ఈనాడు


విజయవాడ 4-1-2018 గురువారం సిటీ సంపుటి 44 . సంచిక 145

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

నా పట్టు.. ఉడుం పట్టు



'అభివృద్ధికి సహకరించండి.. ఆశీర్వదించండి.. రాయలసీమను రతనాల సీమగా తయారు చేస్తా. దేశానికి మణిహారంగా రూపుదిద్దడమే ధ్యేయం. నా కులం పేదల కులం. పేదల పక్షపాతిగా ఉంటా.

భవిష్యత్తులో గోదావరి-పెన్నాతో పాటు వంశధార, నాగావళిని అనుసంధానం చేస్తాం. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు నీటి కష్టాలు లేకుండా చూస్తాం.

రాష్ట్రంలో గత జన్మభూమి సభల్లో 23 లక్షల ఫిర్యాదులు అందాయి. ఇంటింటి సర్వేలో 21 లక్షలు వచ్చాయి. నిర్ణీత వ్యవధిలో పరిష్కారానికి ఈ-ఆఫీస్ అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నాం.' - చంద్రబాబు నాయుడు

- కుప్పం కంటే ముందే పులివెందులకు నీరిచ్చి మాట నిలబెట్టుకొన్నా
- పట్టిసీమతో రాయలసీమలో జలకళ సంతోషాన్నిస్తోంది
- పులివెందులలో చంద్రబాబు
- గండికోట-చిత్రావతి ఎత్తిపోతల జాతికి అంకితం
- కడప ఎంపీ అవినాష్‌రెడ్డి తీరుపై ముఖ్యమంత్రి అభ్యంతరం

కడప - ఈనాడు, పులివెందుల - న్యూస్‌టుడే: తాను ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం కంటే ముందే పులివెందులకు నీరిచ్చి మాట నిలబెట్టుకోవడం ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కొందరు కోర్టుకెక్కినా, కాంట్రాక్టర్లు మొండికేసినా వెనక్కి చూడకుండా గట్టిగా సంకల్పించి సాధించుకున్నామన్నారు. తన పట్టు ఉడుంపట్టులా (మిగతా 2లో)



గండికోట ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవంలో గంగమ్మకు సారె సమర్పిస్తున్న సీఎం, నాయకులు

'పచ్చని' ఆశలు ఆవిరి!



- హెచ్‌1బీ వీసాపై ఆరేళ్లు మాత్రం అమెరికాలో...
- ఆలోపు గ్రీన్ కార్డు రాకుంటే తిరుగుటపా తప్పదు
- అది దక్కాలంటే దశాబ్దం పడుతోంది
- అత్యధికంగా నష్టపోయేది తెలుగు ఐటీ ఉద్యోగులే
- అమెరికా తాజా ప్రతిపాదనతో కలవరం 11లో

కోతల కాలం

- ఐటీలో ప్రారంభ వేతనాలు పతనమవుతున్నాయ్..!
- ప్రస్తుతం కొత్తవారికి ఏడాదికి రూ. 1.8 - రూ. 2.1 లక్షలే
- ఎప్పటికప్పుడు సాంకేతికతపై పట్టు సాధిస్తేనే ఆకర్షణీయ ప్యాకేజీలంటున్న నిపుణులు

ఈనాడు - హైదరాబాద్

ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఉపాధి కల్పతరువుగా మారిన ఐటీ రంగం ఇప్పుడు ఒడిదొడుకులను ఎదుర్కొంటోంది. రెండేళ్ల క్రితం వరకు ఐటీ ఉద్యోగమంటే భారీ వేతనాలు, విలాసవంతమైన జీవితం కనిపించేది. కానీ, ఇప్పుడు క్రమంగా పరిస్థితులు మారుతున్నాయి. ఓ వైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చర్యలు.. మరోవైపు అంతర్గతంగా కూటమి కడుతున్న కంపెనీలు.. వెరసి భారతీయ ఐటీ రంగంపై తీవ్ర ప్రభావం కనిపిస్తోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని ప్రధాన కంపెనీల్లోనూ ప్రారంభ వేతనాలు రూ. 1.8 లక్షలకు పరిమితం అవుతున్నాయి. ప్రస్తుతం ఐటీ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు బెంగళూరు, హైదరాబాద్, పుణె నగరాలు చిరునామాగా ఉన్నాయి.

ఐటీ కంపెనీలు తమకు అవసరమైన మానవ వనరులను ప్రాంగణ నియామకాలతోపాటు ఇతర మార్గాల్లోనూ నియమించుకునేవి. కనీస వేతనాలు రూ. 3.2 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు చెల్లించేవి. ప్రస్తుతం కంపెనీలు కొన్ని కళాశాలల్లో ప్రాంగణ నియామకాలకే పరిమితమై వేతనాల్లోనూ భారీగా కోతపెడుతున్నాయి. అత్యధిక నైపుణ్యం కలిగిన విద్యార్థులకు మాత్రమే రూ. 3 లక్షల వరకు వేతన (మిగతా 2లో)



'ఐటీ కంపెనీలన్నీ ఒక బృందంగా ఏర్పడి కొత్తగా నియమితులయ్యే ఇంజినీర్లకు వేతనాలు తక్కువగా ఇస్తున్నాయి. ఇది అనైతికం, విలువలతో కూడిన నిర్ణయాలు కావివి
- ఇటీవల ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో టీవీ మోహన్‌దాస్ వ్యాఖ్యలు

గతంలో కొత్తగా చేరే ఐటీ ఉద్యోగికి కనీస వేతనం ఏడాదికి రూ. 3.2 లక్షల వరకు ఉండేది. ఇప్పుడు చిన్న కంపెనీలతోపాటు పెద్ద వాటిలోనూ వేతనాలు భారీగా తగ్గిపోయాయి'
- హైదరాబాద్‌లోని ఐటీ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు

రాష్ట్ర హైకోర్టుపై కమిటీ

- ప్రతిపాదిత భవనాలు పరిశీలించాకే తదుపరి కార్యాచరణ
- అమరావతిలో హైకోర్టు ఏర్పాటుపై సమావేశం
- న్యాయమూర్తుల సుదీర్ఘ చర్చ
- కీలకాంశాలపై కమిటీల ఏర్పాటుకు నిర్ణయం
- ఈ బాధ్యతలు ఏసీజేకు అప్పగింత

ఈనాడు - హైదరాబాద్

అమరావతి పరిధిలో తాత్కాలిక భవనంలో ఏపీ హైకోర్టు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామంటూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి లేఖ రాసిన నేపథ్యంలో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తులందరూ బుధవారం సమావేశమయ్యారు. తాత్కాలిక భవనమా, శాశ్వత భవనమా? సౌకర్యాలు? రికార్డుల తరలింపు? ఉద్యోగుల విభజన? సంబంధిత మార్గదర్శకాలు? గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు? న్యాయవాదుల పాత్ర? ఇలా ఒక్కో అంశంపై వివరంగా చర్చించినట్లు సమాచారం. హైకోర్టు విభజనలో అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించి తాత్కాలికంగా కొన్ని నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిసింది. తొలుత తాత్కాలిక భవనాల పరిశీలనకు కమిటీని ఏర్పాటు చేయాలని,



కమిటీ వెళ్లి వచ్చాక మళ్లీ సమావేశమై తదుపరి కార్యాచరణపై చర్చించడానికి అంగీకరించినట్లు సమాచారం. ప్రతిపాదిత భవనాల్ని పరిశీలించాలని కోరుతూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్‌కు లేఖ రాసిన నేపథ్యంలో హైకోర్టు న్యాయమూర్తులందరూ (ఫుల్‌కోర్ట్) హైకోర్టు పరిపాలనాభవన్‌లో (మిగతా 2లో)

భూ సమీకరణే

- బాహ్య, అంతర వలయ రహదారులకు అదే విధానం: సీఎం 6లో

రూ.17,761 కోట్లతో బాహ్యవలయ రహదారి

- పొడవు 189 కి.మీ.లు
- ప్రాజెక్టుకు ఎన్‌హెచ్‌ఏఐ ఆమోదం 6లో

రాజధాని ప్రాంతంలో మరో 12 ఐటీ కంపెనీలు

- సుమారు 1300 ఉద్యోగాల కల్పన
- ఈ నెల 17న ప్రారంభం
- రావడానికి సిద్ధంగా మరో 20 సంస్థలు 2లో

117 కోట్ల ఇందూ ఆస్తుల జప్తు

- శ్యాంప్రసాద్‌రెడ్డి, ఆయనకు సహకరించిన వారివి...
- జగన్ 'క్విడ్ ప్రో కో'లో ఈడీ చర్య
- గచ్చిబౌలి ప్రాజెక్టులో వైవీ సుబ్బారెడ్డి అనుచరుడికి అవకాశం కల్పించినట్లు వెల్లడి

ఈనాడు - దిల్లీ

వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కంపెనీల్లోకి పెట్టుబడుల రూపంలో నిధులు మళ్లించి అప్పటి వైఎస్ ప్రభుత్వం నుంచి భారీగా లబ్ధి పొందిన ఇందూ శ్యాంప్రసాద్‌రెడ్డి, ఆయనకు సహకరించిన మరో రెండు సంస్థలకు చెందిన రూ. 117 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ జప్తు చేసింది. ఈ మేరకు బుధవారం సుదీర్ఘ ప్రకటన విడుదల చేసింది. 'ఇందూ ప్రాజెక్ట్స్ లిమిటెడ్‌కు (మిగతా 2లో)

నా పట్టు.. ఉడుం పట్టు

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని చెప్పుకొచ్చారు. తెదేపా ప్రభుత్వ కష్టానికి ఫలితమే ప్రస్తుతం రాయలసీమ జిల్లాల్లోని జలాశయాల్లో ఉన్న నీటి నిల్వలని వివరించారు. కడప జిల్లాలో ఒకరోజు పర్యటనలో భాగంగా బుధవారం ఆయన పులివెందుల, లింగాల మండలాల్లో పర్యటించారు. లింగాల మండలం పార్నపల్లెలో పైలాన్ ఆవిష్కరించి గండికోట-చిత్రావతి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. కృష్ణా జలాలకు హారతి, సారె సమర్పించిన అనంతరం సభలో ప్రసంగించారు. పులివెందులలో కూడా మాట్లాడారు.

రాయలసీమలో కరవు తాండవిస్తోందని, ఏళ్ల తరబడి నీళ్లు లేక అలమటించిన ఈ ప్రాంతంలో ఇంతపెద్ద ఎత్తున నీళ్లు చూడడం ఆనందంగా ఉందన్నారు. తుంగభద్ర నీరు తక్కువగా వచ్చే సమయంలో ఎన్టీఆర్ చొరవ చూపి జీఎన్ఎస్ఎస్, గండికోట వంటి కీలక పథకాలకు బీజం వేసినట్లు చెప్పారు. తన హయాంలో ఆ పనులను వేగవంతం చేసి ప్రస్తుతం నిజం చేసుకోగలిగినట్లు వివరించారు. కొందరు అభివృద్ధికి అడ్డం పడినా కాలువల దగ్గర పడుకుని మరీ పూర్తిచేసినట్లు స్పష్టం చేశారు. గోదావరి-కృష్ణా నదుల అనుసంధానంతో చరిత్ర సృష్టించామన్న ఆయన పట్టిసీమ ద్వారా రాయలసీమకు నీరు తెచ్చి రుణం తీర్చుకున్నట్లు వివరించారు. "నీళ్లు బంగారం.. అవి ఉంటేనే అభివృద్ధికి అవకాశం ఉంటుంది. కీలకమైన నీటిని పొదుపు చేసి... నదుల అనుసంధానంతో అదుపు చేసి చరిత్ర సృష్టించాం" అని చంద్రబాబు పేర్కొన్నారు.



ఎత్తిపోతల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రులు ఆదినారాయణరెడ్డి, సోమిరెడ్డి తదితరులు



వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కృషి వల్లే నీళ్లు వచ్చాయని చెబుతున్న కడప ఎంపీ అవినాష్‌రెడ్డి ప్రసంగిస్తుండగా అభ్యంతరం చెబుతున్న సీఎం చంద్రబాబు, కలెక్టరు బాబూరావు

సభలో కలకలం...

పులివెందుల సభలో చంద్రబాబు మాట్లాడిన అనంతరం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడేందుకు అవకాశం ఇచ్చారు. ఆయన గండికోట-చిత్రావతి ఎత్తిపోతల పథకం వైఎస్ చొరవతోనే అమలుకు నోచుకుందని చెప్పడం కలకలం రేపింది. రాజకీయాలు ఇక్కడ వద్దంటూ.. ఇచ్చిన గౌరవాన్ని కాపాడుకుని హుందాగా ఉండాలంటూ సీఎం అభ్యంతరం తెలిపారు. సభా వేదికపై ఉన్న ఓ వ్యక్తి అవినాష్ మైక్ లాక్కోబోగా సీఎం వారించారు. సభా ప్రాంగణంలో ఉన్న కొందరు కార్యకర్తలు కేకలు వేయడంతో పాటు కుర్చీలు చేతుల్లోకి తీసుకోవడంతో స్వల్ప గందరగోళం చోటుచేసుకుంది. చివరకు సీఎం కలగజేసుకుని రాజకీయాలకు అతీతంగా సభ జరగాలని కోరారు. చివరకు అవినాష్ వేదిక నుంచి బయటకు వెళ్లిపోయారు. ఉదయం కూడా పులివెందులలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. తెదేపా, వైకాపా వర్గీయులు పార్టీ జెండాలతో వీధుల్లో ప్రదర్శనలు చేపట్టగా ఇరువర్గాల మధ్య వివాదం ఏర్పడింది. పోలీసులు సర్దిచెప్పారు. ఓ వాహనంపై వైకాపా జెండా ఉండడంతో కొందరు దాడికి దిగారు. తమ వారు కొందరు కనిపించడం లేదంటూ వైకాపా శ్రేణులు పోలీసులకు ఫిర్యాదు చేశాయి.

ఎగతాళి చేశారు.. ఏం చెబుతారు?

తాను సీమకు నీళ్లు తెస్తోంటే కొందరు ఎగతాళి చేశారని.. ఇప్పుడు ఈ నీళ్లను చూసి వారు ఏం చెబుతారని చంద్రబాబు ప్రశ్నించారు. 105 టీఎంసీల నీరు పట్టిసీమ నుంచి కృష్ణా డెల్టాకు తెచ్చి.. కృష్ణా నీటిని శ్రీశైలం వద్ద పొదుపుచేసి, రాయలసీమ, నాగార్జునసాగర్‌కు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. కొందరు అబద్ధాలు ఆడుతూ రాజకీయం చేయడం దారుణమని ఎద్దేవా చేశారు. కడప జిల్లా ఉద్యానసాగులో విప్లవాలు సృష్టిస్తోందన్న ఆయన.. అరటి, బత్తాయి, బొప్పాయి తదితర అనుబంధ పరిశ్రమలకు కృషి చేస్తామన్నారు. గత ఏడాది వ్యవసాయంలో 14 శాతం ఆర్థికాభివృద్ధి సాధిస్తే ఈ సారి మొదటి అర్ధ సంవత్సరంలోనే 25.6 శాతం వృద్ధి సాధించామన్నారు. దేశ స్థాయిలో 2.5 శాతంగా నమోదైనట్లు స్పష్టం చేశారు. రైతు కుటుంబంలో పుట్టిన తాను రైతులకు మంచి చేయాలని ప్రయత్నిస్తున్నానని, రాయితీలు ఇస్తున్నానని వివరించారు. ఒకప్పుడు రాయలసీమలో ముఠాకక్షలు ఉండేవని, వాటి నిర్మూలనకు తీవ్ర స్థాయిలో ప్రయత్నించామన్నారు. మొత్తం 19 లక్షల ఇళ్లు కడుతున్నామని, సంక్రాంతి తర్వాత 2.50 లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు చేస్తామన్నారు.

స్వయం సహాయక సంఘాలకు బీసీ పెళ్లి కానుక బాధ్యతలు...

బీసీలకు ఇచ్చే పెళ్లికానుకను స్వయం సహాయక సంఘాల ద్వారా అందిస్తామన్నారు. అనంతరం హిజ్రాలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు పంపిణీ చేశారు. 1500 మంది పోలీసు మహిళా వలంటీర్లకు నియామక పత్రాలు, స్వయం సహాయక సంఘాలకు ఆస్తుల పంపిణీ చేపట్టారు. లింగాల రైతులు తమ చీనీ, దానిమ్మ కాయలతో గజమాల వేసి బాబుపై అభిమానాన్ని చాటుకున్నారు. గండికోట ఉత్సవాల లోగోను సీఎం ఆవిష్కరించారు. మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, దేవినేని ఉమ, విప్ మేడా మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, బీటెక్ రవి, సతీష్‌రెడ్డి, ఆర్.శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలు వరదాపురం సూరి, యామినిబాల తదితరులు పాల్గొన్నారు.



కోతల కాలం

(మొదటి పేజీ తరువాయి)

ప్యాకేజీలు అందిస్తున్నాయి. ఈ తరహా ప్యాకేజీల కింద ఒక్కో కంపెనీ ఇద్దరు, ముగ్గురిని మాత్రమే తీసుకుంటున్నాయి. అవసరాల మేరకు ఇతర విద్యార్థులను ఎంపిక చేసినప్పటికీ.. గరిష్ఠంగా ఏడాదికి రూ.2 లక్షల వరకు మాత్రమే ఇచ్చేందుకు అంగీకరిస్తున్నాయి. ఆటోమేషన్ కారణంగా ఇప్పుడు ఐటీ నియామకాలు తగ్గుతున్నాయి.

గతేడాది కంటే తగ్గిన వేతనాలు..

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రారంభ వేతనాలు మరింత తగ్గాయి. గత ఏడాది వరకు ప్రముఖ కంపెనీలు మినహా మిగతావి ఏడాదికి రూ.2.1 లక్షల నుంచి రూ.2.4 లక్షల వరకు ఇచ్చాయి. ఈ ఏడాదికి ఆ మొత్తాన్ని రూ.1.8 లక్షల నుంచి రూ.2.1 లక్షలకు పరిమితం చేశాయి. "గతంతో పోలిస్తే ఏడాది వేతనం రూ.40 వేల వరకు తగ్గిన మాట వాస్తవమే. పెద్ద కంపెనీలు ఇప్పటికీ రూ.2.4 లక్షల వరకు ఆఫర్ చేస్తున్నాయి. అయితే బీపీవో ఉద్యోగాల్లో వేతనాలు రూ.1.8 లక్షల వరకు ఉంటున్నాయి" అని నియామక అధికారి ఒకరు తెలిపారు.

నూతన కోర్సులు నేర్చుకోవాలి..

"కోర్ రంగంలో ఉద్యోగాలు పెరగడం లేదు. ఇంజినీరింగ్ పూర్తిచేసిన వారందరికీ ఐటీ, ఐటీఈఎస్ ఉద్యోగాలే ఆధారమయ్యాయి. తక్కువ వేతనం ఇచ్చినా వెంటనే ఉద్యోగంలో చేరేందుకు పట్టభద్రులు ఆసక్తి చూపుతున్నారు. ఎందుకంటే కోర్సు పూర్తయ్యాక ఏడాది ఖాళీగా ఉంటే.. ఉద్యోగం దొరకడం కష్టమవుతోంది. వేతనం తక్కువని బాధపడకుండా నూతన కోర్సులు నేర్చుకుంటే భవిష్యత్తు బాగుంటుంది" అని తెలంగాణ ఐటీ అసోసియేషన్ ప్రతినిధి సందీప్‌కుమార్ అభిప్రాయపడ్డారు.

నైపుణ్యం ఉంటే ఎప్పటికీ డిమాండ్...

వేతన ప్యాకేజీలు తగ్గిన విషయాన్ని పక్కనపెడితే... ప్రారంభ ఉద్యోగులకు కొన్ని కంపెనీలు ఇప్పటికీ అధిక వేతనాలు చెల్లిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ''ఐటీ రంగంలో ప్రస్తుతం కొత్త టెక్నాలజీలకు ఎక్కువ డిమాండ్ ఉంది. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, అడోబ్, ఏఐ తదితరాల్లో కోర్సులు నేర్చుకున్న వారికి ఏటా రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు చెల్లించేందుకు కంపెనీలు ముందుకొస్తున్నాయి. విద్యార్థులు ఎప్పటికప్పుడు మార్కెట్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నూతన టెక్నాలజీల్లో నైపుణ్యం సాధించాలి. నైపుణ్యాలు ఉంటే వేతనాలు అవే పెరుగుతాయి.'' అని టాస్క్ అధికారి భాస్కర్ పేర్కొన్నారు.

పాక్ కాల్పుల్లో బీఎస్ఎఫ్ జవాన్ మృతి

జమ్ము: పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో బుధవారం జమ్ములో అంతర్జాతీయ సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తున్న బీఎస్ఎఫ్ జవాన్ మృతి చెందారు. సాంబ సెక్టార్‌లోని భారత పోస్టుపై పాక్ సైనికులు జరిపిన కాల్పుల్లో ఆర్.పి.హజ్రా అనే బీఎస్ఎఫ్ జవాన్ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా మృతిచెందారు. పశ్చిమబెంగాల్ ముర్షీదాబాద్‌కు చెందిన హజ్రా పుట్టినరోజు నాడే మరణించారు.

మరో 12 ఐటీ కంపెనీలు

ఈనాడు అమరావతి: రాష్ట్రంలో మరో 12 చిన్న, మధ్య తరహా ఐటీ కంపెనీలు ఏర్పాటవుతున్నాయి. ఈ నెల 17న వీటిని ఐటీ శాఖ మంత్రి లోకేష్ ప్రారంభిస్తున్నారు. ఇవన్నీ రాజధాని ప్రాంతంలోనే వస్తున్నాయి. మంగళగిరి సమీపంలోని ఏపీ ఎన్ఆర్‌టీ టెక్‌పార్కులో 9 కంపెనీలు, మంగళగిరిలోని పైకేర్ ఐటీ పార్కులో మరో మూడు కంపెనీలు ఏర్పాటవుతున్నాయి. ఇవన్నీ ఏపీ ఎన్ఆర్‌టీ సంస్థ చొరవతో వస్తున్న కంపెనీలు. వీటిలో 90 శాతం అమెరికా కంపెనీలు, బ్రిటన్‌కు చెందినవి ఒకటి రెండు, మన దేశంలో వేరే ప్రాంతంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీ ఒకటి ఉన్నాయని ఏపీఎన్ఆర్‌టీ సొసైటీ అధ్యక్షుడు రవి వేమూరి 'ఈనాడు'కి తెలిపారు. ఈ కంపెనీలు రావడంతో తక్షణం 5-6 వందల మందికి ఉద్యోగాలు లభిస్తాయని, ఈ కంపెనీలు పూర్తి స్థాయిలో పనిచేయడం మొదలుపెట్టాక సుమారు 1300 మందికి ఉపాధి లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ 12 కంపెనీలతో కలిపి ఇంత వరకు ఏపీ ఎన్ఆర్‌టీ ద్వారా రాష్ట్రానికి వచ్చిన కంపెనీల సంఖ్య 53కి చేరినట్టు ఆయన తెలిపారు. వీటిలో ఎక్కువ కంపెనీలు విశాఖ, విజయవాడ, మంగళగిరి ప్రాంతాల్లో ఏర్పాటైనట్టు ఆయన వెల్లడించారు. మరో 20 వరకు కంపెనీలు ఇక్కడికి రావడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

కొత్తగా వస్తున్న కంపెనీలు, అవి అందించే సేవలు తదితర వివరాలు

కంపెనీ పేరు	అందించే సేవలు	ప్రస్తుతం కల్పించే ఉద్యోగాలు	మొత్తం ప్రతిపాదిత ఉద్యోగాలు
1. సిగ్నమ్ డిజిటల్ నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్	ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్స్	42	200
2. చారువికెంట్ ఐటీఈఎస్ ప్రైవేట్ లిమిటెడ్	ప్రొడక్ట్ డెవలప్‌మెంట్	15	50
3. అద్వైత్ అల్గారిథమ్	స్టాఫింగ్ అండ్ కన్సల్టింగ్	52	100
4. స్క్రిప్ట్ బీస్	వెబ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్	72	100
5. స్వరా సాఫ్ట్	ఐటీ సర్వీసెస్	15	25
6. సన్ స్వెట్	హెల్త్‌కేర్ సెక్టార్	స్టార్టప్	30
7. పిక్సీ	టెక్నాలజీ ప్రొడక్ట్	స్టార్టప్	20
8. సువిజ్	ఐటీ డెవలప్‌మెంట్ సర్వీసెస్	20	50
9. డీఎఫ్ఐ స్విస్	సైబర్ సెక్యూరిటీ సర్వీసెస్	స్టార్టప్	20
10. ఎక్సెల్లార్ బీపీఓ సర్వీసెస్	బీపీఓ సర్వీసెస్	50	100
11. మేక్ మై క్లినిక్	హెల్త్‌కేర్ సెక్టార్	100	300
12. బీవీజీ ఇండియా	108 సర్వీసెస్	150	300

● ఈ కంపెనీల్లో మేక్‌మై క్లినిక్, ఎక్సెల్లార్, బీవీజీ ఇండియా సంస్థలు పైకేర్ ఐటీ పార్కులో ఏర్పాటవుతున్నాయి. మిగతా తొమ్మిది కంపెనీలు ఎన్ఆర్‌టీ ఐటీ పార్కులో వస్తున్నాయి.

అర్హతల అయోమయం

టెట్‌కు దూరమవుతున్న అభ్యర్థులు

- బీఈడీ ప్రవేశాలకు డిగ్రీలో 40శాతం మార్కులు
- టెట్ రాయాలంటే 45శాతం ఉండాలనే నిబంధన
- అయోమయంలో విద్యార్థులు

ఈనాడు, అమరావతి: విద్యాశాఖ అధికారుల విరుద్ధ నిర్ణయాలు విద్యార్థిలోకాన్ని అయోమయానికి గురిచేస్తున్నాయి. వీటి పుణ్యమాని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వేలాది విద్యార్థులు ఉపాధ్యాయ ఉద్యోగానికి దూరమయ్యే పరిస్థితి తలెత్తింది. బీఈడీ చదివేందుకు, ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) రాసేందుకు విధించిన అర్హతలే ఇందుకు మూలమవుతున్నాయి.

ఈ ఏడాది ఏపీలో టెట్‌ను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. అది రాసేందుకు అర్హతలను పేర్కొంటూ ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. 2010 జులై తర్వాత బీఈడీ చేసిన ఓసీలకు డిగ్రీలో 50శాతం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, విభిన్న ప్రతిభావంతులకు 45శాతం ఉండాలని పేర్కొన్నారు. జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి 2010లో టెట్‌ను తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులిచ్చింది. అవి జులై నుంచి అమల్లోకి వచ్చాయి. టెట్ రాసే ఎస్సీ, ఎస్టీ, బీసీ, విభిన్న ప్రతిభావంతులకు డిగ్రీలో 45శాతం మార్కులు ఉండాలనే నిబంధన విధించిన అధికారులు.. బీఈడీ ప్రవేశాలకు మాత్రం దీన్ని పాటించడం లేదు. వాటికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, విభిన్న ప్రతిభావంతులకు 40శాతం మార్కులు ఉంటే చాలనే నిబంధన పెట్టారు. దీంతో బీఈడీలో 40శాతం మార్కులతో చేరిన విద్యార్థులు ఇప్పుడు టెట్ రాసే అర్హత కోల్పోతున్నారు. ఉపాధ్యాయ నియామక పరీక్ష రాయాలంటే తప్పనిసరిగా టెట్ అర్హత ఉండాలి. ఈ నేపథ్యంలో బీఈడీ చేసినా వీరు ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాన్ని పొందే పరిస్థితి లేకుండాపోయింది.

అప్పట్లో ఇచ్చారు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2011 జులై; 2012లో జనవరి, మే నెలల్లో టెట్ నిర్వహించారు. ఈ సమయంలో 40శాతం మార్కులను అర్హతగా పేర్కొన్నారు. అనంతరం ఏపీ రాష్ట్రంలో 2014లో టెట్, డీఎస్సీ కలిపి నిర్వహించడంతో ఇబ్బందులేం రాలేదు. తాజాగా తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన టెట్ ఉత్తర్వుల్లోనూ డిగ్రీలో 40శాతం మార్కులకు డిసెంబరు 23, 2015 వరకు అవకాశం కల్పించింది. ఏపీలో టెట్ ఉత్తర్వులు జారీచేసిన అధికారులు మాత్రం బీఈడీ ప్రవేశాల అర్హతలను పట్టించుకోలేదు. జీవోను మార్పుచేసి తమకు న్యాయం చేయాలని చాలామంది విద్యార్థులు విద్యాశాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. టెట్‌ను పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తుండగా.. బీఈడీ ప్రవేశాలను ఉన్నత విద్యామండలి పర్యవేక్షిస్తోంది. వీటి మధ్య సమన్వయం లేక వేలమంది విద్యార్థుల భవిష్యత్తు నలిగిపోతుంది. టెట్ పరీక్షను వాయిదా వేస్తూ ఇటీవల మంత్రి గంటా శ్రీనివాసరావు సవరించిన షెడ్యూల్ విడుదల చేశారు. దీని ప్రకారం టెట్ రుసుముల చెల్లింపు గడువు 13వ తేదీతో ముగుస్తోంది. ప్రభుత్వం జన్మభూమి-మా ఊరు కార్యక్రమం నిర్వహిస్తున్నందున ప్రస్తుతం అధికారులు, మంత్రులు అందరూ గ్రామాల పర్యటనలో ఉన్నారు. ఒకపక్క ముంచుకొస్తున్న రుసుముల గడువు, వినతులు ఇద్దామంటే అధికారులు లభించక అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు.

రాజ్యసభకు ముగ్గురు ఆప్ అభ్యర్థుల ఖరారు

కుమార్ విశ్వాస్‌కు లభించని అవకాశం

దిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాజ్యసభ అభ్యర్థులుగా సంజయ్ సింగ్, సుశీల్‌గుప్తా, ఎన్డీ దుర్గా ఎంపికయ్యారు. దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ నివాసంలో బుధవారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. పార్టీ ఎమ్మెల్యేలు సుమారు 56 మంది ఆ భేటీలో పాల్గొన్నారు. పార్టీ అత్యున్నత నిర్ణయాక విభాగమైన రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) వెంటనే సమావేశమై ఈ నిర్ణయాన్ని లాంఛనప్రాయంగా ఆమోదించింది. రాజ్యసభకు వెళ్లాలని ఆశిస్తున్న కుమార్ విశ్వాస్ పీఏసీ సభ్యుడైనప్పటికీ సమావేశంలో పాల్గొనలేదు. తనకు అవకాశం ఇవ్వకపోవటంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు.

గ్రహం అనుగ్రహం

4-1-2018 గురువారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
హేమంత రుతువు; పుష్య మాసం; బహుళ పక్షం
తదియ: రా. 2-24 తదుపరి చవితి
పుష్యమి నక్షత్రం: ఉ. 10-24 తదుపరి ఆశ్లేష
అమృత ఘడియలు: లేవు
వర్జ్యం: రా. 10-25 నుంచి 11-56 వరకు
దుర్ముహూర్తం: ఉ. 10-14 నుంచి 10-58 వరకు
తిరిగి మ. 2-38 నుంచి 3-23 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.6-36; సూర్యాస్తమయం: సా.5-35

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
శ్రీకాకుళం	15.5	29.5
గుంటూరు	16.0	31.0
హైదరాబాద్	16.9	29.2
అనంతపురం	18.4	31.4
రాజమహేంద్రవరం	18.5	33.5
విశాఖపట్నం	18.8	29.4
విజయవాడ	19.0	29.7
కడప	19.0	33.0
తిరుపతి	19.3	31.2
నరసాపురం	19.4	30.3
తాడేపల్లిగూడెం	19.5	30.0
కర్నూలు	19.7	32.3
ఒంగోలు	22.2	31.9
నెల్లూరు	23.0	29.0

117 కోట్ల ఇందూ ఆస్తుల జప్తు

(మొదటి పేజీ తరువాయి)

చెందిన వివిధ స్థిరాస్తులు, ఎంబసీ ప్రాపర్టీ డెవలప్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ (జితేంద్ర వీర్వాణి), వసంత ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు (వీవీ కృష్ణప్రసాద్) చెందిన ఫిక్స్‌డ్ డిపాజిట్లను పీఎంఎల్ఏ కింద జప్తు చేశాం. వీటి విలువ రూ.117.74 కోట్లు. వైఎస్ జగన్, ఇతరులపై దాఖలు చేసిన 11 ఛార్జిషీట్లకు సంబంధించిన కేసుల్లో ఈ జప్తు చేశాం. ఇది క్విడ్ ప్రో కో కేసే. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం నుంచి పొందిన ప్రయోజనాలకు ప్రతిఫలంగా ఆయన కుమారుడు జగన్ కంపెనీల్లో ఇందూ శ్యాంప్రసాద్‌రెడ్డి భారీగా పెట్టుబడులు పెట్టారు. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నాటి ప్రభుత్వం లేపాక్షి నాలెడ్జ్ హబ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 8,844 ఎకరాలు, ఇందు టెక్ జోన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు శంషాబాద్ వద్ద 250 ఎకరాలతోపాటు, ఇందూ గ్రూప్‌నకు వివిధ హౌసింగ్ ప్రాజెక్టులు ఇచ్చింది. శ్యాంప్రసాద్‌రెడ్డి అప్పటి ప్రభుత్వం నుంచి పొందిన అక్రమ ప్రయోజనాలపై సీబీఐ ఇప్పటికే మూడు ఛార్జిషీట్లు దాఖలు చేసింది. అందులో లేపాక్షి నాలెడ్జ్ హబ్ లిమిటెడ్, ఇందూ టెక్‌జోన్ ప్రైవేట్ లిమిటెడ్‌లకు చెందిన కేసుల్లో ఇప్పటికే తాత్కాలిక జప్తు ఉత్తర్వులు జారీ చేశాం. ఏపీ హౌసింగ్ బోర్డు ఇందూ గ్రూప్‌నకు కట్టబెట్టిన వివిధ గృహ నిర్మాణ ప్రాజెక్టులకు సంబంధించి సీబీఐ దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో భాగంగా ఇప్పుడు రూ.117 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేస్తున్నాం. ఇందూ శ్యాంప్రసాద్‌రెడ్డి, నిమ్మగడ్డ ప్రసాద్ కంపెనీల ద్వారా పెట్టుబడుల రూపంలో జగన్‌కు ముడుపులు చెల్లించినట్లు మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద జరిపిన విచారణలో బయటపడింది. ఈ ముడుపులు చెల్లించినందుకు శ్యాంప్రసాద్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చట్టవిరుద్ధంగా ప్రయోజనం కల్పిస్తూ కూకట్‌పల్లి (65 ఎకరాలు), బండ్లగూడ (50 ఎకరాలు), గచ్చిబౌలి (4.575 ఎకరాలు), నంద్యాల (75 ఎకరాలు)లో గృహ నిర్మాణ ప్రాజెక్టులను కేటాయించింది. ప్రామాణిక నిబంధనలను ఉల్లంఘించి, సదరు సంస్థ సాంకేతిక, ఆర్థిక సామర్థ్యాలను పరిశీలించకుండానే వీటిని కేటాయించింది. అధిక ధర పలికే భూములను అత్యంత చౌకధరలకే శ్యాంప్రసాద్‌రెడ్డికి కట్టబెట్టారు. దీనివల్ల ఏపీ హౌసింగ్ బోర్డుకు భారీ నష్టం చేకూరింది. గృహ నిర్మాణ ప్రాజెక్టులు చేజిక్కించుకుని, ఎస్పీవీ ఏర్పాటు చేసిన తర్వాత శ్యాంప్రసాద్‌రెడ్డి డీపీఆర్‌ను పక్కనపెట్టి తన ఇష్టానుసారంగా, సొంత అవసరాలకు తగ్గట్టు ప్రాజెక్టులను అభివృద్ధి చేసి పెద్ద ఎత్తున సొమ్ము చేసుకున్నారు. శ్యాంప్రసాద్‌రెడ్డి గృహ నిర్మాణ ప్రాజెక్టు చేజిక్కించుకునేలా ఎంబసీ గ్రూప్‌నకు చెందిన జితేంద్ర వీర్వాణి సహాయం చేశారు. పెట్టుబడిపై లాభం, సేవా పరిహారం, విల్లాల విక్రయం రూపంలో ఆయన రూ.50.16 కోట్ల మేర లబ్ధి పొందారు. ఇలా నేరపూరితంగా సంపాదించిన ఈ మొత్తంపై పన్నులు చెల్లించి ఇతర వ్యాపార అవసరాలకు వాడుకున్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తోడల్లుడు వైవీ సుబ్బారెడ్డికి అవకాశం కల్పించడానికి ఇందూ శ్యాంప్రసాద్‌రెడ్డి గచ్చిబౌలి ప్రాజెక్టులో తన వాటాను ఉపసంహరించుకుని సుబ్బారెడ్డి సహచరుడైన వీవీ కృష్ణప్రసాద్‌కు అందులో ప్రవేశం కల్పించారు. ఆ ప్రాజెక్టులోని ప్లాట్ల అమ్మకం, విల్లాల కేటాయింపు, పన్నుల ఎగవేత ద్వారా ఆయన భారీగా లాభాలు పొందారు. ఈ ప్రాజెక్టును సకాలంలో పూర్తిచేయక పోవడంవల్ల ఏపీహెచ్‌బీకి భారీగా నష్టం కలిగింది. ఎల్ఐజీలూ పూర్తిచేయలేదు' అని ఈడీ వివరించింది.

రాష్ట్ర హైకోర్టుపై కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం సమావేశమయ్యారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. తదుపరి చర్యలన్నింటిపై కావాల్సిన కమిటీలు ఏర్పాటు చేయడానికి ఏసీజే నిర్ణయం తీసుకునేలా న్యాయమూర్తులందరూ సమ్మతి తెలిపారు. భవనాల పరిశీలనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఓటింగ్ నిర్వహించగా పరిశీలనకే మొగ్గు చూపినట్లు తెలిసింది. భవనాల్ని పరిశీలించేందుకు ఏసీజే.. ఐదుగురు న్యాయమూర్తులతో కమిటీని ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ అమరావతి వెళ్లి పరిశీలించి వచ్చాక తిరిగి సమావేశం కావాలని నిర్ణయించారు. ఉద్యోగుల విభజనకు మార్గదర్శకాలు ఉండాలని, వీటితో సహా వివిధ అంశాలన్నీ కమిటీల ఆధ్వర్యంలోనే జరిగితే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తమైంది. హైకోర్టు భవనాలతోపాటు నివాస ఏర్పాట్లు, ఉద్యోగుల ఇబ్బందులపైనా సుదీర్ఘంగా చర్చించారు. తాత్కాలిక భవనమైనా ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఉండాల్సిందేనన్న అభిప్రాయం వ్యక్తమైంది. శాశ్వత ఏర్పాట్లు జరిగేదాకా హైకోర్టు తరలింపు సాధ్యం కాదని ఇదే హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పుపైనా చర్చ జరిగింది. న్యాయవాదులను భాగస్వాములను చేసే అంశంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలిసింది.

ఏసీజేకు వినతి.. ఏపీ హైకోర్టు రాజధానికి తరలించడంపై నిర్ణయం తీసుకునే ముందు న్యాయవాదుల ప్రయోజనాల దృష్ట్యా తమ అభిప్రాయాల్ని తీసుకోవాలని ఏసీజేను కోరుతూ ఏపీ న్యాయవాది సంఘం బుధవారం లేఖను సమర్పించింది. తమ వాదనను కూడా పరిగణనలోకి తీసుకోవాలంటూ న్యాయవాదుల సంఘంతో ప్రమేయం లేకుండా సుమారు 300 మంది న్యాయవాదులు సంతకాలు చేసిన వినతిపత్రాన్ని ఏసీజేకి అందజేశారు.


ఇదీ సంగతి!



జయించలేక... జీవించలేక

- విద్యార్థులను కబళిస్తున్న ఒత్తిడి
- 2014-16 మధ్య 988 మంది ఆత్మహత్యలు
- మూడేళ్లుగా నెలకు సగటున 27 మంది బలవన్మరణం
- దేశవ్యాప్త ఘటనల్లో 3.73% ఏపీలో

ఈనాడు - అమరావతి



చదువు చంపేస్తోంది. వికసించాల్సిన విద్యా కుసుమాలను ఒత్తిడి కబళిస్తోంది. 2014-16 మధ్య ఆంధ్రప్రదేశ్‌లో 988 మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. నెలకు సగటున 27 మంది ఆత్మహత్య చేసుకున్నారు.

జాతీయ నేర గణాంక సంస్థ విడుదల చేసే 'ప్రమాద మరణాలు-ఆత్మహత్యల నివేదిక' ఈ విషయాన్ని వెల్లడించింది. ఆ మూడేళ్లలో దేశవ్యాప్తంగా 26,476 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడగా...అందులో 3.73 శాతం ఆంధ్రప్రదేశ్‌లోనే చోటుచేసుకున్నాయి. వీరిలో ఎక్కువ మంది ఇంటర్మీడియట్ స్థాయి విద్యార్థులేనని పోలీసులు చెబుతున్నారు. వివిధ కోర్సుల్లో ప్రవేశపరీక్షలకు సన్నద్ధమయ్యే క్రమంలో తీవ్రమైన ఒత్తిడిని తట్టుకోలేకపోవడం, ర్యాంకుల కోసం పరుగులో చతికిలపడటం, అవిశ్రాంతంగా చదువుల్లో మునిగితేలాల్సి రావడం.. ఇవేకాక తల్లిదండ్రులు మందలించారని కొందరు, వారి ఆశలు నెరవేర్చలేకపోతున్నామన్న ఆత్మన్యూనతతో మరికొందరు.. పరీక్షల్లో తాము నుకున్న స్థాయిలో విజయం సాధించలేకపోయామని ఇంకొందరు ప్రాణాలు తీసుకుంటున్నారు. 2014, 2015 సంవత్సరాలతో పోలిస్తే 2016లో రాష్ట్రంలో ఈ ఆత్మహత్యలు స్వల్పంగా తగ్గినా...ఆ ఒక్క ఏడాదిలోనే 295 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఈ అంశంలో ఆంధ్రప్రదేశ్ దేశంలో 12వ స్థానంలో నిలిచింది. వీటిలోనూ ఎక్కువ శాతం మరణాలు కార్పొరేట్ కళాశాలల్లోనే చోటుచేసుకుంటున్నాయని పోలీసు వర్గాలు విశ్లేషిస్తున్నాయి. పదో తరగతి తర్వాత ఇంటర్మీడియట్‌కు వచ్చే సరికి ఒక్కసారిగా ఇంటికి దూరంగా ఉండాల్సి రావడంతో చాలమంది ఆ వాతావరణానికి ఇమడలేకపోవడం.. తెలుగు మాధ్యమంలో చదివి వెంటనే ఆంగ్ల మాధ్యమంలోకి మారడంతో సర్దుకులేకపోవడం వంటివి ఆత్మహత్యలకు దారితీస్తున్నాయి.

2016లో అత్యధికంగా జరిగిన జాబితా

రాష్ట్రం	విద్యార్థుల ఆత్మహత్యలు
మహారాష్ట్ర	1350
పశ్చిమబంగా	1147
తమిళనాడు	981
మధ్యప్రదేశ్	838
ఛత్తీస్‌గఢ్	633
హరియాణా	556
కర్ణాటక	540
ఒడిశా	390
అసోం	353
తెలంగాణ	349
కేరళ	340
ఆంధ్రప్రదేశ్	295

ఆంధ్రప్రదేశ్‌లో 2014-2016 మధ్య విద్యార్థుల ఆత్మహత్యలు

సంవత్సరం	విద్యార్థుల ఆత్మహత్యల సంఖ్య	దేశవ్యాప్తంగా జరిగిన విద్యార్థుల ఆత్మహత్యల్లో ఏపీలో జరిగిన వాటి శాతం
2014	333	4.12 శాతం
2015	360	4.02 శాతం
2016	295	3.11 శాతం

కమిటీల సిఫార్సుల అమలేదీ?

విద్యార్థుల ఆత్మహత్యలను నివారించేందుకు రాష్ట్రప్రభుత్వం 2015లో విశ్రాంత ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి పద్మావతిలతో ద్విసభ్య కమిటీని నియమించింది. వీరు మొత్తం 20 అంశాలతో సిఫార్సులు చేశారు. ఏ కళాశాలలోనూ ఉదయం 8గంటకు ముందు...సాయంత్రం ఆరింటి తర్వాత ఎలాంటి బోధన ఉండకూడదని, విద్యార్థుల మార్కులను నోటీసు బోర్డులో ప్రదర్శించకూడదని, యోగా, ఇతర వ్యాయామ పద్ధతులను ప్రవేశపెట్టాలని సూచించింది. వ్యక్తిత్వ వికాసంపై దృష్టిసారించాలంది. విద్యార్థులు సెలవుల్లో ఇంటికెళ్లి తిరిగి వచ్చాక, ప్రవర్తనకు సంబంధించిన బలహీన విద్యార్థులను నిశితంగా పర్యవేక్షించాలని పేర్కొంది. అవేవీ అమలుకు నోచుకోలేదు. విద్యార్థుల ఆత్మహత్యలు ఆగకపోవడానికి ఇవన్నీ కూడా పరోక్షంగా కారణమవుతున్నాయి. ఫిర్యాదుల స్వీకరణకు మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ కొన్నాళ్ల కిందట టోల్‌ఫ్రీ నెంబరు ఏర్పాటుచేయగా అదనపు గంటలతో, సెలవు దినాల్లో తరగతుల నిర్వహణ అనే అంశాలపైన ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయి. ఇవన్నీ పరోక్షంగా బలవన్మరణాలకు కారణమవుతున్నాయి.

'నష్ట నివారణ నిధి'పై రాష్ట్రమే నిర్ణయం తీసుకోవాలి

కాకినాడ పెట్రో కెమికల్ ప్రాజెక్టుపై కేంద్రం వెల్లడి

ఈనాడు, దిల్లీ: కాకినాడ పెట్రో కెమికల్ ప్రాజెక్టుకు నష్ట నివారణ నిధి (వయబిలిటీ గ్యాప్ ఫండ్)పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలని కోరినట్లు పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ తెలిపారు. బుధవారం రాజ్యసభలో తెదేపా సభ్యుడు టీజీ వెంకటేష్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. "దిగుమతి చేసుకొనే ఈథేన్, దేశీయ నాఫ్తా ఆధారంగా కాకినాడలో పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుపై ఈ ఏడాది జనవరి 27న విశాఖపట్నంలో గెయిల్, హెచ్‌పీసీఎల్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మధ్య ఒప్పందం జరిగింది. ఈ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్ పూర్తిస్థాయి అధ్యయనం చేసింది. ఈ నివేదికతో పాటు రాయితీ విద్యుత్తు, నీటి ధరలు, ఇతర విషయాలను పరిగణనలోకి తీసుకొని ఎస్‌బీఐ క్యాప్స్ సంస్థ ఆర్థిక మదింపు చేసింది. దాని ఆధారంగా గెయిల్, హెచ్‌పీసీఎల్ సంస్థలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి నష్ట నివారణ నిధి కోరాయి. ఆ నిధిని కేంద్రమే సమకూర్చాలని ఏపీ విజ్ఞప్తి చేసింది. ఈ ప్రాజెక్టుతో కలిగే లాభాలు, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ అంశంపై తగిన నిర్ణయం తీసుకోవాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరాం" అని మంత్రి తెలిపారు.



కరుణానిధిని పలకరిస్తున్న రజనీకాంత్. చిత్రంలో స్టాలిన్

కరుణానిధితో రజనీకాంత్ భేటీ

ఈనాడు డిజిటల్, చెన్నై: రాజకీయ ప్రవేశంపై ఇటీవలే ప్రకటన చేసిన సూపర్‌స్టార్ రజనీకాంత్ బుధవారం సాయంత్రం డీఎంకే అధ్యక్షుడు కరుణానిధితో సమావేశమయ్యారు. ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కరుణతో భేటీ అయ్యేందుకు వచ్చిన రజనీకాంత్‌కు డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, ఆ పార్టీ ఎంపీ కనిమొళి సాదర స్వాగతం పలికారు. సమావేశం అనంతరం రజనీకాంత్ విలేకర్లతో మాట్లాడారు. రాజకీయ ప్రవేశ ప్రకటన నేపథ్యంలో కరుణానిధి ఆశీస్సులు తీసుకునేందుకు వచ్చానని వెల్లడించారు. మర్యాదపూర్వకంగానే ఈ భేటీ జరిగిందని వివరించారు. అంతకుమించి ఇంకేమీ లేదని వ్యాఖ్యానించారు. అంతకు ముందు కరుణానిధితో ఆయన పెద్ద కుమారుడు అళగిరి కూడా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రజనీకాంత్‌ను త్వరలోనే కలుస్తానని చెప్పారు. నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్, '2.ఓ' చిత్ర నిర్మాత రాజు మహాలింగం రజనీ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు.

రేపు శ్రీవారి ఆర్జిత సేవా టిక్కెట్లు విడుదల

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆర్జిత సేవా టిక్కెట్లను తితిదే శుక్రవారం విడుదల చేయనుంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో స్వామి వారిని సేవించేలా దాదాపు 50 వేలకుపైగా టిక్కెట్లను జారీ చేయనుంది. వీటిలో సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాద పద్మారాధన, నిజపాద దర్శనం టిక్కెట్లను ఎలక్ట్రానిక్ లాటరీ ద్వారా కేటాయిస్తుంది. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి వారం రోజుల పాటు బుక్ చేసుకోవచ్చు. తదుపరి గురువారం మధ్యాహ్నం 12 గంటలకు ఎలక్ట్రానిక్ లాటరీలో భక్తులను ఎంపిక చేస్తుంది. ఆన్‌లైన్‌లో నగదు చెల్లించి సేవా టిక్కెట్ ఖరారు చేసుకోవాలి. సాధారణ బుకింగ్ కింద విశేషపూజ, కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజలసేవ, వసంతోత్సవం, సహస్రదీపాలంకరణ సేవా టిక్కెట్లను కేటాయించనుంది.

రేపు డయల్ తితిదే ఈవో కార్యక్రమం: డయల్ తితిదే ఈవో కార్యక్రమం శుక్రవారం జరగనుంది. తిరుమల అన్నమయ్య భవన సమావేశ మందిరం నుంచి ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు ఫోన్‌ఇన్‌లో దేవస్థానం ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ భక్తుల సందేహాలు, సమస్యలపై సమాధానాలిస్తారు. భక్తులు దూరవాణి సంఖ్య- 0877-2263261 ద్వారా ఈవోతో మాట్లాడవచ్చు.

అనిశాకు జూన్‌కల్లా జిల్లాల్లో సొంత గూళ్లు

- ఉద్యోగులపై ప్రత్యేక నిఘా.. కేసులో చిక్కుకుంటే ఆస్తుల స్వాధీనం
- ఉద్యోగాల నుంచి తొలగింపు..
- అనిశా డీజీ ఏపీ ఠాగూర్ వెల్లడి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: జూన్ నాటికి రాష్ట్రంలోని 13 జిల్లాల్లో అవినీతి నిరోధక శాఖ(అనిశా) కార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణం పూర్తిచేస్తామని ఆ శాఖ డీజీ ఏపీ ఠాగూర్ అన్నారు. బుధవారం గుంటూరుకు వచ్చిన ఆయన జిల్లా అనిశా భవన నిర్మాణ పనులు పరిశీలించారు. అనంతరం 'ఈనాడు-ఈటీవీ'తో ప్రత్యేకంగా మాట్లాడారు. అనిశా గతం కంటే మెరుగ్గా పనిచేస్తోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లో తప్ప ఎక్కడా అనిశాకు సొంత భవనాలు లేవన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక సీఎం చంద్రబాబు చొరవతో ఇప్పటికే తిరుపతి, ఏలూరు, విశాఖపట్నంలో సొంత గూళ్లు పూర్తిచేశామన్నారు. జనవరి చివరికల్లా విజయనగరం, రాజమండ్రి.., ఫిబ్రవరి 15 నాటికి గుంటూరు, కర్నూలు, విజయవాడ, ఒంగోలులో వాటి నిర్మాణం పూర్తికానున్నట్లు తెలిపారు. జూన్ నాటికి అన్ని జిల్లాల్లో అనిశా సొంత భవనాలు సమకూరేలా చూస్తామన్నారు. 2017లో అనిశా మొత్తం 308 కేసులు నమోదు చేసిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై ప్రత్యేక నిఘా పెట్టామని, అవినీతి కేసుల్లో పట్టుబడ్డవారి ఆస్తుల స్వాధీనంతోపాటు ఉద్యోగాల నుంచి తొలగించేలా చర్యలు తీసుకుంటున్నామని ఠాగూర్ వివరించారు. డీజీ వెంట అనిశా ఓఎస్డీ అబ్రహం లింకన్, డీఎస్పీ దేవానంద్ శాంతో, పోలీసు హౌసింగ్ డీఈ రవి కుమార్, సీఐ వెంకటేశ్వరరావు, ప్రసాద్ ఉన్నారు.



భవన నిర్మాణాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న అనిశా డీజీ ఏపీ ఠాగూర్

పట్టణ పేదలకు మరో లక్ష ఇళ్లు

- 11 జిల్లాలకు కేటాయింపు
- నిర్మాణ విలువ రూ.3.5 లక్షలు

ఈనాడు, అమరావతి: పట్టణాల్లో సొంత స్థలం ఉండి.. గృహాన్ని నిర్మించుకోలేని పేదలకు ప్రధానమంత్రి ఆవాస యోజన (పీఎంఏవై)లో కేంద్రం ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి 1,02,977 ఇళ్లను మంజూరు చేసింది. ఈ ఇళ్లను 11 జిల్లాల్లోని 84 పట్టణాలకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే పథకంలో 2016-17లో కేటాయించిన 73,041 ఇళ్ల నిర్మాణాలు 31 పట్టణాల్లో ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్నాయి.

ప్రభుత్వాల సాయం రూ.2.5 లక్షలు

ఈ పథకంలో ఒక్కో ఇంటి నిర్మాణ విలువ రూ.3.50 లక్షలుగా నిర్ణయించారు. ఇందులో కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్ష సాయం అందజేస్తుంది. బ్యాంకుల నుంచి రూ.75 వేల రుణం ఇప్పిస్తారు. లబ్ధిదారు రూ.25 వేలు భరించాలి.

లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి రుణం ఇప్పించేలా జిల్లా కలెక్టర్లు చొరవ తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

అర్హుల ఎంపిక ఇలా..

★ దారిద్ర్యరేఖకు దిగువన ఉండి, ప్రభుత్వం నుంచి గృహ నిర్మాణం కోసం ఇప్పటికీ ఎలాంటి సాయం పొందని కుటుంబాలు ఈ పథకంలో లబ్ధి పొందేందుకు అర్హులు. ఈ మేరకు సర్వే నిర్వహించి సొంతంగా/ప్రభుత్వ పరంగా స్థలాన్ని కలిగి, ఇళ్ల నిర్మాణానికి తగిన ఆర్థిక స్తోమత లేని కుటుంబాలను పురపాలక, నగరపాలక సంస్థలు గుర్తించాలి.

★ లబ్ధిదారుల జాబితాలను వార్డు కార్యాలయ నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉంచాలి. కలెక్టర్ ఆమోదం లభించాక పీఎంఏవై-ఎంఐఎస్, ఏపీఎస్‌హెచ్‌సీఎల్ వెబ్‌సైట్‌లో మ్యాపింగ్ చేయాలి.

★ ఎంపిక చేసిన లబ్ధిదారులు గృహనిర్మాణశాఖ ఆమోదించిన నమూనా (డిజైన్)కు లోబడి 30 చదరపు మీటర్ల పరిధిలో మాత్రమే ఇంటి నిర్మాణాన్ని చేపట్టాలి. ఇందులో పడక గది, హాలు, వంట గది, స్నానాల గది, మరుగుదొడ్డి ఉండాలి.

జిల్లాలవారీగా మంజూరైన ఇళ్లు

శ్రీకాకుళం	8,216
తూర్పుగోదావరి	16,530
పశ్చిమగోదావరి	5,510
కృష్ణా	8,142
గుంటూరు	9,190
నెల్లూరు	7,285
చిత్తూరు	5,965
ప్రకాశం	3,308
కడప	9,241
కర్నూలు	15,157
అనంతపురం	14,433

ప్రపంచ బ్యాంక్ రుణంతో రాజధాని నిర్మాణమా?

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శ

విజయవాడ, ఒంగోలు, న్యూస్‌టుడే: రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం సహకరించాల్సి ఉండగా ప్రపంచ బ్యాంకు రుణాన్ని మంజూరు చేయిస్తామని కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించడం దారుణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. బుధవారం ఆయన విజయవాడలోని సీపీఐ కార్యాలయంలో, ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ బ్యాంకు నుంచి రూ.3,324 కోట్ల రుణం ఇప్పించే అంశం పరిశీలనలో ఉన్నట్లు రాజ్యసభలో అరుణ్‌జైట్లీ ప్రకటించడంపై తెదేపా ఎంపీలు హర్షం వ్యక్తం చేయడాన్ని రామకృష్ణ తీవ్రంగా తప్పుపట్టారు. అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్రంపై మరింత రుణభారాన్ని మోపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మిషన్ మోడ్‌తో రాష్ట్రం అవినీతిలో కూరుకుపోయిందని రామకృష్ణ విమర్శించారు.

సంక్రాంతికి 3262 ప్రత్యేక బస్సులు

- ఆంధ్ర ప్రాంతానికి 1352 సర్వీసులు
- వాటిలో 50 శాతం అదనపు ఛార్జీలు
- వెల్లడించిన టీఎస్‌ఆర్టీసీ

ఈనాడు, హైదరాబాద్: సంక్రాంతి పండుగకు నగర ప్రజలు సొంత ఊళ్లకు వెళ్లేందుకు వీలుగా 3,262 ప్రత్యేక బస్సులు నడపాలని టీఎస్‌ఆర్టీసీ నిర్ణయించిందని, ఇవి ప్రతి రోజు తిరిగే సర్వీసులకు అదనం అని రంగారెడ్డి రీజియన్ మేనేజర్ యాదగిరి చెప్పారు. 'ఈ నెల 10, 11, 12, 13 తేదీల్లో ఈ బస్సులు నగరం నుంచి బయలుదేరుతాయి. వీటిలో 50 శాతం అదనపు ఛార్జీలు వసూలు చేస్తాం. ముఖ్యంగా ఏపీలోని విజయవాడ, తిరుపతి, విజయనగరం సహా..ఏపీలోని అన్ని జిల్లా కేంద్రాలు, ప్రధాన ప్రాంతాలకే 1,352 సర్వీసులు నడుపుతాం. ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కోసం www.tsrtconline.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు. టిక్కెట్ పైనున్న సర్వీసు నంబరును వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే ఆ బస్సు ఎక్కడ ఉంది? ప్రయాణికుడు ఎక్కాల్సిన చోటుకు అది ఎంత సమయానికి చేరుకుంటుంది? డ్రైవర్ చరవాణి సంఖ్య సహా.. పూర్తి సమాచారం తెలుసుకునేలా ఏర్పాట్లు చేశాం. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఉప్పల్‌క్రాస్‌రోడ్స్, ఎల్.బి. నగర్, లింగంపల్లి, చందానగర్, ఈసీఐఎల్, కేపీహెచ్‌బీ కాలనీ, ఎస్‌ఆర్‌నగర్, అమీర్‌పేట, టెలిఫోన్‌భవన్, దిల్‌సుఖ్‌నగర్ తదితర బస్ స్టేషన్ల నుంచి బస్సులు నడిపేలా ప్రణాళిక రూపొందించాం. విజయవాడతోపాటు.. దూర ప్రాంతాలకు వెళ్లే వాటిని మాత్రమే ఎంజీబీఎస్ నుంచి నడుపుతాం' అని వెల్లడించారు. ఇబ్బందులు ఎదురైతే ఎంజీబీఎస్: 8330933419, 8330933537, 8330933532, జేబీఎస్: 040-27802203, సీబీఎస్: 9241448891 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

రేపటి తరానికి వెలుగు దివ్వెలు ఉపాధ్యాయులే

- మంత్రి గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం, న్యూస్‌టుడే, బతుకుకు దారి చూపేవారు.. రేపటి తరానికి వెలుగును పంచేవారు ఉపాధ్యాయులేనని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. సర్వశిక్ష అభియాన్, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని రాష్ట్రంలోని 86 మహిళా ఉపాధ్యాయులకు పురస్కారాలను ప్రభుత్వం ప్రకటించింది. ఆంధ్రవిశ్వవిద్యాలయం స్నాతకోత్సవ మందిరంలో బుధవారం ఏర్పాటుచేసిన సభలో వారికి పురస్కారాలను అందజేశారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. విద్యారంగంలో ఫిర్యాదుల స్వీకరణ, పర్యవేక్షణలకు 'వీక్షణం' అనే మొబైల్ యాప్‌ను మంత్రి గంటా ప్రారంభించారు. చదువు మధ్యలో మానేసి, తర్వాత మళ్లీ చదువుకుని ఉన్నత స్థానాలకు చేరిన వారి ఇతివృత్తంతో రూపొందించిన 'కస్తూరి పూలు' పుస్తకాన్ని మంత్రి గంటా ఆవిష్కరించారు. అవార్డులు అందుకున్న ప్రతి ఉపాధ్యాయినికి రూ.10 వేల నగదు, రూ.10 వేలు విలువచేసే ట్యాబ్, బంగారు పతకం, ప్రశంసాపత్రాన్ని అందించి, శాలువాతో సత్కరించారు. విభాగాల వారీగా అవార్డులను అందించారు. కస్తూరిబా బాలిక విద్యాలయం, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలు, వృత్తి విద్య, హెచ్‌ఎంలు, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయినులు అవార్డులు అందుకున్నవారిలో ఉన్నారు. విద్యా సంబంధ సామగ్రితో స్టాళ్లను ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థినులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.



'వీక్షణం' మొబైల్ యాప్‌ను ప్రారంభిస్తున్న మంత్రి గంటా శ్రీనివాసరావు

ఈనాడు

అనామక బాండ్లు

ఏడు దశాబ్దాలుగా దేశ రాజకీయ వ్యవస్థకు ఇంధనంగా మారిన అదృశ్య ధన ప్రవాహానికి అడ్డుకట్ట వెయ్యడంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలు, పార్టీలతో పాటు పార్లమెంటు, ఎలెక్షన్ కమిషన్ సైతం విఫలమయ్యాయని తూష్ణీకరిస్తూ ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ గతంలో ప్రతిపాదించిన విరుగుడు వ్యూహం- ఎన్నికల బాండ్లు. పారదర్శకతకు ప్రోదిచేయగలవంటూ ఆ బాండ్లకు సంబంధించిన విధివిధానాలను లోక్‌సభలో ఆయన తాజాగా ప్రకటించారు. రాజకీయ విరాళం ఇవ్వదలచినవారు నిర్దేశిత బ్యాంకులో బాండ్లు కొని పార్టీలకిస్తే, అవి అధీకృత ఖాతాలద్వారా వాటిని నిర్ణీత కాలావధిలో మార్చుకుంటాయని నిరుటి బడ్జెట్ ప్రసంగంలో జైట్లీ సూచించారు. చూడటానికి ప్రామిసరీ నోట్లలా కనిపించే బాండ్లను వెయ్యి, పదివేలు, పది లక్షలు, కోటి రూపాయల శ్రేణుల్లో ఎంపిక చేసిన స్టేట్ బ్యాంకు శాఖలనుంచి కొనుగోలు చేయగల వీలుందని కొత్త నిబంధనావళి విశదీకరిస్తోంది. 15 రోజుల్లోగా వాటిని అందుకున్న పార్టీ ఆ మేరకు వివరాల్ని అంతిమంగా ఎన్నికల సంఘానికి నివేదించాల్సి ఉంటుంది. ఎంతమొత్తం అలా చేకూరిందో తెలుస్తుందే తప్ప, దాతల వివరాలు ఎన్నికల కమిషన్‌కూ రహస్యంగానే మిగిలిపోతాయంటున్నారు. ఎందుకంటే బాండ్లపై ఎక్కడా కొనుగోలుదారు పేరుండదు. బ్యాంకును మధ్యవర్తిగా నియోగించి రాజకీయ విరాళాలను క్రమబద్ధీకరించడమే తమ లక్ష్యమని విత్తమంత్రి చెబుతున్నారు. తద్వారా దాతలనుంచి నల్లధనం పార్టీలకు అందకుండా నియంత్రించగలమంటున్నా- విరాళాల చీకటి కోణాలపై కొన్ని మౌలిక ప్రశ్నలకు సమాధానాలు ఇంకా దొరకడంలేదు. పేర్లు బహిరంగపరిస్తే దాతలు మళ్ళీ నగదు మార్గానికి మళ్ళే అవకాశం ఉన్నందువల్ల కొంత రాజీపడ్డట్లు చెబుతున్న జైట్లీ, మున్ముందు మరింత పారదర్శకతను లక్షించగలమని విశ్వాసం వ్యక్తీకరిస్తున్నారు. బాండ్లు ప్రవేశపెట్టినా తెరచాటు అక్రమాలను ఎలా నిరోధించగలరన్న ఎన్నికల సంఘం అభ్యంతరాల్ని ఏ మాత్రం తోసిపుచ్చగల వీల్లేదు.

'అవినీతి వలన, నల్లధనం చేత, నేరగాళ్ల కొరకు' భారత ప్రజాతంత్రం ఎలా భ్రష్టుపట్టిందో దేశం నలుమూలలా పదేపదే కళ్లకు కడుతోంది. ఎన్నికల వ్యవస్థ సాకల్య క్షాళనకోసం ఎలెక్షన్ కమిషన్ చేసిన సిఫార్సులెన్నో అరణ్యరోదనమయ్యాయి. పార్టీలకు చేరే ప్రతి రూపాయీ దాతల పూర్తి వివరాలతో నమోదయ్యేలా చూడాలన్న ఈసీ లేఖను యూపీఏ జమానా బుట్టదాఖలు చేసింది. ప్రజాప్రాతినిధ్య చట్టం, ఐటీ చట్టం, కంపెనీల చట్టం, విదేశీ విరాళాల (నియంత్రణ) చట్టాల కింద నిర్ణీత పరిధికి పైబడిన చందాల వివరాలు సమర్పించాల్సి ఉన్నా- వాటిని బేఖాతరు చేయడంలో ఎప్పటికప్పుడు పార్టీలు పోటీపడుతున్నాయి. రాజకీయ విరాళాల్లో పారదర్శకత తెచ్చి ఎన్నికల వ్యయాలకు కత్తెర వేయాలన్న ప్రధాని నరేంద్ర మోదీ సూచనల దరిమిలా, తెరపైకి వచ్చిన ప్రతిపాదనలూ వివాదగ్రస్తమవుతున్నాయి. పార్టీల నిధుల సేకరణ విధివిధానాలను సమగ్రంగా ప్రక్షాళించాలన్న ఈసీ ప్రతిపాదనకు ఏడాది క్రితం ప్రధానమంత్రి జేజేలు పలికారు. వాస్తవంలో, కార్పొరేట్ సంస్థలు తమ గత మూడేళ్ల నికరలాభంలో 7.5శాతం దాకా రాజకీయ విరాళాలు ప్రదానం చేయవచ్చునన్న పరిమితిని ఇటీవల తొలగించారు. ఏ పార్టీకి విరాళం ఇచ్చిందీ పేరు ప్రస్తావించాల్సిన అవసరం లేకుండా కొత్త వెసులుబాటు కల్పించారు. పారదర్శకతకు పాతరేసే ఇటువంటి కప్పదాట్లు కట్టిపెట్టి, బ్రిటన్ తరహా విధానాలతో సచ్ఛీల రాజకీయాలకు బాటలు పరచే సదవకాశాన్ని లోతుగా ఎందుకు పరిశీలించకూడదు?

రాజకీయ పక్షాలకు కార్పొరేట్ నిధుల పందేరం పరోక్ష పెత్తనానికి దారితీస్తుందంటూ లోక్‌సభలో సీపీఐ(ఎం) సభ్యులు మొహమ్మద్ సలీమ్ లేవనెత్తిన అభ్యంతరం సహేతుకమైందే. 'తాము భారీ విరాళాలు అందించిన పార్టీలు అధికారం చేపడితే స్వీయ ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి సంపన్నులు ప్రయత్నిస్తా'రని డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ దశాబ్దాల క్రితమే హెచ్చరించారు. బొగ్గు, ఇనుము, బాక్సైట్ ఖనిజ నిక్షేపాలపై కన్నేసిన సంస్థలు పార్టీలను, వాటి సారథ్యంలోని ప్రభుత్వాలను ఎలా ప్రభావితం చేశాయో మునుపటి యూపీఏ జమానాలో గుప్పుమంది. అలా భారీగా కూడగట్టిన నల్లధనం ఎన్నికల్ని మైలపరచకుండా నగదు రహిత విరాళాలను అనుమతించడం సర్వోత్తమమని ఎన్నికల సంఘం మొత్తుకుంటోంది! సర్ క్రిస్టఫర్ కెల్లీ నేతృత్వంలోని కమిటీ వ్యక్తులైనా, సంస్థలైనా ఏ రాజకీయ పార్టీకీ నిర్ణీత మొత్తానికి మించి విరాళం అందించరాదని సూచించిన నేపథ్యంలో- బ్రిటన్ నిర్ణాయక పరివర్తనకు నడుం కట్టింది. విరాళాలకు కచ్చితమైన పరిమితులు నిర్ధారించి, పార్టీల జమా ఖర్చుల్లో పారదర్శకత, జవాబుదారీతనాలకు మేలుబాటలు పరచింది. ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ, జపాన్ ప్రభృత దేశాల్లో రాజకీయ పక్షాలు తమ ఆస్తి అప్పుల వివరాలతోపాటు ఆదాయ వ్యయాల్నీ సమగ్రంగా నివేదిస్తున్నాయి. అందుకు విరుద్ధంగా ఇక్కడి జాతీయ, ప్రాంతీయ పార్టీలకు గుర్తుతెలియని వ్యక్తులు, సంస్థల నుంచి వేలకోట్ల రూపాయల మేర భూరినిధులు వచ్చిపడుతున్నట్లు ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం (ఏడీఆర్) విపుల నివేదికలు నిర్ధారిస్తున్నాయి. దాతల ఆనుపానుల్ని భద్రంగా దాచిపెట్టే ఎన్నికల బాండ్ల మూలాన గుణాత్మక పరివర్తన సాధ్యపడదు. పార్టీల ఖజానాలకు జమపడే ప్రతి రూపాయీ ఎక్కడినుంచి ఎలా వచ్చిందో కచ్చితంగా నమోదయ్యే వాతావరణమే, శీలహీన రాజకీయాలకు తెర దించుతుంది. ఆ మేరకు సర్వసమగ్ర ఎన్నికల సంస్కరణలను సాకారం చేసే నిబద్ధ కృషే, ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థకు శోభస్కరమవుతుంది!

గ్రామీణంపై దృష్టితోనే వృద్ధిరేట్లకు పుష్టి



భారతదేశ త్రైమాసిక ఆర్థికాభివృద్ధిపై కేంద్ర గణాంక కార్యాలయం (సీఎస్ఓ) ఇటీవల విడుదల చేసిన అంచనాలు ప్రభుత్వ వర్గాల్లో ఆనందం నింపాయి. ఈ ఏడాది రెండో త్రైమాసికంలో భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 6.3 శాతం పెరిగినట్లు సీఎస్ఓ అంచనా. మొదటి త్రైమాసికంలో ఇది 5.7 శాతం మాత్రమే. గత మూడేళ్లలో అదే అతి తక్కువరేటు. రెండో త్రైమాసికం వచ్చేసరికి వృద్ధిరేటు మెరుగుపడటంపై పత్రికలు, టీవీ ఛానెళ్లు హర్షం వ్యక్తీకరించాయి. దేశ ఆర్థిక వ్యవస్థ మళ్ళీ కోలుకుంటోందని సంబరపడ్డాయి. అయితే వృద్ధిరేటు అసలు ఎందుకు మందగించింది, గడచిన అయిదు త్రైమాసికాల్లో వరసగా తగ్గుతూ వచ్చి ఉన్నట్టుండి మెరుగుపడటానికి కారణాలేమిటి, దీన్ని స్థిరపరచి అంతకంతకూ మరింత వృద్ధి సాధించడమెలా అనే మూడు ప్రశ్నలు ఇప్పుడు నిపుణుల మదిలో మెదులుతున్నాయి. వీటిలో మొదటి ప్రశ్నకు పెద్దనోట్ల రద్దు అని ఠక్కున జవాబు వస్తుంది. దీనికితోడు వస్తుసేవల పన్ను (జీఎస్‌టీ) అమలులో అవరోధాలు కూడా వృద్ధిరేటును తగ్గించాయని విమర్శలు వెల్లువెత్తాయి. ఆర్థిక మందగమనం ఇంకా ముందు నుంచే ప్రారంభమైందని- పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీలు ఈ మందగతిని తీవ్రతరం చేశాయని ఇక్కడ గుర్తుంచుకోవాలి.

స్థిరీకరణ అవసరం

ఆర్థిక మందగమనానికి మూలాలు గ్రామీణ భారతంలో ఉన్నాయి. 2004-2012 మధ్యకాలంలో గ్రామీణ ఆర్థికవ్యవస్థ సాపేక్షంగా ఎక్కువ అభివృద్ధి సాధించి జాతీయ వృద్ధిరేటు పెరగడానికి దన్ను ఇచ్చింది. పైన తెలిపిన కాలంలో వ్యవసాయ ఉత్పత్తి మూడు శాతం పెరగడంతో వ్యవసాయ ఆదాయాలు 7.5 శాతం వృద్ధిని నమోదు చేశాయి. దీంతో అనేక వస్తుసేవలకు గ్రామాల నుంచి గిరాకీ ఇనుమడించి స్థూల జాతీయోత్పత్తి వృద్ధి చెందింది. కానీ, 2013-14 నుంచి పరిస్థితులు ప్రతికూలించసాగాయి. 2004-12 మధ్య కొన్ని పంటల కనీస మద్దతు ధరలు సగటున ఎనిమిది శాతం పెరగ్గా, 2013-14 నుంచి కేవలం మూడు శాతం చొప్పున అధికమయ్యాయి. అంతర్జాతీయంగా ఆహార ధరలు తగ్గడంతో వ్యవసాయ ఎగుమతులూ మందగించాయి. ఇదంతా గ్రామీణ ప్రగతిని వెనక్కులాగింది. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్లక్ష్యం చేయడం; 2014-15, 2015-16 సంవత్సరాల్లో సంభవించిన దుర్భిక్షం గ్రామాల్లో కొనుగోలు శక్తిని తగ్గించాయి. పల్లెల నుంచి వస్తుసేవలకు గిరాకీ తగ్గిపోవడం దేశ జీడీపీ జోరుకు పగ్గాలు వేసింది. కాబట్టి జీడీపీ మందగతికి జీఎస్‌టీ, పెద్ద నోట్ల రద్దు మూల కారణాలు కావు. డిజిటల్ ఆర్థికవ్యవస్థ గాడిన పడి, జీఎస్‌టీ అమలులోని లోపాలను సరిదిద్దిన తరవాత జీడీపీ వృద్ధి ఇనుమడించడం ఖాయం!

ఇప్పుడు రెండో ప్రశ్న- ఈ ఏడాది రెండో త్రైమాసికంలో ఆర్థిక వ్యవస్థ కోలుకోవడానికి కారణమేమిటి? మొదటి త్రైమాసికంలో 5.6 శాతం స్థూల విలువ, రెండో త్రైమాసికంలో 5.7 శాతానికి పెరిగింది. ఈ పెరుగుదల పారిశ్రామిక ఉత్పత్తి రంగం నుంచే వచ్చింది. ఈ రంగం ఏడు శాతం వృద్ధిని నమోదు చేసిందని గమనించాలి. ఇది మొదటి త్రైమాసికంకన్నా 5.6 శాతం ఎక్కువ. ప్రైవేటు రంగ వ్యయం పెరగడమూ ఈ వృద్ధికి తోడ్పడింది. మొదటి త్రైమాసికంలో జీఎస్‌టీ అమలులోకి వస్తుందనగా వర్తకులు తమవద్ద ఉన్న పాత సరకులను పెద్దయెత్తున విక్రయించారు. కొత్త నిల్వలను ఇంకా సమకూర్చుకోకపోవడంతో వృద్ధిరేటు తగ్గింది. రెండో త్రైమాసికానికి వచ్చేసరికి వర్తకులు మళ్ళీ కొత్తగా సరకులు కొనడం, పారిశ్రామికోత్పత్తి పెరగడానికి దోహదం చేసింది. జీడీపీని మళ్ళీ వృద్ధి బాట పట్టించింది పారిశ్రామిక రంగమేనని నిగ్గు తేలుతోంది. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో పారిశ్రామికోత్పత్తిరంగ నిర్వహణ లాభాలు 17.6 శాతం తగ్గిపోగా, రెండో


ఆశావహంగా ఆర్థికవ్యవస్థ

త్రైమాసికంలో 10.45 శాతం పెరిగాయని భారత ఆర్థిక వ్యవస్థ పర్యవేక్షణ సంస్థ సీఎంఐఈ తెలిపింది. నిర్మాణ రంగ వృద్ధిరేటు తొలి త్రైమాసికంలో రెండు శాతం. రెండో త్రైమాసికంలో అది 2.6 శాతానికి చేరింది. స్థూల స్థిర పెట్టుబడి సంచయవృద్ధి 4.7 శాతానికి పెరిగింది. 2017-18 మూడో త్రైమాసికంలోనూ అమ్మకాలు, లాభదాయకత పెరిగి జీడీపీ హెచ్చు శాతం వృద్ధిని నమోదు చేస్తుందని వ్యాపార రంగం ధీమా కనబరుస్తోంది. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నిర్వహించిన సర్వేలోనూ ఇది స్పష్టమైంది. మొత్తంమీద భారత ఆర్థిక వ్యవస్థ మళ్ళీ పట్టాలపై పరుగు ప్రారంభించింది. అలాగని అంతా సవ్యంగా ఉందని, వ్యవస్థాపరమైన లోటుపాట్లు అన్నీ

స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)

వృద్ధిరేటు తీరు

(2011-12 ధరల ప్రకారం)



ఆధారం: గణాంక, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ


తొలగిపోయాయని భావించలేం. వ్యవసాయ రంగం ఇప్పటికీ కోలుకోలేదు. 2016 రెండో త్రైమాసికంలో 4.1 శాతంగా ఉన్న వ్యవసాయాభివృద్ధి రేటు 2017లో అదే కాలంలో 1.7 శాతానికి తగ్గిపోయింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఇంకా కోలుకోలేదని, ఫలితంగా గ్రామాల్లో వస్తుసేవలకు గిరాకీ పుంజుకోలేదని స్పష్టమవుతోంది. గ్రామీణుల కొనుగోలు శక్తి పెరిగినప్పుడు మాత్రమే పారిశ్రామికోత్పత్తి వృద్ధిబాట పట్టి జీడీపీ అధికమవుతుందనడంలో మరోమాట లేదు. వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాలకు కొత్త ఉత్తేజం తీసుకురావడం ద్వారా గ్రామీణుల ఆదాయాలను పెంచవచ్చునని కేంద్రం గ్రహించింది. తదనుగుణంగా 2017-18 నుంచి 2028-29 వరకు రూ.10,881 కోట్ల వ్యయంతో పాడి ఉత్పత్తుల శుద్ధి, మౌలిక వసతుల అభివృద్ధి నిధి (డీఐడీఎఫ్) ఏర్పాటుకు కేంద్రం అనుమతించింది.

2017-18 రెండో త్రైమాసికంలో ప్రభుత్వ వ్యయం తక్కువగానే ఉన్నా ప్రైవేటు రంగ చొరవ వల్ల ఎక్కువ వృద్ధిరేటు నమోదైంది. ఇదేకాలంలో ఎగుమతులు 1.2 శాతం మేర తగ్గడం నిరుత్సాహకరమే. జీఎస్‌టీ, పెద్ద నోట్ల రద్దు వల్ల ఈ పరిస్థితి దాపురించిందని విమర్శించేవాళ్లు, ఒకసారి క్రిసిల్ నివేదిక చూడాలి. కార్మికుల అవసరం ఎక్కువగా ఉండే ఉత్పత్తుల ఎగుమతులకు గత పదేళ్ల నుంచి గిరాకీ తగ్గిపోతూ వచ్చింది. ఇలాంటి ఉత్పత్తులను భారత్‌కన్నా చౌకగా తయారుచేయగల దేశాల నుంచి పోటీ తీవ్రం కావడంవల్ల మన ఎగుమతులు తగ్గిపోతున్నాయని క్రిసిల్ తెలిపింది. జీఎస్‌టీ, పెద్దనోట్ల రద్దు తాత్కాలిక ప్రభావం చూపాయే తప్ప, అసలు సిసలు సమస్య వ్యవస్థాగతమైనదని క్రిసిల్ స్పష్టీకరించింది. ఎగుమతులు చేసే సంస్థల్లోని కార్మికుల ఉత్పాదక శక్తిని పెంచడం ద్వారా మళ్ళీ పూర్వ వైభవం తీసుకురావడమే సరైన పరిష్కారం.

సానుకూల సూచనలు

2016 ఆరంభంలో ద్రవ్యోల్బణం తక్కువగానే ఉన్నా, ఈ మధ్య ముడిచమురు ధరలు పెరగడం వల్ల ద్రవ్యోల్బణం మళ్ళీ పైచూపులు చూస్తోంది. దీన్ని అదుపులోకి తీసుకురావడానికి రిజర్వు బ్యాంకు వడ్డీరేట్లు పెంచాల్సి రావచ్చు. ఫలితంగా పెట్టుబడి వ్యయం అధికమై ఎగుమతి సంస్థల ఉత్సాహం నీరుగారిపోవచ్చు. ఇది ఆర్థిక రథాన్ని మళ్ళీ నీరసింపజేసే ప్రమాదం ఉంది. దీన్ని ఎదుర్కోవడానికి కేంద్రప్రభుత్వం అప్పులు చేసైనా వ్యయాన్ని పెంచకతప్పదు. దీనివల్ల ఇప్పటికే పెరిగిపోయిన ద్రవ్యలోటు మరింత హెచ్చవచ్చు. 2017-18లో కేంద్రం నిర్దేశించుకున్న ద్రవ్యలోటులో ఇప్పటికే 96 శాతాన్ని చేరుకున్న దరిమిలా మరింతగా అప్పులుచేసి వ్యయీకరించే సత్తా క్షీణించింది. అందుకే ఈ ఏడాది రెండో త్రైమాసికంలో ప్రభుత్వ వ్యయం పెరగలేదు. వివిధ ప్రాజెక్టులపై నిధులు వెచ్చించాలని కేంద్రం తలపోసినా, అందుకు కావలసిన నిధులు దానివద్ద లేవు. అలాగని నిరుత్సాహపడిపోనక్కర్లేదు. మధ్యకాలికంగా భారత్ వృద్ధి అవకాశాలు బాగా ఉన్నాయి. ప్రభుత్వరంగ బ్యాంకులకు రూ.2.11 లక్షల కోట్ల అదనపు మూలధనాన్ని సమకూర్చడానికి ప్రభుత్వం సన్నాహాలు చేయడం నిస్సంశయంగా శుభసూచన. ఇందుకోసం ఈ ఏడాది ఆగస్టులో కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లు త్వరలో పార్లమెంటు ఆమోదం పొందనుంది. ఈ బిల్లు బ్యాంకులను పటిష్ఠపరచి రుణ వితరణకు బాటవేస్తుంది. సంపన్న దేశాల్లో వృద్ధి చిగురిస్తున్నందువల్ల భారతదేశ ఎగుమతులు మళ్ళీ పుంజుకోనున్నాయి. కాబట్టి 2018లో దేశంలో పెట్టుబడులు, వాటితోపాటే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని గట్టిగా ఆశించవచ్చు!

– డాక్టర్ మహేంద్రబాబు కురువ



కులదీప్ నయ్యర్

చిచ్చురేపిన ట్రంప్ వ్యాఖ్యలు

పాకిస్థాన్‌పై విరుచుకుపడుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు సర్వత్రా కలకలం సృష్టించాయి. గడచిన పదిహేనేళ్ల కాలంలో అమెరికా రెండు లక్షల పదివేల కోట్ల రూపాయలకుపైగా ఆర్థిక సాయం పాకిస్థాన్‌కు అందిస్తే- అబద్ధాలు, నమ్మకద్రోహాన్నే ఆ దేశం తమకు ప్రతిఫలంగా ఇచ్చిందంటూ అగ్రరాజ్యాధీశుడు ట్రంప్ వ్యక్తం చేసిన అభిప్రాయం అంతర్జాతీయ రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టించింది. పాకిస్థాన్‌కు అమెరికా ఆర్థిక సాయం చేసిందన్నది ఎవరూ తోసిపుచ్చలేని వాస్తవం. అయితే అందుకు ప్రతిగా ఇస్లామాబాద్ నాయకత్వం అమెరికాకు ఏమీ ఇవ్వలేదా అన్నది చర్చించాల్సిన అంశం.

అగ్రరాజ్యానికి డాలర్ల రూపంలో పాకిస్థాన్ ప్రతిఫలం చెల్లించి ఉండకపోవచ్చు. కానీ- తమ భూభాగాన్ని వ్యూహాత్మక సైనిక స్థావరంగా ఉపయోగించుకోవడానికి అమెరికాకు ఆ దేశం తోడ్పాటు అందించింది. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో అంతర్జాతీయ సమాజం రెండు వేర్వేరు కూటములుగా విడిపోయినప్పుడు పాకిస్థాన్ పూర్తిగా అమెరికా పక్షాన నిలిచింది. బాగ్దాద్ ఒడంబడిక (1955) ప్రకారం ఇరాన్, ఇరాక్, పాకిస్థాన్, టర్కీ, యునైటెడ్ కింగ్‌డమ్‌లు ఒక కూటమిగా ఏర్పాటయ్యాయి. పశ్చిమాసియాలో అప్పటి సోవియెట్ యూనియన్ విస్తరణను అడ్డుకోవడమే లక్ష్యంగా ఆ కూటమి ఏర్పాటైంది. ఇరాక్ రాజధాని బాగ్దాద్ కేంద్రంగా కూటమి ఏర్పాటైంది కాబట్టి దానికి బాగ్దాద్ ఒడంబడిక అనే పేరు వచ్చింది. అయితే 1958లో ఇరాక్‌లో సైనిక కుట్ర జరిగింది. ఫలితంగా కూటమినుంచి ఇరాక్ వైదొలగింది. దాంతో ఆ కూటమి పేరును 'సెంటో' (సెంట్రల్ ట్రీటీ ఆర్గనైజేషన్)గా మార్చి ప్రధాన కార్యాలయాన్ని అంకారాకు తరలించారు. ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లోగాని, వివిధ దేశాల మధ్య వివాదాల్లోగాని జోక్యం చేసుకోరాదన్నది 'సెంటో' ఒడంబడికలోని కీలక నిబంధన. ఆ మేరకు ఆరు రోజులపాటు జరిగిన యోమ్ కిప్పుర్ యుద్ధం (ఈజిప్ట్, సిరియాల ఉమ్మడి సైన్యానికి, ఇజ్రాయెల్‌కు మధ్య సమరం)లో కూటమి జోక్యం చేసుకోలేదు. అదేవిధంగా 1965లో, 1971లో భారత్, పాకిస్థాన్‌ల మధ్య జరిగిన యుద్ధాల్లోనూ ఆ కూటమి వేలు పెట్టలేదు. 'సెంటో' కేవలం సోవియెట్ యూనియన్‌ను నిరోధించడం కోసం ఏర్పాటైన కూటమి మాత్రమే గాని- భారత్‌కు వ్యతిరేకం కాదని అప్పట్లో దాని అధినేతలు స్పష్టం చేశారు. ఇరాన్‌లో తలెత్తిన ఇస్లామిక్ విప్లవం కారణంగా 1979లో ఆ కూటమి విచ్ఛిన్నమైంది.

'ట్రంప్ వ్యాఖ్యలు సత్యదూరం. వాస్తవాలతో నిమిత్తం లేకుండా ఆయన ఓ కల్పిత గాథ వినిపించారు. ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలోనూ, ఈ ప్రాంతంలో శాంతి సుస్థిరతలను పాదుకొల్పడంలోనూ పాకిస్థాన్ చేసిన త్యాగాలు అన్నీ ఇన్నీ కావు'- ట్రంప్ వ్యాఖ్యలకు ప్రతిగా పాకిస్థాన్ విదేశాంగ



భారత్ దక్షతకు పరీక్ష

మంత్రి ఖ్వాజా ఎం.ఆసిఫ్ ట్విటర్‌లో వెలిబుచ్చిన ప్రతిస్పందన ఇది. తమ మిత్రదేశం పాక్‌పై అమెరికా అధినేత రుసరుసల నేపథ్యంలో చైనా నాయకత్వం వెంటనే రంగంలోకి దిగింది. ఉగ్రవాదాన్ని కట్టడి చేయడంలో నిరుపమాన కృషి చేసిందంటూ చైనా సర్కారు పాకిస్థాన్‌ను వెనకేసుకొచ్చింది. 'అంతర్జాతీయంగా ఉగ్రవాద వ్యతిరేక సమరంతోపాటు, వివిధ దేశాల మధ్య పరస్పర సహకారం సాధించి శాంతి సుస్థిరతలను నెలకొల్పడంలో పాకిస్థాన్ కీలక పాత్ర పోషించాల్సి ఉంది' అని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి జెన్ షువాంగ్ వ్యాఖ్యానించారు. బీజింగ్‌నుంచి ఆ తరహా స్పందన ఊహించిందే. చైనా పాకిస్థాన్ ఆర్థిక నడవా(సీపీఈసీ) రూపంలో బీజింగ్ నాయకత్వం 5,000 కోట్ల డాలర్ల భారీ మొత్తం ఖర్చు చేస్తోంది. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ మీదుగా తలపెట్టిన ఈ నడవా నిర్మాణాన్ని భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. చైనా, పాకిస్థాన్, అఫ్గానిస్థాన్‌ల మధ్య కిందటివారం త్రైపాక్షిక సమావేశం జరిగింది. ఆ సందర్భంగా 'ఆర్థిక నడవా'ను అఫ్గాన్ వరకూ విస్తరించాలన్న తన ఉద్దేశాలను చైనా స్పష్టీకరించింది. అఫ్గాన్‌తో భారత్‌కు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్న విషయం ఈ సందర్భంగా గమనార్హం. అయితే పాక్‌ను ఉద్దేశించి డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను అఫ్గానిస్థాన్ మాజీ అధ్యక్షుడు హమీద్ కర్జాయ్ స్వాగతించారు. అమెరికా నేతృత్వంలో ప్రాంతీయ కూటమి ఏర్పాటై పాకిస్థాన్‌ను నియంత్రించాలని; తద్వారా అఫ్గాన్‌తోపాటు ఈ ప్రాంతంలో శాంతి స్థాపన దిశగా ముందడుగు వేయాలని కర్జాయ్ వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితుల్లో పాక్‌తో కలిసి జట్టుగా అఫ్గాన్‌ను మచ్చిక చేసుకోవడానికి చైనా చేస్తున్న ప్రయత్నాలు ఆసక్తిగొలుపుతున్నాయి.

చైనాతో పాకిస్థాన్ అనుబంధం బహిరంగం! వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన సీపీఈసీకి తెరచాపలెత్తడం ద్వారా భారీ పెట్టుబడులు గుమ్మరించేందుకు చైనాకు పాకిస్థాన్ ఎర్రతివాచీ పరచింది. ఆ రకంగా భౌగోళికంగా ఎంతో ప్రాధాన్యం ఉన్న అరేబియా, హిందూ మహా సముద్ర ప్రాంతాలను అనాయాసంగా చేరుకునేందుకు చైనాకు పాకిస్థాన్ వీలు కల్పించింది. ఈ పరిణామం అమెరికాకు ఏ మాత్రం రుచించడం లేదు. ట్రంప్ తాజా వ్యాఖ్యలను ఈ నేపథ్యంలోనే అర్థం చేసుకోవాల్సి ఉంది. అమెరికా అధ్యక్షుడి మాటలను భారత్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా స్వాగతించింది. 'ట్రంప్ తాజా నిర్ణయంతో భారత్ ఇంతకాలం అనుసరించిన విధానం హేతుబద్ధమేనని నిరూపితమైంది. ఉగ్రవాదాన్ని ఎగదోయడంలో పాకిస్థాన్ కీలక పాత్ర పోషిస్తోందని భారత్ మొదటినుంచీ చెబుతోంది. ఉగ్రవాదికి పాలుపోసి పెంచడం పెనుముప్పును కొనితెచ్చుకోవడమే. ఉగ్రవాదం పంజా విసిరితే ఏ దేశం, ఏ ప్రాంతమూ శాంతియుతంగా మనుగడ సాగించలేదు' మోదీ మంత్రివర్గంలోని జితేంద్ర సింగ్ వ్యాఖ్యలివి. పరిస్థితుల్లో అమెరికా సాయం లేకుండా పాకిస్థాన్ ఏ మేరకు నిలదొక్కుకోగలదన్నది ఆసక్తికరం. అమెరికా ఇప్పటివరకూ చేసిన ఆర్థిక సాయాన్ని లెక్కగట్టి గుండుగుత్తగా ఆ మొత్తాన్ని దానికి తిరిగి ఇచ్చేస్తామని పాకిస్థాన్ చెబుతోంది. కానీ, అది సాధ్యమయ్యే పని కాదు. ట్రంప్ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా కొత్త సమీకరణలకు తెరలేపే అవకాశం ఉంది. కాబట్టి, భారత్ ఆచితూచి అడుగులు వేయాల్సిన సందర్భమిది!

(రచయిత– ప్రముఖ పాత్రికేయులు, బ్రిటన్‌లో భారత మాజీ హైకమిషనర్)

ఈనాడు లేఖలు

నిరాదరణతో భిక్షాటన

వృద్ధులు అనేకమంది భిక్షాటన చేస్తూ వీధుల్లో కనబడుతుండటం ఆవేదన కలిగిస్తోంది. పేదరికం వల్ల కొందరు, ఇళ్లలో పిల్లల ఆదరణ కొరవడి మరికొందరు వీధులపాలవుతున్నారు. ఇలాంటివారిని ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి. స్వచ్ఛంద సంస్థలు, మానవతావాదుల సహకారాన్ని ఆహ్వానించాలి. స్వచ్ఛంద సేవకుల ద్వారా భిక్షాటన చేస్తున్నవారి వివరాలను రాబట్టి ఆదుకునే మార్గాలను అన్వేషించాలి. ఉత్తర్ ప్రదేశ్‌లో భిక్షాటన చేస్తున్న ఓ వృద్ధుడు తమిళనాడుకు చెందిన కోటీశ్వరుడిగా గుర్తించిన వార్తాకథనం ఇటీవల వచ్చింది. ఆధార్ కార్డు ద్వారా అతడి వివరాలు తెలుసుకోగలిగారు. భిక్షాటకుల వివరాలు గుర్తించడానికి సామాజిక మాధ్యమాలు సైతం తోడ్పడుతున్నాయి. సామాజిక మాధ్యమాలు అందజేసిన సమాచారం ద్వారా కేరళలో వీధులపాలైన ఓ ఉపాధ్యాయురాలిని పూర్వ విద్యార్థులు ఆదుకోగలిగారు. ప్రభుత్వం తగిన వ్యవస్థలను ఏర్పాటు చేసి, సహకార ప్రోత్సాహకాలు అందజేయగలిగితే భిక్షాటకులను ఆదుకునేందుకు అనేకమంది మానవతావాదులు ముందుకొస్తారు.

- జె.వినీత్, మాదాపూర్, హైదరాబాద్

నిజస్వరూపం

తలాక్‌ను నిషేధిస్తూ కేంద్రం తెచ్చిన చట్టంపై ప్రధాన రాజకీయ పక్షాలు సహా కొన్ని ప్రాంతీయ పార్టీలు స్పందించిన తీరు వారి నిజనైజాన్ని బయటపెట్టింది. ఇన్నేళ్లుగా లౌకికవాదం ముసుగులో వారి నడిపింది ఓట్ల రాజకీయమని స్పష్టమైంది. ముస్లి సోదరీమణులు పడుతున్న బాధలూ ఏ మహిళా సంఘాలూ నిలదీయలేదు. ముస్లిం మతచట్టం వారి మతం వరకే పరిమితం. అన్యాయం జరిగిందని ఎవరైనా న్యాయస్థానం మెట్లెక్కితే దేశ రాజ్యాంగ పరిధిలో బాధితులకు సమన్యాయం జరగాలి. దీనికి ఏ మతమూ అతీతం కారాదు. భారతదేశంలో ఒకే ప్రజ, ఒకే చట్టం, ఒకే న్యాయం అమలైనప్పుడు నిజమైన జాతీయవాదం సాధ్యపడుతుంది!

- వీరుభొట్ల పేరయ్యశాస్త్రి, అయోధ్యానగర్, విజయవాడ

అంతర్యామి

అవ్యాజ సుహృద్భావం

భగవంతుడు దయామయుడు. గొప్ప ప్రేమమూర్తి. అవ్యాజ కారుణ్యమూర్తి. మనం అసలు నిజంగా దైవం దివ్యత్వాన్ని గ్రహిస్తే, ఆయనను తప్ప మరొకరిని ప్రేమించలేం. భక్తుల ప్రేమకు భగవంతుడు సదా దాసుడు.

కవి తులసీదాసు 'రామ చరిత మానస్'లో అన్నట్లు- భగవంతుడు సర్వత్రా వ్యాపించి ఉన్నప్పటికీ, కేవలం నిర్మలమైన ప్రేమభావన ద్వారానే ప్రకటితమవుతాడు. అంతే కాదు, భక్తుల ప్రేమకు దైవం ఎప్పుడూ అధీనమై ఉంటాడు.

పరమాత్మ పరిపూర్ణ సచ్చిదానంద స్వరూపుడు. నిత్యజ్ఞానం కలిగినవారికి ఆ ఆనందం లభిస్తుంది. భగవద్దర్శనం లేకుండా, ఏ జీవితమూ సఫలం కాదు.

భగవద్దర్శనం మూడు విధాలు. స్వప్నంలో ప్రభు ప్రభ(కాంతి) గోచరమవుతుంది. ఇది సాధారణ దర్శనం. దేవాలయంలోగాని, విగ్రహంలోగాని పరమాత్మ దర్శనం రెండో విధం. ఇది మాధ్యమిక దర్శనం. భగవంతుడి అపరోక్ష దర్శనం మూడో విధం. ఇది మహోత్తమ దర్శనం. సర్వే సర్వత్రా భగవదనుభూతిని పొందిన మానవుడు భగవత్ స్వరూపుడు కాగలుగుతాడు. అతడు ఆలయంలో దర్శించిన భగవంతుణ్ని బయటకు వచ్చాక కూడా ప్రతి వ్యక్తిలోనూ చూడగలగాలి.

'నారదా! నేను వైకుంఠంలోనో, యోగుల గుండెల్లోనో ఉండనయ్యా... నా నామాన్ని భక్తులు ఎప్పుడూ గానం చేస్తున్న చోట ఉంటాను. అక్కడే తిష్ఠ వేసుకుని కూర్చుంటాను' అని శ్రీహరి ఎప్పుడో చెప్పాడంటాయి పురాణ గ్రంథాలు. భక్తులు ఎక్కడైనా సరే... ముందు వెళ్తుంటే, ఆ భగవంతుడు అన్నివేళలా వారి వెంటే ఉంటాడంటాయి పురాణాలు. 'నిజ భక్తుల



పాదధూళి నాపై పడితే, నేను పవిత్రుడనవుతా'ననే భావన ఆయనది. ఆయన తన భక్తుల వెంట ఉండేది అందుకే! ఇది సామాన్య మానవుల్లో చాలామందికి అంతగా అర్థం కాదు.

శ్రీమద్భాగవతం 'భగవంతుడి ప్రేమ ఎంతో అగాధమైంది, మాటలకందనిది. ఆ ప్రేమ తత్వాన్ని గ్రహించడం మానవుడి బుద్ధికి శక్యం కాదు. దైవం ప్రేమమయుడు, ఆనందమయుడు!' అని వర్ణిస్తుంది. 'గజేంద్ర మోక్షం' కథ శ్రీహరి తన భక్తుణ్ని రక్షించేందుకు ఏ విధంగా తరలి వచ్చాడో విశదీకరిస్తుంది.

'దీనుడ నేను, దేవుడవు నీవు' అని వాగ్గేయకారుడు అన్నమయ్య కీర్తించాడు. అందులోని ప్రతి అక్షరమూ సత్యమే. పరమాత్మ సర్వజ్ఞుడు. ఈ జీవాత్మ అల్పజ్ఞుడు. 'నేను ఘటాకాశం. పరమాత్మ మహాకాశం' అని భక్తుడు తెలుసుకోవాలి. అప్పుడే దైవానికి జ్ఞానంతో, సర్వజ్ఞతతో విలువ కట్టినవాడవుతాడు. ఈ ఆత్మతో ఆ పరమాత్మను గ్రహించి మసలాలి. అప్పుడు సాధకుడు దైవాన్నే ఆరాధిస్తాడు. ఐశ్వర్యం వంటి వ్యామోహాల్లో ఎంతమాత్రం పడడు.

ఆత్మ తాలూకు ప్రేమకు మారుపేరు పరమాత్మ. ఒక ఆత్మ ప్రేమనొంది, బదులుగా ఆ పరమాత్మ తనను తానే అర్పించుకోవడం ఎంత గొప్ప ప్రేమో కదా!

– తటవర్తి రామచంద్రరావు



ఎంటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి నారాయణ

రాష్ట్ర పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య కాలమానిని ఆవిష్కరణ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య (ఎంటీఎఫ్) కాలమానిని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ బుధవారమిక్కడ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ.. 'జన్మభూమి- మా ఊరు' కార్యక్రమం అనంతరం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని తమకు హామీ ఇచ్చినట్టు ఎంటీఎఫ్ అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు.

పురపాలికల్లో 6.81 లక్షల పక్కా గృహాలు: నారాయణ

చీమకుర్తి, న్యూస్‌టుడే: దేశంలో ఎక్కడా లేని విధంగా.. రానున్న ఏడాదిన్నర కాలంలో రాష్ట్రంలోని 110 పురపాలక సంఘాల్లో.. 6.81 లక్షల పక్కా గృహాల నిర్మాణం చేపట్టనున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. ప్రకాశం జిల్లా చీమకుర్తి నగర పంచాయతీలో బుధవారం నిర్వహించిన జన్మభూమి - మా ఊరు సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. అర్హులందరికీ పక్కా గృహాలు అందజేస్తామన్నారు. అర్హులెవరైనా ఉంటే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని పురపాలక సంఘాల్లో పక్కా రహదారులు, మురుగు కాలువల నిర్మాణానికి రూ.11 వేల కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఆయా పురపాలక సంఘాల్లో తాగునీటి పథకాల నిర్మాణానికి రూ.3,700 కోట్లతో డీపీఆర్‌లు సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

భూదాన్ యజ్ఞ బోర్డు ప్రత్యేక అధికారి నియామక జీవో సస్పెన్షన్

ఉత్తర్వులు జారీచేసిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ భూదాన్ యజ్ఞ బోర్డు కార్యకలాపాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమిస్తూ రెవెన్యూశాఖ గతేడాది డిసెంబరు 18న జారీచేసిన ఉత్తర్వులను హైకోర్టు సస్పెండు చేసింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావు బుధవారం ఈమేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. ఈ నియామకాన్ని సవాలు చేస్తూ ఏపీ భూదాన్ యజ్ఞ బోర్డు ఛైర్మన్ జి.రాజేందర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా కార్యవర్గం ఏర్పాటయ్యేంత వరకూ గత కార్యవర్గం కొనసాగేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ప్రస్తుత దశలో ప్రత్యేక అధికారి నియామకం అవసరం లేదని, ప్రభుత్వానికి ఆ అధికారిని నియమించే అధికారం లేదని పేర్కొన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. ఆ జీవోను సస్పెండు చేశారు.

వాహనాల రిజిస్ట్రేషన్ నిబంధనల్లో సవరణ తెచ్చాం

ఈనాడు, హైదరాబాద్: మోటారు ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల చట్టం-1961 ప్రకారం వాహనాల్ని రిజిస్ట్రేషన్ చేసేలా నిబంధనల్లో సవరణ తీసుకొచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. ఆ మేరకు జారీ చేసిన జీవోను ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) కృష్ణప్రకాష్ కోర్టుకు అందజేశారు. ఆ వివరాల్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం విచారణను 3 వారాలకు వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఈ ఆదేశాలు జారీచేసింది. గతేడాది ఫిబ్రవరిలో కృష్ణా జిల్లా మూలపాడు వద్ద దివాకర్ ట్రావెల్స్ బస్సు ప్రమాదం నేపథ్యంలో చట్ట నిబంధనలను కఠినంగా అమలు చేయాలంటూ న్యాయవాది కె.వి.సుబ్బారెడ్డి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్య విచారణ సందర్భంగా మోటారు ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల చట్టం కింద వాహనాలను రిజిస్ట్రేషన్ చేయడంలేదనే అంశంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో ప్రభుత్వం ఈ సవరణ తీసుకొచ్చింది.

సొమ్ము జమచేయడంలో విఫలమైతే కోర్టుకు రండి

ఏపీ పశు సంవర్ధకశాఖ ముఖ్య కార్యదర్శికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల్లో జంతు హింస నిరోధక కమిటీల (ఎస్పీసీఏ) నిర్వహణ కోసం సొమ్ము జమ చేయాలని ఏపీ పశు సంవర్ధకశాఖ ముఖ్య కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. సొమ్ము జమ చేయడంలో విఫలమైతే ఈనెల 23న జరిగే తదుపరి విచారణకు స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. ఈ నిధులపై దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం విచారణ సందర్భంగా ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది.

పన్ను విధింపుపై స్టే

ఈనాడు, హైదరాబాద్: ఏపీ ఖనిజ చట్టం - 2005 ప్రకారం పన్ను విధింపుపై హైకోర్టు స్టే విధించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.సీతారామమూర్తి బుధవారం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. ఈ చట్టం కింద తెలుగు రాష్ట్రాల్లో పన్ను విధింపును సవాలు చేస్తూ పలు ఖనిజ తవ్వకాల సంస్థలు హైకోర్టును ఆశ్రయించాయి.

ఎన్టీఆర్ వర్సిటీకి అకడమిక్ సెనేట్

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయానికి అకడమిక్ సెనేట్‌ను ఏర్పాటు చేస్తూ వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య బుధవారం ఉత్తర్వులను జారీచేశారు. అల్లోపతి విభాగం నుంచి ప్రొఫెసర్ డాక్టర్ బి.దేవి మాధవి (ఆంధ్రా వైద్య కళాశాల), డాక్టర్ ఎస్వీ సుందరాచారి (గుంటూరు వైద్య కళాశాల), డాక్టర్ సీహెచ్ లక్ష్మణరావు (మహారాజా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్), డాక్టర్ ఎ.సురేఖ (కర్నూలు వైద్య కళాశాల), యునాని విభాగం నుంచి డాక్టర్ సయ్యద్ మహబూబ్ బాషా (అబ్దుల్ హక్ యునాని వైద్య కళాశాల)లను సభ్యులుగా నియమించారు. అకడమిక్ సెనేట్ కాలవ్యవధి మూడేళ్లు.

స్పష్టత దిశగా పోలవరం!

ఈనాడు - అమరావతి

పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన వ్యవహారాలు పరిష్కారం దిశగా సాగుతున్నాయి. ఇందులో డ్యాం ఆకృతుల కమిటీ (డీడీఆర్‌పీ) శుక్రవారం నాటి భేటీ ప్రధానమైంది. గేట్లకు సంబంధించి గురువారం కేంద్ర జల సంఘం వద్ద సమావేశం ఉంది. ఈ సమావేశంలో ముఖ్యమైన సాంకేతిక అంశాలు కొలిక్కి రానున్నాయి. దీంతోపాటు ప్రాజెక్టులో ఎప్పటికి ఏ పని ఎలా పూర్తి చేయాలనే ప్రణాళిక తుది రూపునకు వస్తుంది. దీంతో 2018 జూన్ నాటికి ఎగువ కాఫర్ డ్యాం, స్పిల్ వే పూర్తి చేసి నీళ్లు ఇవ్వడం సాధ్యమా లేక... 2019 నాటికే పోలవరం పూర్తి స్వరూపం ఏర్పడుతుందా అన్న స్పష్టత రానుంది.

రేపు డీడీఆర్‌పీ

జాతీయ జలవిద్యుత్తు కార్పొరేషన్ ఇచ్చిన నివేదికపై డీడీఆర్‌పీ చర్చిస్తుంది. వ్యయం తగ్గించే కోణంలోనే నివేదిక దృష్టి పెట్టి ప్రత్యామ్నాయాలు సూచించింది. ఎగువ కాఫర్ డ్యాంను 2300 మీటర్ల పొడవునా నిర్మించాల్సిన అవసరం లేకుండా ఎలా పరిమితం చేయవచ్చు... ప్రధాన డ్యాంతో అనుసంధానించి మట్టి పని ఏ మేరకు తగ్గించుకోవచ్చు అనే విషయాలను నివేదిక విశ్లేషించింది. అయితే డయాఫ్రం వాల్, జెట్ గ్రౌటింగ్ అనుసంధానానికి సంబంధించిన సాంకేతిక అంశాలపై నివేదిక పెద్దగా ఏమీ ప్రస్తావించలేదని నిపుణులు చెబుతున్నారు. నిర్ణయం తీసుకోవడంలో అదే కీలకం కానుంది. అదే సమయంలో ఆర్థికంగా ఎంత మేర కలిసొస్తుంది? అనేదానిపైనా సమయపరంగా చర్చించి నిర్ణయం తీసుకోనున్నారని సమాచారం.

టెండర్లకు గడువు మరింత పెంపు?

పోలవరంలో రూ.1483 కోట్ల విలువైన స్పిల్ వే కాంక్రీటు, మట్టి పనికి పిలిచిన టెండర్ల గడువు జనవరి 5తో ముగుస్తోంది. 4, 5 తేదీల్లో పోలవరం అధికారులకు దిల్లీ సమావేశాలు ఉండటం, కేంద్రం నుంచి కొత్త టెండర్లకు అనుమతి రావాల్సి ఉన్న నేపథ్యంలో వీటి గడువు మరికొంత పెంచే అంశంపైనా చర్చ జరుగుతోంది. గురువారం దీనిపై నిర్ణయం వెలువడవచ్చు.

కెనరా బ్యాంకు వ్యవహారంపైనా చర్చ...

మరో వైపు ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ దివాలా తీసిందని ప్రకటించాలంటూ కెనరా బ్యాంకు కంపెనీ లా ట్రిబ్యునల్ ఎదుట పిటిషన్ దాఖలు చేసిన వైనమూ పోలవరం అధికారుల్లో చర్చనీయాంశమైంది. ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ పోలవరం ప్రాజెక్టులో ప్రధాన గుత్తేదారు. కెనరా బ్యాంకు నుంచి వారు దాదాపు రూ.300 కోట్లకు సంబంధించిన బ్యాంకు గ్యారంటీలు సమర్పించారు. కొంత మొత్తం గ్యారంటీ ఈ ఏడాది ఆగస్టుకు పూర్తవుతుంది. మరికొంత మొత్తానికి 2020 వరకూ గడువుంది. ఈ నేపథ్యంలో బ్యాంకు గ్యారంటీ ఇచ్చిన వైనంపై పోలవరం అధికారులు ఆ బ్యాంకుకు లేఖ రాయబోతున్నారు. అవసరమైతే ఆ గ్యారంటీని నగదుగా మార్చుకునేందుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవడమే వారి ప్రధాన ఉద్దేశం.

ఆరుబయటకు వెళ్లొద్దురో డింగిరీ...

• శ్రీకాకుళంలో చెంబుకు శవయాత్ర



భారీ ర్యాలీగా సాగుతున్న ట్రిపుల్‌ఐటీ సిబ్బంది, విద్యార్థులు.. అంతరచిత్రంలో చెంబుకు శవయాత్ర

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: బహిరంగ మలవిసర్జన అనారోగ్యకరమని, మరుగుదొడ్లు నిర్మించుకొని వినియోగించుకోవాలని శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు వారం రోజులుగా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం ఎచ్చెర్ల మండల కేంద్రంలో 'చెంబుకు శవయాత్ర' నిర్వహించారు. చెంబును మనిషి ఆకారంలో తయారుచేసి దానికి పాడి కట్టి ఊరేగించారు. బహిరంగ మలవిసర్జనకు స్వస్తిపలకాలంటూ నినాదాలు చేశారు. ఈ భారీ చెంబు శవయాత్రలో 450 మంది విద్యార్థులతో పాటు ట్రిపుల్‌ఐటీ ఓడీఎఫ్ కార్యక్రమ కన్వీనర్ ఆచార్య ఆర్.రామకృష్ణ, నోడల్ అధికారి వై.కుమార్‌శేఖర్, సమన్వయకర్త రొట్ట గణపతిరావు, నిర్వహణాధికారులు సుధా అంకమ్మ, పి.ముకుందరావు, జి.బాబూరావు, పీఆర్‌వో ఎస్.సతీష్‌కుమార్, శతావధాని రాంభట్ల పార్వతీశ్వర శర్మ పాల్గొన్నారు.

ఈము రైతుకు రుణ ఉపశమనం

• బ్యాంకు రుణంలో 50శాతం చెల్లించనున్న రాష్ట్ర ప్రభుత్వం

ఈనాడు - అమరావతి

ఈము పక్షుల పెంపకంతో ఆర్థికంగా నష్టపోయి అప్పులపాలైన రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. వారు బకాయి పడ్డ బ్యాంకు రుణంలో 50శాతం చెల్లించాలని నిర్ణయించింది. మిగిలిన దాంట్లో 25శాతాన్ని బ్యాంకులు రద్దు చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. పశుసంవర్ధకశాఖ ప్రస్తుతం ఈ పనిలో తలమునకలైంది. యువతకు ఉపాధి కల్పించే పథకంలో భాగంగా ఈము పక్షుల పెంపకాన్ని కేంద్రం 2010లో ప్రవేశపెట్టింది. ప్రాజెక్టు ఏర్పాటుకు బ్యాంకుల నుంచి వడ్డీలేని రుణం ఇప్పిస్తామని స్పష్టం చేసింది. భారీ ఎత్తున లాభాలు ఉంటాయని ఆశ చూపడంతో రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది రైతులు ముందుకొచ్చి అప్పు తీసుకుని ఈము పక్షుల పెంపకం చేపట్టారు.

వడ్డీపై నాబార్డు మెలిక..: పథకంలో భాగంగా 100 ఈము పక్షుల పెంపకం చేపట్టిన రైతుకు రూ.27లక్షల వరకు బ్యాంకు నుంచి రుణం ఇప్పించారు. అంతా వడ్డీలేని రుణమే అని చెప్పారు. రుణ మొత్తంలో 25శాతం రాయితీ ఇస్తామని నాబార్డు తెలిపింది. మరోవైపు, మార్కెటింగ్ సౌకర్యం లేక రైతులు నష్టాలపాలవడంతో రుణ చెల్లింపులు నిలిచిపోయాయి. ఉప ఉత్పత్తుల ఆధారంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ప్రకటించినా అవి రైతులకు అందుబాటులోకి రాలేదు. రోజులు గడిచే కొద్దీ ఈము పక్షుల పోషణ భారమైంది. దీంతో రైతులు పక్షులను తీసుకెళ్లి అడవుల్లో వదిలేసి వచ్చారు. అదేసమయంలో.. పనిచేయని ప్రాజెక్టులకు రాయితీ లేదంటూ నాబార్డు మెలిక పెట్టింది. దీంతో అప్పటివరకు వడ్డీలేని రుణం అన్న బ్యాంకులు 12 శాతం నుంచి 14శాతం వరకు వడ్డీ విధించాయి. అటు పక్షులు లేక.. ఇటు బ్యాంకు రుణాలు పెరిగిపోయి రైతులు ఆర్థికంగా కుంగిపోయారు. రుణాలు తీర్చమంటూ బ్యాంకర్ల నుంచి వత్తిడి అధికమైంది. తీవ్రంగా నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయమై కేంద్రానికి లేఖలు రాశారు. అయినా ఈము రైతులకు ఊరట లభించలేదు.

బ్యాంకులు 25శాతం..: రైతుల ఆర్థిక ఇబ్బందులను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకర్లతో చర్చించింది. మొత్తం రుణంలో 50 శాతం ప్రభుత్వమే చెల్లిస్తుందని స్పష్టం చేసింది. 25శాతం రైతు సొంతంగా చెల్లిస్తారని, మిగిలిన 25శాతాన్ని బ్యాంకులు రద్దు చేయాలని ప్రతిపాదించింది. దీనికి బ్యాంకర్లు అంగీకరించడంతో పశుసంవర్ధకశాఖ అధికారులు బకాయిలున్న రైతుల వివరాలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు 357 మందికి సంబంధించి రూ.74కోట్ల విలువైన బ్యాంకు రుణాలు ఉన్నట్లు లెక్క తేలాయి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.37కోట్లు అవుతుంది. రాష్ట్రంలో ఇంకా ఎవరైనా బ్యాంకు బకాయిలు ఉన్న వారుంటే తమశాఖను సంప్రదించాలని పశుసంవర్ధకశాఖ సంచాలకుడు సోమశేఖరం సూచించారు.

రైళ్లలో సరకుల అక్రమ రవాణా

- పన్ను ఎగవేతకు వ్యాపారుల అడ్డదారి
- పార్శిళ్ల రూపంలో తరలింపు
- విజయవాడలో పట్టుకున్న అధికారులు

ఈనాడు - అమరావతి



పార్శిళ్లను తనిఖీ చేస్తున్న అధికారులు

పన్ను ఎగవేతే లక్ష్యం.. ఇందుకు ఏ దారైతేనేం.. అందుకే కొందరు వ్యాపారులు అడ్డదారి తొక్కుతున్నారు. వాహనాల్లో తీసుకెళ్తే అధికారులు పట్టుకుంటున్నారనే కారణంగా రైళ్లలో పార్శిళ్ల రూపంలో తరలిస్తున్నారు. ఇదీ ఎంతో కాలం సాగదు కదా.. అధికారులు మాటేశారు.. అక్రమంగా తరలిస్తున్న సరకును పట్టుకున్నారు. విజయవాడ రైల్వే పార్శిల్ కార్యాలయంలో రూ.36 లక్షల విలువైన రెడీమేడ్ వస్త్రాలు, ఎలక్ట్రికల్ వస్తువులు, గృహోపకరణాలు, హార్డ్‌వేర్, ఇతర వస్తువులను వాణిజ్య పన్నుల శాఖ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనరు జె.శ్యామలరావు ఆదేశాల మేరకు విజయవాడ సంయుక్త కమిషనర్లు రఘునాథ్, కిరణ్‌కుమార్‌లు రైల్వే డివిజనల్ కమర్షియల్ మేనేజర్ రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఈ తనిఖీలు చేశారు. 66 రకాల వస్తువుల రవాణాకు సంబంధించి పత్రాలు లేవని గుర్తించారు. హౌరా, సూరత్, అహ్మదాబాద్, ఇతర చోట్ల నుంచి ఇవి వచ్చినట్లు తెలిసింది. సంక్రాంతి కావడంతో ఈ తరహా రవాణా పెరిగింది.

జీఎస్టీ ఎగ్గొట్టేందుకే...

జులై ఒకటో తేదీ నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చిన అనంతరం క్రయ, విక్రయాలు అధికారికంగానే జరగాలి. కానీ.. కొందరు వ్యాపారులు అనధికారికంగానే వస్తువులను పొరుగు రాష్ట్రాల నుంచి భారీ స్థాయిలో నిర్దేశిత ప్రాంతాలకు చేరుస్తూ విక్రయాలు సాగిస్తున్నారు. ఈ ప్రక్రియలో కాగితాలపై వస్తువులు ఏ ప్రాంతం నుంచి వస్తున్నాయనిగానీ, ఎంత మొత్తంలో తెస్తున్నారనిగానీ తెలియడంలేదు. దీనివల్ల రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లుతోంది. వినియోగదారులకు జీఎస్టీ ప్రయోజనాలు లభించడం లేదు.

జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాల్లోకి ప్రవేశించే మార్గాల్లో 20 వరకూ తనిఖీ కేంద్రాలను వాణిజ్య పన్నుల శాఖ తొలగించింది. ఈ వే బిల్లు విధానం ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానుంది. ఈ విధానపరమైన నిర్ణయాల్లో జరిగిన జాప్యం, తనిఖీల విషయంలో సంయమనం పాటించాలని కేంద్రం రాష్ట్రాలకు చెబుతుండడాన్ని కొందరు వ్యాపారులు అనుకూలంగా తీసుకుంటూ ప్రయోజనం పొందుతున్నారు. వాహనాల ద్వారా అనధికారికంగా వస్తువులను తరలిస్తున్నారు. లారీలు, బస్సులు, పలు ప్రైవేటు బస్సులు, ఇతర వాహనాల ద్వారా అనధికారికంగా వచ్చే వస్తువులను అధికారులు తనిఖీ చేసి పన్నులు, జరిమానాలను వసూలు చేస్తున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం... రూ.8.7 కోట్ల పన్నులు, రూ.6.7 కోట్ల జరిమానాలను ఇప్పటిదాకా వసూలు చేశారు. అనధికారిక వస్తువులను జప్తుచేయడం ద్వారా మరి కొంత ఆదాయం వచ్చింది. మొత్తమ్మీద రూ.17 కోట్ల వరకూ వసూళ్లు జరిగాయి. వాణిజ్య పన్నుల శాఖ చర్యలతో వ్యాపారులు రైళ్లను అనుకూలంగా మలుచుకోవడంపై దృష్టి పెట్టారు. పార్శిల్ ద్వారా వస్తువులను తరలించే సమయంలో రైల్వే నుంచి ఎటువంటి ప్రశ్నలు వ్యాపారులకు ఉండవు. దీంతో రైళ్లను ఎంచుకుంటున్నారు.

ప్రత్యేక హోదా తాకట్టు

• ప్రజాసంకల్ప యాత్రలో జగన్ విమర్శ



కలికిరిలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్

కలికిరి(గ్రామీణ), న్యూస్‌టుడే: రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందే అవకాశమున్న ప్రత్యేక హోదాను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్రం వద్ద తాకట్టు పెట్టారని ప్రతిపక్ష నేత, వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ప్రజాసంకల్ప యాత్ర చిత్తూరు జిల్లా కలికిరికి చేరుకుంది. కలికిరి నాలుగురోడ్ల కూడలిలో ప్రజలనుద్దేశించి జగన్ మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేక హోదా ప్రకటించి ఉంటే.. రాష్ట్రానికి పరిశ్రమలు వచ్చేవని, పన్నుల్లో రాయితీ దక్కేదని, జీఎస్టీ మినహాయింపుతో రాష్ట్రం అన్నివిధాలుగా అభివృద్ధి చెందేదని పేర్కొన్నారు. ప్రత్యేక హోదాకు చెల్లుచీటి పలికిన చంద్రబాబు ప్రత్యేక ప్యాకేజీ అంటూ కాలయాపన చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. ప్రత్యేక హోదాతోనే పారిశ్రామిక అభివృద్ధి జరిగి.. లక్షలాది మంది యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చిత్తూరు పాలడెయిరీని పునరుద్ధరించి పాడిరైతులకు లీటరుకు రూ.4 బోనస్ అందజేస్తానని హామీ ఇచ్చారు. రైతుల పంటసాగుకు పెట్టుబడి రాయితీని అందజేస్తామని, పండించిన పంటలకు రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు.

దుకాణాలకు నిలిచిన మద్యం సరఫరా

• హెచ్‌పీఎఫ్ఎస్ లేని వాటిపై చర్యలు

ఈనాడు, అమరావతి: మద్యం అమ్మకాల్లో పారదర్శకత కోసం రూపొందించిన హెడోనిక్ పాత్ ఫైండర్ సిస్టమ్(హెచ్‌పీఎఫ్ఎస్)ను సమకూర్చుకోని దుకాణాలకు ఎక్సైజ్ శాఖ బుధవారం నుంచి మద్యం సరఫరాను నిలిపేసింది. హెచ్‌పీఎఫ్ఎస్‌ను సమకూర్చుకున్నప్పటికీ దాని ద్వారా 75 శాతం కంటే తక్కువ లావాదేవీలు నిర్వహిస్తున్న లైసెన్సీలకు కూడా సరఫరాను ఆపేసింది. ఎమ్మార్పీ కంటే అధిక ధరకు మద్యం విక్రయాలు జరకుండా అడ్డుకట్ట వేయడం, వినియోగదారులకు కంప్యూటర్ ఆధారిత బిల్లు ఇవ్వడం, మద్యం అమ్మకాల్లో పారదర్శకతను తీసుకొచ్చేందుకు ఎక్సైజ్ శాఖ హెడోనిక్ పాత్ ఫైండర్ సిస్టమ్‌ను తీసుకొచ్చింది. నూతన మద్యం విధానం ప్రారంభమై ఆరు నెలలు గడిచినా ఇప్పటికీ చాలా దుకాణాల్లో ఈ వ్యవస్థకు సంబంధించిన పరికరాలు అమర్చలేదు. ఈ విషయాన్ని గుర్తించిన ఎక్సైజ్ కమిషనర్ లక్ష్మీనరసింహం.. రెండో రోజుల కిందట అన్ని జిల్లాల ఉప కమిషనర్లకు లేఖలు రాశారు. హెచ్‌పీఎఫ్ఎస్ లేని దుకాణదారులకు డిపోల నుంచి సరఫరా నిలిపేయాలని ఆదేశించారు.

త్వరలో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల క్యాలెండర్

ఈనాడు, అమరావతి: జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా పర్యాటక, సాంస్కృతిక శాఖ నిర్వహిస్తున్న జన్మభూమి నేపథ్య సాంస్కృతిక పోటీలకు విశేష స్పందన లభిస్తోందని ఆ శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో మూడు కేటగిరిలుగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 5-8తరగతులు, 9వ తరగతి-ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థులకు నిర్వహిస్తున్నామని, ఈనెల 9వ తేదీతో గ్రామ స్థాయి పోటీలు ముగుస్తాయని తెలిపారు. గ్రామ స్థాయిలో విజేతలకు 10న మండల స్థాయి పోటీలు నిర్వహించి, విజేతలకు 11న జరిగే కార్యక్రమంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. మండలస్థాయి విజేతలకు జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించేందుకు త్వరలోనే తేదీలను ప్రకటిస్తామన్నారు. ఉగాది రోజున విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో నాలుగు కార్యక్రమాలు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ ఆధ్వర్యంలో కొత్తగా నాలుగు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు అటవీశాఖ ప్రధాన ముఖ్య సంరక్షణాధికారి (పీసీసీఎఫ్) పి.మల్లికార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా వన సురక్ష, వన వికాసం, వన సేవ, వన సంపద కార్యక్రమాలపైన విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఎర్రచందనం పరిరక్షణ, ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు విలువైన అటవీ సంపదను కాపాడటం, అడవుల్లో మంటలు చెలరేగకుండా జాగ్రత్తలు తీసుకోవడం కోసం ఈ కార్యక్రమాలను ప్రవేశపెట్టామన్నారు.



ప్రణయ కలహోత్సవంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామికి హారతి పడుతున్న పెద్దజీయంగార్

నేత్రపర్వంగా ప్రణయ కలహోత్సవం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర స్వామి తన దేవేరులతో పాల్గొనే కలహ శృంగార భరితమైన ఘట్టం ప్రణయకలహోత్సవం బుధవారం తిరుమలలో నేత్రపర్వంగా జరిగింది. ఏటా ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి తర్వాత ఆరో రోజున ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. బుధవారం సాయంత్రం 4.30 గంటలకు శ్రీమలయప్పస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు బంగారు పల్లకీలపై వైభవోత్సవ మండపం నుంచి వేర్వేరుగా ఊరేగుతూ తూర్పుమాడ వీధిలో ఎదురేగారు. ఇక్కడ అర్చకస్వాములు అమ్మవార్ల తరపున ఆళ్వారు దివ్యప్రబంధంలోని పాశురాలను స్తుతించారు. అమ్మవార్లు స్వామివారిని నిందాస్తుతి చేసిన అనంతరం ఒకరిపై ఒకరు పూబంతులను విసరగా.. స్వామివారు పుష్పఘాతం నుంచి తప్పించుకునేందుకు చేసిన విన్యాసాలతో సన్నివేశం ఆకట్టుకుంది. కార్యక్రమంలో తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిసాగులో 1500మంది మారిషస్ రైతులు

• భారత్‌లో మారిషస్ హైకమిషనర్ జగదీశ్వర్ గోవర్ధన్ వెల్లడి

ఈనాడు డిజిటల్, గుంటూరు: రసాయన ఎరువుల వినియోగం వల్ల మారిషస్‌లోని ద్వీపమైన రోడ్రిగ్స్‌లో నదులు, సముద్రం కలుషితమైందని, 5ఏళ్ల కిందట రైతులు ప్రకృతిసాగు వైపు మళ్లడం ద్వారా ప్రస్తుతం కాలుష్యం తగ్గిందని భారత్‌లో మారిషస్ హైకమిషనర్ జగదీశ్వర్ గోవర్ధన్ తెలిపారు. నాగార్జున వర్సిటీ ఎదురుగా జరుగుతున్న పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయం శిక్షణ శిబిరంలో అతిథిగా పాల్గొన్న ఆయన 'ఈనాడు'తో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయంపై చూపిస్తున్న శ్రద్ధ ఆరోగ్యకరమైన రాష్ట్రంగా మారేందుకు దోహదపడుతుందన్నారు. మారిషస్ నుంచి కొంతమంది రైతులు మహారాష్ట్ర వచ్చి ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తీసుకున్నట్లు వెల్లడించారు. 5 సంవత్సరాల నుంచి రోడ్రిగ్స్‌లో దాదాపు 1500మంది రైతులు ప్రకృతిసాగు వైపు మళ్లారని, ప్రస్తుతం అక్కడ ప్లాస్టిక్‌ను సైతం నిషేధించామని చెప్పారు.

మెగా సీడ్‌పార్కుపై రాష్ట్రస్థాయి కమిటీ

• ఛైర్మన్‌గా వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్

ఈనాడు-అమరావతి: మెగాసీడ్ పార్కు ఏర్పాటుకు సంబంధించి వివిధ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం తాత్కాలిక కమిటీని నియమించింది. వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ డాక్టరు ఎం.హరిజవహర్‌లాల్ దీనికి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, అయోవా విశ్వవిద్యాలయం, సీడ్స్‌మెన్ సంఘం నుంచి ఒక్కొక్కరు చొప్పున సభ్యులుగా ఉంటారు. ఏపీ సీడ్స్ ఎండీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

ఫుడ్‌సైన్స్ కళాశాలగా పేరు మార్పు

ఈనాడు-అమరావతి: బాపట్లలోని హోమ్ సైన్స్ కళాశాలను ఫుడ్‌సైన్స్, టెక్నాలజీ కళాశాలగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. నాలుగో డీన్స్ కమిటీ సిఫార్సులు, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సిఫారసు మేరకు ఈ నిర్ణయం తీసుకుంది.



రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభిస్తున్న నెల్లూరు జెడ్పీఛైర్మన్ రాఘవేంద్రరెడ్డి, చిత్రంలో జిల్లా కలెక్టర్ తదితరులు

నెల్లూరులో రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ రాష్ట్రస్థాయి 45వ బాలల వైజ్ఞానిక, గణిత, పర్యావరణ ప్రదర్శన పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభమైంది. నెల్లూరు సుబేదారుపేటలోని సెయింట్ జాన్స్ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన విద్యార్థులు 6 అంశాలలో 234 నమూనాలను ప్రదర్శనలో ఉంచారు. ఆరోగ్యస్వస్థత, సహజవనరుల వినియోగం, నిర్వహణ, ఆహార భద్రత, వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ, డిజిటల్, సాంకేతిక పరిష్కారాలు, గణిత నమూనాలతో చిన్నారులు రూపొందించిన పలు ప్రయోగాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ నమూనాలుగా ఎంపికైన వాటిని హైదరాబాదులో ఈనెల 7వ తేదీన జరిగే దక్షిణ భారత స్థాయి ప్రదర్శనలకు పంపనున్నారు. ఈ ప్రదర్శనను జిల్లా పరిషత్ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు, జిల్లా విద్యాశాఖాధికారి, సైన్స్ అధికారిణి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చతుర్వేద యజ్ఞానికి రండి

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, సభాపతికి విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ: శ్రీకాకుళంలోని శ్రీచక్ర పీఠం ఆధ్వర్యంలో నిర్వహించే చతుర్వేద యజ్ఞానికి హాజరుకావాలని రాష్ట్రపతి రామనాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌కు తెదేపా ఎంపీ రామ్మోహన్‌నాయుడు విజ్ఞప్తి చేశారు. శ్రీచక్రపీఠం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5 నుంచి 17 వరకు నిర్వహించే "కోటి లింగార్చన, శతకోటి కుంకుమార్చన, శతచండీ, అతిరుద్ర సహిత పంచాయతన యాగం, చతుర్వేద యజ్ఞాని"కి రావాలని పీఠం గౌరవ అధ్యక్షుడు ఎంపీ రామ్మోహన్‌నాయుడు బుధవారమిక్కడ వారికి ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఆయా రోజుల్లో నిర్వహించే కార్యక్రమాలు వివరించి తప్పకుండా రావాలని కోరారు.

రూ.17,761 కోట్లతో బాహ్యవలయం

- పొడవు 189 కి.మీ.లు
- ప్రాజెక్టుకు ఎన్‌హెచ్‌ఏఐ ఆమోదం

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి చుట్టూ నిర్మించే బాహ్య వలయ రహదారి (ఓఆర్ఆర్) ప్రణాళిక కొలిక్కి వచ్చింది. దీనికి సంబంధించిన తాజా ప్రతిపాదనల్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారులు బుధవారం అందజేశారు. ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలకు జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ఆమోదం తెలిపిందని వివరించారు. ముఖ్యమంత్రి చేసిన సూచనల్నీ ఎన్‌హెచ్‌ఏఐ పరిగణనలోకి తీసుకున్నట్లు వెల్లడించారు. కృష్ణా జిల్లాలో 49 గ్రామాలు, గుంటూరు జిల్లాలో 38 గ్రామాల మీదుగా ఓఆర్ఆర్ వెళుతుంది.

రోడ్డు స్వరూపం

- నిర్మాణ వ్యయం: రూ. 17,761.49 కోట్లు.
- మొత్తం పొడవు: 189 కి.మీ. వెడల్పు: 150 మీటర్లు
- ఎన్ని వరుసలు: 6 ● ఒక్కో వరుస వెడల్పు: 3.75 మీటర్లు
- సర్వీసు రోడ్లు: 7 మీటర్ల వెడల్పు
- ఫుట్‌పాత్‌లు: 2.5 మీటర్ల వెడల్పు
- సైకిల్ ట్రాక్‌లు: 2 మీటర్ల వెడల్పు
- పెద్ద వంతెనలు: 11 ● ఆర్వోబీలు: 7
- సొరంగాలు: 2 ● అవసరమైన భూమి: 3404 హెక్టార్లు
- భూసేకరణ వ్యయం: రూ. 4198 కోట్లు.

(ప్రభుత్వం భూ సమీకరణ విధానంలో భూములు తీసుకోవాలనుకుంటుంది కనుక ఈ వ్యయం ఉండదు)

ఎన్ని గ్రామాల మీదుగా వెళ్తుందంటే: 87


అవసరమైన అటవీ భూమి

- కృష్ణా జిల్లా జి.కొండూరు రిజర్వు ఫారెస్టు పరిధిలోని 89.83 హెక్టార్లు
- గుంటూరు జిల్లా కొండవీడు రిజర్వు ఫారెస్టు పరిధిలో 34.46 హెక్టార్లు

ప్రాజెక్టు ప్రస్తుత స్థితి

- భూసేకరణ ప్రణాళికలు సమర్పించారు.
- కృష్ణా, గుంటూరు జిల్లాలకు భూసేకరణ అధికారుల నియామకం పూర్తయింది
- ప్రాజెక్టు సాధ్యాసాధ్యాల ముసాయిదా నివేదికను సమర్పించారు
- జి.కొండూరులో టన్నల్ వచ్చే ప్రాంతంలో మినహా మిగతా అన్ని చోట్ల మట్టి పరీక్షలు పూర్తయ్యాయి.

ప్రతిపాదిత మార్గం



బాహ్యవలయ రహదారి సాగే మార్గమిదీ (ఎరుపు వృత్తంలో)..

మూడు భాగాలు.. 11 ప్యాకేజీలు

మొదటి భాగం

- ప్యాకేజీ 8 - ప్యాకేజీ 11 (ఎన్‌హెచ్ 65 - ఎన్‌హెచ్ 16)
- కంచికచర్ల-పోతూరు
- పొడవు: 63 కి.మీ.
- కృష్ణా నదిపై దిగ్గజ వంతెన పొడవు- 3.1 కి.మీ (కంచికచర్ల- ముత్తాయపాలెం మధ్య ఈ వంతెన వస్తుంది)
- టన్నెల్: 0.4 కి.మీ.

రెండో భాగం

- ప్యాకేజీ- 5 నుంచి ప్యాకేజీ- 8 (ఎన్‌హెచ్ 16 నుంచి ఎన్‌హెచ్ 65)
- పోతూరు-పొట్టిపాడు
- పొడవు- 53 కి.మీ.
- కృష్ణా నదిపై దిగ్గజ వంతెన పొడవు: 4.8 కి.మీ. (కంకిపాడు-మున్నంగి మధ్య ఈ వంతెన వస్తుంది)

మూడో భాగం

- ప్యాకేజీ- 1 నుంచి ప్యాకేజీ- 5 (ఎన్‌హెచ్ 65 - ఎన్‌హెచ్ 16)
- పొట్టిపాడు- కంచికచర్ల
- పొడవు: 65 కి.మీ.
- టన్నెల్ పొడవు: 4.4 కి.మీ.

భూ సమీకరణే

- వలయ రహదారులకు, అంతర్జాతీయ విమానాశ్రయానికీ అదే విధానం
- ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం

ఈనాడు – అమరావతి

రాజధాని అమరావతి చుట్టూ నిర్మించే బాహ్య, అంతర వలయ రహదారులకూ భూసమీకరణ విధానంలోనే భూమి తీసుకోనున్నారు. ఇందుకోసం ప్రతిపాదనలను సిద్ధం చేయాల్సిందిగా అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాజధాని పరిధిలో మూడు నాలుగేళ్లలో ఏర్పాటు చేయబోయే అంతర్జాతీయ విమానాశ్రయానికి అవసరమైన భూమి సమీకరణకు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. బుధవారం సాయంత్రం రాజధాని పనులు, అమరావతి-అనంతపురం ఎక్స్‌ప్రెస్ రహదారి పనుల పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష జరిపారు. రాజధాని బాహ్య వలయ రహదారి (ఓఆర్ఆర్) మార్గంలో రెండు, మూడు పారిశ్రామిక టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. 30 రోజుల్లోగా ప్రతిపాదనలను అందించాలని సూచించారు. అమరావతి- అనంతపురం ఎక్స్‌ప్రెస్ రహదారి మార్గంలోనూ పలు జిల్లాల పరిధిలో పారిశ్రామిక టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేయాలని, తమ ప్రాంతం అభివృద్ధి చెందుతోందంటే సంబంధిత భూముల యజమానులు భూసమీకరణలో భూములిచ్చేందుకు ముందుకు వస్తారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

రూ.7,624 కోట్లతో అంతర వలయ రహదారి

- ★ రాజధాని చుట్టూ గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని 30 గ్రామాల మీదుగా సాగే అమరావతి అంతర వలయ రహదారి (ఐఆర్ఆర్)ని మొదట విడతలో 97.5 కి.మీ. మేర నిర్మిస్తారు.
- ★ నిర్మాణ వ్యయం రూ. 7,624 కోట్లుగా అంచనా.
- ★ ఐఆర్ఆర్ నిర్మాణానికి భూములిచ్చేందుకు హరిశ్చంద్రపురం, వైకుంఠపురం, వడ్డమాను, పెదపరిమి, రావెల గ్రామాల రైతుల సంసిద్ధత.

పారిశ్రామిక కారిడార్‌గా ఎక్స్‌ప్రెస్ రహదారి

- ★ అమరావతి-అనంతపురం ఎక్స్‌ప్రెస్ రహదారి భూసేకరణకు వచ్చే బడ్జెట్ తొలి త్రైమాసికంలోనే రూ. 2500 కోట్లు కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరిన అధికారులు.
- ★ 393.6 కి.మీ. పొడవైన ఈ ఎక్స్‌ప్రెస్ రహదారి రాష్ట్ర అభివృద్ధిలో కీలకమవుతుందన్న ముఖ్యమంత్రి.
- ★ ప్రపంచశ్రేణి ప్రమాణాలతో నిర్మించే ఈ రహదారి రాష్ట్రంలో ముఖ్యమైన పారిశ్రామిక కారిడార్ అవుతుందన్న సీఎం.
- ★ రహదారి వెడల్పు 200 మీటర్లు ఉండాలని స్పష్టీకరణ.
- ★ అనంతపురం, కర్నూలు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో పెగ్ మార్కింగ్, ఫీల్డ్ మెజర్‌మెంట్ చాలావరకు పూర్తి.

విలక్షణ వారధుల నగరంగా అమరావతి..

అమరావతిని నిరుపమాన (ఐకానిక్) వారధుల నగరంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కృష్ణా నదిపై నిర్మించే వారధుల కోసం ప్రపంచంలోని అత్యుత్తమ నిర్మాణాలను పరిశీలించాలని సూచించారు. విజయవాడలో కనకదుర్గ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు మార్చి నెలాఖరుకు పూర్తవుతాయని అధికారులు తెలిపారు.



బుధవారం సీఎం క్యాంపు కార్యాలయంలో సీఆర్డీఏ కార్యకలాపాలపై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. హాజరైన పురపాలక మంత్రి నారాయణ, అధికారులు

సమావేశంలో పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

8న పోలవరానికి ముఖ్యమంత్రి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 8న పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. ప్రతి సోమవారం 'పోలవారం' నేపథ్యంలో అదే రోజు ప్రాజెక్టు పరిశీలనకు వస్తున్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణ ప్రణాళికపై పూర్తిస్థాయి కసరత్తు జరిగే అవకాశం ఉంది. అదే రోజు పశ్చిమగోదావరి జిల్లాలో జన్మభూమి కార్యక్రమాల్లోనూ సీఎం చంద్రబాబు పాల్గొంటారు.

ప్రజా సంతృప్తే అధికారుల పనితీరుకు కొలమానం

'ప్రజా సంతృప్తే అధికారుల పనితీరుకు కొలమానం. ప్రజల్లో అవగాహన, పోటీతత్వం పెంచడం మనందరి బాధ్యత. అత్యున్నత జీవన ప్రమాణాలున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రూపొందాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ఐదో విడత 'జన్మభూమి-మావూరు' రెండోరోజు సందర్భంగా బుధవారం ప్రజా ప్రతినిధులు, అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. "అర్హులందరికీ పింఛన్లు అందుతున్నాయా? రేషన్ సకాలంలో అందుతుందా? అర్జీల పరిష్కారం బాగుందా, లేదా? తదితర అంశాలపై ప్రజాభిప్రాయం సేకరిస్తున్నాం. గుంటూరు, పశ్చిమగోదావరి, నెల్లూరు, కృష్ణా, చిత్తూరు, ప్రకాశం జిల్లాలో తొలిరోజు ప్రజలు 70-80శాతం సంతృప్తిచెందగా. అనంతపురం, విశాఖపట్నం, కడప, కర్నూలు జిల్లాలో 60-70శాతం సంతృప్తి చెందారు. తినే తిండి, తాగే నీరు, పరిసరాల పరిశుభ్రత, జీవన విధానంపై మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. అంటువ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రజాసేవలో పోటీతత్వం పెంచేందుకే జన్మభూమి గ్రేడింగ్‌లు ఇస్తున్నాం. తొలిరోజు విజయనగరం, కడప, గుంటూరు, తూర్పుగోదావరి జిల్లాలు ఏ గ్రేడ్ సాధించాయి. నెల్లూరు, విశాఖ, కర్నూలు, ప్రకాశం, శ్రీకాకుళం, అనంతపురం, చిత్తూరు జిల్లాలు బి గ్రేడ్ పొందాయి. నకరికల్లు, తిక్కవోలు, కొత్తపల్లి, అమలాపురం, పెందుర్తి, తదితర మండలాలు ఏ గ్రేడులో నిలిచాయి. కొత్తపల్లి, అశ్వాపురం, నక్కపల్లి, ఎగువ తంబళ్లపల్లి గ్రామాలు ఏగ్రేడ్ లో ఉన్నాయి" అని పేర్కొన్నారు.

నిరుద్యోగ భృతి ప్రకటన 12న లేనట్లే!

ఈనాడు అమరావతి: నిరుద్యోగ భృతి పథకం ప్రకటన ఈ నెల 12న ఉండే అవకాశం లేదని తెలుస్తోంది. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జనవరి 12న యువజనోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగానే నిరుద్యోగ భృతి పథకాన్ని ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. మార్గదర్శకాలు ఖరారు కాకపోవడం, నిరుద్యోగుల సంఖ్య విషయంలో ఒక కచ్చితమైన సంఖ్య తేలకపోవడం వంటి సాంకేతిక కారణాలతో ప్రకటనను వాయిదా వేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. 12నే రాష్ట్ర యువ విధానాన్నీ (యూత్ పాలసీ) ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించాల్సి ఉంది. కానీ, నిరుద్యోగ భృతి ఖరారు కానందువల్ల ఈ రెండూ ఒకేసారి ప్రకటించాలన్న ఉద్దేశ్యంతో యువ విధాన ప్రకటననూ వాయిదా వేశారు.

విద్యాధరపురం మైదానానికి 12న శంకుస్థాపన

ఈనాడు అమరావతి: విజయవాడలో విద్యాధరపురంలో సుమారు 8ఎకరాలకుపైగా స్థలంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన బహుళ ప్రయోజన ఇండోర్ స్టేడియం పనులకు ఈ నెల 12న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసేందుకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ఏర్పాట్లను చేస్తోంది. గత కొన్నేళ్లుగా ఈ మైదానంలో స్టేడియం నిర్మాణం చేపట్టకుండా అలా వదిలేశారు. దుర్గ గుడివద్ద పై వంతెన పనులు చేస్తున్న కంపెనీ ఆ పనులకు సంబంధించిన నిర్మాణ పరికరాలను ఆ స్థలంలో వదిలేశారు. వీటిని తొలగించనందువల్ల స్టేడియం పనులు ప్రారంభం కాలేదు. ఇప్పుడా పరికరాలను తీయించి 12న స్టేడియం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



మాట్లాడుతున్న ఎల్వీ సుబ్రహ్మణ్యం

అమరావతి కేంద్రంగా మళ్లీ తెలుగు వెలుగులు

ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: నవ్యాంధ్ర రాజధాని అమరావతి కేంద్ర బిందువుగా తెలుగు వెలుగులు, భాషా సంస్కృతులు మళ్లీ వైభవాన్ని సంతరించుకునే రోజులొచ్చాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. గుంటూరు శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో శ్రీకొప్పరపు కవుల సాహితీ సర్వస్వం(శ్రీం) ఆవిష్కరణ సభ బుధవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 సంవత్సరాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తెలుగు భాషా పరిరక్షణ సంవత్సరంగా ప్రకటించటం అమరావతి కేంద్ర బిందువుగా తెలుగు వృద్ధి చెందుతుందన్న మాటకు నిదర్శనమన్నారు. అవధాన విద్యలో కొప్పరపు కవులు సాధించిన ఘనత నిరుపమానమని, అవధానాలు, ఆశు కవితా ప్రదర్శనలు లాంటివి చూస్తుంటే తెలుగు భాష గౌరవం అవగతమవుతుందన్నారు. ఛందోబద్ధమైన తెలుగు కవిత్వంలాంటి వాటిని అందరూ ప్రోత్సహించాలన్నారు. సభలో కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, సాహితీవేత్త ఇంద్రగంటి శ్రీకాంత్‌శర్మ, కొప్పరపు కవుల కళాపీఠం(విశాఖపట్నం) వ్యవస్థాపకుడు మాశర్మ తదితరులు ప్రసంగించారు.

ఏడుగురిని కబళించిన మృత్యువు

- డీసీఎం వాహనం బోల్తా పడి దుర్మరణం
- అరగంటలో స్వగ్రామం చేరుకునేంతలోనే ప్రమాదం
- 11 మందికి తీవ్ర గాయాలు

ఆదోని, ఆస్పరి, న్యూస్‌టుడే: వారంతా వలస కార్మికులు. పొట్ట కూటి కోసం రెండు నెలల పాటు వేరొక గ్రామానికి పనులు చేసేందుకు వెళ్లారు. పనులు ముగియడంతో ఇంటికి వెళ్లి కుటుంబీకులను కలవాలని ఆతృతగా డీసీఎం వాహనంలో బయల్దేరారు. అరగంటలో స్వగ్రామం చేరుతుందనగా వారు ప్రయాణిస్తున్న డీసీఎం వాహనం టైరు పగిలి అదుపు తప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న ఏడుగురు కూలీలు మృతి చెందారు. మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. కర్నూలు జిల్లా ఆస్పరి మండలం చిన్నహోతూరు గ్రామ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనతో కర్నూలు జిల్లా హోళగుంద మండలం కొత్తపేట గ్రామంలో విషాదం అలముకుంది.



ఘటనా స్థలంలో పడిపోయిన వాహనం

కొత్తపేటకు చెందిన 18 మంది నల్గొండ జిల్లా డోర్‌పల్లిలో పత్తి పొలాల్లో కూలి పనుల కోసం 2నెలల కిందట వెళ్లారు. మంగళవారం రాత్రి స్వగ్రామానికి డీసీఎం వాహనంలో బయల్దేరారు. మరో అరగంట వ్యవధిలో స్వగ్రామానికి చేరుకునేంతలోనే వాహనం వెనుకవైపు ఉన్న టైరు పగిలిపోవడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన హనుమంతమ్మ(16), గోవిందమ్మ(55), నర్సమ్మ(45), శేకమ్మ(45), ఈరమ్మ(42), నారాయణ(40), మంగమ్మ(40) మృతి చెందారు. ఇదే ఘటనలో గ్రామానికి చెందిన లక్ష్మి, స్రవంతి, బాలరాజు, దుర్గమ్మ, వెంకటేశులు, శేకన్న, వెంకటేశు, నీలమ్మ, గంగమ్మ, వెంకటేశు, సుంకమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం ఆదోని స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు. ఆదోని డీఎస్పీ అంకినీడు ప్రసాద్, సీఐ గౌస్, ఎస్సై శంకరయ్య ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మిగిలిన క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని మృతుల బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గౌస్ తెలిపారు.

మా చిరునామా: మకరందం
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512
makarandam@eenadu.in



నువ్వు భక్తి శ్రద్ధ

"కొత్త సంవత్సరంలో చాలా సంతోషంగా ఉన్నట్టున్నావ్! సంగతేంటి?"

"మొన్న ఒకటో తారీఖు గుడికి వెళ్లొచ్చాను! దేవుడి దయవల్ల అంతా శుభంగానే ఉందోయ్"

"నీ ఓపికకు మెచ్చుకోవాలి! ఒకటో తారీఖు గుళ్లూ, గోపురాలన్నీ కిక్కిరిసిపోతే! దర్శనం బాగానే చేసుకున్నావే!"

"కొత్త ఏడాది మొదటి రోజు దేవుణ్ని దర్శించుకుంటే సంతోషం కలుగుతుంది. ఆ సంతోషం ఏడాదంతా అలాగే ఉంటుంది ఏమంటావ్!"

ఇద్దరి స్నేహితుల మధ్య జరిగిన చర్చ ఇది. కొత్త ఏడాది రాకతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. అంతకు ముందు వైకుంఠ ఏకాదశి రోజూ అంతే. ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. మన ఊళ్లోని రామాలయం నుంచి తిరుమలలోని శ్రీనివాసుని సన్నిధి వరకూ దేవాలయాలన్నీ భక్తజనంతో నిండిపోయాయి. సంవత్సరాదిలో దేవుడిని దర్శించుకుంటే.. ఏడాదంతా బాగుంటుందన్న నమ్మకం భక్తులది. ఆంగ్ల సంవత్సరాది అయినా ఎవరి నమ్మకాలు వారివి. ఎవరి భక్తి వారిది. ముక్కోటి ఏకాదశి ముచ్చటా అంతే!

మతమేదైనా.. మన దైనందిన జీవితంలో భక్తికి కొంత స్థానం కల్పించుకున్నాం. అది మనిషి జీవన శైలికి ఒక నిర్దేశాన్ని, తగినంత ఓర్పును, సహనాన్ని ప్రసాదిస్తుందని విశ్వసిస్తున్నాం. యోగం.. ధ్యానం.. ఉపాసన.. ఇలా పేర్లు ఏవైనా కావొచ్చు.. అన్నీ భక్తిలో అంతర్భాగాలే! భక్తి మనుషులకే పరిమితం కాదు. సమస్త జీవజాలానికీ ఉంటుంది. పశుపక్ష్యాదులకూ ఉంటుందని పురాణాలు చెబుతున్నాయి. గజేంద్రమోక్షంలో.. మకరి నోట చిక్కిన కరిరాజు కూడా.. "ఎవ్వనిచే జనించు.." అని "నీవే తప్ప ఇతఃపరంబెరుంగ" అంటూ శరణు కోరింది! కానీ, వాటి భక్తీ, మన భక్తీ ఒకటేనా? రెండూ ఒకేలా ఉంటాయా? ఉండాలా? మేధస్సు ఉన్న మనిషికి ఎలాంటి భక్తి ఉండాలి?. పశువుతో పోలిస్తే.. మనకు దేవుడంటే ఎన్నో రెట్ల అవగాహన ఉండాలి. అంతకుమించిన హేతుబద్ధత ఉండాలి. మన భక్తి ఎలాంటిదో మనకైనా స్పష్టత ఉండాలి. శ్రద్ధతో చేస్తున్నామా? మూఢంగా అనుసరిస్తున్నామా? అని ఎవరికి వారు ప్రశ్నించుకోవాలి. భక్తిలో మూఢ భక్తి కూడా ఉంటుంది. మనం ఎందుకు, ఏ క్రియ చేస్తున్నామో తెలుసుకోగలిగినప్పుడు మనది భక్తో, మూఢభక్తో తెలుస్తుంది.

మూఢభక్తిలోనూ భక్తి ఉంటుంది. కానీ, దైవంపై గురి ఉంటుందే తప్ప.. శ్రద్ధ తక్కువ. మంత్రం, తంత్రం కన్నా.. శ్రద్ధ చాలా ప్రధానమైంది. అందుకే, పూజలు, వ్రతాలు చేశాక.. మంత్ర హీనం, క్రియా హీనం, భక్తి హీనం అని చెప్పిస్తారే తప్ప శ్రద్ధా హీనం అనరు. అంటే.. భగవంతుడికి కూడా కావాల్సింది శ్రద్ధ! భక్త కన్నప్ప కథనే తీసుకుందాం. పరమశివుడికి మాంసాన్ని ప్రసాదంగా పెట్టాడు. శ్రద్ధతో చేశాడు కాబట్టి.. పెట్టింది ఏదైనా పరమేశ్వరుడు ప్రేమతో స్వీకరించాడు. భగవంతుడిపై ఆర్తి, ప్రేమ, ఆయనపై నిరంతర ధ్యాసలనే శ్రద్ధ అని చెప్పాలి. చాలాసార్లు దేవాలయాల్లో, ఆవరణల్లో నలుగురితో పాటు నారాయణా అనో, ఏదో జరిగిపోవాలనే కోరికతోనో కనిపించే వారెంతో మంది మనకు తారస పడతారు. కోపతాపాలు, మదమాత్సర్యాలు, ఆగ్రహావేశాలు క్యూ కట్టినట్లుండే సన్నివేశాలూ కనిపిస్తుంటాయి. మనం గుడికి వెళ్లేదే వాటిని మన నుంచి దూరం చేయమని శ్రద్ధతో కోరుకోవడానికి. అలా కాకపోతే మరి దేవాలయానికి ఎందుకు వెళ్లినట్లు?

> తరచి చూస్తే దైవం ఎక్కడో లేదు. జన్మనిచ్చిన అమ్మలో ఉన్నాడు. పెంచి పోషించే నాన్నలో ఉన్నాడు. విద్యాబుద్ధులు చెప్పిన గురువులో ఉన్నాడు. వారిని ఎంత వరకూ గౌరవిస్తున్నాం? అమ్మానాన్నలను గౌరవించడం, చిన్నపిల్లలపై ప్రేమాభిమానాలు చూపడం, పెద్దవాళ్లను ఆదరించడం, ఆడవాళ్లను గౌరవించడం, ఈర్ష్యాద్వేషాలు లేకుండా ఉండటం, తోటివాళ్లకు సాయపడటం.. ఇవి రోజూ చేయగలిగితే అంతకుమించింది లేదు. భగవంతుడు కోరుకునేదీ అదే!

"నిమిషం.. నిమిషార్థంవా..
జ్ఞానినో ధ్యానమాచరేత్
క్రతు కోటి సహస్రానాం
ధ్యానమేకం విశేషకం"

భేషజం కోసం.. బాహ్యం కోసం చేసేది కాకుండా... అర నిమిషం భగవంతుడిపై దృష్టినిలిపి ధ్యానించినా భగవంతుడికి ప్రీతిపాత్రమే. ఇది కొన్ని కోట్ల యజ్ఞయాగాదులు చేసిన దానితో సమానమని పెద్దల ఉవాచ. మనల్ని మనం సంస్కరించుకోగలిగితే.. అరాచకత్వాన్ని ప్రోత్సహించకుండా ఉంటే అదే దైవత్వం. నా అనేదాని నుంచి బయటపడి.. లోకం బాగుండాలని అర నిమిషం కోరుకున్నా దాన్ని మించింది మరొకటి లేదు. ప్రతి ఒక్కరూ చేస్తే మనం దైవ సన్నిధిలో ఉన్నట్టే! దీనికి మతాలతో సంబంధం లేదు. అన్ని మతాల సారమిదే.

ప్రత్యేక సందర్భాల్లో దేవుడిని స్మరించుకోవడం, దర్శించుకోవడం మంచిదే. మరి మనిషి జీవితంలో రోజూ ప్రత్యేకమైనదే. ప్రతి నిమిషం విలువైనదే. సంవత్సరాది మొదటి రోజు సంతోషంగా ఉన్నంత మాత్రాన ఏడాదంతా సంతోషంగా ఉండటం సాధ్యమా? ఆ రోజు మనం ఎందుకు సంతోషంగా ఉన్నామో ఆలోచించండి. రోజూ అలాగే ఉండటానికి ప్రయత్నించండి. అప్పుడు ఏడాదంతా ఏమిటి.. జీవితమంతా సంతోషంగా ఉండొచ్చు. సంవత్సరం మొదటి రోజు మంచి పని చేస్తే.. మిగిలిన రోజుల్లో బాగా ఉంటామనే భావన మనం కల్పించుకున్నది. మంచి పని రోజువారీ ప్రక్రియ కావాలి. ఆచరణలో రావాలి. అప్పుడు అన్ని రోజులూ ప్రత్యేకమే! అన్నీ పర్వదినాలే! అనునిత్యం భగవదానుగ్రహమే!

– సాయిరాం పేరి



మహా ప్రసాదం

జగన్నాథుడికి భలే విందు

తూర్పు తీర దివ్యధామం పూరీ క్షేత్రం. సప్త మోక్షదాయక క్షేత్రాల్లో ఇదీ ఒకటి. సోదరుడు బలభద్రుడు, సోదరి సుభద్రాదేవి సమేతంగా కొలువు తీరిన జగన్నాథుని దర్శించుకొని మహాప్రసాదాన్ని ఆరగించి తరించాలని భక్తులు తహతహలాడతారు. ఎందుకంటే ఆ దివ్య క్షేత్రంలోని పాకశాలలో తయారయ్యే అన్న భోగం అమృతతుల్యం... ఆరోగ్యదాయకం.

భక్తుల నీరాజనాలందుకుంటున్న జగన్నాథుడు భోజన ప్రియుడని అంటారు. పూరీలో జగన్నాథునికి రకరకాల వంటలను రోజులో ఆరుసార్లు నివేదిస్తారు. పండగలు, పర్వదినాల్లో స్వామికి 56 నుంచి 64 పిండి వంటలను అర్పిస్తారు. వేల ఏళ్ల నుంచి మహాప్రసాదం రుచిలో ఏ మాత్రం మార్పు ఉండకపోవడం ఇక్కడి ప్రత్యేకత. పాకశాలలో వంటలు తయారయ్యాక సేవాయత్‌లు వీటిని నియమానుసారం గర్భగుడిలోకి తీసుకెళతారు. వాటిని తీసుకెళ్లే సమయంలో ఎవరూ ఎదురు పడకూడదు. దేవుడికి ఆహారాన్ని ఓ రకమైన నాట్యం ద్వారా అర్పణచేస్తారు. ముగ్గురు మూర్తులకు నైవేద్యం అయ్యాక ప్రసాదాలను ఆనంద బజారు (ఆలయం ముందున్న ప్రధాన వీధి)కు తరలిస్తారు. స్వామికి సమర్పించిన ప్రసాదానికి దైవత్వం సిద్ధించి మరింత రుచి వస్తుందని విశ్వసిస్తారు.

ప్రపంచంలోనే అతిపెద్ద వంటశాలగా పూరీ ఆలయ పాకశాలను చెబుతారు. ఆంగ్లేయులు దీన్ని మిరకిల్ హోటల్‌గా పేర్కొన్నారు. ఈ పాకశాలలో 500 మంది పాకశాస్త్ర నిపుణులు, 300 మంది సహాయకులు ఉంటారు. వారికి కావాల్సిన సామగ్రిని అందజేయడానికి మరో 200 మంది ఉంటారు. వంటలు చేసే వారిని మినహాయించి ఇతరులను పాకశాలలోకి అనుమతించరు. పొరపాటున ఎవరైనా వచ్చినా, ఇతర విఘ్నాలు ఎదురైనా వండినదంతా భూమిలో పాతి పెట్టి పాకశాల శుద్ధిచేసి మళ్లీ వండుతారు. అక్కడి వంటను లక్ష్మీదేవి అదృశ్యరూపంలో పర్యవేక్షిస్తుంటుందని, అందుకే ఆ వంటకాలు అంత రుచిగా ఉంటాయని భక్తులు చెబుతారు. దీనివల్ల పూరీలోని ప్రసాదాలను మహాలక్ష్మీ పాకమని కూడా పిలుస్తారు. ఆలయంలోని గంగ, యమున బావుల్లోని నీటిని ప్రసాదాల తయారీకి వాడతారు. రోజూ లక్ష మందికి సరిపడా అన్నప్రసాదం అందుబాటులో ఉంటుంది.



వంటశాలలో షడ్భుజాకారంలో మట్టి, ఇటుకలతో నిర్మించిన 752 పొయ్యిలు ఉంటాయి. రోజూ సూర్యుణ్ని, అగ్ని దేవుణ్ని స్తుతిస్తూ హోమం చేశాక మాత్రమే ఈ పొయ్యిలను వెలిగిస్తారు. నవ గ్రహాలు, నవ దుర్గలు, నవ ధాన్యాలను సూచిస్తూ కుండ మీద కుండ.. ఇలా తొమ్మిది కుండలను పెట్టి వండే విధానం నిన్న, మొన్నటి వరకు ఉండేది. అందరికీ ఈ పద్ధతి కుదరకపోవడంతో ఇటీవల వరుసగా ఉన్న పొయ్యిలపైనే వండుతున్నారు. ఒకసారి వండిన కుండలపై మరోసారి వండరు. ఎప్పటికప్పుడు కొత్త కుండలు ఉపయోగించాల్సిందే. ఆ కుండలు కూడా పూరీ సమీపంలోని కుంభారు గ్రామస్తులు చేసినవే అయ్యుండాలి. విదేశాలకు చెందిన ఆలు, టమాటా, క్యాబేజీ, క్యాలీఫ్లవర్ లాంటి కూరగాయల్ని అసలు వాడరు. ఉల్లి, వెల్లుల్లి కూడా నిషేధమే. ఆకుకూరలు, కొబ్బరి, నెయ్యి, బియ్యం, పప్పు, పాల ఉత్పత్తులతోనే చేస్తుంటారు. తాటిబెల్లం, మిరియాలు కూరల్లో వినియోగిస్తారు.

స్వామి ప్రసాదాల్లో ఆరోగ్యప్రదమైంది ఒబాడా. ఇది అందరూ కలిసి ఆరగించేది అని లక్ష్మీ పురాణం చెబుతోంది. దీన్నే మహాప్రసాదమని అంటారు. ఇందులో అన్నం, ముద్ద పప్పు, పొంతులా (కూరగాయల ఇగురు), పక్కోడో (తీపి పులుసు), ఖారి (పాయసం) వంటివన్నీ ఉంటాయి. కక్కరా, అరిసె, పూరి, చక్కోరి, బాల్సా, రసాబోలి, రసమలై... వంటి తీపి పదార్థాలు ఉంటాయి. భక్తులు శుభ కార్యాల్లోనే కాకుండా, శ్రాద్ధ కర్మల్లోనూ మహా ప్రసాదాన్ని వడ్డిస్తుంటారు. పూరీ ఆనందబజారులో ఆర్డరు చేస్తే ఎంత మందికి సరిపడే ప్రసాదాలనైనా సిద్ధం చేస్తారు. ఒబాడా మిగిలితే దాన్ని శుభ్రమైన ఆవరణలో ఎండబెట్టి నిర్మాయిల్ (ఎండు అన్నం)గా మారుస్తారు. ఇవన్నీ ఆయుర్వేదపరంగా కూడా గుర్తింపు పొందాయి.

– ఎ.నాగభూషణం, గోపాల్‌పూర్ (ఒడిషా)

ఇస్లాం సందేశం

దౌర్జన్యం చేస్తే దైవం మన్నించడు



ఏ ధర్మమైనా చెప్పేది ఒకటే! మంచిగా ఉందాం. నలుగురికీ మంచి చేద్దాం. అలాంటి వారినే దైవం ఆదరిస్తాడు. సత్ప్రవర్తన కలవారినే అల్లాహ్ కరుణిస్తాడంటోంది అంతిమ దివ్య ఖుర్‌ఆన్. "దైవాన్ని విశ్వసించిన వాళ్లు.. పాపాలకు దూరంగా ఉంటారు. చెడు పనులు చేయరు. కోపంలోనూ మన్నించే హృదయం కలిగి ఉంటారు. క్రమం తప్పకుండా నమాజ్ చేస్తారు. ముఖ్యమైన విషయాల్లో ఎదుటివారిని సంప్రదిస్తారు. దైవం ప్రసాదించిన దానిలో నుంచి కొంత నలుగురి బాగు కోసం వెచ్చిస్తారు. దౌర్జన్యాన్ని ప్రతిఘటిస్తారు" అని ఖుర్‌ఆన్ చెబుతోంది. సత్కార్యాలు చేసే వారికి పుణ్యఫలం ప్రసాదించే బాధ్యత అల్లాహ్‌దే అని స్పష్టం చేసింది కూడా!

దౌర్జన్యం చేసే వారిని దైవం మన్నించడు. భయభక్తులు ఉన్నవారినే అక్కున చేర్చుకుంటాడు. కలిమిలో, లేమిలో దైవాన్ని విశ్వసించే వారంటే ఇష్టం. ఇతరుల తప్పులను మన్నించేవారిపై కరుణను కురిపిస్తాడు. అల్లాహ్ ఇష్టపడేది సజ్జనులనే! ఈ విషయాలను మనసులో ఉంచుకొని అల్లాహ్ చూపిన మార్గంలో పయనిద్దాం.

– ముహమ్మద్ లియాఖత్‌ఉద్దీన్

పిల్లలకు స్వాగతం

క్రీస్తువాణి



నేటి పిల్లలు రేపటి నవ సమాజ నిర్మాతలు. ఇది అక్షర సత్యం. అయితే మన బాలల పరిస్థితి ఎలా ఉంది? నిరంతరం చదువుల సంకెళ్లలో బందీ అయింది! బండెడు పుస్తకాల బరువుతో వంగిపోయింది. పోటీ ప్రపంచంలో నలిగిపోతోంది. ఈ ఒత్తిడి భరించలేక అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటున్నారు పిల్లలు. తల్లిదండ్రులకు దుఃఖం మిగిలిస్తున్నారు. ఈ విషాదాలకు చరమగీతం పాడాలంటే ఏం చెయ్యాలి! తల్లిదండ్రులు పిల్లలకు అధిక సమయం కేటాయించాలి. వారికి నైతిక విలువలు బోధించాలి. నీతి, సహనం ఆవశ్యకత తెలియజేయాలి. తరగతి పరీక్షలు కాదు, జీవితాన్ని గెలిచే మార్గాన్ని నిర్దేశించాలి. ఈ సందర్భంగా క్రీస్తు ప్రభువు ఉపదేశించిన బోధలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

క్రీస్తును దర్శించడానికి వందలాదిగా భక్తులు వచ్చేవారు. కొందరు తమ వెంట పిల్లలనూ తీసుకువచ్చేవారు. కారణం.. ప్రభువు పిల్లలను చూసి తమను దగ్గరికి ఆహ్వానిస్తాడని, దీవిస్తాడని, కొన్ని మంచి మాటలు చెబుతాడని! అయితే ప్రభువు శిష్యులు.. పిల్లలను వెంట తెచ్చే తల్లిదండ్రులపై ఆగ్రహం ప్రకటించేవారు. 'క్రీస్తు బోధనలు పిల్లలకు అర్థం కావు' అంటూ కోపగించేవారు. దీంతో ఆ తల్లిదండ్రులు బాధతో వెనుదిరిగేవారు.

శిష్యుల ప్రవర్తన ఒకసారి ప్రభువు కంటపడింది. వారిని కోపగించుకున్నారు. "పిల్లలను నా దగ్గరకు రాకుండా ఆటంకపరచవద్దు. వారిని ఆశీర్వదిస్తాను. పెద్దలను పరామర్శించినట్లే.. చిన్న పిల్లల విషయంలో జాగ్రత్త వహిస్తాను. ఆ చిన్నారులను ఆహ్వానించండి. ప్రేమ, నమ్మకం నిండుగా ఉన్నవాళ్లే.. దేవుని రాజ్యంలోకి ప్రవేశిస్తారు. పిల్లల మాదిరిగా వినయశీలురై ఉన్నవారికే అది సాధ్యమవుతుంది. నేర్చుకోవడానికి పిల్లల్లా కుతూహలం చూపాల"న్నారు ప్రభువు. పిల్లల పట్ల క్రీస్తు పలికిన మాటలు.. ఈ తరానికీ శిరోధార్యం. నీతి, నైతికత, ప్రేమ, కరుణ వంటి సద్గుణాలు పునాదిగా పిల్లలను తీర్చిదిద్దుకుందాం. నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములయ్యేందుకు చిన్నారులకు స్వాగతం పలుకుదాం.

- ఎమ్. సుగుణరావు

ధర్మ సందేహం

సంక్రాంతి సమయంలో ముగ్గుల్లో గొబ్బెమ్మలు ఎందుకు పెడతారు?

శ్రీలక్ష్మి, హైదరాబాద్



మన సంప్రదాయంలో గొబ్బెమ్మ అంటే లక్ష్మీదేవిగా కొలుస్తారు. అంతేకాదు గొబ్బెమ్మ అంటే గోపెమ్మ (గోపిక) అని, గోదాదేవి అని కూడా అభిప్రాయాలు ఉన్నాయి. అందువల్ల ధనుర్మాసం మొదలైనప్పటి నుంచి శుభసూచకంగా ఇంటి ముంగిట వేసే ముగ్గుల్లో గొబ్బెమ్మలతో అలంకరిస్తారు. ఈ గొబ్బెమ్మలను ఆవుపేడతో తయారు చేస్తారు. అవి రోగ నిరోధక శక్తి కలిగి ఉండి.. రోగకారక క్రిములను ఇంటిలోకి ప్రవేశించకుండా నివారిస్తాయి. ముగ్గులోని సున్నపు ఘాటు వాసన క్రిమి నిరోధకంగా పనిచేస్తుంది. ఈ ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని ధనుర్మాసం నుంచి సంక్రాంతి పూర్తయ్యేవరకు ముగ్గుల్లో గొబ్బెమ్మలు ఉంచుతారు.

– మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి

నాకెందుకు భయం?

కథా స్రవంతి

సత్యం, అహింస బాటలో సాగిన గౌతమ బుద్ధుడి జీవితంలో అడుగడుగునా విశేషాలే. బుద్ధుడి మాటలు కరుడుగట్టిన తీవ్రవాదులను సైతం మార్చివేసింది. అలాంటి వారిలో అంగుళీమాలుడు కూడా ఒకడు.

ఒకసారి గౌతమ బుద్ధుడు తన శిష్యులతో కలిసి కోసల రాజ్యానికి బయల్దేరాడు. ఆయన వెళ్లే మార్గంలో దట్టమైన అడవి ఉండేది. ఆ అడవిలో అంగుళీమాలుడు అనే దోపిడి దొంగ ఉండేవాడు. బాటసారులను అటకాయించి.. వారి ధన, మాన, ప్రాణాలు దోచుకునేవాడతడు. మనుషులను చంపి వారి చేతివేళ్లను కత్తిరించి తన మెడలో హారంగా వేసుకునేవాడు.

శిష్య బృందంతో అడవిలో ప్రయాణిస్తున్న బుద్ధుడికి అంగుళీమాలుడు ఎదురుపడ్డాడు. బుద్ధుడిని చంపుతానని బెదిరించాడు. ప్రాణాపాయ స్థితిలోనూ బుద్ధుడు తొణకలేదు. ఆయన కళ్లల్లో ఏ మాత్రం భయం కనిపించలేదు. అది చూసి ఆశ్చర్యపడ్డాడు అంగుళీమాలుడు. ప్రాణం మీదికి వచ్చినా చలించని బుద్ధుడిని చూసి కోపోద్రిక్తుడు అయ్యాడు. "ఎందుకు భయపడటం లేదు?" అని బుద్ధుడిని అడిగాడు. దానికి బుద్ధుడు చిన్నగా నవ్వుతూ.. "నువ్వు భయపడాలి కానీ, నాకెందుకు భయం" అన్నాడు. ఆ జవాబుతో అంగుళీమాలుడికి మతిపోయినంత పని అయింది. బుద్ధుడు అతడ్ని సమీపించి.. "నాయనా! నీవు చేస్తున్న హత్యాకాండ నిన్ను ఎప్పటికీ వెంటాడుతూనే



ఉంటుంది. నీవు చేసినది తప్పని తెలిసిన రోజున పశ్చాత్తాపంతో కుమిలిపోవాల్సి వస్తుంది. హింసను వీడి అహింసా మార్గంలోకి రా! కొత్త జీవితాన్ని ప్రారంభించు" అని హితవు పలికాడు. ఆ మాటలకు అంగుళీమాలుడు కళ్లు తెరుచుకున్నాయి. ఆ క్షణమే హింసను వదిలిపెట్టాడు. బుద్ధుడి శిష్యుడిగా మారిపోతాడు. బౌద్ధ బిక్షువుగా మారిన అంగుళీమాలుడు ఆ తర్వాతి కాలంలో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు.

ఈనాడు సినిమా


ప్రభాస్

ఐదేళ్లు ఏ సినిమాకీ ఇవ్వను!

'బాహుబలి' తెలుగు సినిమా స్టామినాను ప్రపంచానికి తెలియజేసిన చిత్రమే కాదు...తెలుగుకే పరిమితమైన ప్రభాస్‌ను జాతీయ స్థాయి నటుణ్ని చేసిన చిత్రం. ఈ సినిమా కోసం కెరీర్‌లో అత్యంత కీలకమైన ఐదు సంవత్సరాలను కేటాయించారు ప్రభాస్. ఆయన త్యాగం వృథాపోకుండా బాక్సాఫీసు వద్ద పెద్ద ప్రభంజనమే సృష్టించింది 'బాహుబలి'. మరి భవిష్యత్తులో ఓ సినిమా కోసం ఐదేళ్లు కేటాయించే సాహసం ప్రభాస్ చేస్తాడా? లేదా? బాలీవుడ్ ఎంట్రీ గురించి ఎలాంటి నిర్ణయం తీసుకున్నాడు?...ఇలాంటి ఆసక్తికర విషయాలను చిట్‌చాట్‌గా మాట్లాడాడు ప్రభాస్.

- "నటుల జీవితంలో సమయం చాలా విలువైంది. ఇప్పుడు మరే చిత్రానికి ఐదేళ్లు ఇచ్చే ఆలోచన లేదు. ఇవ్వను కానీ ఒకవేళ ఐదు సంవత్సరాల సమయం కేటాయించినా సమాంతరంగా మిగిలిన సినిమాల్లోనూ నటిస్తాను. అదే నా కెరీర్‌కు మంచిది. అయినా 'బాహుబలి' జీవితానికో అవకాశమంతే"
- "'బాహుబలి'తో జాతీయ స్థాయి గుర్తింపు వచ్చింది. ఇప్పుడు నా చిత్రాలన్నీ భారతీయ ప్రేక్షకుల్ని దృష్టిలో పెట్టుకొని చేస్తున్నవే. భాషతో సంబంధం లేకుండా అందరికీ నచ్చే కథల్నే ఎంచుకుంటున్నాను"
- "నా బాలీవుడ్ ఎంట్రీ గురించి రకరకాల ఊహాగానాలు ప్రచారంలో ఉన్నాయి. బాలీవుడ్‌లో సినిమా చేయడానికి నేను సిద్ధంగానే ఉన్నాను. అక్కడనే కాదు దేశంలోని ఏ భాషలోనైనా నేను నటిస్తాను. కేవలం నాకు నచ్చాల్సింది కథ మాత్రమే. భాష, ప్రాంతం అనే హద్దులు లేవు"
- "ప్రస్తుతం నా దృష్టంతా ప్రేక్షకులకు ఎంటర్‌టైన్‌మెంట్ అందించే సినిమాలు చేయడమే. ఇప్పుడు కాదు కానీ భవిష్యత్తులో ఎప్పుడైనా ప్రతినాయక ఛాయలున్న సినిమాలు చేస్తానేమో"
- "నేను హిందీలో నటించినా సొంతంగా డబ్బింగ్ చెప్పుకోవడం కష్టమే. హిందీ రాయడం, చదవడం వచ్చు. కానీ అక్కడి వాళ్లు మాట్లాడినంత ధారాళంగా హిందీలో మాట్లాడలేను. దక్షిణాది యాస నా మాటల్లో స్పష్టంగా ఉంటుంది. హిందీ ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా డబ్బింగ్ చెప్పే ప్రయత్నం చేస్తున్నాను"


చిరంజీవి

'సైరా'కి సంక్రాంతి సెలవులు

చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'సైరా నరసింహారెడ్డి'. నయనతార కథానాయిక. అమితాబ్ బచ్చన్, సుదీప్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. హైదరాబాద్‌లో పదిరోజుల పాటు షూటింగ్ సాగింది. ఇందులో భాగంగా యాక్షన్ దృశ్యాల్ని తెరకెక్కించారు. ఆ వెంటనే 'సైరా'కి సంక్రాంతి సెలవులు ఇచ్చేశారు. షూటింగ్ మళ్లీ ఫిబ్రవరిలోనే. ఈసారి చిత్రబృందం పొలాచ్చి వెళ్లబోతోంది. అక్కడ రెండు వారాల పాటు కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తారు. తొలి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితాన్ని ఆధారంగా చేసుకుని తెరకెక్కిస్తున్న చిత్రమిది. సురేందర్‌రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. రామ్‌చరణ్ నిర్మాత. సంగీత దర్శకుడిగా రెహమాన్‌ని ఎంచుకున్నారు. అయితే... అనివార్య కారణాల వల్ల ఆయన ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నారు. ఆయన స్థానంలో ఎవరొస్తారో చూడాలి.

దేవుడు పెట్టిన పరీక్షే అనుకున్నా!



వీసాల దేవుడిగా వినతికెక్కారు చిలుకూరులో వెలసిన బాలాజీ. అక్కడికెళ్లే భక్తుల్లో యువతే ఎక్కువ. శతాబ్దాల చరిత్ర కలిగిన బాలాజీ ఆలయంలో స్వామి దర్శనం మొదలుకొని, పూజా విధానం వరకు అన్నీ విశిష్టంగానే ఉంటాయి. ఆ ఆలయ స్థల పురాణం ప్రధానంగా 'శ్రీ చిలుకూరు బాలాజీ' చిత్రాన్ని స్వీయ దర్శకత్వంలో నిర్మించారు అల్లాణి శ్రీధర్. ఈటీవీ సౌజన్యంతో రూపొందిన ఆ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా దర్శకనిర్మాత అల్లాణి శ్రీధర్ 'ఈనాడు సినిమా'తో మాట్లాడారు. ఆ విషయాలివీ...

చిలుకూరు స్థల పురాణం నేపథ్యంలో సినిమా తీయాలని ఎందుకనిపించింది?

స్వతహాగా నాకు చారిత్రక, పౌరాణిక సినిమాలంటే ఇష్టం. అందుకే 'కొమరం భీమ్', 'గౌతమ బుద్ధ' చిత్రాల్ని తీశా. చరిత్రని వర్తమాన సమాజానికి అన్వయించి చెబితే మంచి ఫలితాలుంటాయి. చిలుకూరి బాలాజీ స్థలపురాణంలో కూడా నేటి తరానికి కనెక్ట్ అయ్యే చాలా విషయాలున్నాయి. చిలుకూరులో గుడి కట్టేందుకు వెంకటేశ్వర స్వామి భక్తుడైన మాధవరెడ్డి పడిన తపన... ఏదైనా సాధించాలనే లక్ష్యంతో ముందు కెళుతున్న నేటి యువతరానికి స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. అందుకే ఈ పురాణం నవతరానికి తెలియాలనే ఈ సినిమా రూపకల్పనకి నడుం బిగించా.

బాలాజీ మహిమల్ని తెరపై చూపిస్తున్నారా?

చిలుకూరు బాలాజీ స్థల పురాణం మహిమల కంటే కూడా, ఆత్మవిశ్వాసం గురించే ఎక్కువగా చెబుతుంది. ఎన్ని అడ్డంకులు ఎదురైనా అనుకొన్నది సాధించేవరకు విశ్రమించకూడదని చెబుతుంది. కథలో భాగంగానే ఆ విషయాల్ని చెబుతూ... పలు సామాజికాంశాల్ని కూడా స్పృశించాం. ఇప్పుడంటే క్లబ్బులనీ, కమ్యూనిటీ హాళ్లనీ వచ్చాయి కానీ... అప్పట్లో గుడులే సామాజిక కేంద్రాలు. భక్తికి, వినోదానికి, వేడుకలకీ అన్నీ గుడులే కేంద్రంగా ఉండేవి. అలాంటి గుడి కోసం ఓ సామాన్య రైతు అయిన మాధవరెడ్డి ఎన్ని అడ్డంకుల్ని అధిగమించాడనే విషయాన్ని ఈ చిత్రంలో చూపించబోతున్నాం. ఏడుకొండలవాడు కొండదిగి రావడం, పుట్టలో నుంచి బయటపడే విధానం, శ్రీవారి సన్నిధిలో మాత్రమే గానం చేసే తిరుమలదాసు చిలుకూరులో పాట పాడటం వంటి ఘట్టాలు ప్రేక్షకుల్ని ఆకట్టుకొంటాయి.

సినిమా కోసం ఎలాంటి పరిశోధన చేశారు?

శతాబ్దాల కిందట జరిగిన కథ ఇది. పలు విషయాలు తెలుసుకొని కథ, మాటలు రాసుకొన్నా. చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సౌందర్‌రాజన్, రంగరాజన్ ఆలయ స్థల పురాణం గురించి మాకు చాలా విషయాలు చెప్పారు. అజయ్‌శాంతి స్క్రీన్‌ప్లే సమకూర్చారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సాయికుమార్, సుమన్, భానుశ్రీ మెహ్రా తదితరులంతా చక్కటి అభినయాన్ని ప్రదర్శించారు.

చిత్రం విడుదల బాగా ఆలస్యమైంది. అందుకు కారణమేమిటి?

సినిమాపై దర్శకనిర్మాతలకి ఉన్న నమ్మకం కొనుగోలుదారులకి లేకపోవడమే సినిమా విడుదలలో ఆలస్యానికి కారణం. మాధవరెడ్డి అప్పట్లో చిలుకూరు బాలాజీ ఆలయం కట్టడానికి ఎన్ని ఇబ్బందులు పడ్డారో, అలా ఈ సినిమా చేయడానికి నాక్కూడా అన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇది కూడా దేవుడు పెట్టిన పరీక్షే అనుకొన్నా. కానీ ఆ దేవుడి మహిమతోనే ఈ సినిమా ఆలస్యంగానైనా ఎక్కువ థియేటర్లలో విడుదలవుతోంది. మొదట ఒక ఐదారు థియేటర్లలో విడుదలవుతుందేమో అనుకొన్నా. కానీ రెండు రాష్ట్రాల్లో 60 థియేటర్లలో విడుదలవుతోంది. దిల్‌రాజు, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, కె.వి.రమణాచారి తదితరులు అందించిన సహకారంతోనే సినిమా విడుదలవుతోంది. అయితే 'కొమరం భీమ్' నుంచి కూడా నా సినిమాలు ఆలస్యంగానే విడుదలవుతుంటాయి. ఆ చిత్రం పూర్తయ్యాక, 18 యేళ్లకు విడుదలై విజయవంతమైంది.

ఈమధ్య 'డూ డూ డీ డీ' అనే బాలల చిత్రం చేశారు కదా....

సాంకేతికత చిన్న పిల్లలపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతోందనే విషయం ఆధారంగా ఆ చిత్రాన్ని తీశా. ఇప్పుడు 'నేనే సరోజ' తీస్తున్నా. బీడీ కార్మికుడి ఇంట్లో పుట్టి పెరిగిన ఓ అమ్మాయి తనకున్న కష్టాల్ని ఎలా అధిగమించి విజేతగా నిలిచిందనే కథతో ఆ చిత్రం తెరకెక్కుతోంది. మూస ధోరణిలో కాకుండా... ఇలా ఎప్పటికప్పుడు విభిన్నమైన సినిమాలు చేయాలనేదే నా దృక్పథం. ఇదివరకు సినిమా సినిమాకీ మధ్య విరామం ఎక్కువగా ఉండేది. ఇకపై విరామం లేకుండా సినిమాలు చేయబోతున్నా.


రాశీ ఖన్నా

వేరుచేసి చూడటం కష్టమే!

ఎంతటి గొప్ప వారయినా వాళ్లకంటూ ఓ వ్యక్తిగత జీవితం ఉంటుంది. వృత్తితో పాటు వ్యక్తిగత జీవితానికీ ప్రాధాన్యత ఇవ్వాల్సిందే. 'మేం వ్యక్తిగతం... వృత్తిగతం రెండింటినీ వేరు వేరుగానే చూస్తాం..కలపలేం' అని చాలామంది అంటుంటారు. కానీ అన్నిసార్లు రెండింటినీ వేరుగా చూడటం కుదరకపోవచ్చు అంటోంది టాలీవుడ్ అందాల భామ రాశీ ఖన్నా. "ఉదయం లేచి షూటింగ్‌కు వెళ్లడం... సాయంత్రం తిరిగొచ్చేశాక అన్నీ మర్చిపోవడం... ఇదంతా చెప్పడానికే బాగుంటుంది. కానీ ఆచరణలో చాలా కష్టం. చిత్రీకరణలో ఎన్నో జరుగుతుంటాయి. ఓ మంచి సీన్ చేసినా, ఏదైనా సమస్య ఎదురైనా ఆ ప్రభావం ఇంటికొచ్చాకా కూడా ఉంటుంది. దాని నుంచి వీలైనంత తొందరగా బయటపడటం ఎలాగో ఆలోచించడం ఒక్కటే మన చేతుల్లో ఉంటుంది. విజయం వచ్చినప్పుడు చుట్టూ చాలామంది ఉంటారు. ఫ్లాప్‌లు వస్తుంటే ఒక్కరూ కనిపించకపోవచ్చు. ఆ విషయాన్ని గ్రహించగలిగితేనే కెరీర్ ముందుకెళుతుంది. పర్సనల్, ప్రొఫెషనల్ రెండింటినీ వేరు వేరుగా చూడనప్పుడే అది సాధ్యమవుతుంద"ని చెప్పింది రాశీ ఖన్నా. ఈ భామ ప్రస్తుతం రవితేజతో 'టచ్ చేసి చూడు', వరుణ్‌తేజ్‌తో కలిసి 'తొలి ప్రేమ' చిత్రాల్లో నటిస్తోంది. వీటితో పాటు ఓ మూడు తమిళ చిత్రాలు ఆమె చేతిలో ఉన్నాయి.

పంచ్ డైలాగ్

మన సంతోషాన్ని పది మందితో పంచుకుంటే బాగుంటుంది. కానీ బాధల్ని పంచి బాధ పెట్టకూడదు!

చిత్రం: శతమానం భవతి

- పంపినవారు: జాటోత్ రంగి బాయి నాయక్, ధర్మపురం, జనగామ

మెయిల్ ఐడీ: cinema@eenadu.net

ఇజ్రాయెల్‌లో బ్రహ్మాస్త్రం

రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్ జంటగా తెరకెక్కుతోన్న చిత్రం 'బ్రహ్మాస్త్ర'. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నారు. కరణ్‌జోహార్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మరో కీలకమైన పాత్రలో అమితాబ్‌బచ్చన్ నటించనున్నారు. వచ్చే నెల నుంచి ఈ సినిమా చిత్రీకరణ మొదలుకానుంది. దీనికి సంబంధించిన సన్నాహాలు ఇజ్రాయెల్‌లో మొదలయ్యాయి. ఈ విషయాన్ని ట్విట్టర్ ద్వారా పంచుకొన్నారు కరణ్. "'బ్రహ్మాస్త్ర' ఏర్పాట్లు జరుగుతున్నాయి. కొత్త సంవత్సరంలో ఈ సినిమా ప్రారంభానికి కౌంట్‌డౌన్ మొదలైంది"అని ట్వీటారు. ఇందులో రణ్‌బీర్ అతీంద్రియ శక్తులున్న పాత్రలో కనిపించనున్నాడు. ఈ సినిమా తొలి భాగం ఆగస్టు 2019కి ప్రేక్షకుల ముందుకురానుంది.


రణ్‌బీర్ కపూర్, అయాన్ ముఖర్జీ, ఆలియా భట్

మెప్పించాలంటే ఆ పాత్రలే చేయక్కర్లేదు


కత్రినా

'జగ్గా జాసూస్'తో 2017లో పెద్ద భారీ ఫ్లాప్‌ను తన ఖాతాలో వేసుకొంది కత్రినా కైఫ్. సూపర్ హిట్ అవుతుంది అనుకొంటే గట్టి షాకిచ్చింది ఆ చిత్రం. కానీ ఏడాది ముగింపు మాత్రం ఆమెకు అదిరిపోయే బహుమతి ఇచ్చి వెళ్లిపోయింది. సల్మాన్ ఖాన్‌తో నటించిన 'టైగర్ జిందా హై' బాక్సాఫీసు వద్ద వసూళ్లు కురిపిస్తోంది. దీంతో కొత్త ఏడాదిని మాంచి జోష్‌తో ఆహ్వానించేసింది కత్రినా. "'టైగర్...'కు వస్తున్న స్పందన చాలా సంతోషాన్నిస్తుంది. నన్ను ఓ శక్తిమంతమైన మహిళ పాత్రలో ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. నాయిక ప్రాధాన్య చిత్రాల్లో నటిస్తేనో, ప్రతినాయిక ఛాయలున్న పాత్రలు పోషిస్తేనో పేరొస్తుంది... ప్రేక్షకుల్ని మెప్పించగలం అనుకోవడం పొరపాటు. పాత్రకు ప్రాధాన్యం ఉంటే హీరో ఓరియెంటెడ్ సినిమాల్లో నటించీ సత్తా చాటొచ్చు"అని చెప్పింది. ఈ ఏడాది షారుఖ్‌ఖాన్‌తో ఓ సినిమా, ఆమీర్ చిత్రంలోనూ నటిస్తోంది కత్రినా. ఈ రెండూ మంచి విజయం సాధించడం ఖాయం అని ధీమాగా ఉంది 'బ్యాంగ్ బ్యాంగ్' భామ.

గీతోపదేశం

కరిమబ్బులు కమ్మే వేళ
మెరుపు తీగే వెలుగు
కారుచీకటి ముసిరే వేళ
వేగుచుక్కే వెలుగు
మతి తప్పిన కాకుల రొదలో
మౌనమే వెలుగు
దహియించే బాధల మధ్యన
సహనమే వెలుగు

గీతం: గోరంత దీపం...
చిత్రం: గోరంత దీపం
రచన: సి.నారాయణరెడ్డి

- పంపినవారు: కె.సుధాకర్ నాయుడు, పప్పూరు

చిరునామా: సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్

తేజూ... తెలివైనోడు


సాయిధరమ్‌తేజ్

సాయిధరమ్‌తేజ్ కథానాయకుడిగా సి.కల్యాణ్ ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వి.వి.వినాయక్ దర్శకుడు. లావణ్య త్రిపాఠి కథానాయిక. ఈ చిత్రానికి 'ఇంటెలిజెంట్' అనే పేరు ఖరారు చేశారు. ఇది వరకు 'ధర్మాభాయ్' అనే మరో టైటిల్ ప్రచారంలో ఉండేది. కథకు, అందులోని కథానాయకుడి పాత్రకూ 'ఇంటెలిజెంట్' అనే పేరే బాగుంటుందనిపించి... దాన్ని ఓకే చేశారు. చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. త్వరలోనే టీజర్‌ని విడుదల చేస్తారు. ఫిబ్రవరి 9న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు.


ఆమీర్ ఖాన్

డ్రాగన్ దేశంలో 'దంగల్' దూకుడు

'వొమెన్ ఐ ఆమీర్ ఖాన్..' అంటున్నారు చైనా ప్రేక్షకులు. అంటే చైనీస్‌లో 'వుయ్ లవ్ ఆమీర్' అని అర్థం. ఆమీర్ ఖాన్ సినిమాలకు ప్రపంచవ్యాప్తంగా అభిమానులున్నారు. అయితే చైనీయుల్లో ఆమీర్‌పై ఉన్న అభిమానం అంతా ఇంతా కాదు. 'త్రీ ఇడియట్స్' నుంచి ఆయన సినిమాలు చైనాలో వసూళ్ల వర్షం కురిపిస్తున్నాయి. ఆమీర్ కథానాయకుడిగా నటించిన 'దంగల్' గతేడాది చైనాలో విడుదలై ప్రభంజనం సృష్టించిన విషయం తెలిసిందే. ఆ చిత్రానికి అక్కడ రూ.1200 కోట్లకు పైగా వసూళ్లు దక్కాయి. ఇప్పుడు ఆ చిత్రం మరో ఘనత సాధించింది. గతేడాది చైనాలో విడుదలైన సినిమాల్లోకెల్లా అత్యంత ప్రేక్షకాదరణ పొందిన చిత్రంగా నిలిచింది. ప్రముఖ సినిమా వెబ్‌సైట్ ఐఎండీబీ-చైనా నిర్వహించిన సర్వేలో చైనీస్, హాలీవుడ్ సినిమాలను కాదని చైనీయులు 'దంగల్'కే ఓటేయడం విశేషం. దీంతో 2017లో డ్రాగన్ దేశంలో వచ్చిన చిత్రాల్లో మొదటి ర్యాంకు కైవసం చేసుకుంది 'దంగల్'.

ఆర్థిక ప్రణాళికతో భవిష్యత్తు..

పురుషులతో సమానంగా నేటి మహిళలు ఆర్థికపరంగానూ దూసుకువెళుతున్నారు. ఇంటి బాధ్యతలతోపాటు ఉద్యోగినిగా పలు లక్ష్యాలతో ముందడుగు వేస్తున్న ఈతరం మహిళలకు ఆర్థిక ప్రణాళిక మరింత ముఖ్యం. కుటుంబ సంతోషం మాత్రమే కాకుండా, భవిష్యత్తులో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలంటే... ఇది తప్పనిసరి. మరి ఆ ఆర్థిక ప్రణాళిక ఎలా ఉండాలీ.. ఆ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో చూద్దాం.



- ఉద్యోగినుల జీవితంలో నిత్యం ఉరుకులూ పరుగులే. కుటుంబ బాధ్యతలూ, పని ఒత్తిడీ.. ఇవన్నీ వారి ఆరోగ్యం పైన తీవ్ర ప్రభావం చూపిస్తాయి. దీంతో తలెత్తే ఆరోగ్య సమస్యల్ని ఎదుర్కోవాలంటే ఆర్థికపరంగా కూడా ప్రణాళిక అవసరం. దీన్నే సంరక్షణా ప్రణాళిక అంటారు. అంటే ఆర్థిక బీమా ఉండాలి. కుటుంబంలో నలుగురు సభ్యులుంటే సుమారుగా ఆరోగ్య పరిరక్షణకు అయిదు లక్షలరూపాయల పథకం అవసరమవుతుంది. అలాగే ప్రస్తుతం వస్తున్న ఆరోగ్యబీమా సంస్థలు మహిళలకు ప్రత్యేక పథకాలు అందిస్తున్నాయి. వీటిలో కాన్సర్ వంటి అనారోగ్యాలకు బీమా ప్రకటిస్తున్నాయి. కాబట్టి అలాంటివాటిపై దృష్టిపెట్టడం మంచిది.
- పిల్లల చదువులూ, వారి భవిష్యత్తూ, ఉద్యోగ విరమణ తరువాత ఉపయోగపడేలా పొదుపు చేసుకోవాలి. ఈ రోజుల్లో రకరకాల మ్యూచువల్ ఫండ్లు అందుబాటులో ఉంటున్నాయి. అందులో అనువైనది ఎంచుకుంటే అవసరానికి తగినట్లుగా పొదుపు చేసుకోవచ్చు.
- ప్రతినెలా వచ్చే ఆదాయంలో ముందు పొదుపు చేశాకే తరువాత ఖర్చుల గురించి ఆలోచించాలి. అలాగే భాగస్వామితో కలిసి పొదుపు చేస్తున్నా సరే.. అత్యవసర సమయంలో ఉపయోగపడేలా ఎంతో కొంత డబ్బును విడిగా కూడా పక్కన పెట్టుకోవాలి.

నజరానా


తేనె, నిమ్మరసం సమపాళ్లలో తీసుకుని బాగా కలిపి పాదాలకు పట్టించాలి. ఇరవై నిమిషాల తరువాత కడిగేయాలి. ఇలా రెండు రోజులకోసారి చేస్తూ ఉంటే పగుళ్లు తగ్గి పాదాలు ఆరోగ్యంగా, మృదువుగా మారతాయి.



- వినీత ఒంటరిగా ఉంటోంది. ఆ విషయం తెలుసుకున్న సహోద్యోగి ఒకరు తోడుంటానంటూ వేధిస్తున్నాడు. ఆఫీసులో అందరికీ మంచిగా కనిపించే అతని నిజస్వరూపం ఆమెని భయపెడుతోంది. పైగా నా విషయం బయటికి చెబితే నువ్వే చెడ్డదానివవుతావంటూ బెదిరిస్తున్నాడు. అతని బారి నుంచి ఎలా తప్పించుకోవాలో తెలియని పరిస్థితి.
- లాలిత్య ఓ ఫార్మాకంపెనీలో పనిచేస్తోంది. రోజూ ఓ అపరిచితుడి నుంచి ఫోన్లూ, సందేశాలు వస్తున్నాయి. తను ఆఫీసులో ఏం చేస్తోందో వాటన్నింటినీ దానిలో వర్ణిస్తున్నాడతను. ఎవరో తెలుసుకునే ప్రయత్నం చేస్తే సహోద్యోగే. బయటపడితే పరువుపోతుందనే భయం.

- వీళ్లనే కాదు... ఉద్యోగాన్ని ఓ సవాలుగా తీసుకుని పనిచేసే ఎందరో మహిళలకు పని వాతావరణంలో ఇలాంటి లైంగిక వేధింపులు తప్పడంలేదు. వాటన్నింటినీ మౌనంగా భరించాలా లేదా శక్తి స్వరూపిణిగా మారి ఎదుర్కోవాలా..! రెండోమార్గాన్నే ఎంచుకోమని చెబుతోంది చట్టం. అది మన వల్ల సాధ్యమవుతుందా అంటే 'వందశాతం అవుతుంది'. అది ఎందుకో, ఎలాగో తెలుసుకోండి మరి.

చెయ్యేస్తేనే కాదు... అలా చూసినా తప్పే!



ఆడామగా కలుపుగోలుతనం ఆధునిక పనిసంస్కృతి తెచ్చిన అనివార్యమైన మార్పు! రాత్రీ,పగలూ తేడాలేకుండా అబ్బాయిలతోపాటు అమ్మాయిలూ పనిచేస్తున్నారు. 'హాయ్' అంటూ షేక్ హ్యాండ్ ఇవ్వడం, 'వాట్సాప్' అంటూ భుజంమీద చెయ్యేయడం... క్యాంటీన్‌లో సరదాగా మాట్లాడుకుంటూ.. భోజనాలు పంచుకోవటం మామూలవుతోంది! కానీ... కొన్నిసార్లు ఆ సరదానే శ్రుతిమించి వేధింపులకు కారణం అవుతోంది. సరదా అనుకున్నది కాస్తా సరిహద్దులు దాటినప్పుడు... అడ్డుకట్ట వేయలేక, ఏం చేయాలో తెలియక మౌనంగా ఉండిపోతారు చాలా మంది అమ్మాయిలు. అలాంటి వాళ్ళ సంఖ్య చాలా ఎక్కువే అంటోంది ఇండియన్ నేషనల్ బార్ అసోసియేషన్ నిర్వహించిన ఓ అధ్యయనం. ఐటీ రంగం, బీపీఓలూ, విద్యాసంస్థలూ, ఆసుపత్రులూ, న్యాయసేవా సంస్థల ఉద్యోగులపై ఈ అధ్యయనం చేస్తే 38 శాతం మంది అమ్మాయిలు పని వాతావరణంలో లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. వీరిలో దాదాపు 68 శాతం తాము నలుగురిలో చులకన కావడం ఇష్టం లేకే ఫిర్యాదు చేయలేకపోయామనీ చెప్పడమే విషాదం! అసలు పని వాతావరణంలో లైంగిక వేధింపులంటే ఏంటీ? దానికి సంబంధించి ఉన్న చట్టం ఏం చెబుతోంది?

చూపులతో వేధించడమూ నేరమే..

'ఆమె పేరు భన్వరీదేవి. రాజస్థాన్ ప్రభుత్వ ఉద్యోగిని. అప్పట్లో ఈమెపై జరిగిన అత్యాచారం కేసు ఓ సంచలనమే. దాన్ని సవాల్ చేస్తూ ఆమె కోర్టుకు వెళ్తే, ఆమె పనిచేస్తున్న విభాగం నుంచి ఏ సహకారమూ అందలేదు. అదే సమయంలో దిల్లీకి చెందిన విశాఖ అనే ఎన్‌జీవో ఆమె తరఫున ఈ కేస్‌ని సవాల్ చేసింది. ఆ తరువాతే పని ప్రదేశంలో మహిళలు వేధింపులు ఎదుర్కొంటే యాజమాన్యాలు బాధ్యత తీసుకోవాలంటూ 1997లో సుప్రీంకోర్టు కొన్ని మార్గదర్శకాలను వెలువరించింది. అదేపనిగా కన్నార్పకుండా చూడటం, సైగలు చేయడం, కావాలని తాకేందుకు ప్రయత్నించడం, అసభ్యకరంగా వ్యాఖ్యానించడం, బెదిరించి లొంగదీసుకునే ప్రయత్నం, ప్రేమపేరుతో వేధింపులు... వంటివన్నీ వేధింపులేనని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. 2013లో ఇది చట్టంగా మారడంతో లైంగిక వేధింపుల నిర్వచనంలో మరిన్ని అంశాలు చేరాయి. అశ్లీల పదజాలం, అశ్లీల సినిమాలు, బొమ్మలు చూపించడం అందులో కొన్ని'

ఎవరికైనా వర్తిస్తుంది...

ఉద్యోగం చేసే మహిళలకు ఓ చట్టం ఉందని చాలామందికి తెలిసినా చాలామంది అది తమకు వర్తించదేమో అనుకుంటారు. పని వాతావరణం అంటే ఓ పెద్ద సంస్థకే పరిమితం కాదు. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలూ, కర్మాగారాలూ, విద్యాసంస్థలూ, సొసైటీలూ, ఆసుపత్రులూ, ట్రస్టులూ, ఎన్‌జీఓలూ, సేవా, వినోదకేంద్రాలు... ఇలా ఓ మహిళ ఉద్యోగినిగా పనిచేసే ప్రతి ప్రదేశమూ దీని పరిధిలోకి వస్తుంది. ఎవరైనా సరే! లైంగిక వేధింపులకు గురైతే ధైర్యంగా ఫిర్యాదు చేయొచ్చు. ఆమె ఆ సంస్థలో శాశ్వత ఉద్యోగే కానక్కర్లేదు. కాంట్రాక్టు పద్ధతిలో లేదా రోజువారీ జీతానికి పనిచేసే వ్యక్తి అయినా, మధ్యవర్తి ద్వారా చేరినా సరే.. ధైర్యంగా సమస్యను ఎదుర్కోవచ్చు. ఇంటినుంచి పనిచేసే వర్క్‌ఫ్రమ్ హోం ఉద్యోగినులూ, ఆఫ్‌సైట్ కన్సల్టెంట్లకూ ఈ చట్టం వర్తిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే వ్యవసాయ కూలీ మొదలు కార్పొరేట్ స్థాయి ఉద్యోగిని వరకూ ఈ చట్టాన్ని ఉపయోగించుకోవచ్చు.

ఫిర్యాదు చేస్తే...

వెంటనే సదరు వ్యక్తిని జైలుకు పంపరు. ఫిర్యాదు స్వీకరించిన కమిటీ సమస్య తీవ్రతను బట్టీ హెచ్చరించి వదిలేయొచ్చు. ఇంక్రిమెంట్లూ, పదోన్నతుల్లో కోత కోయొచ్చు. గుడ్ బిహేవియరల్ బాండ్ సమర్పించమని అడగొచ్చు. ట్రాక్ రికార్డ్‌పై రిమార్క్ నమోదు చేయొచ్చు. తాత్కాలికంగా లేదా శాశ్వతంగా ఉద్యోగం నుంచి తీసేసే అధికారం కూడా ఆ కమిటీకి ఉంటుంది. తప్పు రుజువైతే బాధితురాలికి అతని జీతం నుంచి కొంత భాగం డబ్బు చెల్లించమనీ చెప్పొచ్చు. ఆ క్రమంలో ఏ వ్యక్తినైనా హాజరు పరచి విచారించేందుకూ, ఎటువంటి దస్త్రాలైనా పరిశీలించేందుకూ ఈ ఫిర్యాదు కమిటీలకు సర్వాధికారం ఉంటుంది. మూణ్నెల్లలోగా విచారణ పూర్తికావాలి. అలా పరిష్కారం కానప్పుడు ఆ కమిటీ విచారణ చేసి, ప్రాథమిక విచారణలో తప్పు జరిగిందని తేలితే వారం రోజుల్లోగా ఈ కేసుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు పంపించి కేసు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇలా విచారిస్తున్నప్పుడు ఆమె కోరితే గనుక తాత్కాలికంగా మరోచోటికి బదిలీ చేయొచ్చు లేదా మూణ్నెల్లు జీతంతో కూడిన సెలవూ తీసుకోవచ్చు. అయితే ఆమె ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయడమే ముఖ్యం. ఒకవేళ ఆమె మానసికంగా గానీ, శారీరకంగా గానీ రాలేని పరిస్థితుల్లో, మరణించినా ఆమె తరఫున ఇంకెవరైనా ఫిర్యాదు చేయొచ్చు. అదీ మూణ్నెల్లలోపే.

కమిటీకే చెప్పొచ్చు...

- సుప్రీంకోర్టు నిర్దేశించిన ప్రకారం లైంగిక వేధింపులు అంటే ఏమిటి? వాటి పర్యవసానాలూ, శిక్షల్ని తెలిపే గోడ ప్రతులను పని ప్రదేశంలో ఉంచాలి.
- ఒక సంస్థలో పదిమందికి మించి ఉద్యోగులు ఉంటే ఆ సంస్థలో మహిళలకు ఎదురయ్యే ఇలాంటి సమస్యలకోసం అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలి. దానికి ఆ సంస్థలో పనిచేసే ఒక సీనియర్ ఉద్యోగిని అధ్యక్షత వహిస్తే, మరో ఇద్దరు ఉద్యోగినులు కమిటీసభ్యులుగా ఉండాలి. మరొకరు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అయ్యుండాలి.
- ఉద్యోగులు పదికంటే తక్కువ ఉంటే ఆ మహిళల కోసం జిల్లా అధికారి స్థానిక ఫిర్యాదుల కమిటీని తన అధ్యక్షతన ఏర్పాటుచేయాలి. ఈ అధికారి ప్రతి బ్లాక్‌లోనూ, తాలూకాలోనూ, డివిజన్‌లోనూ ఒక నోడల్ అధికారిని నియమించాలి. వారు ఈ లైంగిక వేధింపులకు సంబంధించి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారం చూపించాలి.
- చట్ట ప్రకారం ఈ కమిటీ లేకపోయినా, బాధితులకు న్యాయం జరగకపోయినా యాజమాన్యానికీ శిక్ష తప్పదు. బాధితురాలు తనకు న్యాయం జరగలేదని ఈ కమిటీకి ఫిర్యాదు చేస్తే న్యాయస్థానం విచారణ చేపట్టే అవకాశం ఉంది.
- ఒకవేళ మహిళ చేసిన ఫిర్యాదు ఉద్దేశపూర్వకం అయితే, అది విచారణలో తప్పు అని తేలితే ఆమె కూడా శిక్షార్హురాలే. ఆ శిక్ష కమిటీ విధివిధానాల ప్రకారం యాజమాన్యం నిర్ణయం తీసుకుంటుంది.

పేరు అవసరం లేదు

– కృష్ణ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని



అవును! ప్రతి చోటా వేధింపులు పెరిగాయి. లైంగిక వేధింపుల చట్టం గురించి ఉద్యోగినుల్లో అవగాహన తక్కువే. కానీ కొన్ని సంస్థలు ప్రత్యేకించి ఇలాంటి వేధింపుల్ని నివారించేందుకు నియమావళిని రూపొందించుకుంటున్నాయి. మా సంస్థలో ప్రత్యేకంగా ఇంటిగ్రేటెడ్ హెల్ప్‌లైన్ ఉంది. మాకు సమస్య ఎదురైతే మా వ్యక్తిగత వివరాలు చెప్పకుండానే ఫిర్యాదు చేయొచ్చు వెంటనే విచారణ మొదలవుతుంది. సమస్యను బట్టీ చర్యలు ఉంటాయి. దీనివల్ల బాధితులూ అభద్రతకు లోనుకాకుండా ఉంటారు.

న్యాయం సంస్థలోనే జరగాలి..

–వసుధా నాగరాజు, ప్రముఖ న్యాయవాది

సాధారణంగా పని ప్రదేశంలో వేధింపులు జరిగినప్పుడు ఏ ఉద్యోగినీ పోలీస్‌స్టేషన్‌కి వెళ్లదు. సత్వర న్యాయం సంస్థలోనే జరగాలని కోరుకుంటారు. అలాంటి స్వేచ్ఛాయుత, బాధ్యతాయుతమైన వాతావరణాన్ని పనిచేసేసంస్థలు అందించాలి. ఆ సంస్థలో ఆమెకు న్యాయం జరగలేదనుకున్నప్పుడు కోర్టులు వాటిని స్వీకరించేందుకు సిద్ధంగా ఉంటాయి. ఏది ఏమైనా బాధితులు ధైర్యంగా ఫిర్యాదు చేయడానికి ముందుకు వచ్చినప్పుడు మీకు చట్టం అండగా నిలబడుతుంది.

– స్వాతి కొరపాటి

రంగవల్లిక

15 చుక్కలు
5 వరుసలు
5 వచ్చేవరకూ

మూడువైపులా ముగ్గు వేసి ఒకవైపు మాత్రం వదిలేయడం మర్చిపోవద్దు.






శ్రీలత, మొవ్వ, కృష్ణాజిల్లా

ఇంటి ముంగిట రంగవల్లికలను తీర్చిదిద్దే మీకిదే మా ఆహ్వానం. పెన్నూ, పెన్సిల్‌తో చక్కగా వేసిన ముగ్గులను పంపండి. ముగ్గు, చుక్కల వివరాలతో పాటూ మీ ఫొటో, చిరునామా జతచేయాలి. ముగ్గుల్లో రంగులు నింపాల్సిన పని లేదు.

19 చుక్కలు
9 వరుసలు
9 వచ్చేవరకూ





మట్టపల్లి అన్నపూర్ణ, సూర్యాపేట

మా చిరునామా:
వసుంధర,
ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలిం సిటీ,
హైదరాబాద్. - 501 512.
email: vasundhara@eenadu.net

అప్పుడు సెలవు పెట్టేయండి!

ఉద్యోగినులకు ప్రధానంగా ఎదురయ్యేది ఒత్తిడే. దీనిపై ప్రముఖ మానసిక వైద్య నిపుణులు చేపట్టిన అధ్యయనాల్ని పరిశీలిస్తే, ఒత్తిడి వల్ల ఉద్యోగినుల్లో క్రమంగా చురుకుదనం తగ్గడం, కంగారు వంటివి కనిపిస్తున్నట్లు తేలింది. దానికితోడు పని భారం, పనిలో సామర్థ్యం తగ్గడం వంటి సమస్యలూ తప్పవు. మరేం చేయాలంటారా.. ఆ సమస్యల్ని సవాళ్లుగా తీసుకుని అధిగమించడమే అంటారు నిపుణులు.

- ఒత్తిడికి గురైె, ఆత్మవిశ్వాసం లోపించినప్పుడు కుంగిపోవద్దు. ఆ సమయంలో ఒంటరిగా ఉండటం కన్నా, అత్యంత సన్నిహితులతో మాట్లాడాలి. లేదంటే మానసిక వైద్యులను సంప్రదించి సమస్యను వివరించాలి.




- మీ అనుభవాలను, మనసులో ఉండే స్తబ్ధతకు గల కారణాలను ఒకరికొకరు పంచుకోవడం ప్రారంభించాలి. దీంతో మనసుకు ఓ ఆసరా దొరికినట్లు అనిపిస్తుంది. త్వరగా దాన్నుంచి బయటపడే అవకాశమూ ఉంటుంది.
- పుస్తకపఠనం కూడా మనసుకు ఓ చికిత్స లాంటిది. ఎవరికి వారే మనసును ఆహ్లాదపరుచుకోవడానికి పుస్తకం మంచి ఔషధంలా పని చేస్తుంది. ఇష్టమైన అంశానికి సంబంధించిన పుస్తకాన్ని చదవడం మొదలుపెట్టండి. అలాగే కుటుంబ సభ్యులతో కలిసి నచ్చిన సినిమా చూడండి లేదా ఏదైనా పార్క్‌కు వెళ్లండి
- బాగా ఒత్తిడికి లోనవుతున్నారనుకోండి. మీ పనులన్నీ పక్కన పెట్టేసి ఓ రోజు సెలవు పెట్టేయండి. ఇంట్లో మీకు నచ్చినట్లుగా ఉండేందుకు ప్రయత్నించండి.
- ఆఫీస్‌లో మీపై మీరు నియంత్రణ తెచ్చుకోవాలి. ఆత్మవిశ్వాసంతో పనులు పూర్తిచేయగలుగుతాననే నమ్మకాన్ని పెంచుకోవాలి. చేయవలసిన పనులను ఓ పట్టికలా రాసుకుని, నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా చూస్తే ఒత్తిడి అనేది ఉండదు.

బంగారం వెండి

3న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,819	2,816
వెండి (గ్రా)	42.00	41.90



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమండ్రి		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	30,500	30,490	30,500	30,400	30,420	30,350	30,150	30,120	30,220	30,220
ఆర్నమెంట్	28,500	28,490	28,300	28,300	28,200	28,180	28,210	28,180	28,100	28,100
వెండి(కిలో)	39,830	39,900	42,000	40,300	39,900	39,900	39,150	39,250	39,900	39,900

మూడుజళ్ల సొగసిది!

సిగ సింగారం

ఏదయినా సందర్భం ఉన్నప్పుడు దుస్తులూ, వాటికి తగ్గ కేశాలంకరణ ఉంటేనే అందం కదూ. అలాగని పెద్దగా కష్టపడాల్సిన అవసరంలేదు. రెండు సన్నటి జడలు వేసుకుని సులువుగా ఇలా ప్రయత్నించి చూడండి.





1. ముందుగా తలపైన మధ్యలో వచ్చేటట్లుగా జుట్టులోంచి కుడి, ఎడమ వైపులా పాయలు తీసి రెండు సన్నటి జడలను వేసుకోవాలి.








2. కుడి వైపు ఉన్న జడకు పక్కగా చిత్రంలో చూపించినట్లు చిన్న పాయ తీసుకోవాలి. దాన్ని టూల్ సాయంతో చిన్న జడలో దూర్చి ఇవతలకు తేవాలి. ఇలా జడ చివరి వరకు వరుసగా పాయల్ని తీసుకుంటూ ఇవతలకు తెచ్చుకోవాలి.



3. ఎడమవైపు కూడా ఇదే విధంగా చేసుకోవాలి.





4. రెండువైపులా నుంచీ మధ్యలోకి తెచ్చిన పాయలు ఉంటాయి కదా.. వీటి నుంచి రెండు చొప్పున తీసుకుంటూ మధ్య జుట్టులోంచి ఇంకో పాయను కలుపుతూ ఒక వరుస అల్లాలి. ఇలా రెండువైపులా పాయలు పూర్తయ్యేవరకూ జడ అల్లుకుని మధ్యలో రబ్బరుబ్యాండు పెట్టుకుంటే సరి.




కేతా శోభారాణి
కేశాలంకరణ నిపుణురాలు

ఈ అలంకరణకి సంబంధించిన వీడియోను www.eenadu.netలోని వసుంధర విభాగంలో చూడొచ్చు.

రూ.5 లక్షల ప్రారంభ జీతం!

ఫోరెన్సిక్ సైన్స్‌లో డిగ్రీ పూర్తి చేసిన వారికి రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షల వరకు ప్రారంభ వార్షిక జీతం అందుతుంది. ఈ కోర్సు చదవడానికి ఫీజు భారతీయ యూనివర్సిటీల్లో సరాసరిన రూ.30 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఉంటుంది. కోర్సులో చేరడానికి ప్రకటనలు సాధారణంగా ప్రతి సంవత్సరం జూన్‌లో వెలువడతాయి. ప్రధానంగా 10+2లో పొందిన మార్కుల ఆధారంగా అడ్మిషన్లు జరుగుతాయి.



మా చిరునామా:
చదువు
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501 512
■ edc@eenadu.net

Give a talking...
మాటలా? తిట్లా?

పొరపాటు చేసి, దానికి క్షమాపణ చెప్పే సందర్భం మనకైనా, మన స్నేహితులకైనా వస్తుంటుంది. ఆ పరిస్థితిని సూచించే సముచితమైన వ్యక్తీకరణ ఇంగ్లిష్‌లో ఉంది. ఆ PHRASAL VERB ఏమిటి? అలాగే తిట్టటానికీ, తీవ్రంగా విమర్శించటానికీ మరికొన్ని వ్యక్తీకరణలు ఉపయోగిస్తాం. వీటి గురించి తెలుసుకుందామా?

ENGLISH PHRASAL VERBS



ఎం. సురేశన్

Anirudh: I called on our friend Bhaskar last evening. I heard his father scolding him for something he had done (నేను నిన్న భాస్కర్‌ను కలవడానికి వాళ్లింటికి వెళ్లాను. వాళ్ల నాన్న అతను చేసిందానికి కేకలేయడం విన్నాను).

Virat: That is always the trouble. Bhaskar's father is very short tempered. He flares up even at the small mistakes Bhaskar does (ఎప్పుడూ అదే ఇబ్బంది. భాస్కర్ వాళ్ల నాన్న చాలా సులభంగా కోప్పడతాడు. భాస్కర్ చేసే చిన్న తప్పులకు కూడా ఆయన ఎగిరి పడుతుంటాడు).

Anirudh: I heard his father giving him a talking to. Bhaskar bore it with all patience. He is a guy with under-standing (వాళ్ల నాన్న అతన్ని తీవ్రంగా విమర్శించడం నేను విన్నాను. కానీ భాస్కర్ ఓపికతో భరించాడు. అవగాహన ఉన్నతను).

Virat: It seems even at office his father is very temperamental. He lacks self-control (ఆఫీసులో కూడా భాస్కర్ వాళ్ల నాన్న ఊరికే కోప్పడుతూ ఉంటాడట. తన మీద అదుపులేదట).

Anirudh: My father is his colleague and, he tells me the same. Sometimes because of his short-tempered nature he has to eat a humble pie (మా నాన్న ఆయన సహోద్యోగి, మా నాన్న కూడా అదే అంటాడు. కొన్నిసార్లు ఆయన సులభంగా కోప్పడటం వల్ల దాని ఫలితాలు అనుభవించి క్షమాపణలు చెప్పుకుంటాడట).

Virat: In spite of his age, he hasn't learnt. He has a lot of experience too (అంత వయసుండి కూడా ఆయన నేర్చుకోలేదు. ఆయన అనుభవం కూడా ఎక్కువే).

Anirudh: But very often he tells Bhaskar to mind his 'p's and 'q's. He doesn't need that kind of warning. Bhaskar takes after his mother and is very balanced (కానీ తరచుగా ఆ భాస్కర్‌తో అంటుంటాడట, జాగ్రత్తగా నడుచుకోమని. కానీ భాస్కర్‌కు ఆ హెచ్చరిక అక్కర్లేదు. అతనికి వాళ్లమ్మ పోలిక, చాలా సౌమ్యంగా ప్రవర్తిస్తాడు).

Virat: We must appreciate Bhaskar for his patience. He bears with his father (భాస్కర్ ఓర్పుకు మెచ్చుకోవాలి. వాళ్ల నాన్న అతన్ని ఏమైనా భరిస్తాడు).

Now let us look at the expressions in detail



1. Give a talking to = scold / criticize severely (తిట్టడం/ విమర్శించడం).

Venkat: Yesterday the teacher scolded Ramana for no fault of his. It was the boy sitting next to Ramana that made the noise (నిన్న మన టీచర్ రమణను ఏ తప్పూ చేయకపోయినా తిట్టాడు. రమణ పక్కన ఉన్నవాడు గొడవ చేశాడు).

Viswam: The teacher is always so. He often barks up the wrong tree. Ramana cried when the teacher gave him a talking to (ఆ టీచర్ ఎప్పుడూ అంతే. తప్పు చేయనివాళ్ల మీదనే విరుచుకుపడతాడాయన. పాపం, రమణ ఏడ్చాడు, టీచర్ విమర్శించినందుకు).

2. Eat humble pie = Suffer humiliation / suffer the consequences of a mistake and be forced to apologize (అవమానం పాలవడం/ చేసిన పొరపాటుకు క్షమాపణ చెప్పే పరిస్థితి తెచ్చుకోవడం).

Raghav: Ekambaram accused Prasad for no fault of his. Later, of course, he realized he found fault with Prasad wrongly (ఏ తప్పూ చేయకపోయినా ప్రసాద్‌ను ఏకాంబరం తిట్టాడు. తర్వాత తెలుసుకున్నాడు, తాను ఏ తప్పూ చేయని ప్రసాద్‌ను తిట్టాడని).

Sagar: Yea, I was told he had to eat humble pie for that. He had to ask Prasad to excuse him (అవును. నాకెవరో చెప్పారు, దానికి అతను తాను చేసిన పొరపాటు ఫలితాలు అనుభవించాల్సి వచ్చిందని. ప్రసాద్‌ను అతను క్షమాపణ కోరాల్సి వచ్చింది).

3. Mind your 'p's and 'q's = Behave politely (మర్యాదతో ప్రవర్తించడం).

Sunil: I am surprised that Prabhakar has impeccable manners. Considering his family back-ground it is a surprise (ప్రభాకర్‌కు అంత మంచి నడవడి ఎలా వచ్చిందో నాకాశ్చర్యమే. వాడి కుటుంబ నేపథ్యానికి వాడలా నడుచుకోవడం వింతే).

Pasha: It is a fact. He always minds her 'p's and 'q's, and wins the appreciation of all (అది నిజమే. అతనెప్పుడూ చాలా మర్యాదగా ప్రవర్తిస్తాడు, అందరి మెప్పునూ పొందుతాడు).

ఆ వీడియోలో ఉన్నది నేను కాదు... అది ప్రతిపక్షాల కుట్ర! ఆ మాటలు నావి కాదు.. గిట్టని వాళ్లు పుట్టించారు! ప్రమాదవశాత్తు ఫ్యాక్టరీ కాలి బూడిదైందా... అంతా అబద్ధం. పరిహారం కోసం పథకమే! ఉరేసుకుని వివాహిత ఆత్మహత్యా.. కాదు కాదు అది ముమ్మాటికీ హత్యే! ఇలాంటి మిస్టరీలను ఛేదించే ఉద్యోగంలో మీరు చేరాలంటే ఏం చదవాలో చూడండి!

కెరియర్స్ & కోర్సెస్



ఫోరెన్సిక్ కొలువుకి క్లూ!

రోజూ పత్రికలు, టీవీల్లో వార్తలెన్నో మనం చూస్తున్నాం. ఎన్నో ట్విస్టులు.. మరెన్నో సందేహాలు... వీటన్నింటికీ సమాధానమే ఫోరెన్సిక్ సైన్స్.. ప్రపంచవ్యాప్తంగా నేరాలు, ఆర్థిక మోసాలు ఎక్కువయ్యాయి. మనదేశంలోనూ వీటి సంఖ్య తక్కువేమీ కాదు. అయితే చాలా సందర్భాల్లో పోలీసు విచారణలో లైంగికదాడి, హత్యకు కారకులు దొరకడం లేదు. ఎన్నో కేసులు మిస్టరీగానే మిగిలిపోతున్నాయి. అసలు నేరగాళ్లను గుర్తించడానికి ప్రత్యేక నైపుణ్యాలున్న వ్యక్తులపై ఆధారపడడం తప్పనిసరవుతోంది. ఆధారాలు అన్వేషించి, అసలు దోషుల గుట్టు విప్పడానికి ఆవిర్భవించిందే ఫోరెన్సిక్ సైన్స్. ఫోరెన్సిక్ సైన్స్ అంటే కేవలం హంతకులను గుర్తించే శాస్త్రమే కాదు. మోసగాళ్లను పట్టించే దివ్యాస్త్రం కూడా. అగ్ని ప్రమాదాలు, ఫోర్జరీ సంతకాలు, మార్ఫింగ్, సైబర్ నేరాలు... ఇలా ప్రతీదీ ఫోరెన్సిక్‌తో ముడిపడి ఉన్నదే. ఆధునిక సమాజంలో నేరాలు గుర్తించడానికి ఫోరెన్సిక్ సైన్స్ సమర్థ అస్త్రంగా అవతరించింది. దీంతో ఈ రంగంలో కెరియర్ అవకాశాలు విస్తరిస్తున్నాయి. ఇందుకోసం డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ స్థాయుల్లో పలు కోర్సులు ఆవిర్భవించాయి. కేవలం ఈ తరహా కోర్సులు అందించడానికే ప్రత్యేకంగా ఒక విశ్వవిద్యాలయం సైతం ఏర్పడింది. ఆ వివరాలు తెలుసుకుందాం..

ఎవరు అర్హులు

ఫోరెన్సిక్ సైన్స్‌పై ఆసక్తి ఉన్నవాళ్లు డిగ్రీ నుంచే ఈ కోర్సును చదువుకోవచ్చు. సైన్స్ గ్రూప్‌తో ఇంటర్ చదివిన విద్యార్థులు బీఎస్సీ ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులో ప్రవేశం పొందవచ్చు. అయితే బీఎస్సీ స్థాయిలో ఈ కోర్సును అందించే సంస్థలు పరిమితంగానే ఉన్నాయి. అందువల్ల పీజీ కోర్సుల్లో ఎక్కువ మంది విద్యార్థులు చేరుతున్నారు. సైన్స్ సబ్జెక్టుల్లో డిగ్రీ పూర్తిచేసినవారు ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులో చేరడానికి అర్హులు. పీజీ అనంతరం పీహెచ్‌డీ కోర్సులు సైతం ఉన్నాయి. అలాగే పలు సంస్థలు సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులను అందిస్తున్నాయి.

ఏం చేస్తారు...

ఏదైనా సంఘటన జరిగినప్పుడు అందుబాటులో ఉన్న ఆధారాలు సేకరించడం, లభ్యమైన సమాచారాన్ని విశ్లేషించి అసలు దోషి ఎవరో నిర్ధారించడం ఫోరెన్సిక్ నిపుణుల ప్రథమ కర్తవ్యం. కొన్నిసార్లు ఎలాంటి ఆధారాలూ లభించవు. తర్కాన్ని ఉపయోగించి, పలు కోణాల్లో ఆలోచించి దోషిని గుర్తించడం పెద్ద సవాల్‌గా మారుతుంది. దొంగతనం, అత్యాచార సంఘటనల్లో పలు సందర్భాల్లో ఆధారాలు కాకుండా బాధాకర విషయాలే మిగులుతాయి. ఇలాంటప్పుడే ఫోరెన్సిక్ నిపుణుల సమర్థత బయటపడుతుంది. ఆ కేసును బాగా విచారించి, క్షుణ్ణంగా ఆలోచిస్తే ఏదో ఒక చిన్న క్లూ తప్పకుండా లభిస్తుంది. తీగలాగితే డొంకంతా కదిలినట్టు దాని నుంచి వివరాలు సేకరించడం సాధ్యమవుతుంది. లభ్యమైన ఆధారాలను ప్రయోగశాలలో పలు పరికరాలు ఉపయోగించి అసలు దోషులను గుర్తించవచ్చు. ఫోరెన్సిక్ సైన్స్‌లో అంతర్గతంగా ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మెడిసిన్, సైకాలజీ, స్టాటిస్టిక్స్... ఇలా పలు సబ్జెక్టులు ఉంటాయి. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఆ కేసునుబట్టి వివిధ విభాగాలకు చెందిన నిపుణులతో కలిసి పనిచేయాల్సి ఉంటుంది.



ప్రపంచవ్యాప్తంగా ఫోరెన్సిక్ సైన్స్‌లో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అందుకు తగ్గట్టుగానే మనదేశం సన్నద్ధమవుతోంది. కేవలం ఈ రంగంలో అధ్యయనం కోసమే 'గుజరాత్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ' ఏర్పాటైంది. మన దేశంలో ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులకు ఈ విశ్వవిద్యాలయాన్ని ముఖ్యమైన సంస్థగా చెప్పుకోవచ్చు. ఆడియో టేపుల్లో గొంతును విశ్లేషించడానికి ఫోరెన్సిక్ స్పీచ్ సైన్స్ ఉపయోగపడుతుంది. స్పెక్ట్రోగ్రామ్స్‌పై వాయిస్ శాంపిల్స్ ఉపయోగించి సులువుగానే ఆ గొంతు ఎవరిదో నిర్ధారిస్తారు. ఈ విభాగంలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్-మైసూరు సంస్థ ఫోరెన్సిక్ స్పీచ్ సైన్సెస్, ఫోరెన్సిక్ అకౌంటింగ్ కోర్సులు అందిస్తోంది. ఫోరెన్సిక్ అకౌంటింగ్ ద్వారా ఆర్థిక నేరగాళ్లను తెలుసుకోవడం, ఆర్థిక నేరాలను గుర్తించడం సాధ్యమవుతుంది.

కోర్సులు అందిస్తోన్న కొన్ని సంస్థలు

- గుజరాత్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రిమినాలజీ
- యూనివర్సిటీ ఆఫ్ దిల్లీ
- పంజాబ్ యూనివర్సిటీ
- యూనివర్సిటీ ఆఫ్ లఖ్‌నవూ
- ఉస్మానియా యూనివర్సిటీ
- బుందేల్‌ఖండ్ యూనివర్సిటీ
- అమిటీ యూనివర్సిటీ

కావాల్సిన స్కిల్స్

పాఠ్యాంశాల ద్వారా ఈ విభాగానికి సంబంధించిన సాంకేతిక నైపుణ్యాలను తెలుసుకోవచ్చు. అయితే వాస్తవ పరిస్థితిని నిశితంగా గమనించినప్పుడే ఏవైనా ఆధారాలు లభిస్తాయి. ఉన్న సమాచారాన్ని భిన్న కోణాల్లో విశ్లేషించడం, తర్కం, ఆప్టిట్యూడ్‌లతో మరింతగా రాణించవచ్చు. అకడమిక్ పరిజ్ఞానంతోపాటు సైన్స్‌కు చెందిన విభాగాల్లో అవగాహన ఉన్నవాళ్లు మరింత సమర్థంగా రాణించడం సులువవుతుంది. సునిశిత పరిశీలన, విశ్లేషణ సామర్థ్యం ఈ రెండూ ఎంతో ముఖ్యం. కొన్నిసార్లు ఇతర విభాగాలకు చెందిన నిపుణులతో కలిసి పనిచేయాల్సి వస్తుంది. కాబట్టి మంచి కమ్యూనికేటర్‌గా, బృంద సభ్యులుగా మెలగడం తప్పనిసరి. ముఖ్యంగా సైకాలజిస్టులు, స్టాటిస్టిక్ నిపుణులతో కలిసి పనిచేయాల్సి రావచ్చు. అప్పుడప్పుడు అవుట్‌డోర్ పని కూడా తప్పదు.

సైన్స్, మ్యాథ్స్ ఆసక్తి ఉందా!

సైన్స్ అంటే ఆసక్తి, గణితంలో ప్రావీణ్యం, సమాచారాన్ని విశ్లేషించగలగడం, లోతుగా ఆలోచించడం, వాస్తవానికి దగ్గరగా ఊహించడం, తర్కం, సునిశిత పరిశీలన ఉన్నవాళ్లు ఈ కోర్సుల్లో రాణించడానికి అవకాశాలు ఉన్నాయి.

హోదాలు

అభ్యర్థి చదువుకున్న కోర్సును బట్టి ఫోరెన్సిక్ పాథాలజిస్ట్, క్రైమ్ ల్యాబొరేటరీ అనలిస్ట్, ఫోరెన్సిక్ ఇంజినీర్, ఫోరెన్సిక్ ఆర్కిటెక్ట్స్, ఫోరెన్సిక్ వెటర్నరీ సర్జన్, వైల్డ్ లైఫ్ ఫోరెన్సిక్ స్పెషలిస్ట్, ఫోరెన్సిక్ సైకియాట్రిస్ట్, ఫోరెన్సిక్ టాక్సికాలజిస్ట్, ఫోరెన్సిక్ అడోంటాలజిస్ట్, ఫోరెన్సిక్ సెరోలజిస్ట్... తదితర హోదాల్లో ఫోరెన్సిక్ నిపుణులు బాధ్యతలు నిర్వర్తిస్తారు.

స్పెషలైజేషన్లు

పీజీలో ఫోరెన్సిక్ సైన్స్‌లో స్పెషలైజేషన్లు సైతం ఉన్నాయి. ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ సైన్స్‌తోపాటు ఎమ్మెస్సీ- డిజిటల్ ఫోరెన్సిక్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, ఎమ్మెస్సీ - హోం ల్యాండ్ సెక్యూరిటీ అండ్ యాంటీ టెర్రరిజం, ఫోరెన్సిక్ అకౌంటింగ్ స్పెషలైజేషన్‌తో ఎంబీఏ ఫైనాన్స్, ఎంటెక్ - సైబర్ సెక్యూరిటీ అండ్ ఇన్సిడెంట్ రెస్పాన్స్, పీజీ డిప్లొమాలో - ఫోరెన్సిక్ టాక్సికాలజీ, ఫోరెన్సిక్ డాక్యుమెంట్ ఎగ్జామినేషన్, ఫింగర్ ప్రింట్ సైన్స్, క్రిమినాలజీ, ఫోరెన్సిక్ మేనేజ్‌మెంట్, ఫోరెన్సిక్ అకౌంటింగ్, ఫోరెన్సిక్ అడోంటాలజీ, ఫోరెన్సిక్ నర్సింగ్... తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిని గుజరాత్ ఫోరెన్సిక్ యూనివర్సిటీతో పాటు పలు సంస్థల్లో బోధిస్తున్నారు. సైన్స్, ఫార్మసీ, ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు ఈ కోర్సుల్లో చేరవచ్చు.

అవకాశాలిక్కడ...

ప్రభుత్వ, ప్రైవేటు ఏజెన్సీలు, ఆసుపత్రులు, ల్యాబొరేటరీల్లో ఉద్యోగాలు లభిస్తాయి. ఎంచుకున్న స్పెషలైజేషన్‌పై అవకాశాలు ఆధారపడి ఉంటాయి. కొన్ని కార్పొరేట్ సంస్థలు ఫోరెన్సిక్ నిపుణులను డాక్యుమెంట్ రైటర్లుగా నియమించుకుంటున్నాయి. యాంటీ టెర్రరిస్ట్ ఆపరేషన్, మాస్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్, కన్స్యూమర్ ప్రొటెక్షన్ అండ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ తదితర విభాగాల్లో అవకాశాలు లభిస్తాయి. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ), ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ), పోలీస్ శాఖల్లో ఫోరెన్సిక్ ఉద్యోగాలు ఉంటాయి. ఫ్రీలాన్సర్‌గా రాణించడానికి రాష్ట్రానికి చెందిన ఫోరెన్సిక్ విభాగం నుంచి సర్టిఫికేషన్ తీసుకోవాలి. ఫోరెన్సిక్ టాక్సికాలజీ, ఫోరెన్సిక్ బయాలజీ, క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ విభాగాల్లో ఎక్కువ మంది ఉపాధి పొందుతున్నారు.

ఆతిథ్యరంగంలోకి తొలిఅడుగు!

ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలకు పర్యాటకరంగం ఒక పెద్ద ఆదాయ వనరుగా మారింది. మన దేశంలో జాతీయ, రాష్ట్ర స్థాయుల్లో కూడా పర్యటకం బాగా విస్తరిస్తోంది. దీంతో ఇందులో భాగమైన ఆతిథ్యరంగంలో నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ జాతీయ స్థాయిలో రాత పరీక్ష కోసం ఇటీవల ప్రకటన (ఎన్‌సీహెచ్ఎం -జేఈఈ 2018) వెలువరించింది. ఈ పరీక్ష రాయడానికి అర్హతలు, ఆయా సంస్థలు అందిస్తున్న కోర్సులు, ఉద్యోగావకాశాల గురించి తెలుసుకుందాం.

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్ఎం)లు ఆతిథ్య రంగంలో ఉత్తమ విద్యాబోధనకు పేరుపొందిన సంస్థలు. ఇవి కేంద్ర పర్యటకశాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నడుస్తున్నాయి. ఈ సంస్థలను నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ (ఎన్‌సీహెచ్ఎంసీటీ) పర్యవేక్షిస్తుంది. ఇవి మూడేళ్ల వ్యవధితో బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సును అందిస్తున్నాయి. జాతీయ స్థాయి ఉమ్మడి పరీక్ష ద్వారా 58 ఐహెచ్ఎంల్లో ప్రవేశం లభిస్తుంది. వీటిలో 21 జాతీయ సంస్థ (ఐహెచ్ఎం)లు, 22 రాష్ట్రీయ, 14 ప్రైవేట్ సంస్థలు, ఒక పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్ సంస్థ ఉన్నాయి. వీటిలో రెండు సంస్థలు హైదరాబాద్‌లో ఉన్నాయి. ఆతిథ్య రంగంలోకి అడుగుపెట్టాలంటే ఇంటర్ తరువాత మూడేళ్ల హోటల్ మేనేజ్‌మెంట్ డిగ్రీ కోర్సు పూర్తిచేయాలి.

ప్రవేశ పరీక్షలో 200 మార్కులకు 200 ప్రశ్నలు ఉంటాయి. వ్యవధి 3 గంటలు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటుంది. నెగెటివ్ మార్కింగ్ ఉంది. తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రం హైదరాబాద్‌లో ఉంది.

ఇంటర్ చదువుతున్నా కూడా!

కనీస విద్యార్హత ఇంటర్మీడియట్. ఇంగ్లిష్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు: జులై 1, 2018 నాటికి 22 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలైతే 25 ఏళ్లు.

ఎంపిక: ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: 11.04.2018

పరీక్ష తేదీ: 28.04.2018

https://applyadmission.net/nchmjee2018

ఏ ఉద్యోగాలు, ఎక్కడెక్కడ?

ఆతిథ్య రంగంలో ఉద్యోగావకాశాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. మొదట మేనేజ్‌మెంట్ ట్రెయినీ హోదాతో హోటళ్లు, రిసార్ట్‌ల్లో కెరియర్ ప్రారంభించవచ్చు. ఆసక్తి, ప్రావీణ్యాన్ని బట్టి కిచెన్ మేనేజ్‌మెంట్, హౌస్ కీపింగ్ మేనేజ్‌మెంట్, ఫ్లైట్ కిచెన్స్/ ఆన్‌బోర్డ్ ఫ్లైట్ సర్వీసెస్, వివిధ సేవా పరిశ్రమల్లో గెస్ట్/ కస్టమర్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్, ఫాస్ట్‌ఫుడ్ చెయిన్స్‌లో ఎగ్జిక్యూటివ్, క్యాటరింగ్ సంస్థలు, షిప్పుల్లో సప్లై, కిచెన్ సెక్షన్ ఉద్యోగాలు ఉన్నాయి. పర్యటక సంస్థలు, కేంద్రాల్లో వివిధ రకాల సేవలు, బహుళజాతి కంపెనీల క్యాంటీన్లు, హౌస్ కీపింగ్, హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలల్లో ఫ్యాకల్టీలుగా చేరవచ్చు. సొంతంగా ఫుడ్ చెయిన్‌లు కూడా ప్రారంభించుకోవచ్చు. చాలా సంస్థల్లో క్యాంపస్ నియామకాలు జరుగుతున్నాయి. ఆతిథ్య, సేవారంగాలకు చెందిన సంస్థలు/ కంపెనీల్లో హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు అవకాశాలు లభిస్తున్నాయి.



ఈ కోర్సులోకి ప్రవేశం కల్పిస్తున్న విద్యాసంస్థల చిరునామాలు, సీట్ల సంఖ్య, రాత పరీక్షలోని వివిధ విభాగాల నమూనా ప్రశ్నలను www.eenadupratibha.net లో చూడవచ్చు.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఐఐటీ వారణాసి

పోస్టు: జూనియర్ ఇంజినీర్
ఖాళీలు: 04 **అర్హత:** బీఈ/ బీటెక్/ డిప్లొమా
ఎంపిక: రాతపరీక్ష ద్వారా **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ **చివరితేదీ:** 15.01.2018
వెబ్‌సైట్: http://iitbhuonline.in/

సీఎస్ఐఆర్ - సీఎంఈఆర్ఐ

పోస్టు: సైంటిస్ట్/ సీనియర్ సైంటిస్ట్ **ఖాళీలు:** 15
అర్హత: బీఈ/ బీటెక్/ ఎంఈ/ ఎంటెక్/ పీహెచ్‌డీ.
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్
చివరితేదీ: 25.01.2018
వెబ్‌సైట్: http://cmeri.res.in/

ఎన్ఎండీసీ కిరండోల్

పోస్టు: మెయింటెనెన్స్ అసిస్టెంట్ తదితరాలు
ఖాళీలు: 101 **అర్హత:** పదోతరగతి/ ఐటీఐ/ డిప్లొమా/ బీఎస్సీ తదితరాలు **ఎంపిక:** రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్/ జాబ్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ద్వారా
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్
చివరితేదీ: 27.01.2018
వెబ్‌సైట్: www.nmdc.co.in

ద్రవిడ యూనివర్సిటీ, కుప్పం

పోస్టు: అసిస్టెంట్ ప్రొఫెసర్/ అసోసియేట్ ప్రొఫెసర్
ఖాళీలు: 13 **అర్హత:** పీజీ/ నెట్/ స్లెట్/ సెట్/ పీహెచ్‌డీ. **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్
చివరితేదీ: 01.02.2018
వెబ్‌సైట్: http://dravidianuniversity.ac.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

కియా మోటార్స్ ఇండియా ఎండీగా కుక్ హున్ షిమ్



ఈనాడు, అమరావతి: కియా మోటార్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, ముఖ్య కార్యనిర్వాహణాధికారిగా కుక్ హ్యున్ షిమ్ నియమితులయ్యారు. ఈ మేరకు కియా మోటార్స్ బుధవారం ప్రకటన విడుదల చేసింది. అనంతపురం జిల్లాలో కియా మోటార్స్ తన తయారీ కేంద్రాన్ని నిర్మిస్తోంది. భారత్‌లో కియా సంస్థ నిర్మిస్తున్న తొలి తయారీ కేంద్రమిదే. దేశంలో కియా మోటార్స్ విస్తరణతో పాటు నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం తయారీ కేంద్రం నిర్మాణం పూర్తయ్యేలా చూడటంలో షిమ్ ముఖ్య భూమిక పోషించనున్నారు. ఇక్కడ ఈ సంస్థ భవిష్యత్ అభివృద్ధికి 1.1 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనుంది. ప్రస్తుతం ఆయన జార్జియాలోని కియా మోటార్స్‌లో సమన్వయ బృందానికి నేతృత్వం వహిస్తున్నారు. కియా మోటార్స్ ప్రెసిడెంట్ హన్-వూ-పార్క్ మాట్లాడుతూ. 'కియా తయారుచేసే ప్రపంచ శ్రేణి కార్లకు భారత్‌లో భారీ డిమాండ్ ఉందని గుర్తించాం. షిమ్ నాయకత్వంలో మేం నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోగలమనే నమ్మకం ఉంది' అన్నారు.

మిడిల్ కొలాబ్ ప్రాజెక్టుతో మాకు నష్టం

గోదావరి బోర్డుకు తేల్చి చెప్పనున్న తెలుగు రాష్ట్రాలు

ఈనాడు, హైదరాబాద్: ఒడిశా ప్రభుత్వం ప్రతిపాదించిన మిడిల్ కొలాబ్ ప్రాజెక్టు వల్ల తమకు నష్టం వాటిల్లుతుందని తెలుగు రాష్ట్రాలు అభిప్రాయపడుతున్నాయి. గోదావరి నదీ యాజమాన్య మండలికీ, కేంద్ర జలవనరుల శాఖకు ఇదే విషయాన్ని స్పష్టం చేయనున్నట్లు తెలిసింది. ఒడిశాలోని కొలాబ్ నదిపై ఈ ప్రాజెక్టును చేపట్టాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై సమగ్ర ప్రాజెక్టు నివేదికను కేంద్ర జలసంఘానికి సమర్పించగా, ఆ సంఘం గోదావరి బోర్డును అభిప్రాయం కోరింది. నెల కిందట జరిగిన సమావేశంలో మిడిల్ కొలాబ్ ప్రాజెక్టు వివరాలను అందజేసిన బోర్డు... దానిని పరిశీలించి, అభిప్రాయం చెప్పాలని తెలుగు రాష్ట్రాలను కోరింది. అధికారికంగా 27 టీఎంసీలు వినియోగించుకొనేలా ఒడిశా ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టినా... ఇందుకు రెండింతల నీటిని వాడుకునే అవకాశం ఉందనీ, ఇంద్రావతిపైనా దీని ప్రభావం ఉంటుందని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు భావిస్తున్నట్లు తెలిసింది.

టీటీవీ దినకరన్‌కు షాక్ ఖాయం

భాజపా సీనియర్ నేత హెచ్.రాజా

ఈనాడు డిజిటల్, చెన్నై: ఆర్కేనగర్ ఉప ఎన్నికలో టీటీవీ దినకరన్ ఎలా గెలిచారో అందరికీ తెలుసని, ఆయనకు రెండు రోజుల్లో షాక్ తగులుతుందని భాజపా జాతీయ కార్యదర్శి హెచ్.రాజా వ్యాఖ్యానించారు. భాజపాపై తీవ్ర స్థాయిలో టీటీవీ దినకరన్ విమర్శలు చేస్తున్నారని, రెండు రోజుల్లో వెలువడే తాజా వార్త ఆయన నోటి నుంచే వింటే బాగుంటుందని పేర్కొన్నారు. బుధవారం హెచ్ రాజా ఈ సంచలన వాఖ్యలు చేయడంతో ఏం జరుగుతుందోననే ఆసక్తి సర్వత్రా నెలకొంది.

ప్రధానోపాధ్యాయుల సీనియారిటీ జాబితాల సేకరణ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న డిప్యూటీ డీఈవోలు, మండల విద్యాధికారుల పోస్టులకు ఇన్‌ఛార్జిలను నియమించేందుకు పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఇటీవల చిత్తూరులో సీనియారిటీ లేని ఉపాధ్యాయుడికి ఇన్‌ఛార్జి డిప్యూటీ డీఈవోగా నియమించారు. దీనిపై వివాదం ఏర్పడింది. ఉపాధ్యాయ సంఘాలు మంత్రి గంటా పేషీలో ఫిర్యాదులు చేయడం, కొందరు ఉపాధ్యాయులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి ఆయన్ని తప్పించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. శ్రీకాకుళం, కృష్ణా జిల్లాల్లోనూ కొందరు జూనియర్లకు డిప్యూటీ డీఈవో పోస్టులు ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో సీనియర్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారుల జాబితాలను ఉన్నతాధికారులు సేకరిస్తున్నారు.

పంచాయతీరాజ్‌లో మరో అదనపు కమిషనర్

ఈనాడు, అమరావతి: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు మరో అదనపు కమిషనర్ పోస్టుని మంజూరు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. కమిషనర్ కార్యాలయంలో ఇప్పటివరకు ఒక అదనపు కమిషనర్, మరో ఇద్దరు ఉప కమిషనర్‌లు ఉన్నారు. వీరంతా కమిషనర్‌కు అనుబంధంగా సేవలు అందిస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మరో అదనపు కమిషనర్ అవసరమన్న అధికారుల ప్రతిపాదనలపై సర్కారు స్పందించి ఈ నిర్ణయం తీసుకుంది

పర్యాటకాభివృద్ధి సంస్థ ఈడీ రిలీవ్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థలో కార్యనిర్వాహక సంచాలకుని (ఈడీ)గా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న బాలసుబ్రమణ్యం రెడ్డిని ఆ బాధ్యతల నుంచి ప్రభుత్వం రిలీవ్ చేసింది. పర్యాటకశాఖ కార్యదర్శి ముకేష్‌కుమార్ మీనా బుధవారం ఈ ఉత్తర్వులు జారీచేశారు. ఆయనకు ఇప్పటికే ఒకసారి డిప్యుటేషన్ పొడిగించారు. ఆ గడువు కూడా గత నవంబరు 11న ముగిసింది. అప్పటి నుంచి మరోసారి డిప్యుటేషన్ పొడగింపుపై చర్చ జరుగుతోంది. నవంబరులో కృష్ణా నదిలో పడవ ప్రమాదం చోటుచేసుకోవడంతో పలువురు అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. కృష్ణాలో పడవలకు అనుమతులు ఇచ్చే అంశం ఈడీ పరిధిలోనిదే. ఈ అనుమతుల మంజూరులో బాలసుబ్రమణ్యం రెడ్డి నిర్లిప్తత ప్రదర్శించారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. అలానే పున్నమి రిసార్ట్స్‌లో ఎగ్జిక్యూటివ్ సూట్‌ను గత కొంతకాలంగా ఈడీ వినియోగించుకుంటుండడంపైనా కథనాలు వచ్చాయి. వీటన్నింటి నేపథ్యంలో బాలసుబ్రమణ్యం రెడ్డిని పర్యాటకశాఖకు రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు జారీఅయ్యాయి.

'పచ్చని' ఆశలు ఆవిరి!

● హెచ్1బీ వీసాపై ఆరేళ్లు మాత్రం అమెరికాలో...● తాజా ప్రతిపాదనతో కలవరం

ఈనాడు - హైదరాబాద్

గ్రీన్‌కార్డుకు దరఖాస్తు చేశాం...అది పెండింగ్‌లో ఉన్నంత వరకు అమెరికాలో ఉండటానికి ఢోకా లేదన్న భారతీయుల ధీమాకు అమెరికా ప్రభుత్వ ప్రతిపాదన గండికొడుతుంది. ముఖ్యంగా హెచ్1బీ వీసాపై అక్కడ ఉంటున్న వారు ఐటీ ఉద్యోగులే...అందులోనూ దాదాపు 30-40 శాతం మంది తెలుగు వారే. ఇప్పటికే ఇక్కడి కొన్ని స్థిరపడిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను తాజా ప్రతిపాదన ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. గ్రీన్‌కార్డు రాకుంటే స్వదేశానికి తిరుగుటపా తప్పదన్న ఆందోళన వ్యక్తమవుతోంది. నిపుణులు మాత్రం ఇది కేవలం ప్రతిపాదనే కాబట్టి ఇప్పటికిప్పుడు వచ్చే ఇబ్బందేమీ లేదని, మన కెంత నష్టమో.. అమెరికాకూ అంతేనని, బిల్లు పాసైతే మాత్రం ప్రభావం తప్పదని విశ్లేషిస్తున్నారు.

స్వదేశంలో బీటెక్... అమెరికాలో ఎంఎస్...ఆ తర్వాత మూడేళ్లపాటు ఓపీటీ... శిక్షణలో ఉండగానే హెచ్1బీ వీసాకు దరఖాస్తు. మూడేళ్లపాటు హెచ్1బీ వస్తే...మరోమారు మూడేళ్లు పొడిగింపు. అదే సమయంలో పనిచేసే కంపెనీ ఆమోదంతో గ్రీన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవడం.... అది పెండింగ్‌లో ఉన్నంత కాలం హెచ్1బీ వీసా గడువును పొడిగించుకుంటూ ఉండటం... ప్రస్తుతం అమెరికాలోని ఎక్కువ మంది భారతీయ ఉద్యోగులు చేసే పని ఇది. తెలుగు రాష్ట్రాల యువతా ఇదే దిశగా తన కెరీర్‌ను మలుచుకుంటోంది. అమెరికాలో ఉద్యోగం చేసే భారతీయుల్లో 80 శాతం మంది ఐటీ వారే. నిపుణులు తాత్కాలిక ఉద్యోగం చేసుకునేందుకు ఏటా అమెరికా ప్రభుత్వం 85 వేల హెచ్1బీ వీసాలు మంజూరు చేస్తుంది. ఈ ప్రక్రియ ఏప్రిల్‌లో మొదలవుతోంది. ఆ వీసాల్లో 20 వేలను అమెరికాలో చదువుకున్న వారికి కేటాయిస్తారు. మిగతా వాటిని ప్రపంచ వ్యాప్తంగా నిపుణులకు ఇస్తారు. మొత్తం వీసాల్లో 70 శాతం భారతీయులకు దక్కుతున్నాయి. ఆరేళ్లపాటు హెచ్1బీ వీసాపై ఉంటూ...గ్రీన్‌కార్డుకు దరఖాస్తు చేసుకొని...అది తేలే వరకు అక్కడ ఉద్యోగం చేసుకుంటూ ఉంటున్నారు. అయితే వీసాల పొడిగింపులో హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం(డీహెచ్ఎస్) సవరణను ప్రతిపాదిస్తోంది.

భారత్‌తోపాటు అమెరికాకూ నష్టమే: నాస్కామ్

దిల్లీ: వీసాల జారీలో ఎలాంటి విధ్వంసకర మార్పులు తీసుకొచ్చినా భారత్‌తో పాటు అమెరికాకు కూడా భారీ నష్టం జరిగే ముప్పుందని నాస్కామ్ అధ్యక్షుడు ఆర్.చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు. 'ఇది భారత ఐటీ పరిశ్రమ సమస్యకాదు. హెచ్1బీ వీసాలపై వెళ్తున్న భారతీయులందరిపై ప్రభావం పడుతుంది. ఇప్పటికే అమెరికాను నిపుణుల కొరత వేధిస్తోంది. ఇలాంటి ప్రతిపాదనలతో భారత్, అమెరికా రెండు దేశాలకూ నష్టమే'అని ఆయన వ్యాఖ్యానించారు. 'ఒక వేళ నిజంగా భారత నిపుణుల్ని వెనక్కి పంపించేస్తే నేను స్వాగతం చెబుతాను. భారత్ అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న సమయంలో చేయి అందించేందుకు మీరు వస్తున్నారని చెబుతాను'అని మహీంద్ర గ్రూప్ అధిపతి ఆనంద్ మహీంద్ర వ్యాఖ్యానించారు.

ట్రంప్ నినాదానికి అనుగుణంగా వీసాల జారీలో విధాన, నియంత్రణా పరమైన మార్పులను తాము పరిశీలిస్తున్నట్లు అమెరికా పౌరసత్వం, వలసల సేవల సంస్థ (యూఎస్ఐఎస్) మీడియా సంబంధాల విభాగం అధిపతి జొనాథన్ విథింగ్టన్ కూడా తెలిపారు. ఆరేళ్ల లోపు గ్రీన్‌కార్డు రాకుంటే ఇక అమెరికాలో ఉద్యోగం చేయడానికి వీల్లేదు. ఈ ప్రతిపాదనే భారతీయ ఉద్యోగుల్లో కల్లోలం రేపుతోంది. గ్రీన్‌కార్డు దక్కితే అక్కడే స్థిరపడవచ్చు. కాకపోతే ఓటు హక్కు, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందటం కుదరదు. అవి కూడా దక్కాలంటే సిటిజన్‌షిప్ రావాలి.

అత్యధిక ప్రభావం మనవారిపైనే

దాదాపు రెండు లక్షల మంది భారతీయ విద్యార్థులు అమెరికాలో చదువుతున్నారు. వారిలో తెలుగు రాష్ట్రాల వారు 40 వేల నుంచి 50 వేల మంది ఉన్నారు. వారిలో చదువు పూర్తయిన తర్వాత స్వదేశానికి వచ్చేవారు కొద్దిమందే. అక్కడ ఐటీ ఉద్యోగుల్లోనూ తెలుగు వారు 30-40 శాతం మంది ఉంటారని అంచనా. తాజా ప్రతిపాదన అమల్లోకి వస్తే కనీసం 5 లక్షల మంది భారత్‌కు తిరిగి రాక తప్పదని అంచనా వేస్తున్నారు. గ్రీన్‌కార్డు దరఖాస్తు చేస్తే అది ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితి. ప్రస్తుతం 2007లోని దరఖాస్తులను పరిశీలిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ మీడియా సమన్వయకర్త సాగర్ దొడ్డపనేని తెలిపారు. సామాజిక భద్రత సంఖ్య(ఎస్ఎస్ఎన్) ద్వారా దరఖాస్తుదారుని ఆర్థిక కార్యకలాపాలు, క్రమశిక్షణ, కేసులు, జరిమానా చెల్లింపులు తదితర వాటిని పరిశీలించి గ్రీన్‌కార్డు ఇస్తారు. అయితే 2017 ఏప్రిల్లో తెరపైకి వచ్చిన పలు ప్రతిపాదనలు ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదని, తాజా ప్రతిపాదనపై అమెరికా అధ్యక్షుడు ఏం చేస్తాడన్నది ప్రశ్న.

ఇప్పటికిప్పుడు నష్టం లేదు



ప్రస్తుతం ఇది కూడా ఒక ప్రతిపాదనే. ముందుగా హౌస్ కమిటీలో...తర్వాత సెనెట్‌లో బిల్లు పాస్ కావాలి. తర్వాత అమెరికా అధ్యక్షుడు సంతకం చేయాలి. దీనికి ఎంత సమయం పడుతుందో చెప్పలేం. గతంలో చెప్పిన వాటిల్లో ఏ ఒక్కటీ ఇప్పటివరకు అమలు కాలేదు. ఒక వేళ అమలై..లక్షల మంది ఐటీ నిపుణులను వెనక్కి పంపితే అమెరికా ఎలా మనగలుగుతుంది? ఆ దేశ పౌరుల్లో ఐటీ పరిజ్ఞానం తక్కువ. అంతేకాకుండా ఆ దేశ ఆర్థిక వ్యవస్థపైనా తీవ్ర ప్రభావం పడుతుంది. అందువల్ల ఇప్పటికిప్పుడు వచ్చిన నష్టమేమీ లేదు. భవిష్యత్తులో మాత్రం కొంత ఇబ్బంది తప్పదు

–శుభాకర్, సంచాలకుడు, గ్లోబల్ ట్రీ కన్సల్టెన్సీ

వేచి చూసే సమయంలో ఉండటం కుదరదు



ప్రస్తుతం వేల మంది గ్రీన్‌కార్డుకు దరఖాస్తు చేసి... పెండింగ్‌లో ఉన్నా అక్కడ ఉద్యోగం చేస్తున్నారు. వారిలో భారతీయులు లక్షల సంఖ్యల్లోనే ఉన్నారు. తాజా సవరణ కార్యరూపంలోకి వస్తే అమెరికాలో ఆరేళ్ల కంటే హెచ్1బీపై ఉండటం కుదరదు. ఇది ఎక్కువగా భారత్, చైనాలపై ప్రభావం ఉంటుంది. పర్యవసానాలను ఎదుర్కోవడానికి మానసికంగా సిద్ధంగా ఉండాలి. కేంద్ర ప్రభుత్వం వీటిపై సంప్రదింపులు జరిపి భారతీయులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి.

– కన్నెగంటి రమేశ్, వ్యవస్థాపక కార్యనిర్వాహక సంచాలకుడు, సెంటర్ ఫర్ హ్యూమన్ సెక్యూరిటీ స్టడీస్



హెచ్1బీ వీసాల కోసం అందిన దరఖాస్తులు

ఆర్థిక సంవత్సరం	సంఖ్య
2018	1,99,000
2017	2,36,000
2016	2,33,000
2015	1,72,500
2014	1,24,000

(గమనిక: 2017 ఏప్రిల్లో 2018 ఆర్థిక సంవత్సరానికి దరఖాస్తులు స్వీకరించారు.)

ప్రైవేటు బస్సులకు అనుమతిపై ఇచ్చిన జీవోను సవాలుచేస్తే విచారిస్తాం

ఏపీఎస్ఆర్టీసీ ట్రేడ్ యూనియన్ నేతకు హైకోర్టు సూచన

ఈనాడు, హైదరాబాద్: అరుణాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో రిజిస్టరైన ప్రైవేటు బస్సులు ఆంధ్రప్రదేశ్‌లో తిరగడానికి అవకాశం కల్పించిన జీవోను సవాలు చేస్తూ పిటిషన్ దాఖలుచేస్తే విచారణ జరుపుతామని ఆర్టీసీ ట్రేడ్ యూనియన్ నాయకుడు వరహాల నాయుడుకు బుధవారం ఉమ్మడి హైకోర్టు సూచించింది. ప్రైవేటు బస్సుల యజమానులు ఎక్కువ మంది ప్రయాణికులు కూర్చోవడానికి వీలుగా పెద్ద బస్సులను తయారు చేసి అరుణాచల్‌ప్రదేశ్‌లో రిజిస్టర్ చేయించుకుంటున్నారంటూ ఏపీ ప్రభుత్వం వాటిని సీజ్ చేసింది. దీంతో బస్సుల యజమానులు హైకోర్టును ఆశ్రయించగా పన్ను మొత్తాన్ని ప్రత్యేకంగా డిపాజిట్ చేయించుకుని బస్సులు తిరగడానికి అనుమతించాలని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై ఏపీ ప్రభుత్వం అప్పీలు దాఖలు చేయగా... బుధవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జి.శ్యాంప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇందులో ప్రతివాదిగా ఉన్న ఆర్టీసీ సంఘ నేత తరఫు న్యాయవాది పీవీ పద్మనాభం వాదనలు వినిపిస్తూ... బస్సుల పొడవును పెంచడంవల్ల ప్రమాదాలకు కారణమవుతున్నాయని చెప్పారు. హైకోర్టు ఆదేశాలను అడ్డు పెట్టుకుని పన్ను డిపాజిట్ చేసి బస్సులను నడుపుకోవచ్చంటూ ప్రభుత్వం జీవో 67ను జారీ చేసిందని వివరించారు. వాదనలను విన్న ధర్మాసనం ఈ వ్యవహారంపై విచారించాలంటే జీవోను సవాలు చేయాల్సి ఉందని పేర్కొంది.

మౌజన్ హత్య కేసులో నిందితుడి అరెస్టు

● వేలిముద్రల సాయంతో పట్టివేత

● రూ. 1.30 లక్షల సొత్తు స్వాధీనం

రాజమహేంద్రవరం – న్యూస్‌టుడే

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం లాలాచెరువు వద్ద ఓ ప్రార్థనా మందిరంలో మౌజన్‌ను హత్యచేసిన కేసులో నిందితుడిని పోలీసులు బుధవారం అరెస్టు చూపించారు. అతడి నుంచి రూ.1.30 లక్షల విలువైన వెండి సామగ్రి, నగదును స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో అర్బన్ జిల్లా ఎస్పీ బి.రాజకుమారి ఈ కేసు వివరాలు వెల్లడించారు.

నిందితుడు ఆరుముగం మణిరత్నం గుంతకల్లులోని శ్రీలంక కాలనీలో ఉంటూ వ్యసనాలకు బానిసై డబ్బుల కోసం నేరాల బాటపట్టాడు. ఆరు కేసుల్లో ముద్దాయిగా ఉన్నాడు. ఇతడి భార్య, తల్లిదండ్రులు చనిపోవడంతో ఇటీవల రాజమహేంద్రవరంలోని తన అన్న ఇంటి వద్దకు వచ్చాడు. ఇతడి ప్రవర్తన నచ్చకపోవడంతో అన్న వెళ్లిపొమనడంతో గుంతకల్లు వెళ్లిపోయాడు. తిరిగి నవంబరు 22న రాజమహేంద్రవరానికి వచ్చి విద్యుత్తు కాలనీలో వినాయకుని గుడి వద్ద హుండీని పగులగొట్టి డబ్బులు చోరీ చేశాడు. ఆలయంలోని వెండి సామగ్రిని మూటగట్టి సమీపంలోని తోటలో పాతిపెట్టి తిరిగి వెళ్లిపోయాడు. దొంగిలించిన సొత్తు తీసుకెళ్లడానికి నిందితుడు మణిరత్నం డిసెంబరు 28న మరోసారి నగరానికి వచ్చాడు. లాలాచెరువు కూడలికి చేరుకుని అక్కడ మద్యం దుకాణంలో తాగి అనంతరం బత్తినవగర్‌లో నడుచుకుంటూ వెళ్తూ అక్కడ నిర్మాణంలో ఉన్న గృహం వద్ద కర్ర సేకరించాడు. సమీపంలో ప్రార్థనా మందిరం కనబడటంతో లోపల డబ్బులు ఉంటాయని భావించిన నిందితుడు గేటు దూకి లోపలికి ప్రవేశించాడు. అక్కడ నిద్రిస్తున్న మౌజన్ మహ్మద్ ఫరూక్ కదలడంతో కర్రతో విచక్షణారహితంగా దాడిచేశాడు. అతడి జేబులో తాళాలు తీసుకుని ప్రార్థనా మందిరం తెరిచి లోపల హుండీ పగలగొట్టి డబ్బులు దొంగిలించాడు. సాక్ష్యాలు మాయం చేసేందుకు లోపల పొగ పెట్టే ప్రయత్నం చేశాడు. అనంతరం రైల్వేస్టేషన్‌కు చేరుకుని దుస్తులు మార్చుకుని గుంతకల్లుకు వెళ్లిపోయాడు.





సమావేశంలో వివరాలు చెబుతున్న ఎస్పీ రాజకుమారి ■ నిందితుడు మణిరత్నం

వేలిముద్రలు సరిపోలడంతోనే..

నవంబరు 22న వినాయకుని ఆలయంలో జరిగిన దొంగతనం సమయంలో సేకరించిన వేలిముద్రలు, ప్రార్థనా మందిరంలో వేలిముద్రలు సరిపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా వేలిముద్రలతో సరిపోల్చుకుని నిందితుడిని గుర్తించామన్నారు. నిందితుడు మణిరత్నంను అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాల చిట్టా విప్పాడు. అతడు దాచిపెట్టిన వెండి సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సంక్రాంతికి సాంకేతిక అడ్డు!

చంద్రన్న కానుక పంపిణీలో ఆటంకాలు

ఈనాడు అమరావతి: సంక్రాంతి కానుకల పంపిణీకి సర్వర్ మోకాలడ్డుతోంది. రేషన్ దుకాణాల్లో ఇ-పాస్‌లకు అనుసంధానంగా ఉన్న సర్వర్ డౌన్ కావడంతో బుధవారం చంద్రన్న సంక్రాంతి కానుకలతోపాటు, ప్రతి నెలా ఇచ్చే సాధారణ రేషన్ కోటా (పీడీఎస్) బియ్యం పంపిణీకి అంతరాయం ఏర్పడింది. పీడీఎస్, చంద్రన్న సంక్రాంతి కానుకలకు వేర్వేరుగా కార్డుదారులు రెండు సార్లు ఇ-పాస్‌పై వేలిముద్ర వేసేలా సాఫ్ట్‌వేర్‌ను మార్చారు. దీంతో ఆ ప్రభావం సర్వర్‌పై పడుతోంది. ఇలా సాఫ్ట్‌వేర్‌ను మార్చేటపుడు ముందుగానే సర్వర్ సామర్థ్యం పెంపు విషయంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టకపోవడంతో సరకుల పంపిణీకి అంతరాయం కలిగే పరిస్థితి నెలకొంది. సర్వర్ సమస్య కారణంగా ఒక్కో కార్డు ప్రాసెస్ చేసేందుకు కనీసం అరగంట పడుతోందని డీలర్లు తెలిపారు.

రాజధాని నిర్మాణ పనుల గ్రావెల్ కోసం 768.53 ఎకరాలు


ఈనాడు అమరావతి: రాజధాని నిర్మాణ పనుల కోసం 768.53 ఎకరాలను సీఆర్‌డీఏకు అప్పగిస్తూ భూగర్భ గనులశాఖ బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. నిర్మాణపనులకు అవసరమైన గ్రావెల్ కోసం సీఆర్‌డీఏ నుంచి విజ్ఞప్తిని అనుసరించి గుంటూరు జిల్లా కర్లపూడి గ్రామంలో 768 ఎకరాలను కేటాయించినట్లు భూగర్భ గనుల శాఖ కార్యదర్శి బి.శ్రీధర్ జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆధార్ బాటపట్టిన కర్ణాటక ప్రభుత్వం

● ప్రతి పథకానికీ సంఖ్యతో అనుసంధానం

బెంగళూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్ని సేవలకూ ఆధార్‌ను జత చేసుకోవటాన్ని కర్ణాటక ప్రభుత్వం తప్పనిసరి చేసింది. బ్యాంకు, గ్యాస్ ఖాతాలకు ఆధార్ నంబరును జత చేయాలన్న నిబంధనలను కేంద్రం తప్పనిసరి చేయడాన్ని తొలినాళ్లలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా విమర్శించింది. ఆధార్ నంబరు అనుసంధానంతో కలిగే ప్రయోజనాలను అధ్యయనం చేశాక 'కర్ణాటక రాష్ట్ర ఆధార్ ఆర్థిక- ఇతర సహాయ ధనాల పంపిణీ, ప్రయోజనాలు, సేవల చట్టం-2017'కు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మంగళవారం రాత్రి విధానసౌధలో నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో ఈ చట్టానికి ఆమోదం తెలిపారు. కర్ణాటక జనాభా ఆరున్నర కోట్లు కాగా, వారిలో నాలుగు కోట్ల మంది వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా ఉన్నారు. 'అన్నభాగ్య' పథకం కింద ప్రతి ఒక్కరికీ నెలకు ఏడు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు. వీటితో పాటు స్వయం ఉపాధి పథకాలు, ఆశాదీప పథకం, షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను ప్రభుత్వం అందిస్తోంది. ఈ ఏడాది జరగనున్న శాసనసభ ఎన్నికల నేపథ్యంలో పేద, వెనుకబడిన కులాలు, మైనార్టీలకు ప్రభుత్వం వేర్వేరు పథకాలను ప్రకటించింది. ఆధార్‌ను ఆయా పథకాలకు అనుసంధానించడం ద్వారా అసలైన లబ్ధిదారులకు మేలు కలిగేలా చూడాలన్నది ప్రభుత్వ ఆలోచనని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి టి.బి.జయచంద్ర వివరించారు.

కర్ణాటక సంగీత విద్వాంసురాలు రాధా విశ్వనాథన్ కాలధర్మం



బెంగళూరు(శివాజీనగర), న్యూస్‌టుడే : సంగీత స్వర సామ్రాజ్ఞి రాధా విశ్వనాథన్ (83) మంగళవారం అర్ధరాత్రి 11.35 గంటలకు బెంగళూరులో మృతి చెందారు. ఎంఎస్ సుబ్బులక్ష్మి భర్త టి.సదాశివం మొదటి భార్య కుమార్తె రాధా విశ్వనాథన్. ఆమెను సుబ్బులక్ష్మే పెంచి పెద్ద చేశారు. దశాబ్దకాలంగా బెంగళూరులో ఉంటున్న రాధా కర్ణాటక సంగీత కళాకారిణిగా చక్కని గుర్తింపు తెచ్చుకున్నారు. ఈమె ఆలపించిన వెంకటేశ్వర సుప్రభాతం, విష్ణుసహస్ర నామం, భజ గోవిందం మంచి కీర్తి తెచ్చిపెట్టాయి. సుబ్బులక్ష్మితో కలిసి ఆమె పలు కచేరీల్లో పాల్గొన్నారు. 'మానసిక, శారీరక ఆరోగ్యంతో చివరి రోజులు గడిపిన ఆమె కొన్ని వారాలుగా న్యుమోనియాతో ఇబ్బంది పడ్డారు. మంగళవారం రాత్రి 11గంటల సమయంలో తన కుమార్తె గాయిత్రిని పిలిపించుకుని శ్రీమన్నారాయణ కీర్తనను పాడించుకున్నారు. అలా.. కొద్దిసేపు ఆమె సాంత్వన పొందుతూ కీర్తనలు ఆలకిస్తూనే కన్ను మూసింది' అని రాధా కుమారుడు వి.శ్రీనివాసన్ తెలిపారు. సంగీత కచేరీలను ఇవ్వటం నిలిపి వేసినా కొంతమంది విద్యార్థులకు ఆమె సంగీతంలో శిక్షణ ఇస్తూ శేషజీవితాన్ని గడిపేవారన్నారు. 'నాయనమ్మ నాకు 700 కీర్తనలను నేర్పారు. అవన్నీ కంఠోపాఠంగా నేర్చుకున్నా'నని మనవరాలు గాయిత్రి వివరించారు. రాధా విశ్వనాథన్‌కు వి.చంద్రశేఖర్, వి.శ్రీనివాసన్‌లు కుమారులు. సిక్కిల్ మాలా చంద్రశేఖర్, గీతా శ్రీనివాసన్ కోడళ్లు. బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఆమె అంత్యక్రియలు ముగిశాయి.

పోలీసుశాఖకు కేంద్రం నుంచి రావాల్సిన వాటిపై సమీక్ష

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కేంద్రం నుంచి ఏపీ పోలీసు శాఖకు ఏమేం రావాల్సి ఉందన్న దానిపై డీజీపీ డా.ఎం.మాలకొండయ్య బుధవారం సీనియర్ అధికారులతో సమీక్షించారు. ప్రధానంగా గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం, ఆపరేషన్ హబ్ నిర్మాణానికి అవసరమైన నిధులు రాబట్టడం, రాష్ట్రస్థాయి పోలీసు అకాడమీ నిర్మాణానికి చేయూత కోరడం తదితర అంశాలపై చర్చించారు. ఈ చట్టం ప్రకారం రావాల్సిన వాటన్నింటిపైనా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. త్వరలో వీటన్నింటిని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి సాధించాలని నిర్ణయించారు.

లైంగిక వేధింపుల నేపథ్యంలో సీఐ సస్పెన్షన్



ఈనాడు, విశాఖపట్నం: లైంగిక వేధింపుల ఆరోపణలపై విశాఖపట్నం మూడో పట్టణ సి.ఐ. బెండి వెంకటరావును సస్పెండ్ చేస్తూ విశాఖ సీపీ టి.యోగానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేసిన ప్రబుద్ధుడిపై సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న విశాఖ నగరానికి చెందిన యువతి మూడో పట్టణ పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. ఆ కేసు దర్యాప్తు పేరుతో సీఐ వెంకట్రావు తనతో అసభ్యంగా ప్రవర్తించారని ఆమె నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన అభ్యంతరకర ప్రవర్తనను నిరూపించే విధంగా బాధితురాలు పక్కా సాక్ష్యాలు సేకరించి నేరుగా కమిషనర్‌కు అందజేశారు. వాటిని పరిశీలించిన ఆయన సి.ఐ.ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

జయలలిత చికిత్స వివరాలివ్వండి

ఈనాడు డిజిటల్, చెన్నై: జయలలిత ఆసుపత్రిలో ఉన్న 75 రోజుల్లో అందిన వైద్యం, తదితర అన్ని వివరాలను ఈ నెల 12వ తేదీలోగా అందజేయాలని జయ మరణంపై దర్యాప్తు చేస్తున్న జస్టిస్ ఆర్ముగస్వామి కమిషన్ బుధవారం అపోలో ఆసుపత్రి యాజమాన్యాన్ని ఆదేశించింది. ఇటీవల విడుదలైన 'జయ ఆసుపత్రి వీడియో', ఇతర అంశాలకు సంబంధించిన రికార్డులను గడువులోగా సమర్పించాలని కోరింది. ఆసుపత్రి, అన్నాడీఎంకే ప్రముఖులు వివిధ సందర్భాల్లో చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వివరాలనూ అందజేయాలని కోరినట్లు సమాచారం.

విశాఖ ఉక్కులో 10 శాతం వాటా విక్రయించాం

● కేంద్ర మంత్రి విష్ణుదేవ్ సాయి

ఈనాడు, దిల్లీ: ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) 2012లో విశాఖ ఉక్కులో పెట్టుబడుల ఉపసంహరణ ప్రతిపాదనకు ఆమోదం తెలిపిందని, ఈ మేరకు రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్‌లో ప్రభుత్వ వాటాలో 10శాతం పబ్లిక్ ఇష్యూ ద్వారా ఉపసంహరించుకున్నామని కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి విష్ణుదేవ్ సాయి తెలిపారు. బుధవారం రాజ్యసభలో వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర సహాయ మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రతికూల మార్కెట్, ఉక్కు అమ్మకాల్లో క్షీణత, దేశీయ అంతర్జాతీయ మార్కెట్‌లో పెరిగిన బొగ్గు ధరలు, అంతర్జాతీయ ఉక్కు పరిశ్రమలో మాంద్యం తదితర కారణాలవల్ల 10 శాతం పెట్టుబడులు ఉపసంహరించుకున్నట్లు తెలిపారు.

ఆ ఎంపీలను సస్పెండు చేయండి

వైకాపా గుర్తుతో గెలిచి పార్టీ ఫిరాయించిన ఎంపీలను సస్పెండు చేయాలని లోక్‌సభ స్పీకరు సుమిత్రా మహాజన్‌కు వైకాపా ఎంపీ సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎస్పీవై రెడ్డి, కొత్తపల్లి గీత, బుట్టా రేణుకలు తెదేపాలోనూ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెరాసలోను చేరారని తెలిపారు. ఇటీవల రాజ్యసభలో ఇద్దరు సభ్యులను సస్పెండు చేసిన విషయాన్ని సుబ్బారెడ్డి గుర్తుచేశారు. మరోవైపు, ప్రకాశం జిల్లాలో రక్షణశాఖ భూముల్లో రక్షణ సంస్థలు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు వైకాపా ఎంపీ సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు.

జాతీయ క్యాన్సర్ సంస్థను ఏర్పాటు చేయండి: రాజమహేంద్రవరంలో జాతీయ క్యాన్సర్ సంస్థను ఏర్పాటు చేయాలని తెదేపా ఎంపీ మురళీ మోహన్ డిమాండు చేశారు. బుధవారం లోక్‌సభలో ఆయన ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఉభయగోదావరి జిల్లాల్లో క్యాన్సర్ సంబంధిత కేసులు అధికంగా ఉన్నాయన్నారు.

కేంద్ర చట్టానికి విరుద్ధంగా 'ఏపీ విద్యుత్ బిల్లు'

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఆమోదించిన ఏపీ ఎలక్ట్రిసిటీ డ్యూటీ బిల్లు-2015 కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందని హోంశాఖ సహాయమంత్రి హన్స్‌రాజ్ గంగారాం ఆహిర్ తెలిపారు. బుధవారం రాజ్యసభలో తెదేపా సభ్యుడు సీఎంరమేష్ అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. 'రాజ్యాంగంలోని 201 అధికరణం కింద రాష్ట్రపతి ఆమోదం కోసం ఆ బిల్లును 2016 జనవరి 21న ఏపీ గవర్నర్ పంపారు. సదరు బిల్లును కేంద్ర ప్రభుత్వంలోని సంబంధిత శాఖలు, విభాగాలకు పంపించాం. అందులోని కొన్ని విషయాలు కేంద్ర విద్యుత్తుచట్టం-2003లోని నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు విద్యుత్తు మంత్రిత్వశాఖ పేర్కొంది. అందువల్ల ఆ బిల్లును పునఃపరిశీలించాలని కోరాం. ఒకవేళ కేంద్ర ఇంధన మంత్రిత్వశాఖ చేసిన సూచనలకు స్థానం కల్పిస్తూ కొత్త బిల్లు తెచ్చినట్లయితే తమకు చెప్పాలని సూచించినట్లు' మంత్రి పేర్కొన్నారు.

ఏఎన్‌యూలో ఖాళీల భర్తీకి ప్రకటన

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సహాయాచార్యుల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. తొలి విడత నోటిఫికేషన్‌లు 60 సహాయాచార్యుల పోస్టులను భర్తీ చేయనున్నారు. గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ నెల 25లోపు దరఖాస్తులు పంపించాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేవాళ్లు ఈ నెల 30లోపు పంపించాలి. ఎక్కువగా ఆర్థికశాస్త్రం విభాగంలో 5 పోస్టులు, అత్యల్పంగా గ్రామీణ అభివృద్ధి, భౌతికశాస్త్రం, గణాంకాలు, యూఎస్ఐసీ విభాగాల్లో ఒక్కో సహాయాచార్యుడి పోస్టు భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులన్నీ రోస్టర్ పద్ధతుల్లో కేటాయించారు. ఎంపిక పరీక్షలను రెండు పేపర్లుగా విభజించారు. మొదటి పేపరుకు 120 మార్కులు, రెండో పేపరుకు 180 మార్కులుగా నిర్ణయించారు. మొదటి పేపరుకు 2గంటలు, రెండో పేపరుకు 3గంటలు సమయం నిర్ణయించారు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో ఉండనున్నాయి. తప్పు జవాబుకు 1/3 మార్కులు కోత విధించారు.

సెన్సెక్స్ ▼ 19	నిఫ్టీ ▲ 01	రూపాయి 63.53 ▼	బంగారం 29,585 ▲	వెండి 38,695 ▲	ముడి చమురు 67.58 ▲
33793	10443	(ఒక అమెరికా డాలరుకు) 05 పైసలు	(ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 45	ముంబయిలో కిలో రూ.లలో 20	(బ్రెంట్ ధర డాలర్లలో)

ఈనాడు బిజినెస్

ప్రధాన ప్రపంచ మార్కెట్లు


సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	24,901	+77
నాస్‌డాక్	7,064	+57
నిక్కీ 225 (జపాన్)	22,765	−19
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,464	+34
షాంఘై (చైనా)	3,370	+22
ఎఫ్‌టీఎస్‌ఈ (బ్రిటన్)	7,671	+23
డాక్స్ (జర్మనీ)	12,978	+107

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం			
అమెరికా డాలరు	62.60	70.83	థాయ్ బాట్/100	178.11	213.02
[illegible]	57.81	67.03	బహ్రెయిన్ దీనార్	156.56	179.41
పౌండ్ స్టెర్లింగ్	78.61	91.15	కువైట్ దీనార్	174.29	217.04
యూరో	69.63	80.76	సౌదీ రియాల్	15.37	18.22
జపాన్ యెన్/100	51.46	59.67	యూఏఈ దిర్హమ్	15.73	18.39
ఆస్ట్రేలియా డాలరు	45.14	52.25	మలేషియా రింగిట్	14.06	17.28



బుధవారం నిఫ్టీ కదలికలు



కొత్త ప్రాజెక్టులతో ఆర్ఐఎల్‌కు ఊతం

- నిర్వహణ ఆదాయం పెరుగుతుంది
- 2018-19లో పూర్తి స్థాయి ప్రయోజనాలు
- సీఎల్ఎస్ఏ నివేదిక

దిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు భారీ స్థాయిలో నగదు మద్దతు లభించే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 40 బిలియన్ డాలర్లకు పైగా విలువైన ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించనుండడం ఇందుకు నేపథ్యమని అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థ సీఎల్ఎస్ఏ పేర్కొంది. మూలధన వ్యయాలు తగ్గుతున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకోవడం కంపెనీకి కలిసొచ్చే విషయమని సీఎల్ఎస్ఏ భావిస్తోంది. తాజాగా ప్రారంభమైన రిఫైనరీ ఆఫ్-గ్యాస్ క్రాకర్(ఆర్ఓజీసీ), పెట్ కోక్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులు కంపెనీ పన్నుకు ముందు ఆదాయాల(ఎబిటా)ను పెరిగేలా చేయగలవని తన నివేదికలో వెల్లడించింది. డౌన్‌స్ట్రీమ్ విభాగంలో విస్తరణగా భావిస్తున్న జే3లో ఈ ఏడాది ప్రారంభం



కల్లా పూర్తి స్థాయి స్థిరీకరణ కనిపించగలదన్న అంచనాలున్నాయి. ఇది 2018-19 ఏడాదికి పూర్తి ప్రయోజనాన్ని అందించగలదు.

ఆ రెండూ కీలకం

ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్ఓజీసీ కాంప్లెక్స్ కార్యకలాపాలను రిలయన్స్ ఇండస్ట్రీస్ మంగళవారం ప్రారంభించిన సంగతి తెలిసిందే. బొగ్గు, కోక్‌లను గ్యాస్‌గా మార్చగలిగే పెట్‌కోక్ గ్యాసిఫికేషన్ ప్లాంట్ ప్రారంభం సైతం ముందస్తు దశలో ఉంది. ఈ రెండు ప్రాజెక్టుల వల్ల వచ్చే నగదు వల్ల కంపెనీ నిర్వహణ ఆదాయం పెరుగుతుందని సీఎల్ఎస్ఏ అంటోంది. అయితే పూర్తి స్థాయి ప్రయోజనాలు మాత్రం వచ్చే ఆర్థిక సంవత్సరంలోనే కనిపించనున్నాయని స్పష్టం చేసింది. 'ఈ రెండు ప్రాజెక్టుల వల్ల వార్షిక ప్రయోజనం గరిష్ఠంగా 2-2.5 బిలియన్ డాలర్ల మేర ఉన్నప్పటికీ.. మేం 1.8 బిలియన్ డాలర్లుగానే భావిస్తున్నాం. రానున్న 12-15 నెలల్లో చమురు-గ్యాస్ ఆదాయాలకు భారీ మద్దతునివ్వవచ్చు'ని ఆ సంస్థ అంచనా కట్టింది.

వచ్చే ఏడాది మార్చి కల్లా 10 కోట్ల జియో ఫోన్లు

'మార్చి 2019 కల్లా జియో 10 కోట్ల 4జీ ఫీచర్ ఫోన్లను విక్రయించగలదని మేం అంచనా వేస్తున్నాం. క్రమంగా 4జీ ఫీచర్ ఫోన్ల విక్రయాలను పెంచుకోవడం; గృహాలకు బ్రాడ్‌బ్యాండ్ సేవలందించడం, కంపెనీలకూ సేవలు అందించడం తదితరాల ద్వారా వినియోగదార్ల ద్వారా వచ్చే సగటు ఆదాయాన్ని జియో పెంచుకోవచ్చ'ని సీఎల్ఎస్ఏ అంటోంది.

సిమెంట్ రంగానికి 2018-19లో మంచిరోజులు!

2016-17 స్థాయిలోనే ప్రస్తుత గిరాకీ: ఇక్రా

ముంబయి: స్థిరాస్తి కార్యకలాపాలు నెమ్మదించడానికి తోడు ఇసుక కొరత వల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సిమెంటుకు గిరాకీ గత ఆర్థిక సంవత్సరం స్థాయిలోనే ఉంటుందని ఇక్రా పేర్కొంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మాత్రం గిరాకీ పెరిగి, పరిమాణంలో 5 శాతం వృద్ధి లభించొచ్చని అంచనా వేసింది. గిరాకీకి సంబంధించి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 1-2 శాతమే ఉండొచ్చని తెలిపింది. 'అందుబాటు ధర గృహాలు, గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం, రోడ్లు-సాగునీటి ప్రాజెక్టులు సహా మౌలిక సదుపాయాల అభివృద్ధి జరగనుంది కనుక 2018-19లో సిమెంటుకు గిరాకీ 4-5 శాతం పెరుగుతుంద'ని ఇక్రా తన నివేదికలో పేర్కొంది. ఇప్పటికే ఉత్పత్తి సామర్థ్యం అధికంగా ఉండటం, గిరాకీ అంతంతే కావడంతో, మధ్యకాలానికి ప్లాంట్ల వినియోగం 60-65 శాతాన్ని మించకపోవచ్చని పేర్కొంది. దక్షిణాదిలో కరవు పరిస్థితులకు తోడు, స్థిరాస్తి నియంత్రణ చట్టం, వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ), సేవాపన్ను వంటివి అమల్లోకి రానుండటం, ఇసుక కొరత వల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి 7 నెలలు సిమెంటుకు గిరాకీ నెమ్మదించిందని తెలిపింది.

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ ఇష్యూతో ఖజానాకు రూ.4000 కోట్లు

దిల్లీ: హిందుస్థాన్ ఏరోనాటిక్స్‌తో పాటు రైల్వే రంగానికి చెందిన రైట్స్, ఇర్కాన్ ఇంటర్నేషనల్, ఇండియన్ రైల్వే ఫైనాన్స్‌ల పబ్లిక్ ఇష్యూలు ఈ మార్చి కల్లా పూర్తయ్యే అవకాశం ఉంది. పబ్లిక్ ఇష్యూ నిమిత్తం గత సెప్టెంబరులోనే సెబీకి హిందుస్థాన్ ఏరోనాటిక్స్ దరఖాస్తు సమర్పించిందని ఓ అధికారి వెల్లడించారు. ఇక మూడు రైల్వే రంగ సంస్థలు ఈ నెలలోనే సెబీకి దరఖాస్తు సమర్పించే అవకాశం ఉందని పేర్కొన్నారు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.4000 కోట్లు సమీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే మూడు రైల్వే రంగ సంస్థల ఇష్యూల ద్వారా రూ.2000- 2500 కోట్లు రావొచ్చని ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, పెట్టుబడుల విభాగం భావిస్తోంది. ఇష్యూలో భాగంగా 10% వాటాకు సమానమైన 3.61 కోట్ల షేర్లను సంస్థ విక్రయించనుంది.

అన్ని టాటా ట్రక్కులకూ 6 ఏళ్ల వారెంటీ

ముంబయి: మధ్య, భారీ వాహన శ్రేణిలోని అన్ని వాణిజ్య ట్రక్కులకూ ఆరేళ్ల వారెంటీని ఇవ్వనున్నట్లు టాటా మోటార్స్ ప్రకటించింది. 'ట్రాక్టర్ ట్రయలర్లు, మల్టీ యాక్సెల్ ట్రక్కులు, టిప్పర్లతో కూడిన మొత్తం మధ్య, భారీ వాణిజ్య వాహనాలను ఆరేళ్ల ప్రామాణిక డ్రైవ్‌లైన్ వారెంటీని ఇచ్చిన తొలి వాహన కంపెనీ మాదేన'ని టాటా మోటార్స్ ఒక ప్రకటనలో వెల్లడించింది. డ్రైవ్‌లైన్ వారెంటీ అనేది అదనంగా ఇచ్చే వారెంటీ కాగా.. మొత్తం వాహనానికి వారెంటీని సైతం ప్రస్తుతమున్న 24 నెలల నుంచి 36 నెలలకు పెంచింది. ఆరేళ్ల వారెంటీ అనేది దేశవ్యాప్తంగా ఉన్న టాటా ట్రక్కులు, టిప్పర్లపై వర్తిస్తుందని. . ఒక వేళ ఆ వాహనాలను విక్రయిస్తే రెండో యజమానికి మిగిలిన సమయానికి వారెంటీ సైతం బదిలీ అవుతుందని తెలిపింది.

ఆంధ్రప్రదేశ్ నగరాల్లో బ్రాడ్‌బ్యాండ్ సేవల విస్తరణ: ఏసీటీ

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: విశాఖపట్నం, విజయవాడ, ఏలూరు, గుంటూరుల్లో తన ఇంటర్నెట్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను విస్తరిస్తున్నట్లు ఏట్రియా కన్వర్జెన్స్ టెక్నాలజీ (ఏసీటీ) ప్రకటించింది. ప్రస్తుతం ఈ నగరాల్లో తాము అందిస్తున్న సేవలను పొందుతున్న వినియోగదారులు అదనపు ఖర్చు లేకుండా- అధిక ఇంటర్నెట్ వేగాన్ని, ఎఫ్‌యూపీ పరిమితిని పెంచుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. సిల్వర్, గోల్డ్, డైమండ్, ప్లాటినం పేర్లతో ప్రణాళికలను వినియోగదారుల కోసం సిద్ధం చేశామన్నారు. చిన్న కార్యాలయాలు, హోమ్ ఆఫీస్‌లను నిర్వహించుకునే వారికి సోహో లైటెనింగ్, సోహో ఫోర్స్, సోహో ఇన్‌క్రెడిబుల్ ప్లాన్‌లను, చిన్న, మధ్యతరహా సంస్థలకు ఎస్.ఎం.ఇ. అల్ట్రా ఫాస్ట్, ఎస్.ఎం.ఇ. ఎక్సప్షనల్, ఎస్.ఎం.ఇ. ఫినామిల్ ప్లాన్‌లను సంస్థ అందిస్తోంది.

నేటి మార్కెట్

నేడు సూచీలు స్వల్ప శ్రేణిలో కదలాడొచ్చు. చెప్పుకోదగ్గ పరిణామాలు లేకపోవడం, మదుపర్ల లాభాల స్వీకరణకు మొగ్గుచూపడం ఇందుకు దోహదపడొచ్చని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాల సీజన్ ప్రారంభం కానుండటం, నెలాఖర్లో సాధారణ బడ్జెట్ వెలువడనుండటంతో మదుపర్లు తాజా కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించొచ్చని అంటున్నారు. జనవరి 11 నుంచి ప్రారంభం కానున్న ఫలితాల సీజన్ నుంచి సంకేతాలు అందిపుచ్చుకునే అవకాశం ఉంది. డిసెంబరులో జరిగిన అమెరికా ఫెడరల్ రిజర్వు ఒపెన్ మార్కెట్ కమిటీ సమావేశ నిర్ణయాలపై సైతం మదుపర్లు దృష్టి పెట్టొచ్చు. వచ్చే సాధారణ బడ్జెట్‌లో దీర్ఘకాలిక మూలధన లాభాల పన్నును మళ్లీ ప్రవేశపెట్టొచ్చన్న అంచనాలతో మదుపర్ల సెంటిమెంట్ స్తబ్దుగా ఉందని చెబుతున్నారు. వచ్చే కొన్ని సెషన్ల పాటు మార్కెట్ల స్థిరీకరణ కొనసాగొచ్చని విశ్లేషిస్తున్నారు. నేడు నిఫ్టీ 10400- 10500 పాయింట్ల శ్రేణిలో కదలాడొచ్చని సాంకేతిక విశ్లేషకులు భావిస్తున్నారు. 2018లో పరిశ్రమ సానుకూలంగా ఉండొచ్చని గోల్డ్‌మన్ శాక్స్ అభిప్రాయపడటంతో లోహ షేర్ల జోరు కొనసాగొచ్చు. షేర్ల బైబ్యాక్ నేపథ్యంలో యునికెమ్ ల్యాబ్స్ వెలుగులోకి రావొచ్చు.

మార్కెట్ కబుర్లు

- ప్రిఫరెన్షియల్ పద్ధతిలో ప్రభుత్వానికి ఈక్విటీ షేర్ల జారీ ద్వారా మూలధనం కింద రూ.1,375 కోట్లు పొందేందుకు **యూకో బ్యాంక్** డైరెక్టర్ల బోర్డు అనుమతినిచ్చింది.
- క్లిక్2షాప్ నుంచి రూ.1,632 కోట్ల నిధులను **ఫ్లిప్‌కార్ట్**కు చెందిన ఇకార్ట్ లాజిస్టిక్స్ సమీకరించింది. మూడు దశల్లో ఈ నిధులను పొందినట్లు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సమర్పించిన పత్రాల్లో కంపెనీ పేర్కొంది.
- గత నెలలో రూ.314.77 కోట్ల విలువైన కాంట్రాక్టులను పొందినట్లు **ఎన్‌బీసీసీ** తెలిపింది. మేఘాలయలోని భారత్- బంగ్లాదేశ్ సరిహద్దుకు, రహదారికి కంచె (ఫెన్సింగ్) నిర్మాణం నిమిత్తం వచ్చిన రూ.215.77 కోట్ల ఆర్డరు కూడా ఇందులో కలిసి ఉంది.

పియాజియో వాహనాలకు గ్రీవ్స్ కాటన్ కొత్త ఇంజిన్లు

- బీఎస్-4 ఉద్గార నిబంధనలకు అనుగుణంగా అభివృద్ధి

ముంబయి: బీఎస్-4 ఉద్గార నిబంధనలకు అనుగుణంగా పియాజియో వాహనాలకు సరికొత్త ఇంజిన్లను గ్రీవ్స్ కాటన్ తయారీ చేయనుంది. డీజిల్‌తో పాటు పర్యావరణహిత ఇంధనాలతో నడిచేవిధంగా వీటిని అభివృద్ధి చేయనుంది. ఇంజిన్ల తయారీ సరఫరా నిమిత్తం రెండు సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇటలీకి చెందిన పియాజియో ద్విచక్ర, త్రిచక్ర వాహనాలను తయారు చేస్తోంది. మరోవైపు డీజిల్ ఆధారిత త్రిచక్ర వాహనాల విపణిలో గ్రీవ్స్ కాటన్ 78 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉంది. గ్రీవ్స్ కాటన్‌తో పియాజియో ఇండియా భాగస్వామ్యం 1998-99 నుంచి ప్రారంభమైంది. అప్పటి నుంచి ఈ ఇటలీ సంస్థకు 50 లక్షలకు పైగా ఇంజిన్లను కంపెనీ విక్రయించింది. విభిన్న ఇంధన ఇంజిన్ల అవసరాలను తీర్చేవిధంగా కొత్త సాంకేతికతలు, సామర్థ్యం పెంపుపై అధిక పెట్టుబడులను కంపెనీ పెడుతోందని గ్రీవ్స్ కాటన్ మేనేజింగ్ డైరెక్టరు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి నగేశ్ బసవన్‌హళ్లీ తెలిపారు. అపోజ్డ్ పిస్టన్ సీఎన్‌జీ ఇంజిన్లను అందించేందుకు కాలిఫోర్నియాకు చెందిన పినాకల్ టెక్నాలజీతోనూ ఇటీవల కంపెనీ ఒప్పందం కుదుర్చుకుంది.

రెండో రోజూ అదే తీరు

- చివర్లో మళ్లీ అమ్మకాలు
- కొనసాగిన హెచ్చుతగ్గులు

సమీక్ష

రెండో రోజూ సూచీల ఒడుదొడుకులు కొనసాగాయి. మధ్యాహ్నం తర్వాత వాహన, ఐటీ, చమురు షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురుకావడంతో సూచీల ఆరంభ లాభాలు ఆవిరయ్యాయి. కార్పొరేట్ ఫలితాల సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మదుపర్లు ఆచితూచి అడుగేశారు. ఆసియా షేర్లు మెరుగ్గా ముగియగా, ఐరోపా మార్కెట్లు సైతం లాభాల్లో ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 33,929.61 పాయింట్ల వద్ద బలంగా ప్రారంభమైంది. అనంతరం అదే జోరు కొనసాగించిన సూచీ.. ఇంట్రాడేలో 33,998.37 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. అయితే మదుపర్ల లాభాల స్వీకరణతో ప్రారంభ లాభాలు కోల్పోయిన సూచీ నష్టాల్లోకి జారుకుంది. చివరకు 18.88 పాయింట్లు కోల్పోయి 33,793.38 పాయింట్ల వద్ద ముగిసింది. గత రెండు సెషన్లలో సూచీ 244.57 పాయింట్లు తగ్గిన విషయం తెలిసిందే. ఇక నిఫ్టీ 1 పాయింటు పెరిగి 10,443.20 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,429.55- 10,503.60 పాయింట్ల మధ్య కదలాడింది.

డాక్టర్ రెడ్డీస్ డీలా: వరుసగా నాలుగో రోజూ డాక్టర్ రెడ్డీస్ షేరు డీలా పడింది. కంపెనీ దువ్వాడ ప్లాంట్‌కు సంబంధించి ఈఐఆర్ లభించడంలో జాప్యం జరగొచ్చన్న వార్తలతో ఇంట్రాడేలో షేరు 4.51 శాతం నష్టపోయింది. చివరకు స్వల్పంగా కోలుకుని 2.97 శాతం నష్టంతో రూ.2,336.20 వద్ద ముగిసింది.

- ఎరువుల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. నాగార్జున ఫెర్టిలైజర్స్ అత్యధికంగా 19.91 శాతం లాభపడింది. ఆర్‌సీఎఫ్ 5.72 శాతం, గుజరాత్ స్టేట్ ఫెర్టిలైజర్స్ 2.49 శాతం, నేషనల్ ఫెర్టిలైజర్స్ 4.05 శాతం, జువారీ ఆగ్రో 2.46 శాతం, మంగళూర్ కెమికల్స్ 3.59 శాతం, చంబల్ ఫెర్టిలైజర్స్ 2.07 శాతం చొప్పున రాణించాయి.


సెన్సెక్స్ 30 షేర్లలో 15 లాభాలతో ముగిశాయి. అదానీ పోర్ట్స్ అత్యధికంగా 2.78% లాభపడింది. ఎల్ అండ్ టీ 2.17%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.88%, యెస్ బ్యాంక్ 1.33%, హిందుస్థాన్ యునిలీవర్ 0.80%, కోల్ ఇండియా 0.72%, పవర్‌గ్రిడ్ 0.62%లు రాణించిన వాటిలో ఉన్నాయి. డాక్టర్ రెడ్డీస్ (2.97%), విప్రో (2.73%), ఓఎన్‌జీసీ (1.65%), బజాజ్ ఆటో (1.42%), మారుతీ సుజుకీ (1.35%), టాటా మోటార్స్ (1.29%), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (1.07%), ఇన్ఫోసిస్ (1.01%)లు నష్టాలు చవిచూశాయి. రంగాల వారీ సూచీల్లో.. వాహన సూచీ 0.55% తగ్గింది. ఐటీ, చమురు- గ్యాస్, టెక్, ఆరోగ్య సంరక్షణ షేర్లు సైతం అదే బాటలో నడిచాయి.

అదానీ పోర్ట్స్



రూ.398.10 వద్ద ప్రారంభమై రూ.397.45- 410.90 మధ్య కదలాడి క్రితం ముగింపు రూ.397.40తో పోలిస్తే రూ.10.25 (2.58%) లాభంతో రూ.407.65 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 46,79,468.

డాక్టర్ రెడ్డీస్




రూ.2386.50 వద్ద మొదలై రూ.2292.10- 2386.50 మధ్య చలించి క్రితం ముగింపు రూ.2409.20తో పోలిస్తే రూ.70.20 (2.91%) నష్టంతో రూ.2339 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 8,86,002 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)			
జుబిలెంట్ ఫుడ్‌వర్క్స్	1857.00	బజాజ్ ఎలక్ట్రికల్స్	548.70
ఎల్ అండ్ టీ	1283.95	టెక్ మహీంద్రా	525.00
రేమండ్	1071.70	డాబర్ ఇండియా	360.90
టాటా ఎలెక్సీ	1006.00	హిందాల్కో	279.35
పవర్‌మెక్ ప్రాజెక్ట్స్	922.25	**52 వారాల కనిష్ఠం (రూ.లలో)**	
జెట్ ఎయిర్‌వేస్	874.90	బాంబే రేయాన్ ఫ్యాషన్స్	106.30

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు)			దేశీయ మదుపర్లు (డీఐఐలు)		
తేదీ	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
03/01	4,529	4,433	96	3,081	3,350	−269
02/01	3,162	2,640	523	3,230	3,166	65
01/01	770	444	326	2,499	3,800	−1,300
29/12	3,587	2,992	595	4,283	3,821	461
28/12	5,486	4,923	563	5,562	6,336	−774



3వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

కోడిగుడ్లు

హైదరాబాద్	383	వరంగల్	385
చిల్లరగా(ఒక గుడ్డు)	4.45	విశాఖపట్నం	390
బెంగళూరు	380	చెన్నై	395
4న		చిత్తూరు	388
విజయవాడ/గోదావరి	385	నమక్కల్	375

ఎన్ఎస్ఈ

బుధవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 407.65 (397.40) 4679468
AMBUJA CEMEN 272.60 (268.15) 1906004
ASIAN PAINTS 1141.90 (1142.75) 593809
AUROBIND PHA 665.55 (671.40) 1716552
AXIS BANK LT 560.45 (559.50) 3990149
BAJAJ AUTO L 3241.05 (3294.75) 372267
BAJAJ FINANC 1715.30 (1724.65) 416136
BHARTI AIRTE 518.20 (516.55) 5707905
BHARTI INFRA 378.65 (378.80) 2009516
BOSCH LTD 19692.95 (19721.75) 12104
BPCL 494.90 (499.80) 3870814
CIPLA 606.80 (607.80) 771828
COAL INDIA L 271.85 (270.05) 9240120
DR. REDDYS 2339.00 (2409.20) 886002
EICHER MOTOR 28814.35 (28670.15) 47088
GAIL 490.10 (494.35) 2205711
HCL TECH 897.30 (892.80) 1291953
HDFC 1700.80 (1703.25) 2133332
HDFC BANK 1852.65 (1872.35) 1132822
HERO MOTOCOR 3755.20 (3743.85) 274963
HINDALCO IND 276.50 (271.90) 7285874
HINDUSTAN UN 1350.35 (1338.60) 832810
HPCL 410.95 (406.40) 3006953
ICICI BANK 315.00 (309.70) 8898342
INDIABULLS H 1185.65 (1183.55) 704273
INDIAN OIL 386.30 (386.40) 2613904
INDUSINDBANK 1630.25 (1643.95) 1120860
INFOSYS LTD 1021.30 (1029.70) 3423276
ITC 261.15 (260.75) 11018996
KOTAK MAHIND 1000.10 (1003.20) 884021
LARSEN & TOU 1275.30 (1249.75) 2720736
LUPIN 878.95 (875.15) 3960088
M&M 754.90 (752.90) 2256643
MARUTI SUZIK 9416.60 (9554.05) 658281
NTPC LTD 177.05 (178.90) 10341665
ONGC 193.45 (196.85) 8032715
POWER GRID C 201.65 (200.75) 4605412
RELIANCE IND 914.80 (911.15) 6175312
SBI 302.85 (303.25) 13857373
SUN PHARMA 569.05 (572.15) 2182632
TATA CONSULT 2638.65 (2631.20) 628560
TATA MOTORS 433.90 (439.30) 9794953
TATA STEEL L 734.95 (729.30) 2634779
TECH MAHINDR 519.45 (513.95) 2288877
ULTRATECH 4301.95 (4252.30) 166916
UPL LIMITED 775.80 (773.45) 1914605
VEDANTA LIMI 332.50 (327.75) 8171980
WIPRO 309.95 (318.70) 2197677
YES BANK LTD 315.85 (311.65) 5672263
ZEE ENTERTAI 579.75 (578.15) 1207540

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1414.45 (1400.20) 57470
ACC 1774.60 (1743.20) 194666
ASHOK LEYLAN 124.50 (123.35) 22686568
AVENUE SUPER 1184.55 (1160.00) 580610
BAJAJ FINSER 5099.45 (5101.10) 119413
BANK OFBAROD 157.85 (157.95) 8271671
BEL 181.00 (181.65) 2795736
BHEL 98.55 (98.20) 13637110
BRITANNIA 4680.95 (4656.05) 83023
CADILA HEALT 428.50 (428.30) 472672
COLGATE PALM 1098.35 (1100.75) 351927
CONTAINER 1370.05 (1352.70) 125692
CUMMINS INDI 931.35 (922.30) 414585
DABUR INDIA 354.65 (349.05) 1819175
DLF LIMITED 258.30 (253.90) 7342607
EMAMI LIMITE 1321.95 (1310.25) 129344
GLAXOSMI CON 6414.35 (6464.50) 8055
GLAXOSMI PHA 2459.30 (2466.00) 16057
GLENMARK PHA 591.85 (592.80) 349314
GODREJ CONSU 986.40 (981.55) 293077
HAVELLS INDI 555.65 (549.25) 968648
HINDUSTAN ZI 312.00 (309.40) 882982
ICICI PRU LI 376.70 (375.20) 561656
IDEA CELLULR 102.70 (100.70) 10968592
INTERGLOBE A 1208.40 (1201.40) 402883
JSW STEEL LT 268.70 (264.55) 3279293
LIC HOUS.FIN 566.85 (562.75) 928381
MARICO LIMIT 320.85 (325.70) 1160639
MCDOWELL 3598.15 (3592.00) 195740
MOTHERSON 373.90 (378.80) 1303688
MRF 71173.35 (71246.10) 9083
NHPC LTD 32.70 (31.85) 12168282
NMDC LTD 149.25 (148.60) 9219947
OIL INDIA 376.90 (374.25) 753373
ORACLE FIN S 4163.05 (4000.25) 98373
P&G HYG&HEAL 9412.85 (9388.75) 6981
PETRONET LNG 253.60 (252.75) 1846460
PIDILITE IND 913.95 (889.20) 552174
PIRAMAL ENTE 2850.05 (2848.45) 75514
PNB 166.60 (166.40) 8534233
POWER FIN CO 123.75 (123.65) 3126273
RURAL ELEC C 157.85 (157.65) 2593130
SAIL 93.80 (91.85) 15846529
SHREE CEMENT 18099.55 (18000.35) 16576
SHRIRAM TRAN 1452.10 (1463.35) 497431
SIEMENS 1258.15 (1258.90) 138470
SUN TV LTD 1004.70 (995.20) 779309
TATA POWER 100.80 (99.70) 23056832
TITAN IND 856.30 (845.15) 2606556
TORRENT PHAR 1378.55 (1395.10) 120264

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 205.05 (205.45) 1399871
ADANI ENTERP 176.20 (163.90) 21268697
ADANI POWER 44.25 (43.35) 36109485
ALL BANK 72.20 (72.15) 1381266
AMARA RAJA 846.30 (829.70) 755541
ANANT RAJIND 71.35 (70.85) 1996959
ANDHRA BANK 57.30 (57.35) 1944803
APOLLO HOSPI 1176.50 (1191.95) 261936
APOLLO TYRES 269.95 (267.55) 1504749
APTECH 361.20 (362.25) 268217
BAJAJ ELECT. 533.45 (489.80) 1599056
BAJAJ HIND 17.40 (17.90) 13371821
BAJAJ HOLDIN 2843.55 (2839.80) 4207
BALAJI TELE 153.95 (152.65) 95070
BALLARPUR IN 18.85 (18.35) 5998560
BALRAMPUR CH 137.25 (135.55) 2104490
BANK OF MAHA 23.05 (22.95) 739321
BANK OFINDIA 168.35 (167.30) 2542967
BATA INDIA 772.40 (753.90) 1333787
BGR ENERGY S 138.90 (138.70) 113441
BHARAT FORGE 733.10 (728.05) 1073961
BHUSHAN STEE 67.30 (67.30) 1651903
BIOCON LTD 541.85 (541.70) 1038802
BOMBAY DYE 279.50 (280.60) 2065149
CANARA BANK 352.80 (352.05) 1386224
CEAT LIMITED 1945.55 (1919.65) 344906
CENTRAL BANK 75.90 (74.95) 1984589
CHAMBAL FERT 160.20 (157.65) 1537454
CHENNAI PETR 426.15 (430.05) 335065
CITY UNIBANK 178.40 (177.35) 382064
CORPO BANK 40.15 (39.65) 215788
COX & KINGS 268.10 (276.80) 186789
D B REALTY L 67.85 (70.00) 3838377
DELTA CORP L 300.80 (298.80) 1362726
DENA BANK 25.40 (25.40) 1342446
DHANALAKBANK 29.60 (29.90) 381724
DIVIS LAB 1099.40 (1080.90) 768114
EDELWEISS CA 282.45 (285.50) 1458966
EID PARRY 382.55 (380.80) 85790
EIH 149.20 (146.40) 184049
ESSAR SHIPPI 31.65 (30.55) 367843
ESTER INDUST 62.40 (63.75) 243500
EXIDE INDUST 223.35 (221.70) 2078634
FEDERAL BANK 107.70 (107.60) 2894282
FINOLEX CABL 689.05 (688.10) 25878
G E SHIP LTD 404.90 (401.05) 94826
GAMMON INFRA 3.70 (3.70) 10384131
GATI LIMITED 135.70 (133.45) 921597
GAYATRI PROJ 227.45 (226.65) 161521
GITANJALIGEM 75.25 (72.60) 5787426
GMR INFRASTR 21.80 (21.65) 46683517
GODREJ IND 607.80 (601.70) 234920
GRASIM IND 1127.20 (1139.55) 667578
GUJ ALK&CHEM 743.45 (739.05) 85206
GUJ NRE COKE 1.65 (1.80) 11122212
HCL INFOSYS 59.65 (59.00) 5119493
HDFC BANK 1880.00 (1886.00) 313995
HEXA TECH 350.40 (341.10) 1735291
HIMACHAL FUT 33.30 (32.15) 19032192
HINDU MOTORS 9.60 (9.65) 420425
HOUSING DEV 62.65 (61.85) 15472607
IDBI 59.50 (59.40) 1775812
IDFC 61.70 (61.60) 3375751
IFCI 29.25 (28.70) 20007093
IL&FS TRANS 93.05 (81.55) 6687838
IND SWIFTLAB 77.80 (78.85) 203159
INDBULLS REL 216.00 (215.50) 4382554
INDIA CEM 186.40 (180.10) 4763679
INDIAN BANK 373.20 (375.55) 813917
INDO RAMA SY 45.60 (42.45) 555254
INDRAPRASTHA 332.75 (335.20) 1295368
INGERSOLL-R 859.50 (854.50) 42661
IOB 22.50 (22.35) 1002936
IPCA LAB 584.70 (587.55) 421258
IRB INFRA DE 236.10 (228.95) 2128151
J&K BANK 82.05 (81.55) 524631
JAI CORP 207.15 (204.55) 6889823
JAIN IRRIGAT 128.75 (128.70) 4724195
JAYPEE INFRA 23.15 (22.55) 5646775
JET AIRWAYS 870.60 (831.40) 4889426
JINDAL SAW 150.15 (142.45) 5194896
JINDAL STEEL 219.55 (203.40) 21696089
JK LAKSHMI C 441.90 (440.80) 32446
JK PAPER LIM 145.45 (136.90) 2756076
JM FINANCIAL 155.05 (156.05) 727129
JP ASSOCIATS 24.25 (23.90) 98155395
JSW ENERGY L 90.30 (89.85) 5812909
JUBILANT FOO 1850.55 (1792.35) 1275474
JUBILANT ORG 763.05 (756.65) 184921
JYOTHY LABS 379.05 (379.55) 309765

ఘనం (+)

నిఫ్టీ	3న	మార్పు %
ADANI PORT	407.65	2.58
L & T	1275.30	2.04
ICICI BANK	315.00	1.71
HINDALCO	276.50	1.69
AMBUJA CEM	272.60	1.66
VEDANTA	332.50	1.45
YES BANK	315.85	1.35

గ్రహణం (-)

నిఫ్టీ	3న	మార్పు %
DR. REDDYS LAB	2339.00	-2.91
WIPRO	309.95	-2.75
ONGC	193.45	-1.73
BAJAJ AUTO	3241.05	-1.63
MARUTI SUZUKI	9416.60	-1.44
TATA MOTORS	433.90	-1.23
HDFC BANK	1852.65	-1.05

JYOTI STRUC 14.30 (14.05) 3058391
KARNATA BANK 153.15 (153.85) 1405256
KEC INTL LTD 372.80 (381.40) 499822
KOLTE PATIL 357.45 (358.55) 219218
KPIT CUMMINS 198.60 (190.15) 4054972
L&TFIN.HOLD 170.05 (170.75) 3621694
LAK VIL BANK 148.55 (149.85) 522995
M & M FINANC 464.60 (462.80) 688247
MANAPPURAM G 119.40 (119.25) 5974354
MMTC LIMITED 71.50 (71.05) 3309857
MOSER-BEAR 5.30 (5.25) 673494
MPHASIS LTD 720.05 (734.65) 58527
MRPL 126.35 (125.35) 1351955
MTNL 29.75 (30.25) 9326728
NAGARJUNA OI 4.75 (4.20) 4710773
NCC LIMITED 130.05 (130.45) 4593780
NETWORK18 FI 58.85 (58.95) 1132059
NEULAND LAB 873.70 (876.40) 27633
NIIT LTD 108.65 (100.15) 3576131
NIIT TECHNOL 645.95 (642.55) 310252
OMAXE LTD 228.85 (228.55) 672267
ONMOBILE GLO 63.35 (62.75) 2692139
ORIENT PAPER 158.20 (159.35) 966854
ORIENTALBANK 119.70 (120.00) 1315928
PARSVNATH DE 30.55 (29.30) 272264
PATEL ENGG 78.60 (76.40) 3539433
PFIZER 2017.15 (2049.50) 45745
POLARIS SOFT 386.30 (387.10) 75216
POWERTRADING 118.80 (119.25) 1279869
PRAJ IND 109.25 (109.00) 838419
PRISM CEMENT 115.70 (115.35) 230521
PUNJ LLOYD 26.50 (26.60) 6789068
PUNJAB & SIN 49.60 (48.30) 317716
PURAVANKARA 166.15 (160.85) 585771
PVP VENTURES 8.00 (8.15) 500015
PVR LIMITED 1401.80 (1402.80) 143604
RADICO KHAIT 297.80 (292.15) 1477942
RAJESH EXPOR 809.75 (816.25) 1124425
RALLIS INDIA 269.55 (265.35) 814998
RAMCO IND 290.45 (283.90) 116730
RAMCO SYS 562.35 (559.85) 85591
RAMKY INFRA 221.85 (221.00) 186311
RAYMOND 1055.90 (1045.80) 406824
RELIANCE CAP 599.80 (596.75) 6894223
RELIANCE COM 30.55 (32.40) 233379852
RELIANCE INF 562.55 (563.40) 3690364
RELIANCE POW 56.95 (56.85) 54258958
ROLTA INDIA 70.80 (71.20) 7155838
SAGAR CEMENT 1002.65 (909.50) 203066
SAREGAMA 853.40 (792.80) 385768
SHANTHI GEAR 160.00 (162.25) 167435
SHIPPNG CORP 96.05 (93.80) 2372906
SHREE RENUKA 16.85 (17.05) 3722046
SINTEX IND 26.65 (26.65) 4787668
SOBHA DEVELO 603.25 (589.55) 479584
SOUTHINDBANK 31.15 (31.15) 6245319
SRS LIMITED 1.65 (1.65) 5567480
STERLITE TEC 303.60 (290.70) 2285278
SUN PHARMA 500.30 (490.95) 356522
SUND FASTNER 573.65 (574.70) 72372
SUZLON ENERG 15.75 (15.85) 33251247
SYND. BANK 79.40 (78.65) 2239604
TATA CHEM 755.90 (730.10) 3451560
TATA COFFEE 165.70 (165.00) 519006
TATA COMMUN 668.65 (670.75) 430050
TATA GLOBAL 311.20 (311.15) 2073353
TATA METALIK 860.55 (872.65) 137447
TATA MOT DVR 255.15 (253.10) 3644585
THE INDIAN H 121.35 (118.50) 1708368
TORRENT POWE 278.25 (277.85) 895484
TRIVENI ENGG 78.25 (78.05) 343039
TTK PRESTIGE 7748.35 (7770.65) 4371
TV TODAY NET 430.05 (428.50) 65531
TV18 BROADCA 60.50 (59.95) 7653850
TVS MOTOR 769.85 (774.85) 663896
UCO BANK 30.40 (30.30) 1272634
UNION BANK 143.15 (141.95) 2243525
UNITECH 10.55 (10.70) 90775127
UNITED BANK 18.00 (18.00) 732120
UNITED BREWE 1077.55 (1030.70) 540133
USHA MARTIN 23.65 (23.60) 801757
VADILAL INDU 970.55 (970.05) 7629
VENKYS 2751.90 (2785.10) 28333
V-GUARD IND 235.40 (236.65) 639889
VIJAYA BANK 66.80 (68.15) 1978777
VIP 344.60 (347.15) 269677
VOLTAS 643.60 (647.40) 798896
ZEE LEARN LI 45.85 (44.05) 1252064
ZUARI GLOBAL 250.00 (244.95) 191393
ZYDUS WELLNE 1022.00 (1017.35) 3265

ALPHAGEO 910.50 (906.40) 3489
AMAR RAJA BA 846.10 (829.50) 48173
ANDHRA BANK 57.35 (57.35) 127354
ANDHRA CEMEN 13.75 (13.67) 85346
ANDHRA PAPER 332 (317.95) 45147
ANDHRA PETRO 58.30 (60.95) 132898
ANDHRA SUGAR 522.80 (523.15) 2040
ASTRA MICROW 120.90 (118.25) 117676
AUROBINDO PH 666.50 (671.85) 129509
AVANTEL SOFT 484.85 (467.45) 19598
AVANTI FEEDS 2563.25 (2587.50) 7190
AVON ORG 16.48 (15.70) 9770
BALAJI AMIN 623.60 (622.55) 8163
BARTRONICS 15.17 (15.06) 21400
BHAGIRA CHEM 314.75 (323.65) 4243
BHAGYA NAG 51.15 (51.25) 46930
BN RATHI SEC 55.10 (53.75) 16415
BRILLIANT SE 12.21 (11.63) 31809
CONT COFFEE 298.65 (298.85) 4176
COROMAN FERT 568.70 (542) 27798
CYBERMATE 3.49 (3.50) 121240
CYIENT LIMIT 576.65 (573.25) 3952
DIVI'S LAB 1098.20 (1079.20) 56760
DIVYA GRANIT 101.10 (104.90) 1133
DR REDDY 2336.20 (2407.70) 76717
GATI CORPN 135.40 (133.25) 255894
GAYATRI PROJ 228.10 (227.25) 17021
GMR INFRASTR 21.80 (21.65) 4410096
GOLDST INFRA 199.70 (201.85) 17069
GRANULES (I) 134.75 (134.30) 74832

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

GVK POWER 19.25 (18.60) 1031330
HBL NIFE POW 73.05 (73.05) 180596
IDL INDUSTRS 605.85 (577.30) 3793
ILFS ENGINEE 56.45 (53.80) 17979
INNAREDY COM 4.67 (4.25) 356039
IVRCL INFRAS 6.85 (7.33) 1777422
KAKATIYA CEM 395.60 (396.30) 11560
KAVERI SEED 536.35 (539.30) 74727
KCP LTD 147.20 (143.85) 77579
KNR CONSTRUC 312.95 (308.85) 7969
LANCO INDUS 405.20 (391.95) 45153
LANCO INFRAT 1.55 (1.48) 4167009
LAURUS LABS 536.70 (534.70) 11913
LOKESH MACH 77.65 (71.95) 171514
MADHUCON PRO 35.70 (35.80) 63142
MEGA SOFT 16.82 (16.02) 37197
MIC ELECTRON 9.47 (9.42) 78571
MOLDTK PLA 325.35 (321.15) 4941
NAGARJAGRICH 62.20 (59.65) 214597
NATCO PHARMA 973.75 (967.60) 21616
NAVA BH VENT 163 (153.65) 660401
NCC 130 (130.45) 526779
NCL IND 265.70 (251.30) 20494
NEHA INTER 10.25 (9.94) 109263
NETTLINX 81.85 (80.70) 60077
NEULAND LAB 875.05 (886.35) 2669
NIHAR INFO 14.30 (14.80) 3541
OIL COUNTRY 64.20 (54.75) 261243
PANYAM CEMEN 62.30 (60.70) 26408
PENNER IND 67.55 (67.20) 74772
PITTI LAMIN 104.95 (102) 33644
POKARNA 220.90 (218.80) 9844
PRAJAY ENGS 15.97 (15.21) 48160
PREMIER EXPL 431.80 (430.25) 2994
PRISM CEMENT 115.40 (115.50) 22691
PRUDENTL PHA 6.10 (6.15) 324241
RAIN INDUSTR 438.95 (400.05) 2421212
SAGAR CEM 1011 (912.75) 33360
SAMKRG PIST 346.45 (347.60) 12526
SAMPRE NUTRI 90.40 (95.15) 51468
SATVAH. ISPA 34.20 (33.85) 23761
SMS PHARMA 102 (101.90) 8430
SREE RAYAL A 79.75 (72.95) 1097893
STEEL EXCHAN 48.65 (46.35) 195689
SUJANA TOWER 4.90 (4.84) 15861
SUJANA UNIVE 0.90 (0.88) 110211
SUVEN PHARMA 202.30 (202.40) 26937
TAJ GVK HOTE 178.20 (178.30) 4247
TANLA 40.70 (38.55) 268198
TERA SOFTWAR 70 (70.90) 6560
VICEROY HOTE 20.45 (18.30) 832621
VIMTA LABS 170.45 (167.75) 8515
VISAKA IND 662.05 (647.75) 7668
VISTA PHARMA 41.50 (40.65) 26659
VIVIMED LABS 104.35 (105) 150411
YBRANT DIGIT 5.98 (6.13) 2587807
ZENTECH 149.15 (147.95) 99678

మారుతీ చిన్న కార్ల మోడళ్లపై రూ.30000 వరకు తగ్గింపు!

దిల్లీ: జనవరిలో చిన్న కార్లు సహా కొన్ని మోడళ్లపై రూ.30,000 వరకు నగదు తగ్గింపును మారుతీ సుజుకీ అందిస్తోంది. మరోవైపు ఈ నెల నుంచి ధరలు పెంచుతున్నట్లు కంపెనీ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఇప్పటివరకు కొత్త రేట్లను అమల్లోకి తేలేదు. కోజెన్సిస్ వార్తా సంస్థకు సంబంధిత వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం ఆల్టో 800 మినీ కారుపై రూ.25,000, ఆల్టో కే10పై రూ.22,000, వ్యాగన్ ఆర్‌పై రూ.35,000 వరకు ధరల్లో తగ్గింపును మారుతీ అందిస్తోంది. అమ్మకాలను పెంచుకునేందుకు డిసెంబరులో కూడా వ్యాగన్ ఆర్, ఆల్టో ధరలను రూ.35,000 వరకు కంపెనీ తగ్గించిన సంగతి తెలిసిందే. ఈ ప్రభావం వల్లేనేమో డిసెంబరులో చిన్న కార్ల అమ్మకాలు 2 శాతం పెరిగాయి. నవంబరులో వీటి అమ్మకాలు 1.8 శాతం తగ్గాయి. సెడాన్ సియాజ్ ధరలోనూ రూ.30,000 వరకు తగ్గింపును ఇస్తోంది. ఈ కారు అమ్మకాలు డిసెంబరులో 36 శాతం వరకు తగ్గడం గమనార్హం. ఇక ఇగ్నిస్‌పై రూ.30000 వరకు, ఎర్టిగా, సూపర్ క్యారీపై రూ.20,000 వరకు డిస్కౌంట్‌ను అందిస్తోంది.



భారత్ బయో టీకాకు డబ్ల్యూహెచ్ఓ గుర్తింపు

- 128 దేశాల్లో విక్రయించే అవకాశం
- టైఫాయిడ్ నియంత్రణలో కీలక మలుపు!

ఈనాడు – హైదరాబాద్

అంతర్జాతీయ ప్రమాణాల స్థాయిలో టీకాలను అభివృద్ధి చేయగల సత్తా భారత్‌కు ఉందని భారత్ బయోటెక్ నిరూపించింది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థ ప్రపంచంలోనే తొలిసారిగా అభివృద్ధి చేసిన టైఫాయిడ్ కాంజుగేట్ వ్యాక్సిన్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) గుర్తింపు (ప్రి-క్వాలిఫికేషన్) లభించింది. కంపెనీ నిర్వహించిన వైద్య పరీక్షలు, అధ్యయనాలను పరిశీలించిన అనంతరం 'టైప్‌బార్ టీసీవీ' టీకాకు డబ్ల్యూహెచ్ఓ ప్రి-క్వాలిఫికేషన్ గుర్తింపు ఇచ్చిందని భారత్ బయోటెక్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) కృష్ణ ఎల్లా తెలిపారు. 'టైప్‌బార్ టీసీవీ'ని మూడేళ్లుగా భారత్‌తోపాటు నాలుగైదు దేశాల్లో భారత్ బయోటెక్ సాధారణ విపణిలో విక్రయిస్తోంది. దాదాపు 14 ఏళ్లు కష్టపడి, రూ.150 కోట్ల నిధులు వెచ్చించి ఈ వ్యాక్సిన్‌ను సంస్థ అభివృద్ధి చేసింది. దేశంలో మొదటి పది ఔషధ బ్రాండ్‌లలో 'టైప్‌బార్ టీసీవీ' ఒకటి. టైఫాయిడ్ విస్తృతంగా ఉన్న దేశాల్లో వ్యాక్సినేషన్‌కు యునిసెఫ్, గ్లోబల్ అలయన్స్ ఫర్ వ్యాక్సిన్స్ ఇనీషియేటివ్ (గవి) వంటి సంస్థలు తమ పథకాల కింద టైప్‌బార్ టీసీవీ టీకాను కొనుగోలు చేసి సరఫరా చేయడానికి డబ్ల్యూహెచ్ఓ గుర్తింపు దోహదం చేస్తుందని కృష్ణ అన్నారు. ఆయా దేశాల ఔషధ నియంత్రణ సంస్థల అనుమతి లేకుండా 128 దేశాల్లో ఈ టీకాను విక్రయించవచ్చు. టైఫాయిడ్ నియంత్రణలో ఇది ఒక కీలక మలుపు కానుంది.

కొనుగోలుకు రూ.550 కోట్లు మంజూరు

గవి మద్దతుగా నిలుస్తున్న దేశాల్లో కాంజుగేట్ వ్యాక్సిన్‌ను సరఫరా చేయడానికి గవి బోర్డు 8.5 కోట్ల డాలర్లు (దాదాపు రూ.550 కోట్లు) మంజూరు చేసింది. డబ్ల్యూహెచ్ఓ ఆమోదం లభించినందున గవి ఇచ్చే నిధులతో యునిసెఫ్ టైప్‌బార్ టీసీవీ టీకాలను కొనుగోలు చేస్తుందని కృష్ణ ఎల్లా చెప్పారు. 2020 నాటికి ఈ వ్యాక్సిన్‌ను కొనుగోలు చేయడానికి గవి 80 కోట్ల డాలర్లను (దాదాపు రూ.5,200 కోట్లు) మంజూరు చేయాలని భావిస్తోందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా టైఫాయిడ్ విస్తృతంగా ఉన్న దేశాలు, ఈ దేశాలకు పర్యటనకు వచ్చే వారిని పరిగణనలోకి తీసుకుంటే టైఫాయిడ్ వ్యాక్సినేషన్ వ్యాపార అవకాశాల విలువ 200 కోట్ల డాలర్ల వరకూ ఉండగలదని కృష్ణ ఎల్లా అభిప్రాయపడ్డారు. వచ్చే అయిదారేళ్లలో 40-50 దేశాల్లో ఈ టీకా అందుబాటులోకి వస్తుంది. అంతర్జాతీయ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఎవల్యూషన్ (ఐహెచ్ఎంఈ) అంచనా ప్రకారం 2016లో 1.2 కోట్ల మంది టైఫాయిడ్ జ్వరం బారిన పడ్డారు. ఇందులో దాదాపు 1.3 లక్షల మంది మృత్యువాత పడ్డారు. విచ్చలవిడిగా యాంటీ బయోటిక్స్‌ను వినియోగించడం వల్ల బహుళ ఔషధాలను తట్టుకుని నిలబడగలిగే టైఫి బాక్టీరియా అభివృద్ధి చెందుతోందని ఇది చాలా ప్రమాదకరమని కృష్ణ ఎల్లా అన్నారు. దేశీయ మార్కెట్‌లో టైప్‌బార్ టీసీవీ ధర (ఒక డోస్) రూ.1,500 ఉంది. టైఫాయిడ్ రాకుండే వ్యాక్సినేషన్ కార్యక్రమాలను కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టి మద్దతు ఇవ్వాలని కృష్ణ కోరారు. ఇందుకు భారత్ బయోటెక్ కూడా సహకరిస్తుందని, తక్కువ ధరకు టీకాలను సరఫరా చేయడానికి సిద్ధంగా ఉందని అన్నారు.



టైఫాయిడ్ టీకాకు డబ్ల్యూహెచ్ఓ గుర్తింపు లభించిన వివరాలను వివరిస్తున్న భారత్ బయోటెక్ సీఎండీ కృష్ణ ఎల్లా. పక్కన సంయుక్త ఎండీ సుచిత్ర ఎల్లా

ఈ టీకా ప్రత్యేకత..

సాధారణ టీకాను పాలీసాక్రైడ్ (చక్కెర)లతో తయారు చేస్తారు. దీన్ని 2 సంవత్సరాల లోపు వయసున్న పిల్లల శరీరం గుర్తించదు. టైఫాయిడ్ రాకుండా నిరోధించ లేదు. పెద్ద వారిలో కూడా టీకా ప్రభావం రెండేళ్ల వరకే ఉంటుంది. ప్రోటీన్ (టెటనస్ టాక్సైడ్)తో పాలీసాక్రైడ్‌ను కలిపి (కాంజుగేట్) టీకాను భారత్ బయోటెక్ అభివృద్ధి చేసింది. 6 నెలలు నిండిన పసి పిల్లలకు కూడా టైప్‌బార్ టీసీవీ ఇచ్చి టైఫాయిడ్ నిరోధక శక్తిని కల్పించవచ్చు. ఇప్పటి వరకూ సమీకరించిన డేటా ప్రకారం కాంజుగేట్ టీకా తీసుకున్న వారిలో గత ఏడేళ్లుగా టైఫాయిడ్ రాలేదు.

6 ప్రభుత్వరంగ బ్యాంకులకు రూ.7,577 కోట్ల మూలధనం

ఆమోదించిన ఆర్థిక శాఖ

దిల్లీ: మూలధన పునర్వ్యవస్థీకరణ ప్రణాళికలో భాగంగా బలహీనంగా ఉన్న ఆరు ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీలు)కు రూ.7,577 కోట్లు అందించాలన్న ప్రతిపాదనకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. రిజర్వు బ్యాంక్ సూచనల మేరకు సత్వర దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నవాటిలో ఈ బ్యాంకులు ఉండటంతో మూలధన సాయం అందనుంది. ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా షేర్లను జారీ చేసి మూలధనం పొందుతున్న వాటిలో బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐడీబీఐ బ్యాంక్, యూకో బ్యాంక్‌లు ఉన్నాయి. వాటాదార్ల అనుమతి సహా అన్ని నియంత్రణ సంస్థల అనుమతి లభించిన తర్వాత వచ్చే కొన్ని వారాల్లో బ్యాంకులు ఈ మూలధన సాయాన్ని అందుకుంటాయి.

ప్రభుత్వానికి ప్రిఫరెన్షియల్ పద్ధతిలో ఈక్విటీ షేర్ల జారీ చేసి.. రూ.1,375 కోట్ల మూలధనాన్ని పొందేందుకు యూకో బ్యాంక్ బోర్డు బుధవారం ఆమోదం తెలిపింది. ఇక రూ.323 కోట్లకు సమానమైన 3.88 కోట్ల షేర్లను జారీ చేసేందుకు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన నిధుల సమీకరణ కమిటీ అంగీకారం తెలిపింది. ఇదే సమయంలో బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రూ.2,257 కోట్లు, ఐడీబీఐ బ్యాంక్‌కు రూ.2,729 కోట్లు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రకు రూ.650 కోట్లు, దేనా బ్యాంక్‌కు రూ.243 కోట్లు చొప్పున మూలధనం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

98% డిపాజిటర్లకు ఆ ప్రమాదమే లేదు

- బెయిల్-ఇన్‌పై భయమొద్దు
- ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి

దిల్లీ: బ్యాంకు డిపాజిటర్ల ఆందోళనలు తగ్గించే దిశగా ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ సైతం పూనుకున్నారు. ఫైనాన్షియల్ రిజల్యూషన్ డిపాజిట్ ఇన్సూరెన్స్ (ఎఫ్ఆర్‌డీఐ) బిల్లు-2017లో బెయిల్-ఇన్ నిబంధన భయపెట్టేలా అసలు లేదని ఆయన వ్యాఖ్యానించారు. అందుకు కారణాలను సైతం ఆయన వివరించారు. '75 శాతం డిపాజిట్లు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉన్నాయి. మిగతా డిపాజిట్లన్నీ మూలధనం బలంగా ఉన్న ప్రైవేటు బ్యాంకుల్లో ఉన్నాయి. 98 శాతం డిపాజిటర్లపై బెయిల్-ఇన్ నిబంధన అమలయ్యే అవకాశమే లేదు. మిగతా వారికి కూడా వారి ఆమోదంతోనే బెయిల్-ఇన్ జరుగుతుంద'ని ట్విటర్‌లో గార్గ్ పేర్కొన్నారు. వైఫల్యం పాలైన ఆర్థిక సంస్థలను కాపాడడానికి బ్యాంకుల్లో ఉన్న డిపాజిటర్ల నగదును వినియోగించుకోవడానికి ఉపయోగపడే బెయిల్-ఇన్ నిబంధనపై ఆందోళనలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే. 'ప్రభుత్వం ఇప్పటికే బిల్లులోని నిబంధనల గురించి స్పష్టతనిచ్చింది. డిపాజిటర్లకున్న ప్రస్తుత రక్షణలను సైతం మరింత విస్తృతపరుస్తారు. ప్రభుత్వ రంగ బ్యాంకులేవీ బెయిల్-ఇన్ నిబంధనను ఉపయోగించకపోవచ్చు. వీటిపై డిపాజిటర్లకు ఎటువంటి అనుమానాలు అక్కర్లేద'ని గార్గ్ అన్నారు.

వృద్ధి 7% లోపు!

2017-18పై విశ్లేషకుల అంచనా

దిల్లీ: భారత జీడీపీ వృద్ధి రేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7 శాతం దిగువకు చేరొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. జీఎస్‌టీ అవాంతరాలు, నోట్ల రద్దు ప్రభావం ఇందుకు నేపథ్యమని అంటున్నారు. 2015-16లో 8 శాతం; 2016-17లో 7.1 శాతం వృద్ధి నమోదైన సంగతి తెలిసిందే. 2017-18కి సంబంధించిన జాతీయ ఆదాయం ముందస్తు అంచనాలను కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్ఓ) శుక్రవారం విడుదల చేయనుంది. 'ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ 7 శాతాన్ని అధిగమించడం కష్టతరమే. ప్రాతిపదికను కింది స్థాయికి సవరిస్తే తప్ప అది జరగదు. మూడు, నాలుగో త్రైమాసికాల్లో ఆర్థిక వ్యవస్థ రాణించొచ్చ'ని ఎస్‌బీఐ రీసెర్చ్ ముఖ్య ఆర్థికవేత్త సౌమ్య కాంతి ఘోష్ పేర్కొన్నారు. ప్రణాళిక సంఘం మాజీ డిప్యూటీ ఛైర్మన్ మాంటెక్ సింగ్ అహ్లూవాలియా ఇదే తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్థూల విలువ జోడింపు(జీవీఏ) 6.6-6.8 శాతం మేర నమోదు కావొచ్చని యాక్సిస్ బ్యాంక్ ముఖ్య ఆర్థికవేత్త సుగతా భట్టాచార్య సైతం అంచనా కట్టారు. వృద్ధి రేటు 6-6.5 శాతం ఉండొచ్చని ప్రణాళిక సంఘం మాజీ సీనియర్ ఆర్థికవేత్త అభిజిత్ సేన్ పేర్కొన్నారు.



బుధవారం హైదరాబాద్‌లో మాజీ ఐఏఎస్ అధికారి శంకరన్ స్మారకోపన్యాసమిస్తున్న ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి

ఎఫ్ఆర్‌డీఐ బిల్లుతో బహుళ ప్రయోజనాలు

ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు

హైదరాబాద్ (రాజేంద్రనగర్), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ఫైనాన్షియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్(ఎఫ్ఆర్‌డీఐ) బిల్లుతో బహుళ ప్రయోజనాలు ఉంటాయని రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అభిప్రాయపడ్డారు. బుధవారం నాడిక్కడ 'ప్రజల దైనందిన కార్యక్రమాలలో ఆర్‌బీఐ పాత్ర' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఎఫ్ఆర్‌డీఐ బిల్లుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ల ఖాతాదారుల సొమ్ముకు భద్రత ఉండదనే ఆరోపణలు వస్తున్నాయని, అయితే సామాన్యులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని అన్నారు. బ్యాంకులు నష్టపోయిన క్రమంలో ప్రభుత్వం ఆ నష్టాన్ని భరించాల్సి వస్తోందని, అది కూడా ప్రజల సొమ్మనే విషయం గుర్తించాలని అన్నారు. ఇలాంటివి అరికట్టడానికి ఎఫ్ఆర్‌డీఐ బిల్లు ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. బిట్ కాయిన్స్ నియంత్రణపై చర్చ జరుగుతున్న క్రమంలో, ఇప్పుడే దాన్ని నియంత్రించాల్సిన అవసరం లేదని దువ్వూరి సుబ్బారావు అభిప్రాయం వ్యక్తం చేశారు. అది సాంకేతిక పరిజ్ఞానంతో కూడుకున్నదని, నియంత్రించే క్రమంలో జాగ్రత్తగా వ్యవహరించడం అవసరం అన్నారు. పెద్దనోట్ల రద్దుతో తాత్కాలిక నష్టం జరిగినా దీర్ఘకాలంలో తగిన ప్రయోజనాలు ఉంటాయని అభిప్రాయపడ్డారు. కేవలం నోట్లరద్దు నిర్ణయంతోనే నల్లధనం రూపుమాపడం అసాధ్యమని అన్నారు. నగదు వినియోగం తగ్గించడం ద్వారా అవినీతి, అక్రమసంపాదన తగ్గడంతో పాటు పారదర్శకత పెంచడానికి అవకాశం ఉందని చెప్పారు. నిరుపేదలకు జన్‌ధన్ యోజన లాంటి పథకాలలో భాగంగా ఖాతాలు తెరిచినంత మాత్రాన ఉపయోగం ఉండదన్నారు. అయితే ఆఖాతాల ఆధారంగా వారికి తగిన రుణాలు ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. గతంలో ప్లాస్టిక్ మనీని అందుబాటులోకి తేవడానికి ఆర్‌బీఐ సర్వే నిర్వహించిందన్నారు. అయితే మనదేశ పరిస్థితుల దృష్ట్యా ఇంకా కొంతకాలం ఆగక తప్పదని వివరించారు.

జౌళి సంచుల్లోనే ఆహార ధాన్యాలు, పంచదార

- 2018 జూన్ వరకు తప్పనిసరి
- జౌళిశాఖ మంత్రి స్మృతి ఇరానీ

దిల్లీ: ఈ ఏడాది జూన్ వరకు ఆహార ధాన్యాలు, పంచదారను జౌళిసంచుల్లోనే తప్పనిసరిగా ప్యాక్ చేయాలని ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ సంఘం (సీసీఈఏ) నిర్ణయించింది. ఆహార ధాన్యాల్లో 90 శాతం, పంచదార ఉత్పత్తుల్లో 20 శాతం మేర జౌళి సంచుల్లోనే ప్యాక్ చేయడం వల్ల 40 లక్షల మంది రైతులు, 3.7 లక్షల మంది కార్మికులకు మేలు జరుగుతుందని జౌళిశాఖ మంత్రి స్మృతి ఇరానీ ట్వీట్ చేశారు. తమకు చట్టపరంగా రావాల్సిన బకాయిల కోసం జౌళిమిల్లుల కార్మికులు ఆందోళన చెందనవసరం లేదని, రాష్ట్రప్రభుత్వాల సహకారంతో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి, ఉత్పత్తిని నియంత్రిస్తామని తెలిపారు. ఇందువల్ల సమయానుసారం చెల్లింపులు జరిగేలా చూడొచ్చని పేర్కొన్నారు. పర్యావరణ అనుకూల జౌళిని ప్యాకింగ్‌కు మరింతగా వినియోగించేలా, దేశీయ, అంతర్జాతీయ విపణుల్లో ప్రచారం చేస్తామని వివరించారు. తాజా నిర్ణయాల వల్ల ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమబంగా, బిహార్, అస్సోం, మేఘాలయ, త్రిపుర ప్రాంతాల్లోని రైతులు, కార్మికులకు మేలు జరుగుతుందన్నారు. ఏటా రూ.5,500 కోట్ల విలువైన జౌళి సంచులు కొనుగోలు చేస్తున్నందున, ప్రభుత్వంపై ఈ పరిశ్రమ అధికంగా ఆధారపడింది. బంగ్లాదేశ్, నేపాల్‌ల నుంచి దేశంలోకి దిగుమతి అయ్యే జౌళి సంచులపై దిగుమతి సుంకాన్ని విధించడం ద్వారా, 2 లక్షల మెట్రిక్ టన్నుల జౌళి ఉత్పత్తులకు గిరాకీ ఉండేలా ప్రభుత్వం చూస్తోంది.




కేంద్ర మంతివర్గ నిర్ణయాలు

నౌకాశ్రయాల్లో పీపీపీ ప్రాజెక్టుల రాయితీ ఒప్పందాల సవరణ

దేశంలోని ప్రధాన నౌకాశ్రయాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)లో చేపట్టే ప్రాజెక్టుల్లో రాయితీ ఒప్పందాల నిబంధనలను ప్రభుత్వం సవరించింది. మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. జాతీయ రహదారుల తరహాలోనే, ఈ ప్రాజెక్టుల్లో వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభమైన రెండేళ్ల తరవాత అభివృద్ధి సంస్థలు తమ 100 శాతం వాటాను కూడా విక్రయించుకునే వీలు కల్పించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో సమావేశమైన మంత్రిమండలి ఈ నిర్ణయం తీసుకుంది. వివాదాల పరిష్కారానికి కూడా జాతీయ రహదారుల విభాగం తరహాలోనే వ్యవస్థను ఏర్పాటు చేస్తారు. నౌకాశ్రయ ప్రాజెక్టులకు అదనపు భూమి కావాలంటే, అద్దెను 200 శాతం నుంచి 120 శాతానికి తగ్గించనున్నారు. ఇందువల్ల దీర్ఘకాల సమస్యకు పరిష్కారం లభిస్తుందని ప్రభుత్వం పేర్కొంది.

నిలిచిపోయిన ఓడరేవు ప్రాజెక్టులపై అత్యున్నత స్థాయి కమిటీ: గడ్కరీ



నిలిచిపోయిన ఓడరేవు ప్రాజెక్టులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఓ అత్యున్నత స్థాయి కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలో ఏర్పాటయ్యే ఈ కమిటీలో కేంద్ర న్యాయ మంత్రి, ఓడల మంత్రి, నీతి ఆయోగ్ ప్రతినిధి ఉంటారు. అత్యున్నత స్థాయి కమిటీ ఏర్పాటు నిర్ణయాన్ని బుధవారం జరిగిన కేంద్ర మంత్రి వర్గ సమావేశంలో కేంద్రం తీసుకుందని ఓడల మంత్రి గడ్కరీ వెల్లడించారు. 'చాలా కాలంగా 11-12 ఓడరేవు ప్రాజెక్టులు నిలిచిపోయాయి. వీటిపై కమిటీ నిర్ణయం తీసుకుంటుంద'ని గడ్కరీ పేర్కొన్నారు. దీనికి సంబంధించి వచ్చే వారంలో సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల అంచనా విలువ రూ.10,000-20,000 కోట్ల వరకు ఉండొచ్చని తెలిపారు. ఈ ప్రాజెక్టుల్లో కొన్ని కాంట్రాక్టర్లు మధ్యలో ఆపేసినవి కాగా.. మరికొన్ని ఇతరత్రా కారణాలతో నిలిచిపోయాయి. విశాఖపట్నం, కాండ్లాలోని ప్రాజెక్టులు కూడా ఇందులో ఉన్నాయి. కొత్త మోడల్ కన్షెషన్ అగ్రిమెంట్‌కు కూడా కేంద్రం ఆమోదం తెలిపిందని గడ్కరీ తెలిపారు. దీని వల్ల ఓడల రంగంలో మరిన్ని పెట్టుబడులు వస్తాయని తెలిపారు.

డబ్ల్యూటీఓలో భారత విధానానికి ఆమోదముద్ర

గతేడాది డిసెంబరులో జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీఓ) 11వ మంత్రిత్వ శాఖల సదస్సులో భారత్ పాటించిన విధానానికి కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఇలా జరిగిపోయిన విషయాలకు అనుమతులు ఇవ్వడాన్ని ఎక్స్-పోస్ట్ ఫాక్టో ఆమోదం అంటారు. దేశ ప్రయోజనాలు, ప్రాథామ్యాలు, ఆందోళనలు పరిరక్షించడమే లక్ష్యంగా అర్జెంటైనాలో జరిగిన ఈ సదస్సులో భారత్ విధానం నిలిచిందని ప్రభుత్వం ఒక ట్వీట్ చేసింది. భారత్ తీసుకున్న ఆ విధానానికి మంత్రి మండలి ఎక్స్-పోస్ట్ ఫాక్టో ఆమోదం సైతం ఇచ్చిందని అందులో వెల్లడించింది. కాగా, ప్రజా ఆహార నిల్వల అంశానికి శాశ్వత పరిష్కారం కనుగొనడానికే కట్టుబడి ఉండడం కోసం అమెరికా వెనక్కి వెళ్లడంతో 4 రోజుల సదస్సు ఎటువంటి ప్రకటనలు చేయలేదు.

కోటి వైఫై హాట్‌స్పాట్‌లు

- రూ.6.50 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యం
- టెలికాం నూతన విధానంపై చర్చాపత్రం
- గ్రామాల్లో 100 శాతం టెలిసాంద్రత కావాలి
- 19లోపు అభిప్రాయాలు తెలపొచ్చు: ట్రాయ్

దిల్లీ: వినియోగదార్లకు అందుబాటు ధరల్లో సేవలు అందించేందుకు టెలికాం రంగానికి 100 బిలియన్ డాలర్ల (సుమారు రూ.6.50 లక్షల కోట్లు) పెట్టుబడులు అవసరమని టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ పేర్కొంది. 1000 కోట్ల ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ పరికరాలను అనుసంధానించేందుకు దేశం మొత్తం మీద ప్రజా వైఫై హాట్‌స్పాట్‌లు కోటి మేర నెలకొల్పాలని సూచించింది. నూతన టెలికాం విధానం 2018కు సంబంధించి సిఫారసులు, అభిప్రాయాలను ట్రాయ్ వెల్లడించడంతో పాటు చర్చాపత్రాన్ని విడుదల చేసింది. సంబంధితులందరూ దీనిపై ఈనెల 19 లోపు తమ అభిప్రాయాలు తెలపాలని కోరింది.



టెలికాం మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు సామాజిక-ఆర్థిక అభివృద్ధికి ఈ రంగం ఊతం ఇచ్చేలా నూతన టెలికాం విధానం ఉండాలన్నది లక్ష్యమని ట్రాయ్ పేర్కొంది. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ నాణ్యమైన సేవలందించేందుకు ప్రపంచస్థాయి మౌలిక వసతులు కల్పించాలని కోరింది. గ్రామీణ టెలి సాంద్రత నూరుశాతానికి చేర్చడం, పంచాయతీలకు సెకనుకు 1 జీబీ వేగంతో డేటా అందించడాన్ని లక్ష్యంగా చేసుకోవాలని తెలిపింది. దేశీయ అవసరాలకు తగిన డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను ఆవిష్కరించాలని, ఆరోగ్య సంరక్షణ-విద్య-డిజిటల్ సేవలు ప్రతి ఒక్కరికీ చేరేందుకు నెట్ అనుసంధానత అత్యంత కీలకమని వివరించింది.

- ✦ దేశీయంగా 50 శాతం మందికి వైర్‌లైన్‌తో, 90 శాతం మందికి మొబైల్ ద్వారా బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించగలగాలి.
- ✦ సెకనుకు కనీసం 2 మెగాబైట్ వేగంతో డేటాను సరఫరా చేయగలిగే బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు 90 కోట్ల మందికి చేరాలి. వీరిలో 15 కోట్ల మందికి సెకనుకు 20 మెగాబైట్ వేగం బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లుండాలి.
- ✦ రహదారులు, రైల్వేలు, జల, వాయు రవాణా ప్రాజెక్టుల తరహాలోనే టెలికాం ప్రాజెక్టులకూ రుణాలు అందించాలి. స్పెక్ట్రమ్‌తో పాటు ఇతర లైసెన్సుల ప్రక్రియను సులభతరం చేయాలి.
- ✦ టెలికాం రంగంలో పరిశోధన-అభివృద్ధి, వినూత్నతల కోసం అంకుర సంస్థలను ప్రోత్సహించాలి. వాటి ప్రవేశానికి ఉన్న అవరోధాలు పరిహరించాలి. సమీకృత అభివృద్ధి కోసం ఒక నిధిని ఏర్పాటు చేయాలి. ఇందులో 40 శాతం పరిశోధనలకే కేటాయించాలి.
- ✦ గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో సేవలందించే సంస్థలకు ప్రోత్సాహకాలివ్వాలి.

ఐవీఆర్‌సీఎల్, కోస్టల్ ప్రాజెక్ట్స్‌ల దివాలా ప్రక్రియ చేపట్టండి

- హైదరాబాద్, కోల్‌కతా ఎన్‌సీఎల్‌టీల్లో ఎస్‌బీఐ పిటిషన్‌లు
- ఐవీఆర్‌సీఎల్ బకాయి రూ.604 కోట్లు
- కోస్టల్ ప్రాజెక్ట్స్ రూ.975 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించకపోవడంతో ప్రముఖ సంస్థలు ఐవీఆర్‌సీఎల్, కోస్టల్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్‌ల కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియను ప్రారంభించాలంటూ జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఆశ్రయించింది. ఐవీఆర్‌సీఎల్ రూ.604 కోట్ల బకాయి ఉందని, కోస్టల్ ప్రాజెక్ట్స్ రూ.975 కోట్ల బకాయి పడటంతో హైదరాబాద్, కోల్‌కతాల్లోని ట్రైబ్యునళ్లలో ఎస్‌బీఐ వేర్వేరుగా పిటిషన్‌లు దాఖలు చేసింది.

ఐవీఆర్‌సీఎల్‌కు..: మొదటి విడత పునర్‌నిర్మాణ వర్కింగ్ క్యాపిటల్ రూ.125.28 కోట్లు, వడ్డీ నిమిత్తం కాలపరిమితి రుణం రూ.58.61 కోట్లు, ప్రాధాన్య రుణం రూ.18.71 కోట్లు, క్యాష్ క్రెడిట్ సౌకర్యం రూ.215.75 కోట్లు, బ్యాంకు గ్యారంటీ 689.58 కోట్లు, రెండో విడత పునర్‌నిర్మాణ వర్కింగ్ క్యాపిటల్ రూ.25.78 కోట్లు, లెటర్ ఆఫ్ క్రెడిట్ సౌకర్యం కింద రూ.37.94 కోట్లు చొప్పున మొత్తం రూ.1171.65 కోట్ల దాకా రుణం మంజూరు చేసింది. ఇలా మంజూరైన రుణం నుంచి 2014, 2015 సంవత్సరాల్లో 6 ఖాతాల కింద రూ.899.49 కోట్ల రుణాన్ని ఎస్‌బీఐ విడుదల చేసింది. ఒప్పందం ప్రకారం రుణ వాయిదాలను చెల్లించడంలో ఐవీఆర్‌సీఎల్ విఫలమైంది. ఒప్పందంలో పేర్కొన్న గడువు ముగిసినా కంపెనీ స్పందించకపోవడంతో ఎస్‌బీఐ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించింది. ఇందులో గత ఏడాది అక్టోబరు 22నాటికి రూ.604 కోట్ల బకాయి చెల్లించాల్సి ఉంది. ఇందులో అసలు రూ.488.60 కోట్లు కాగా వడ్డీ కింద రూ.97.68 కోట్ల దాకా చెల్లించాల్సి ఉంది. ఈ పిటిషన్‌ను హైదరాబాద్ ఎన్‌సీఎల్‌టీ జ్యుడిషియల్ సభ్యులు రాజేశ్వరరావు విత్తనాల, సాంకేతిక సభ్యులు రవికుమార్ దురైస్వామిలతో కూడిన ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టింది. సమస్యను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవడానికి గడువు కావాలని ఐవీఆర్‌సీఎల్ తరఫు న్యాయవాది కోరడంతో విచారణను ఈనెల 8వ తేదీకి వాయిదా వేసింది. అదేవిధంగా దివాలా పరిష్కార నిపుణుడు (ఐఆర్‌పీ) పేరును ప్రతిపాదించడానికి గడువు కావాలని ఎస్‌బీఐ తరఫు న్యాయవాది కోరారు.

కోస్టల్ ప్రాజెక్ట్స్ రుణ వ్యవహారంలో ఎస్‌బీఐ పిటిషన్‌పై తీర్పు వాయిదా: కోస్టల్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ దివాలా ప్రక్రియ ప్రారంభించడానికి ఐఆర్‌పీని నియమించాలంటూ ఎస్‌బీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై కోల్‌కతలోని ఎన్‌సీఎల్‌టీ బుధవారం తీర్పు వాయిదా వేసింది. సుమారు రూ.975 కోట్ల రుణ బకాయిని చెల్లించాలంటూ నోటీసులు ఇచ్చినా స్పందించలేదని, దివాలా ప్రక్రియను ప్రారంభించాలని బ్యాంకు తరఫు న్యాయవాది బిశ్వజిత్ దూబె వాదనలు వినిపించారు. కోస్టల్ ప్రాజెక్ట్స్‌కు నిర్వహణ, వర్కింగ్ క్యాపిటల్ తదితర కేటగిరీల కింద రుణదాత హోదాలో బ్యాంకు రుణాన్ని మంజూరు చేసిందని చెప్పారు. అయితే ఒప్పందం ప్రకారం అసలు, వడ్డీ బకాయిలను కంపెనీ చెల్లించడంలేదన్నారు. అందువల్ల బకాయి వసూలు నిమిత్తం దివాలా కోడ్ (ఐబీసీ) సెక్షన్ 7 కింద దరఖాస్తు చేసినట్లు చెప్పారు. దివాలా ప్రక్రియ ప్రారంభం నిమిత్తం పిటిషన్‌ను విచారణకు స్వీకరించాలని అభ్యర్థించారు. కోస్టల్ ప్రాజెక్ట్స్‌కు నోటీసులు జారీ చేసి బుధవారం ఇరుపక్షాల వాదనలను విన్న ట్రైబ్యునల్ తీర్పును వాయిదా వేసింది.



బుధవారం దిల్లీలో పార్లమెంట్ హౌస్‌కు వస్తున్న ప్రధాని మోదీ

పార్లమెంటరీ కమిటీకి పంపాల్సిందే..

- **తలాక్ బిల్లుపై రాజ్యసభలో విపక్షాల పట్టు**
- **తెదేపాదీ అదే వైఖరి!**

దిల్లీ: అప్పటికప్పుడు ముమ్మారు తలాక్ చెప్పడాన్ని నేరంగా పరిగణించే బిల్లుపై చర్చ జరగనీయకుండా విపక్షాలు బుధవారం రాజ్యసభలో ఉమ్మడిగా అడ్డుపడ్డాయి. తలాక్ పద్ధతి రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు పేర్కొన్న దృష్ట్యా బిల్లును అత్యవసరంగా ఆమోదించాలని అధికార పక్షం పట్టుపట్టింది. ముందుగా వివిధ భాగస్వాముల అభిప్రాయాలనూ తెలుసుకోవాలనీ, దానికోసం దీనిని పార్లమెంటరీ కమిటీకి నివేదించాల్సిందేనని విపక్షం పేర్కొంది. విపక్షాలతో పాటు ఎన్డీఏ భాగస్వామ్యపక్షమైన తెదేపా కూడా ఈ మేరకు తీర్మానం ప్రవేశపెట్టాయి. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల సభ్యులు బిల్లుకు మద్దతు ప్రకటిస్తూనే దానిని సమగ్ర పరిశీలన నిమిత్తం పార్లమెంటరీ కమిటీకి పంపాలని గట్టిగా గళమెత్తారు. గందరగోళం నడుమే ఈ బిల్లును న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ప్రవేశపెట్టారు. బిల్లుకు లోక్‌సభలో కాంగ్రెస్ సభ్యులు మద్దతునిచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కమిటీలో ఏయే పార్టీల నుంచి ఏయే సభ్యులకు అవకాశం కల్పించాలో పేర్కొంటూ విపక్షనేత ఆనంద్ శర్మ ఒక తీర్మానం ప్రవేశపెట్టారు. బిల్లు లోక్‌సభ నుంచి వచ్చినందువల్ల ఇలా చేయలేమంటూ సభా నాయకుడు అరుణ్‌జైట్లీ అభ్యంతరం తెలిపారు. ఎలాంటి రూలింగ్ ఇవ్వకుండానే డిప్యూటీ ఛైర్మన్ పి.జె.కురియన్ సభను గురువారానికి వాయిదా వేశారు. కాంగ్రెస్ పరోక్షంగా తలాక్ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లుందని పార్లమెంటు వెలుపల విలేకరులతో మాట్లాడుతూ జైట్లీ ఆరోపించారు. అన్యాయాన్ని సరిచేయడానికి బంగారం లాంటి అవకాశం వచ్చినా కాంగ్రెస్ మాత్రం మోకాలడ్డుతోందన్నారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలు మరో రెండ్రోజులే జరగనుండడంతో బిల్లు ఆమోదంపై అనిశ్చితి నెలకొంది.



బుధవారం పార్లమెంట్‌ను సందర్శించిన ముస్లిం మహిళలు

ముందుగా చర్చ జరగాల్సిందే: జైట్లీ

తలాక్ బిల్లుపై రాజ్యసభలో చర్చ జరగాల్సిందేనని, ఆ తర్వాతే దానిని పార్లమెంటరీ కమిటీకి పంపించాలా వద్దా అనేది నిర్ణయించాలని జైట్లీ అభిప్రాయపడ్డారు. బుధవారం జరిగిన భాజపా పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. లోక్‌సభలో మద్దతిచ్చి, రాజ్యసభలో అడ్డుకోవడం ద్వారా బిల్లుపై కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలు అనుసరిస్తోందని ఆరోపించారు. గృహ హింస కేసుల్లో బెయిల్ ఇవ్వరాదని న్యాయస్థానాలను కోరే విపక్షాలే ఇప్పుడు ముస్లిం మహిళల హక్కుల దగ్గరకు వచ్చేసరికి భిన్నమార్గాన్ని అనుసరిస్తున్నాయని విమర్శించారు. సమావేశంలో ప్రధాని నరేంద్రమోదీ, పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా పాల్గొన్నారు. సమావేశానంతరం మంత్రి అనంత కుమార్ విలేకరులకు వివరాలు తెలిపారు. బిల్లు ఆమోదం కోసం విపక్షాలతో ప్రభుత్వం మాట్లాడుతోందని చెప్పారు. మోదీ సర్కారు ప్రయత్నాలతో భారతీయులకు హజ్‌కోటాను 36 వేలకు పెంచుతూ సౌదీ సర్కారు నిర్ణయించిందని మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ తెలిపారు.

లోక్‌సభకు చేరిన ఓబీసీ బిల్లు

ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించాలనే కీలక బిల్లుకు రాజ్యసభ ప్రతిపాదించిన సవరణలను చర్చ నిమిత్తం ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ సవరణల్ని తిరస్కరించాలని సామాజిక న్యాయం- సాధికారత శాఖ మంత్రి థావర్‌చంద్ గహ్లోత్ ప్రతిపాదించారు. జాతీయ బీసీ కమిషన్‌లో మహిళకు అవకాశం కల్పించవచ్చనీ, మైనారిటీ కమిషన్ విడిగా ఉన్నందువల్ల ఆ వర్గాల నుంచి ప్రాతినిధ్యం అవసరం లేదనీ చెప్పారు. బిల్లుపై చర్చ కొనసాగలేదు. అభ్యంతరాలను పరిగణనలో తీసుకునే విషయంలో వాగ్వాదం నేపథ్యంలో సభ గురువారానికి వాయిదాపడింది.

మోదీ, భాజపాలకే విశేష ప్రజాదరణ

- **2017 ర్యాంకులను వెల్లడించిన ఫేస్‌బుక్**

దిల్లీ: ప్రఖ్యాత సామాజిక మాధ్యమవేదిక ఫేస్‌బుక్‌లో 2017 సంవత్సరానికి అత్యంత ప్రజాదరణ పొందిన పార్లమెంటేరియన్లుగా ప్రధాని నరేంద్ర మోదీ (లోక్‌సభ), క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్ (రాజ్యసభ)లు నిలిచారు. రాజకీయ పార్టీల్లో భాజపా ప్రథమస్థానాన్ని దక్కించుకోగా.. ఆప్, కాంగ్రెస్‌లు తర్వాతి ర్యాంకుల్లో నిలిచాయి. మొత్తంగా చర్చలు, స్పందనలు, షేర్లు, వ్యాఖ్యలు(కామెంట్లు), లైక్‌ల ఆధారంగా ర్యాంకులను రూపొందించినట్లు ఫేస్‌బుక్ ఓ ప్రకటనలో తెలిపింది. అమిత్ షా, ఆర్.కె. సిన్హా, అసదుద్దీన్ ఒవైసీ, భగవంత్‌మన్ తదితరులు కూడా ర్యాంకుల్లో ఉన్నట్లు వెల్లడించింది. అత్యున్నత కార్యాలయాలు, ప్రముఖుల్లో.. పీఎంవో, రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌లకు అత్యంత ప్రజాదరణ లభించినట్లు తెలిపింది. ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంవో) పేజీకి 1.374 కోట్ల ఫాలోవర్లు ఉండగా, 1.382 కోట్ల 'లైక్'లు వచ్చాయి. అలాగే రాష్ట్రపతి పేజీకి 48.8 లక్షల ఫాలోవర్లు ఉండగా.. 49 లక్షల లైక్‌లు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి యూపీ, రాజస్థాన్ ముఖ్యమంత్రులు యోగి ఆదిత్యనాథ్, వసుంధర రాజేలు ముందువరుసలో ఉన్నారు.

ఉపగ్రహాలతో రైలింజన్ల అనుసంధానం డిసెంబరులోగా పూర్తి

దిల్లీ: రైళ్ల గమనాన్ని కచ్చితత్వంతో సులభంగా తెలుసుకునేందుకు వీలుగా అన్ని రైలింజన్లను ఇస్రో ఉపగ్రహాలతో అనుసంధానం చేసే పనిని ఈ ఏడాది డిసెంబరు మాసాంతంలోగా పూర్తి చేయాలని రైల్వే మంత్రిత్వ శాఖ లక్ష్యంగా పెట్టుకొంది. మొత్తం 10,800 ఇంజిన్లపైనా ఏంటెన్నాలు అమర్చనున్నారు. ఇప్పటికే పది ఇంజిన్లకు వీటిని అమర్చి, పనితీరును పరిశీలించారు. దిల్లీ-గువాహటి, దిల్లీ-ముంబయి రాజధాని ఎక్స్‌ప్రెస్ మార్గాల్లో వ్యవస్థ పనితీరును సమీక్షించారు. కాపలాదారులు లేని లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద జరుగుతున్న ప్రమాదాలకు కళ్లెం వేయడంలోనూ ఇస్రో ఉపగ్రహాల ఆధారిత సమాచారాన్ని వినియోగించుకోవడంపై రైల్వే దృష్టి సారించింది. ఇస్రో రూపొందించిన ఇంటెగ్రేటెడ్ సర్క్యూట్ చిప్‌లను కొన్ని రైలింజన్లపై రైల్వే అమర్చి చూసింది. కాపలాదారులు లేని గేట్ల వద్దకు వాహనాలు వస్తున్నప్పుడు రైలు గమనాన్ని గురించి కూత ద్వారా హెచ్చరించే ఏర్పాటు చేసింది.

రాఫెల్‌తో రక్షణ ఒప్పందం రద్దు

జెరూసలేం: ట్యాంకుల నిరోధక క్షిపణుల్ని అభివృద్ధి చేసేందుకు ఉద్దేశించిన సుమారు రూ.3,175 కోట్ల (500 మిలియన్ డాలర్లు) విలువైన రక్షణ ఒప్పందాన్ని భారత్ రద్దు చేసుకుందని ఇజ్రాయెల్ ఆయుధ తయారీ సంస్థ రాఫెల్ వెల్లడించింది. ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తొలి భారత్ పర్యటనకు కొద్దిరోజుల ముందు ఈ నిర్ణయం తీసుకోవడంపై విచారం వ్యక్తం చేసింది. రాఫెల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్ లిమిటెడ్ అధికార ప్రతినిధి ఇషాయి డేవిడ్ మాట్లాడుతూ.. ఒప్పందం రద్దుపై భారత రక్షణ శాఖ నుంచి అధికారిక పత్రం వచ్చిందన్నారు. స్పైక్ క్షిపణుల్ని 26 దేశాలు ఉపయోగిస్తున్నాయనీ, సుదీర్ఘ ప్రక్రియ తర్వాతే భారత్ వీటిని ఎంపిక చేసుకొందన్నారు. భారత రక్షణ శాఖతో సహకారానికి, భారత్‌తో కలిసి పనిచేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. ఒప్పందం రద్దుకు సంబంధించిన కారణాల్ని కంపెనీ వెల్లడించలేదు. నెతన్యాహు జనవరి 14 నుంచి నాలుగు రోజులపాటు భారత్‌లో పర్యటించనున్నారు. రాఫెల్ సీఈవో కూడా ఆయన వెంట రానున్నారు. పర్యటనలో ఈ అంశం చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు కోసం రాఫెల్ ఇటీవలే హైదరాబాద్‌లో కేంద్రాన్ని ప్రారంభించడం తెలిసిందే. భారత అధికార వర్గాల సమాచారం ప్రకారం పూర్తిస్థాయి సాంకేతిక పరిజ్ఞాన బదిలీపై వెనుకంజ వల్లే ప్రస్తుత పరిస్థితులు తలెత్తినట్లు తెలుస్తోంది.

శబరిమల అయ్యప్ప ఆలయం పేరు మారదు

తిరువనంతపురం: ప్రఖ్యాత శబరిమల అయ్యప్పస్వామి గుడి పేరు ఇకపై కూడా 'శబరిమల శ్రీధర్మ సస్తా ఆలయం'గానే కొనసాగుతుంది. 'ది ట్రావెన్‌కోర్ దేవస్వోమ్ బోర్డు'(టీడీబీ) ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. టీడీబీ అధ్యక్షుడు ఎ.పద్మకుమార్ బుధవారం ఈ విషయాన్ని వెల్లడించారు. యూడీఎఫ్ అధికారంలో ఉండగా ఏర్పాటైన బోర్డు ఈ గుడి పేరును 'శ్రీ అయ్యప్ప స్వామి ఆలయం' మార్చాలని నిర్ణయించింది. ఇప్పుడా నిర్ణయాన్ని టీడీబీ తిరస్కరించింది.

రైళ్ల ఆలస్యాన్ని నివారించాం

- **లోక్‌సభలో కేంద్ర మంత్రి వెల్లడి**

దిల్లీ: పొగమంచు కారణంగా రైళ్లు ఆలస్యంగా నడవడాన్ని ఈ ఏడాది గణనీయంగా తగ్గించగలిగినట్లు రైల్వే మంత్రి పీయూష్ గోయల్ బుధవారం తెలిపారు. విమానాలతో పోలిస్తే తక్కువ సంఖ్యలోనే రైళ్లు ఆలస్యమయ్యాయని.. సిగ్నలింగ్ విధానం కంప్యూటరీకరణ తదితర నిరంతర చర్యల ఫలితంగా ఇది సాధ్యపడినట్లు లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో వెల్లడించారు. ఎప్పటికప్పుడు మారే రైలు ప్రయాణ ధరల (ఫ్లెక్సీబుల్ ఫేర్) విధానాన్ని సమీక్షించడంతో పాటు, ప్రయాణికుల ప్రయోజనాలకు అనుగుణంగా ఉత్తమ విధానాలను సూచించేందుకు గాను కమిటీనీ ఏర్పాటు చేసినట్లు వివరించారు. రైల్వే సమస్యల పరిష్కారానికి ఈ ఏడాది రూ. 1,20,000 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు తెలిపారు. 2022 నాటికి సరికొత్త భారతీయ రైల్వేను రూపొందించాలన్నది లక్ష్యమని వివరించారు.

టికెట్ల రిజర్వేషన్‌కు ఆధార్ తప్పనిసరి కాదు

రిజర్వేషన్ విధానంలో రైలు టికెట్లను కొనుగోలు చేసేందుకు ఆధార్ తప్పనిసరి కాదని రైల్వే శాఖ స్పష్టం చేసింది. ప్రయాణికులు స్వచ్ఛందంగా ఆధార్ వివరాలు ఇచ్చేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపింది. రైల్వేశాఖ సహాయమంత్రి రాజెన్ గొహైన్ బుధవారం లోక్‌సభలో ఈ వివరాలు వెల్లడించారు. వృద్ధులు రాయితీ పొందేందుకుగాను 2017 జనవరి 1 నుంచి ఆధార్ స్వచ్ఛంద వెరిఫికేషన్‌ను ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. ఆధార్, చరవాణి నెంబర్లను టికెట్ రిజర్వేషన్‌తో అనుసంధానించుకునే ప్రయాణికులను ప్రోత్సహించేందుకుగాను ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో నెలనెలా వినియోగదారులు కొనుగోలు చేసే టికెట్లపై ఉన్న పరిమితిని 12 టికెట్లకు సవరించినట్లు తెలిపారు. రైలు గంటకుపైగా ఆలస్యంగా నడుస్తుంటే.. ఆ మార్గంలోని స్టేషన్లలో సదరు రైలుకోసం వేచిచూస్తున్నవారందరికీ ఇకపై సంక్షిప్త సందేశాల(ఎస్ఎంఎస్) రూపంలో సమాచారం అందనుంది. గతేడాది నవంబరు 3న 102 ప్రీమియం రైళ్లకు ఈ సేవను ప్రారంభించగా.. తాజాగా మరో 1,104 రైళ్లకు విస్తరిస్తున్నట్లు సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. వీటిలో 1,082 సూపర్‌ఫాస్ట్ రైళ్లు, 22 హమ్‌సఫర్ రైళ్లు ఉన్నాయని తెలిపారు.

2.40 లక్షల కోట్ల రక్షణ ఒప్పందాలు: గత నాలుగేళ్లలో విదేశీ, స్వదేశీ సంస్థలతో రూ.2.40 లక్షల కోట్ల విలువైన 187 రక్షణ ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. రక్షణశాఖ సహాయమంత్రి సుభాష్ భామ్రే లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ.. రూ.1.62 లక్షల కోట్ల విలువైన 119 ఒప్పందాల్ని భారతీయ సంస్థలతోనూ, రూ.1.24 లక్షల కోట్ల విలువైన 68 ఒప్పందాల్ని విదేశీ అమ్మకందార్లతో కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. 2016-17లో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డు తదితర ప్రభుత్వరంగ రక్షణ సంస్థల ఉత్పత్తుల విలువ రూ. 55,890 కోట్లని తెలిపారు.

పార్లమెంటులో మహారాష్ట్ర ప్రకంపనలు

మహారాష్ట్రలో చెలరేగిన హింసాత్మక ఘటనలు బుధవారం పార్లమెంటు ఉభయసభలను కుదిపేశాయి. కులాలు, మతాల పేరుతో ప్రజల మధ్య చీలిక తీసుకొచ్చేందుకు భాజపా, హిందూ మత సంస్థలు కుట్రపన్నుతున్నాయని కాంగ్రెస్ సభ్యులు ఆరోపించారు. దళితులపై దాడులు, తదనంతర ఘర్షణలపై విచారణ జరిపించేందుకు సుప్రీంకోర్టు ప్రస్తుత న్యాయమూర్తి నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దళితులపై వరుసగా జరుగుతున్న దాడులపై ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు మాట్లాడటంలేదని సభలో కాంగ్రెస్ నేత మల్లికార్జున్ ఖర్గే ప్రశ్నించారు. మోదీ 'మౌని బాబా'గా మారిపోయారంటూ వ్యాఖ్యానించటంతో భాజపా ఎంపీలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఘర్షణలను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవాలని విపక్ష పార్టీ యత్నిస్తోందంటూ మంత్రులు ప్రత్యారోపణలు చేయటంతో ఆగ్రహించిన కాంగ్రెస్ ఎంపీలు సభా మధ్యలోకి దూసుకెళ్లారు. ఘర్షణలకు పురికొల్పారంటూ పోలీసు కేసులు నమోదైన నిందితులిద్దరూ గతంలో ప్రధాని మోదీ, మహారాష్ట్ర సీఎం ఫడణవీస్‌తో దిగిన ఫొటోను కాంగ్రెస్ సీనియర్ నేత వీరప్ప మొయిలీ విడుదల చేశారు. శాంతిభద్రతలను నెలకొల్పాల్సిన వ్యక్తులు హింసను ప్రేరేపించే వారితో సంబంధాలు కొనసాగించటమేమిటని మొయిలీ ప్రశ్నించారు. రాజ్యసభలోనూ మహారాష్ట్ర ఘటనలపై అధికార, విపక్ష సభ్యుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. సభ రెండు మార్లు వాయిదాపడింది. భాజపా, ఆరెస్సెస్‌లు రెండూ దళిత వ్యతిరేకమైనవని కాంగ్రెస్ నేత గులాంనబీ ఆజాద్ విమర్శించారు. ఘర్షణలకు హిందూ మత సంస్థలే కారణమంటూ కాంగ్రెస్ నిందించటంపై ఆరెస్సెస్ మండిపడింది. దేశాన్ని ముక్కలుగా విభజించాలని యత్నిస్తున్న శక్తులే ఈ ఘర్షణ వెనుకున్నాయని ఆరెస్సెస్ విమర్శించింది. దిల్లీలోని జేఎన్‌యూలో దేశానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన వారి హస్తం దీనిలో ఉందని ఆరోపించింది.



దళిత సంఘాల బంద్ పిలుపుతో ప్రయాణికులు లేక బోసిపోయిన ఛత్రపతి శివాజీ టెర్మినస్



బుధవారం థానే రైల్వే స్టేషన్‌లో రైలును ఆపి నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

బంద్ హింసాత్మకం

- **ముంబయిలో రైళ్లు, వాహనాలకు అంతరాయం**

ముంబయి: మహారాష్ట్రలో బుధవారం నిర్వహించిన బంద్ హింసాత్మకంగా మారింది. భీమా-కోరెగావ్ యుద్ధం జరిగి 200 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అల్లర్లు చెలరేగి ఒక యువకుడు ప్రాణాలు కోల్పోవడంతో గత రెండ్రోజులుగా ఉద్రిక్తకర పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. వీటిని అదుపు చేయడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిందిస్తూ 'భారిపా బహుజన్ మహాసంఘ్' నేత, అంబేడ్కర్ మనుమడు ప్రకాశ్ అంబేడ్కర్ ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్రంలో బంద్ పాటించారు. అనేకచోట్ల రైళ్లు, వాహనాల రాకపోకలకు అంతరాయం వాటిల్లింది. సిటీ బస్సులపై ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. సబర్బన్ రైళ్లను అడ్డుకున్నారు. థానే, ఘాట్కోపర్, విక్రోలీ తదితర స్టేషన్లలో జరిగిన నిరసనల కారణంగా అనేక రైళ్లు గంటలతరబడి పట్టాలపైనే నిలిచిపోయాయి. పెద్దఎత్తున ఆందోళనకారులు పట్టాలపైనే తిష్టవేశారు. అనేకచోట్ల రహదారులపై అడ్డంకులు కల్పించారు. పశ్చిమ ఎక్స్‌ప్రెస్ హైవేపై అవరోధం కలిగించడానికి ప్రయత్నించిన వందలాది మందిని పోలీసులు చెదరగొట్టారు.

నిలిచిపోయిన డబ్బావాలా సేవలు

ముంబయిలో అనేక ప్రాంతాల్లో వాహనాలను దారి మళ్లించారు. వివిధ ఘటనల్లో 13 బస్సులు ధ్వంసమయ్యాయి. డబ్బావాలాలు తమ సేవల్ని నిలిపేశారు. ఖాతాదారులు కార్యాలయాలకు చేరడమే కష్టమవుతుందనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారి సంఘం ప్రతినిధి తెలిపారు. విద్యా సంస్థలకు సెలవు ప్రకటించకపోయినా, విద్యార్థుల భద్రత దృష్ట్యా బస్సుల్ని తిప్పకూడదని పాఠశాల బస్సు యజమానుల సంఘం నిర్ణయించింది. హింస జరగవచ్చనే భయంతో అనేకమంది ఇళ్ల నుంచి బయటకే రాకపోవడంతో కార్యాలయాల్లో హాజరు తగ్గింది. బంద్ శాంతియుతంగానే జరిగిందనీ, మహారాష్ట్ర జనాభాలో సగం మంది దీనిలో పాల్గొన్నారనీ ప్రకాశ్ అంబేడ్కర్ పేర్కొన్నారు. పుణె హింసకు కారకులైన ఇద్దరు నేతల్ని ముంబయి పేలుళ్ల నిందితులతో సమానంగా పరిగణించి, అరెస్టుచేసి విచారించాలని డిమాండ్ చేశారు. దోషుల్ని వదిలిపెట్టేది లేదని ముఖ్యమంత్రి ఫడణవీస్ స్పష్టంచేశారు.

క్రూయిజ్ క్షిపణిని పరీక్షించిన పాక్

ఇస్లామాబాద్: పాకిస్థాన్ నౌకాదళ అమ్ములపొదిలో సరికొత్త క్షిపణి చేరనుంది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన హర్బా క్రూయిజ్ క్షిపణిని బుధవారం విజయవంతంగా పరీక్షించినట్లు పాక్ నౌకాదళం ఒక ప్రకటనలో తెలిపింది. ఉపరితలంపై నుంచి ఉపరితల లక్ష్యాలతో పాటు భూభాగాలపై ఉన్న లక్ష్యాలను ఇది ఛేదించగలదని పేర్కొంది. వేగంగా శత్రువులపై దాడి చేయగల పీఎన్ఎస్ హిమ్మత్ నౌకపై నుంచి హర్బాను ప్రయోగించగా నిర్దేశిత లక్ష్యాన్ని ఏమాత్రం గురి తప్పకుండా ధ్వంసం చేసిందని ఆ ప్రకటన వివరించింది. దేశ ప్రయోజనాలను, సముద్ర తీర ప్రాంతాలను రక్షించుకోగల సామర్థ్యం తమ నౌకాదళానికి ఉందని పాక్ నౌకాదళ అధినేత అడ్మిరల్ జఫర్ మహమూద్ అబ్బాసి వ్యాఖ్యానించారు.



జలజల జాలువారే నయాగరా జలపాతం.. అత్యల్ప ఉష్ణోగ్రతల కారణంగా ఇలా గడ్డ కట్టుకుపోయింది

చిన్న ఉపగ్రహ వాహక నౌకల తయారీలో ఇస్రో

దిల్లీ: చిన్న ఉపగ్రహాలను ప్రయోగించడం కోసం చిన్నతరహా వాహక నౌకను రూపొందించాలని ఇస్రో ప్రయత్నాలు చేస్తోందని ప్రధాని కార్యాలయ సహాయ మంత్రి జితేందర్ సింగ్ చెప్పారు. బుధవారం లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానం చెబుతూ వీటి వల్ల ప్రయోగాల వ్యయం తగ్గుతుందని చెప్పారు. మరో ప్రశ్నకు శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి వై.ఎస్. చౌదరి సమాధానమిస్తూ ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి దేశంలో 32 భూకంప నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

హిమాచల్‌కు ఎయిమ్స్ మంజూరు

దిల్లీ: హిమాచల్‌ప్రదేశ్‌కు ఎయిమ్స్‌ను మంజూరు చేస్తూ బుధవారం కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకొంది. ఆ రాష్ట్రంలోని బిలాస్‌పుర్‌లో రూ.1,350 కోట్ల వ్యయంతో దీన్ని ఏర్పాటు చేయనుంది. 48 నెలల్లో దీని నిర్మాణ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకొంది.

- ★ కశ్మీర్‌లోని జోజిల్లా కనుమల్లో రూ. 6,089 కోట్లతో సొరంగం నిర్మాణానికి ఆమోదం తెలిపింది. 14.2 కి.మీ. పొడవు ఉండే ఈ సొరంగం కారణంగా శ్రీనగర్, లేహ్, కార్గిల్‌ల మధ్య రవాణా సౌకర్యాలు మెరుగవుతాయి.
- ★ ప్రజారవాణా వ్యవస్థను మెరుగుపరచడానికి ట్రాన్స్‌పోర్ట్ ఫర్ లండన్ సంస్థతో కుదిరిన అవగాహనఒప్పందానికి ఆమోద ముద్ర వేసింది.
- ★ పునరుత్పాదక ఇంధనం రంగంలో ఇటలీతో, ఇన్ఫర్మేషన్-కమ్యూనికేషన్ టెక్నాలజీలో బెల్జియంతో కుదిరిన ఒప్పందాలకు ఆమోదం.
- ★ భారత్- మయన్మార్‌లకు చెందిన స్థానిక గిరిజనులు సరిహద్దులు దాటి వెళ్లేందుకు వీలు కలిగిస్తూ నిర్ణయం.

నా వద్ద ఇంకా పెద్ద అణ్వాయుధాల మీట!

- **ఉత్తర కొరియాకు ట్రంప్ హెచ్చరిక**
- **పాలస్తీనాకూ సాయం నిలిపేస్తామని బెదిరింపు**

వాషింగ్టన్: తన వద్ద 'పని చేసే అణ్వాయుధాల మీట' ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. తన చేతిలో అణ్వాయుధాల మీట ఉందంటూ ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ చేసిన ప్రకటనకు అంతే ధీటుగా స్పందిస్తూ ట్రంప్ ట్వీట్ చేశారు. "తన టేబుల్ మీద అన్ని వేళలా అణ్వాయుధాల మీట ఉంటుందని ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్ ఉన్ చెప్పారు. అన్ని విధాలుగా క్షీణించిన, ఆహారం లేక అలమటిస్తున్న ఆ ప్రభుత్వానికి చెందినవారు ఎవరైనా ఆయనకు చెప్పండి.. నా వద్దా అణ్వాయుధాల మీట ఉందని.. అది ఆయన వద్ద ఉన్నదానికన్నా చాలా పెద్దది, చాలా శక్తివంతమైనదని... నా వద్ద ఉన్న మీట పనిచేస్తుందని చెప్పండ"ని ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌తో శాంతి ఒప్పందానికి విముఖత చూపిస్తున్నందుకుగాను ఆర్థిక సాయాన్ని నిలిపివేస్తామని పాలస్తీనాను ట్రంప్ హెచ్చరించారు. 'ఏటా రూ.వందల కోట్లు పాలస్తీనాకు సాయంగా అందిస్తున్నాం. కానీ అక్కడి నేతలు మా మాటకు విలువ ఇవ్వడంలేదు. మాపై గౌరవమూ చూపట్లేదు. కనీసం ఇజ్రాయెల్‌తో శాంతి ఒప్పందంపై చర్చలనూ వారు కొనసాగించాలని అనుకోవట్లేదు'అంటూ వరుస ట్వీట్లతో ట్రంప్ ధ్వజమెత్తారు. 2008 నుంచి పాలస్తీనాకు ఏటా సగటున రూ.2,541 కోట్లకుపైగా ఆర్థిక సాయాన్ని అమెరికా ఇస్తున్నట్లు కాంగ్రెస్ మేధోమథన సంస్థ సీఆర్ఎస్ చెబుతోంది. ట్రంప్ హెచ్చరికలను పాలస్తీనా తీవ్రంగా ఖండించింది. 'శాంతి చర్చల్లో అమెరికా ఓ నిజాయితీలేని మధ్యవర్తిగా తేలిపోయింది. జెరూసలేం ఎప్పటికీ మా రాజధానే'అని దేశ అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ స్పందించారు. జెరూసలేంను తాము బంగారానికో లేదా వెండికో అమ్మకానికి పెట్టలేదని అధ్యక్షుని అధికార ప్రతినిధి నబిల్ అబు రదైనా వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలపై ఇజ్రాయెల్ ప్రభుత్వం ప్రశంసలు కురిపించింది. తాము చాలా సంతృప్తిగా ఉన్నామని ఇజ్రాయెల్ సాంస్కృతిక శాఖ మంత్రి మిరి రెజెవ్ తెలిపారు.

ఉగ్రవాదం పేరుతో పాక్ దొంగాట!

- **అమెరికా ప్రముఖుల స్పష్టీకరణ**

వాషింగ్టన్, ఐరాస: ఉగ్రవాదంపై పోరాటం పేరుతో పాకిస్థాన్ దొంగాట ఆడుతోందని అమెరికా ప్రభుత్వంలోని ప్రముఖ అధికారులు విమర్శించారు. ఆ దేశానికి ఆర్థిక సాయం నిలిపివేస్తూ అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని వారు సమర్థించారు. ఐరాసలో అమెరికా రాయబారి నిక్కీ హేలీ న్యూయార్క్‌లో విలేకరులతో మాట్లాడుతూ "నిధులు నిలిపివేతకు కచ్చితమైన కారణాలు ఉన్నాయి. వారు (పాక్) మాతో కొన్నిసార్లు పనిచేశారు. మరోవైపు అఫ్గానిస్థాన్‌లో మా దళాలపై దాడులు చేస్తున్న ఉగ్రవాదులకు ఆశ్రయం ఇస్తున్నారు. ఈ ఆట మా ప్రభుత్వానికి ఆమోదయోగ్యం కాద"ని చెప్పారు. అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి హీథర్ నౌరెట్ వాషింగ్టన్‌లో మాట్లాడుతూ ఉగ్రవాదుల అణచివేతపై పాకిస్థాన్ నిజాయతీతో వ్యవహరించి తిరిగి ఆర్థిక సహాయాన్ని పొందాల్సి ఉంటుందని అన్నారు. హక్కానీ, ఇతర ఉగ్రవాద సంస్థలపై ఆ దేశం నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని అమెరికా భావిస్తోందని వ్యాఖ్యానించారు. 15 ఏళ్ల పాటు రూ.2.21లక్షల కోట్లు ఇచ్చామన్న ట్రంప్ వ్యాఖ్యను పాక్ విదేశాంగ శాఖ మంత్రి ఖ్వాజా అసిఫ్ సవాలు చేశారు. ఏ ఆడిట్ సంస్థ తనిఖీ చేసినా ట్రంప్ వ్యాఖ్య అబద్ధమని తేలుతుందంటూ ట్వీట్ చేశారు.

పనామా కేసులో తప్పు చేసినట్లు ఆధారాలు లేవు: షరీఫ్

ఇస్లామాబాద్: పనామా కేసులో తాను తప్పు చేసినట్లు ఎలాంటి ఆధారాలు లేవనీ, బలహీన ఆధారాలతో సుప్రీంకోర్టు ద్వారా తనపై అనర్హత వేటు పడిందని పాకిస్థాన్ పదవీచ్యుత ప్రధాని నవాజ్ షరీఫ్ పేర్కొన్నారు. ఈ కేసులో అవినీతి నిరోధక న్యాయస్థానానికి బుధవారం ఆయన హాజరయ్యారు. డిసెంబర్ 30న సౌదీఅరేబియా వెళ్లిన షరీఫ్ మంగళవారం స్వదేశానికి తిరిగొచ్చారు. పాక్ సైన్యంతో షరీఫ్ ఒప్పందానికి వచ్చినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

అసహాయత నుంచి ఆత్మస్థైర్యం

- **గజల్ శ్రీనివాస్ అకృత్యాలపై బాధితురాలి మూడో కన్ను**
- **2 నెలల నుంచే దృశ్యాల చిత్రీకరణ**
- **ప్రసార మాధ్యమాలకు వెల్లడి**

ఈనాడు, హైదరాబాద్-న్యూస్‌టుడే, పంజాగుట్ట: గజల్ శ్రీనివాస్ తనను రాత్రంతా ఉండమని వేధించారని... ఉద్యోగం నుంచి తీసేస్తానంటూ ఆంక్షల చట్రంలో బిగించారని బాధితురాలు ఆరోపించారు. ప్రసార మాధ్యమాలతో బుధవారం ఆమె తన గోడు వెళ్లబోసుకున్నారు. లైంగిక వేధింపులు తాళలేక ఆలయవాణి నుంచి ఎలాగోలా బయటకు వద్దామనుకుంటే... మరోచోట ఉద్యోగం దొరక్కుండా చేస్తానని శ్రీనివాస్ హెచ్చరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనకు శిక్ష పడాలన్న భావనతోనే తాను మీడియా ముందుకు వచ్చానన్నారు. "ఆలయవాణి వెబ్ రేడియోలో ఉద్యోగంలో చేరినప్పుడు ఎన్నో కలలు కన్నాను. ఆధ్యాత్మిక భావాలు పెంపొందించే సంస్థలో ఉద్యోగం... రేడియో జాకీగా ఎదిగే అవకాశం... జీతం తక్కువైనా ఆత్మసంతృప్తి లభిస్తుందని అనుకున్నా. రెండు నెల్లోనే ఈ కలలన్నీ గజల్ శ్రీనివాస్ ప్రవర్తన కారణంగా కల్లలయ్యాయి. అతడి లైంగిక కోర్కెలు తీర్చితేనే అక్కడ స్థానం ఉంటుందని తేలిపోయింది. అక్కడే పనిచేస్తున్న పార్వతి కూడా వేధించింది. నాలాంటి వారికి న్యాయం జరగదేమోనని భయపడ్డా. నాకు ఎదురైన చేదు అనుభవాలు మరో ఆడపిల్లకు రాకూడదని ధైర్యం తెచ్చుకున్నా. సమాజంలో పేరు ప్రతిష్ఠలున్న గజల్ శ్రీనివాస్ అకృత్యాలను, నిజస్వరూపాన్ని బహిర్గతం చేయాలనుకున్నా. అంతర్జాలం సాయంతో... గజల్ శ్రీనివాస్ పడక గదిలో ఉన్న సీసీ కెమెరాలకు తోడుగా రహస్యంగా సీసీ కెమెరాలను ఏర్పాటుచేశాను. ఏమాత్రం అనుమానం వచ్చినా నన్ను చంపేస్తారన్న భయం ఉండేది. అయినా ధైర్యం తెచ్చుకుని... గజల్ శ్రీనివాస్, పార్వతిలు నన్ను బెదిరించిన దృశ్యాలు, హెచ్చరించిన మాటలను రికార్డు చేశా. బలమైన ఆధారాలున్నాయని నమ్మకం కలిగాకే పోలీసులను ఆశ్రయించా" అని బాధితురాలు వివరించారు. మొత్తం తొమ్మిది వీడియోలు, ఒక హార్డ్‌డిస్క్‌ను ఆమె పోలీసులకు అందజేశారు.

బెయిల్‌పై వాదనలు...: గజల్ శ్రీనివాస్‌కు రెండోరోజూ బెయిల్ లభించలేదు. అభ్యంతరకర దృశ్యాలను తమకు బాధితురాలు ఇచ్చినందున, వాటిపై విచారించేందుకు గజల్ శ్రీనివాస్‌ను తమకు కస్టడికీ అప్పగించాలన్న పంజాగుట్ట పోలీసుల విజ్ఞప్తిని నాంపల్లి కోర్టు గురువారానికి వాయిదా వేసింది. బాధితురాలితో పాటు మరికొందరిని వేధించారంటూ శ్రీనివాస్‌పై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో... నిజానిజాలను నిర్ధరించుకుంటున్నామని ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపారు.

సేవ్ టెంపుల్స్ ప్రచారకర్త బాధ్యతల నుంచి గజల్ శ్రీనివాస్ తొలగింపు: సేవ్ టెంపుల్స్ ఆధ్యాత్మిక సంస్థ ప్రచారకర్త బాధ్యతల నుంచి గజల్ శ్రీనివాస్‌ను తొలగిస్తున్నట్లు ఆ సంస్థ ఛైర్మన్ వెలగపూడి ప్రకాశ్‌రావు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. సనాతన హిందూ ధర్మ పరిరక్షణ నిమిత్తం... ప్రవాస భారతీయుల సహకారంతో 2006లో గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్, సేవ్ టెంపుల్స్ సంస్థలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యాలయంలో పనిచేసే మహిళపై శ్రీనివాస్ లైంగికంగా వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు రావడం, అరెస్టు కావడం తమను దిగ్భ్రాంతికి గురిచేసినట్లు పేర్కొన్నారు.

ఛాంపియన్స్

దక్షిణాఫ్రికాలో గెలవాలంటే ఎలా..?


ఈ ప్రశ్నకు సమాధానం ఆస్ట్రేలియాకు తెలిసినంత బాగా మరే జట్టుకు తెలియదు..! 1992లో దక్షిణాఫ్రికా క్రికెట్లో పునరాగమనం చేశాక స్వదేశంలో దాదాపుగా అన్ని జట్లతో ఆడింది.. గెలిచింది! కానీ.. ఆస్ట్రేలియాపై మాత్రం ఇప్పటివరకు ఒక్క సిరీస్‌లోనూ విజయం సాధించలేదు. మొత్తం 7 సిరీస్‌ల్లో 20 మ్యాచ్‌లు జరగ్గా.. 13 విజయాలు అందుకున్న కంగారూ జట్టు 5 సిరీస్‌లను ఖాతాలో వేసుకుంది. ఎవరికీ సాధ్యం కాని ఈ ఘనత ఆసీస్‌కు ఎలా సాధ్యమైంది?

ఆస్ట్రేలియా విజయాలను పరిశీలిస్తే అర్థమయ్యేది ఒక్కటే..! తొలుత భారీ స్కోరు చేయాలి.. ఆ తర్వాత నాణ్యమైన పేస్, స్పిన్‌తో దక్షిణాఫ్రికా జట్టును దెబ్బ తీయాలి. మరి ఈ సామర్థ్యం భారత జట్టుకు ఉందా? స్పిన్‌లో భారత్‌కు తిరుగులేదు. గతంతో పోల్చుకుంటే పేసూ పదునెక్కింది. ప్రత్యర్థి జట్టుకు దీటుగా ఉంది. మరి బ్యాటింగ్ సంగతేంటి? దక్షిణాఫ్రికా వేగాన్ని తిప్పికొట్టె సత్తా మన బ్యాట్స్‌మెన్‌కు ఉందా..?


విజయ్


పుజారా


రహానె


కోహ్లి

విజయం అక్కడే..!

2
దక్షిణాఫ్రికాలో భారత్ విజయాలు. ఈ రెండు సార్లు భారత తొలుత బ్యాటింగ్ చేయడం విశేషం. 2006 జొహానెస్‌బర్గ్‌లో, 2010లో డర్బన్‌లో భారత్ గెలిచింది.

13
దక్షిణాఫ్రికాలో భారత బ్యాట్స్‌మెన్ శతకాలు. సచిన్ అత్యధికంగా 5 సెంచరీలు బాదాడు. పుజారా, ద్రవిడ్, కపిల్ దేవ్, కోహ్లి, జాఫర్, అజహరుద్దీన్, సెహ్వాగ్, ఆమ్రే ఒక్కోసారి ఈ ఘనత సాధించారు.

326
దక్షిణాఫ్రికాలో టెస్టు సిరీస్‌లో ఓ భారత బ్యాట్స్‌మన్ అత్యధిక పరుగులు. 2010-11 సీజన్‌లో 3 టెస్టుల సిరీస్‌లో సచిన్ చేశాడు.

1161
దక్షిణాఫ్రికాలో సచిన్ పరుగులు. భారత బ్యాట్స్‌మెన్‌లో అతడిదే అగ్రస్థానం. 15 మ్యాచ్‌ల్లో 46.44 సగటుతో సచిన్ ఈ పరుగులు చేశాడు. ద్రవిడ్ (11 మ్యాచ్‌ల్లో 624) రెండో స్థానంలో ఉన్నాడు.

ఈనాడు క్రీడావిభాగం

17 టెస్టుల్లో 8 ఓటములు.. 7 డ్రాలు.. విజయాలు కేవలం రెండే. కేవలం ఎనిమిదిసార్లే జట్టు స్కోరు 300 దాటింది. పదమూడుసార్లు మాత్రమే బ్యాట్స్‌మన్ స్కోరు మూడంకెలు చేరింది. చెత్తగా ఉన్న ఈ రికార్డులన్నీ భారత్‌వే. దక్షిణాఫ్రికాలో గత రెండున్నర దశాబ్దాలుగా పరిస్థితి ఇది! మనకు ఎదురైన పరాజయాల్లో ప్రధానంగా కనిపించే సమస్య బ్యాటింగే! సొంతగడ్డపై సెంచరీలపై సెంచరీలు బాదేసే మన బ్యాట్స్‌మెన్ సఫారీ గడ్డపై పేస్‌కు, స్వింగ్‌కు దాసోహమనడం.. దాన్ని ప్రత్యక్షంగా వీక్షించడం అభిమానులకు అలవాటైంది. ఐతే.. 'ఈసారి అలా జరగదు.. ఎప్పుడూ లేనంత బలంగా ప్రస్తుత భారత జట్టు ఉంది.. చరిత్రను తిరగరాసేందుకు సువర్ణావకాశమిది' అని క్రికెట్ దిగ్గజాలు విశ్లేషిస్తున్నారు. మరి ప్రపంచంలో మేటి పేస్ బౌలింగ్ దళం కలిగిన దక్షిణాఫ్రికాను భారత్ తిప్పికొట్టగలదా? డేల్ స్టెయిన్, మోర్నీ మోర్కెల్, వెర్నాన్ ఫిలాండర్, కగిసో రాబాడలతో కూడిన సఫారీ పేస్ బృందం ప్రపంచంలో ఎలాంటి పిచ్‌లపైనైనా ప్రమాదకరమైందే. అదీ పేస్‌కు స్వర్గధామమైన దక్షిణాఫ్రికాలో వారిని ఎదుర్కోవడమంటే పెను సవాలే.

అతడు ముందుంటే..: ప్రస్తుతం మన ఆశలన్నీ ప్రధానంగా నలుగురిపైనే. మురళీ విజయ్, చెతేశ్వర్ పుజారా, కోహ్లి, రహానె. ఈ నలుగురు రాణిస్తే భారత్‌కు సిరీస్ గెలిచేందుకు మెరుగైన అవకాశముంటుందనడంలో సందేహం లేదు. స్వదేశీ పిచ్‌లపైనే కాదు.. విదేశీ గడ్డపై అత్యుత్తమంగా రాణించగల సత్తా వీరి సొంతం. ప్రస్తుతం ప్రపంచంలోనే మేటి బ్యాట్స్‌మన్‌గా మన్ననలు అందుకుంటున్న సారథి విరాట్ కోహ్లి. 32 టెస్టుల్లో జట్టుకు సారథ్యం వహించిన కోహ్లి ఇప్పటికే 6 ద్విశతకాలతో అదరగొట్టాడు. గత ఏడాదిగా అతడిని ఇబ్బంది పెట్టిన బౌలరే లేడు. ఐతే అతడికీ ఓ బలహీనత ఉంది. టాప్ క్లాస్ స్వింగ్ బౌలింగ్‌లో అతడు కాస్త ఇబ్బందిపడతాడు. అయినా ఒక్క ఇంగ్లాండ్ (13.4 సగటుతో 134 పరుగులు) సిరీస్‌ను మినహాయిస్తే.. ఆస్ట్రేలియా (62 సగటుతో 992 పరుగులు), న్యూజిలాండ్ (71.33 సగటుతో 214)లతో పాటు దక్షిణాఫ్రికా (68 సగటుతో 272)లోనూ మెరుగైన రికార్డు అతడి సొంతం. ఒకట్రెండు సెషన్లలో మ్యాచ్ ఫలితాన్నే మార్చేయగలడు. అతడు రాణిస్తే మిగతా వారంతా అతడిని అనుసరించేందుకు సిద్ధంగా ఉంటారు..!

ఓపెనింగ్‌లో అతడు..: ప్రస్తుతం టీమ్‌ఇండియా అత్యుత్తమ ఓపెనర్ విజయే! సహనం, దూకుడు కలగలసిన ఈ బ్యాట్స్‌మన్‌కు విదేశీ గడ్డపై విజయ్‌కు మంచి రికార్డే ఉంది. ఆస్ట్రేలియాలో 60.25తో 482 పరుగులు చేసిన అతడు.. ఇంగ్లాండ్‌లో 40.2 సగటుతో 402 పరుగులు చేశాడు. దక్షిణాఫ్రికాలో 3 మ్యాచ్‌ల్లో 29.33 సగటుతో 176 పరుగులు చేసిన అతడు తన రికార్డును మెరుగు పరుచుకోవాలనే పట్టుదలతో ఉన్నాడు విజయ్. మరో ఓపెనర్ ధావన్ (లేదా రాహుల్) అతడికి అండగా నిలిస్తే భారత్ శుభారంభం ఆశించొచ్చు. ధావన్‌తో పోల్చుకుంటే రాహులే సాంకేతికంగా మెరుగైన ఆటగాడు. అయినా ఓపెనింగ్‌లో కుడి ఎడమల మేళవింపు కోసం ధావన్ తుది జట్టులో ఉండే అవకాశమే ఎక్కువ. ప్రస్తుతం అతడు మంచి ఫామ్‌లో ఉన్నాడు కూడా.

మిడిల్ భారం..: ఓపెనింగ్ సమస్య అధిగమిస్తే.. భారత్‌కు అతిపెద్ద సమస్య తీరినట్లే. ఎందుకంటే మిడిలార్డర్‌లో పుజారా, కోహ్లి, రహానెలతో భారత లైనప్ ఎంతో పటిష్ఠంగా కనిపిస్తోంది. పుజారా గత రెండు సీజన్లుగా అత్యుత్తమ ఫామ్‌లో ఉన్నాడు. నిరుడు 11 టెస్టుల్లో 67.05 సగటుతో 1140 పరుగులు చేసిన పుజారా.. అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మన్ జాబితాలో రెండో స్థానంలో ఉన్నాడు. సుదీర్ఘ ఇన్నింగ్స్‌లకు పెట్టింది పేరైన పుజారా షార్ట్ పిచ్ బంతులను ఎదుర్కోవడంలో దిట్ట. ఆస్ట్రేలియా (33.5 సగటు), ఇంగ్లాండ్ (22.2)లతో పోల్చుకుంటే దక్షిణాఫ్రికాలో అతడి రికార్డు (44.42 సగటుతో 311) మెరుగ్గా ఉంది. గత సిరీస్‌లో 70 సగటుతో 280 పరుగులు చేశాడు. మరోవైపు రహానెకు కెరీర్ పరంగా ఈ సిరీస్ ఎంతో కీలకం. స్వదేశంలో లంకతో టెస్టు సిరీస్‌లో ఘోరంగా విఫలమైన అతడు తానేంటో నిరూపించుకోవాల్సిన అవసరముంది. నైపుణ్యం పరంగా రహానెకు తిరుగులేదు. ఐదేళ్లుగా జట్టులో ఉన్న రహానె 43 టెస్టులాడాడు. అందులో స్వదేశం (19 మ్యాచ్‌ల్లో 1009 పరుగులు)లో కంటే విదేశాల్లోనే (24 మ్యాచ్‌ల్లో 1817 పరుగులు) గొప్పగా ఆడాడు. కఠిన పిచ్‌లపై ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సిరీస్‌ల్లో శతకాలు సాధించాడు. క్లిష్ట పరిస్థితుల్లో అత్యుత్తమంగా ఆడగల సత్తా రహానె సొంతం. ఐతే.. ఏడాదిగా అతడి ఫామ్ గొప్పగా లేకపోవడమే ఆందోళన కలిగిస్తోంది. ఈ సమస్యను అధిగమిస్తే మిడిల్‌లో భారత్ శక్తి పెరిగినట్లే.

సఫారీ గడ్డపై జట్టుగా భారత్ విఫలమై ఉండొచ్చు. ఐతే ఎప్పటికీ గుర్తుండిపోయే కొన్ని అద్భుత ఇన్నింగ్స్ ఆడారు మన బ్యాట్స్‌మెన్. అందులో ప్రధానంగా చెప్పుకోవాల్సింది అజహర్, సచిన్ భాగస్వామ్యం గురించే. 1997లో కేప్‌టౌన్ టెస్టులో.. జట్టు 58కే 5 వికెట్లు కోల్పోయిన దశలో.. ఎదురుదాడికి దిగిన సచిన్ (169), అజహర్ (115).. 222 పరుగులు భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. 2001-02లో సెహ్వాగ్ బ్లోమ్‌ఫొంటీన్‌లో అరంగేట్ర మ్యాచ్‌లోనే శతకంతో మెరిశాడు. ఇక 2010-11లో డర్బన్ టెస్టులో వీవీఎస్ లక్ష్మణ్ (96) కళాత్మక ఇన్నింగ్స్‌తో జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. కోహ్లి బృందానికి ఇవన్నీ స్ఫూర్తినిచ్చే ఇన్నింగ్స్‌లే. నిరుడు తిరుగులేని విజయాలు సాధించిన భారత్.. ఎప్పుడూలేనంత సమతూకంతో కనిపిస్తోంది. ప్రపంచ నం.1 జట్టుగా తానేంటో నిరూపించుకునే అవకాశం ఇప్పుడు కోహ్లిసేన ముందుంది. మరి సిరీస్ విజయంతో చరిత్ర సృష్టిస్తుందా?




ఇంత సమతూకం ఎప్పుడూ లేదు

"భారత టెస్టు జట్టు ఇప్పుడున్నంత సమతూకంగా నా 24 ఏళ్ల కెరీర్లో ఎప్పుడూ లేదు. ఈ జట్టుకు వైవిధ్యం తీసుకొస్తున్న ఆటగాడు హార్దిక్ పాండ్య. అతను 17-18 ఓవర్లు వేయగలడు. 7 లేదా 8 స్థానంలో బ్యాటింగ్‌కు దిగి పరుగులు చేయగలడు. పాండ్యకు ఇది అతి పెద్ద సిరీస్. విరాట్ అతడి మీద నమ్మకంతో ఉంటాడు. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో క్రమశిక్షణతో ఆడటం కీలకం. ఎలాంటి మానసిక స్థితితో ఉన్నారన్నది అన్నింటికన్నా ముఖ్యం. దక్షిణాఫ్రికా గతంలో ఉన్నంత బలంగా లేదు. మెక్‌మిలన్, కలిస్ లాంటి వాళ్లున్నప్పటి స్థాయిలో ఆ జట్టు ఇప్పుడు లేదు. దక్షిణాఫ్రికా పేస్ విభాగం బలహీనంగా ఉంది. స్టెయిన్, ఫిలాండర్, మోర్కెల్ వారి అత్యుత్తమ దశలో లేరు" – సచిన్

భారత్ నంబర్‌వన్‌కు ముప్పు లేదు

దుబాయ్: దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో ఫలితం ఎలా ఉన్నా టెస్టుల్లో భారత్ తన నంబర్‌వన్ స్థానాన్ని నిలబెట్టుకుంటుంది. ఐతే దక్షిణాఫ్రికా సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేస్తే మాత్రం భారత్‌ను అందుకుంటుంది. దక్షిణాఫ్రికా ప్రస్తుతం భారత్ (124) కన్నా 13 పాయింట్లు వెనుక ఉంది. ఒకవేళ దక్షిణాఫ్రికా సిరీస్‌ను 3-0తో గెలిస్తే రెండు జట్లూ 118 పాయింట్లతో సమమవుతాయి. దశాంశ పాయింట్ల ప్రకారం అప్పుడు కూడా భారత జట్టే ముందుంటుంది.



మైక్ టైసన్.. ఒక గంజాయి తోట!


కాలిఫోర్నియా: మైక్ టైసన్.. ఒకప్పుడు ప్రపంచ బాక్సర్లందరినీ గడగడలాడించిన మహాబలుడు. బాక్సింగ్ కెరీర్లో శిఖర స్థాయికి ఎదిగి, ఆ తర్వాత అనూహ్య పతనం చవిచూసిన అతను.. వ్యక్తిగత జీవితంలో దారి తప్పాడు. ఒకమ్మాయిపై అత్యాచారం చేసిన నేరానికి జైలుకు కూడా వెళ్లొచ్చాడు. వందల కోట్ల సంపదను పోగొట్టుకున్నాడు. ఒక దశలో దివాలా తీసి రోడ్డు మీదికి వచ్చాడు. ఐతే ఈ మధ్య టైసన్ మళ్లీ కొంచెం నిలదొక్కుకున్నట్లే ఉన్నాడు. ఇప్పుడతను పెద్ద ఎత్తున గంజాయి వ్యాపారంలోకి దిగడం విశేషం. కాలిఫోర్నియాలో కొందరు మిత్రులతో కలిసి అతను 40 ఎకరాల్లో గంజాయి తోట పెంపకం చేపడుతున్నాడట. గంజాయి పెంపకానికి అమెరికా ప్రభుత్వం ఇటీవలే అధికారికంగా అనుమతి ఇచ్చిన నేపథ్యంలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి మిత్రులతో కలిసి రంగంలోకి దిగాడు టైసన్. అతను ఇటీవలే కెనాబిస్ పేరుతో కాలిఫోర్నియా నగరంలో రిసార్ట్ కూడా ఆరంభించాడు.

కోహ్లి మెడలో అనుష్క!



కేప్‌టౌన్: పెళ్లి తనలో ఎలాంటి మార్పు తేలేదంటూ దక్షిణాఫ్రికా బయల్దేరే ముందు అన్నాడు విరాట్ కోహ్లి. ఐతే కానీ విరాట్‌కు సంబంధించిన కొత్త ఫొటో చూసిన అభిమానులు మాత్రం అతను మారాడని అంటున్నారు. దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్ ముంగిట ప్రాక్టీస్ చేసిన అనంతరం విరాట్ ఓ అభిమానితో ఫొటో దిగాడు. ఆ ఫొటో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా తిరుగుతోంది. పెళ్లి సందర్భంగా అనుష్క తన వేలికి తొడిగిన ఉంగరానికి గొలుసు కలిపి మెడలో వేసుకుని కనిపిస్తుండటమే ఈ ఫొటోలో అందరినీ ఆకర్షిస్తున్న విషయం!

నైట్‌రైడర్స్ గంభీర్‌ను వదిలేస్తోందా?



కోల్‌కతా: గౌతమ్ గంభీర్.. ఐపీఎల్ వరుస వైఫల్యాలతో సతమతమవుతున్న కోల్‌కతా నైట్‌రైడర్స్ పగ్గాలు చేపట్టి ఆ జట్టును ఒకటికి రెండుసార్లు విజేతగా నిలబెట్టిన ఆటగాడు. అలాంటివాడిని నైట్‌రైడర్స్ యాజమాన్యం వచ్చే సీజన్‌కు అట్టిపెట్టుకోవట్లేదని తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ప్రస్తుత ఫ్రాంఛైజీలన్నింటికీ ఇప్పుడున్న ఆటగాళ్లలో గరిష్ఠంగా ముగ్గురి చొప్పున అట్టిపెట్టుకునే అవకాశాన్ని ఐపీఎల్ పాలక మండలి కల్పించిన సంగతి తెలిసిందే. ఐతే నైట్‌రైడర్స్ కచ్చితంగా అట్టిపెట్టుకునే ఆటగాళ్లలో కెప్టెన్ గంభీర్ ఉంటాడని అందరూ భావించగా, ఆ ఫ్రాంఛైజీ మాత్రం అతడిని పక్కనబెడుతున్నట్లు సమాచారం. వెస్టిండీస్ మిస్టరీ స్పిన్నర్ సునీల్ నరైన్‌ను నైట్‌రైడర్స్ అట్టిపెట్టుకుంటున్న సమాచారం. మిగతా ఇద్దరి సంగతి తేలలేదు. గతంలో గంభీర్‌ను భారీ ధరకు దక్కించుకున్న నేపథ్యంలో ఈసారి అతడిని విడిచిపెట్టి వేలంలో తక్కువ ధర పలికితే, అప్పుడు 'రైట్ టు మ్యాచ్' ద్వారా తిరిగి తీసుకోవచ్చున్నది ఫ్రాంఛైజీ ఆలోచన అని సమాచారం. ఐతే నైట్‌రైడర్స్ కోసం ఇంత చేస్తే.. ఇలా తనను విడిచిపెట్టడాన్ని గంభీర్ ఎలా తీసుకుంటాడో మరి!

ధావన్ సిద్ధం.. జడేజా అనుమానం





కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు ముంగిట భారత్‌కు ఓ చింత తొలగింది. ఓపెనర్ శిఖర్ ధావన్ చీలమండ గాయం నుంచి కోలుకుని ఫిట్‌నెస్ సాధించాడు. శుక్రవారం ఆరంభమయ్యే తొలి టెస్టులో మురళీ విజయ్‌తో కలిసి అతనే భారత ఇన్నింగ్స్‌ను ఆరంభించనున్నాడు. "ధావన్ ఫిట్‌గా ఉన్నాడు. తొలి టెస్టు సెలక్షన్‌కు అందుబాటులో ఉంటాడు. భారత జట్టు దక్షిణాఫ్రికాకు బయల్దేరే ముందు అతడికి అయిన గాయం చిన్నదే" అని బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ధావన్ ఫిట్ అనే తేలే సమయానికి ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా అనారోగ్యం పాలయ్యాడు. అతను జ్వరంతో బాధపడుతున్నాడు. జడేజాకు చికిత్స అందుతోందని, అతడిని స్థానిక ఆసుపత్రికి కూడా తీసుకెళ్లామని, తొలి టెస్టుకు అందుబాటులో ఉండేది లేనిది మ్యాచ్ రోజు ఉదయం తేలుతుందని బీసీసీఐ తెలిపింది.

సింధు ఓటమి

చెన్నైకి షాక్ ● దిల్లీ గెలుపు



లఖ్‌నవూ: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో పి.వి. సింధు సారథ్యంలోని డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై స్మాషర్స్‌కు మరో ఓటమి. బుధవారం దిల్లీ డాషర్స్ 3-0తో చెన్నైకి షాకిచ్చింది. పురుషుల డబుల్స్‌లో మినహాయిస్తే.. మిగతా నాలుగు మ్యాచ్‌ల్లో చెన్నైకి ఓటమి తప్పలేదు. తొలి మ్యాచ్‌నే దిల్లీ ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకోగా.. సుమీత్ రెడ్డి, లీ జోడీ 15-13, 15-11తో ఇవనోవ్, సొజొనోవ్ జంటకు షాకిచ్చింది. ఆ తర్వాత రెండు పురుషుల సింగిల్స్ మ్యాచ్‌ల్లో చెన్నై ఓడిపోవడంతో స్కోరు 1-1తో సమమైంది. కీలక మ్యాచ్‌లో హ్యున్ 11-15, 15-13, 15-14తో సింధుకు షాకివ్వడంతో దిల్లీ 2-1 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆఖర్లో జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌ను చెన్నై ట్రంప్ మ్యాచ్‌గా చేసుకుంది. ఈ మ్యాచ్‌లో గెలిచివుంటే ఆ జట్టు సొంతమయ్యేది. ఐతే.. అశ్విని పొన్నప్ప, ఇవనోవ్ జోడీతో మ్యాచ్‌లో స్టార్ జోడీ గాబి అడ్కాక్, క్రిస్ అడ్కాక్ జంట గాయం కారణంగా వైదొలగడంతో దిల్లీ గెలిచింది. మ్యాచ్‌ను 3-0తో సొంతం చేసుకుంది. పాయింట్ల పట్టికలో అవధె వారియర్స్ అగ్రస్థానంలో ఉండగా.. చెన్నై ఏడో స్థానంలో ఉంది.

మన్రో రికార్డు సెంచరీ

ఆఖరి టీ20లో విండీస్‌పై కివీస్ ఘనవిజయం

మౌంట్ మాంగనుయి: అంతర్జాతీయ టీ20 క్రికెట్లో మూడు శతకాలు బాదిన తొలి బ్యాట్స్‌మన్‌గా న్యూజిలాండ్ విధ్వంసకుడు కోలిన్ మన్రో రికార్డు సృష్టించాడు. అతడు కేవలం 53 బంతుల్లోనే 104 పరుగులు చేయడంతో బుధవారం జరిగిన చివరిదైన మూడో టీ20లో కివీస్ 119 పరుగుల తేడాతో వెస్టిండీస్‌ను చిత్తు చేసింది. మన్రో శతకంలో 10 సిక్స్‌లు, మూడు ఫోర్లు ఉన్నాయి. అతడితో పాటు గప్తిల్ (63) మెరవడంతో మొదట న్యూజిలాండ్ 5 వికెట్లకు 243 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో వెస్టిండీస్ తడబడింది. 16.3 ఓవర్లలో 124 పరుగులకే ఆలౌటైంది. ఫ్లెచర్ (46) టాప్ స్కోరర్. సౌథీ మూడు వికెట్లు పడగొట్టగా.. బౌల్ట్, ఇష్ సోధి చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను కివీస్ 2-0తో గెలుచుకుంది.


మన్రో

పోరాడి ఓడిన ఆంధ్రప్రదేశ్

జాతీయ సీనియర్ కబడ్డీ

ఈనాడు, హైదరాబాద్: జాతీయ సీనియర్ కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ పోరాటం ముగిసింది. ప్రిక్వార్టర్‌ఫైనల్లో పోరాడి ఓడింది. బుధవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన పురుషుల ప్రిక్వార్టర్స్‌లో ఆంధ్రప్రదేశ్ 31-52తో ఉత్తరాఖండ్ చేతిలో పరాజయం చవిచూసింది. ప్రొ కబడ్డీ స్టార్ ప్రదీప్ నర్వాల్ సారథ్యంలోని ఉత్తరాఖండ్‌ను మొదట్లో ఆంధ్రప్రదేశ్ కట్టడి చేసింది. ఆరంభంలో వరుస పాయింట్లతో సత్తా చాటి 10-4తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆంధ్రప్రదేశ్ ఆటగాళ్లు.. ప్రదీప్‌ను మూడు సార్లు టాకిల్ చేసి కోర్టు నుంచి బయటకు పంపారు. ఐతే నర్వాల్ చెలరేగడంతో ఆంధ్రప్రదేశ్ వెనుకబడింది. ద్వితీయార్ధంలోనూ ప్రదీప్ విజృంభించాడు. వరుస పాయింట్లతో హోరెత్తించాడు. ఆంధ్రప్రదేశ్ ఆటగాళ్లు గట్టిగానే పోరాడినా.. ప్రదీప్ అనుభవం ముందు తేలిపోయారు.

ఐరాస యోగం.. హిందీకి దక్కేనా?

ఐక్యరాజ్యసమితి(ఐరాస)లో శాశ్వత సభ్యత్వం కోసం మనదేశం ఎన్నో ఏళ్లుగా ప్రయత్నిస్తోంది. పలు దేశాల మద్దతు కూడగడుతోంది. కానీ అది ఇంతవరకూ సాధ్యం కాలేదు. ఐక్యరాజ్యసమితిలోని అయిదు శాశ్వత సభ్య దేశాలు మరొక దేశానికి అటువంటి హోదా ఇచ్చేందుకు సిద్ధంగా లేవు. పైకి కాదనవు, కానీ ఆ దిశగా ముందడుగు వేయవు. హిందీని ఐక్యరాజ్యసమితి అధికార భాషగా గుర్తించే అంశం కూడా ఇటువంటిదే. భారతదేశపు అధికారిక భాష హిందీని ఐక్యరాజ్యసమితి కూడా అధికార భాషగా గుర్తించాలనే డిమాండ్ ఒక దశాబ్దకాలంగా ఉంది. కానీ ఈ విషయంలో ఐక్యరాజ్యసమితి మీనమేషాలు లెక్కిస్తుంది తప్ప స్పందించటం లేదు. ఈ నేపథ్యంలో హిందీని ఐక్యరాజ్యసమితి అధికార భాషగా గుర్తించేందుకు ప్రభుత్వ పరంగా తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నామని విదేశాంగ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ తాజాగా స్పష్టం చేయటం చర్చనీయాంశంగా మారింది.



ఆరు అధికార భాషలు ...

- రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత ఐదు శాశ్వత, 46 ఇతర సభ్య దేశాలతో న్యూయార్క్ కేంద్రంగా ఐక్యరాజ్యసమితి ఏర్పాటైంది. ప్రస్తుతం ఐక్యరాజ్యసమితిలో 193 సభ్య దేశాలు ఉన్నాయి. శాశ్వత సభ్య దేశాలు మాత్రం అయిదే. అవి అమెరికా, చైనా, యూకే, ఫ్రాన్స్, రష్యా.
- ఫిబ్రవరి 1, 1946 నాడు ఐక్యరాజ్యసమితి ఆరింటిని అధికార భాషలుగా గుర్తించింది. అవి- అరబిక్, చైనీస్, ఇంగ్లిష్, ఫ్రెంచి, రష్యన్, స్పానిష్.
- తొలుత అయిదు శాశ్వత సభ్యత్వ దేశాలకు సంబంధించిన భాషలే ఐక్యరాజ్యసమితి అధికార భాషలుగా ఉన్నాయి. ఎక్కువ మంది విజ్ఞప్తి మేరకు డిసెంబరు, 18, 1973న అరబిక్‌ను అధికార భాషగా గుర్తించాలని నిర్ణయించారు.
- ఐక్యరాజ్యసమితిలో ఏదైనా దేశానికి చెందిన ప్రతినిధి మాట్లాడాలంటే ఈ ఆరు అధికారిక భాషల్లోనే మాట్లాడాలి. లేదంటే ఆయన మాట్లాడే భాషను ఈ ఆరు అధికార భాషల్లోకి తర్జుమా చేసి వినిపిస్తారు.
- ఐక్యరాజ్యసమితి పత్రాలన్నీ ఆరు భాషల్లో తయారు చేస్తారు. ఏదైనా ఒక భాషలో పత్రాలు తయారు కాకపోతే అది కూడా సిద్ధమయ్యే వరకూ ఆగుతారు.

నిబంధనల చిక్కుముడి

ఏదైనా ఒక భాషను ఐక్యరాజ్య సమితి అధికారిక భాషగా గుర్తించాలంటే... అందుకు సంక్లిష్టమైన విధానం ఉంది. ఐరాస నిబంధనల ప్రకారం మొత్తం 193 సభ్యదేశాల్లో 129 దేశాల నుంచి మద్దతు లభించాలి. ఇదే విషయాన్ని విదేశాంగ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్ లోక్‌సభలో స్పష్టం చేశారు. మద్దతిచ్చే సభ్యదేశాలన్నీ కూడా హిందీని ఐరాస అధికార భాషల్లో ఒకటిగా చేసేందుకు అయ్యే వ్యయాన్ని భరించాల్సి ఉంటుంది. అధికార భాషగా హిందీకి మద్దతు ఇచ్చేందుకు పలు దేశాలు సిద్ధంగా ఉన్నాయి. కానీ అందుకయ్యే వ్యయాన్ని భరించేందుకు మాత్రం వెనకాడుతున్నాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవం గుర్తింపునకు మనదేశం చేసిన ప్రతిపాదనకు 177 సభ్య దేశాలు మద్దతు ఇచ్చాయి. ఇదేవిధంగా హిందీ గుర్తింపునకు సభ్య దేశాల మద్దతు సంపాదించవచ్చనే నమ్మకాన్ని విదేశాంగశాఖ అధికార వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. అదే జరిగితే ఐక్యరాజ్యసమితి ఏడవ అధికార భాషగా హిందీకి గుర్తింపు లభిస్తుంది.

– ఈనాడు ప్రత్యేక విభాగం

ఎన్నో డిమాండ్లు

ప్రస్తుత ఆరు భాషలకు అదనంగా మరికొన్ని భాషలను ఐక్యరాజ్యసమితి అధికార భాషలుగా గుర్తించాలనే డిమాండ్లు ఎన్నో ఏళ్లుగా ఉన్నాయి. వీటిలో రెండు భారతీయ భాషలు ఉండటం ప్రత్యేకత.

హిందీ : మనదేశంలో అత్యధికులు మాట్లాడే భాష హిందీని అధికార భాషల్లో చేర్చేందుకు ఐక్యరాజ్యసమితిని ఒప్పించాలని భారత ప్రభుత్వం 2007లో నిర్ణయించింది. దౌత్య పద్ధతుల్లో ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రభుత్వం ఆ తర్వాత ప్రకటించింది. హిందీని ఐక్యరాజ్యసమితి అధికార భాషగా గుర్తించాలనే భారత ప్రభుత్వ డిమాండ్‌కు నేపాల్ ప్రభుత్వం మద్దతు ప్రకటించింది.

బెంగాలీ : భారత, బంగ్లాదేశ్‌లో బెంగాలీ మాతృభాషగా కలవారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. 2009లో ఐక్యరాజ్యసమితిలో బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా మాట్లాడుతూ బెంగాలీని ఐక్యరాజ్యసమితి అధికార భాషగా గుర్తించాలని డిమాండ్ చేశారు. దీనికి మనదేశంలోని పశ్చిమ బెంగాల్, అసోం, త్రిపుర రాష్ట్రాలు మద్దతు పలికాయి.

పోర్చుగీస్ : నాలుగు ఖండాల్లో పోర్చుగీసు భాష మాట్లాడేవారున్నారు. ఐరోపా (పోర్చుగీసు), దక్షిణ అమెరికా (బ్రెజిల్), ఉత్తర ఆఫ్రికా (మొజాంబిక్, అంగోలా, గినియా దేశాలు), ఆసియా (మకావ్, తైమూర్ దేశాలతో పాటు భారతదేశంలోని గోవా, డామన్, డయ్యూ)లో పోర్చుగీసు మాట్లాడేవారు ఉన్నారు. దీన్ని ఐక్యరాజ్యసమితి అధికార భాషగా గుర్తించాలని పోర్చుగీసు ప్రభుత్వం ఒత్తిడి తెస్తుంది.

టర్కిస్ : టర్కీ భాష అయిన టర్కిస్‌ను సమితి అధికార భాషగా గుర్తించాలనే డిమాండ్ ఎన్నో ఏళ్లుగా ఉంది. 2011లో ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్‌తో సమావేశమైన సందర్భంగా టర్కీ ప్రధాని రీసెప్ తయ్యిప్ ఎర్డోగన్ టర్కిస్‌ను అధికార భాషగా గుర్తించాలని డిమాండ్ చేశారు. టర్కీతో పాటు ఈ భాష మాట్లాడేవారు అజర్‌బైజాన్, తుర్క్‌మెనిస్థాన్, ఉజ్బెకిస్థాన్, కజకస్థాన్, కిర్గిస్థాన్, ఉత్తర సైప్రస్, ఇరాన్, రష్యా తదితర దేశాల్లో ఉన్నారు.

అత్యధిక జనాభా మాట్లాడే భాషలు (జనాభా... కోట్లలో)	చైనీస్	ఇంగ్లిషు	హిందీ	స్పానిష్	అరబిక్	రష్యన్	బెంగాలీ	పోర్చుగీసు	ఫ్రెంచి
	109	98	54	52	42	27	26	23	22

మీకు నీళ్లు ఇవ్వలేం...

- కర్ణాటకకు తెలియజేసిన జలవనరులశాఖ అధికారులు
- మాకు 3 టీఎంసీలు విడుదల చేయండి
- తుంగభద్ర బోర్డుకు లేఖ రాయనున్న ఏపీ

ఈనాడు-అమరావతి: కర్ణాటకలోని తుంగభద్ర ఆయకట్టు ప్రాంతంలో వర్షాలు లేక ఇబ్బందులు పడుతున్నందున తమకు కేసీ కాలువ నీటి వాటా నుంచి కొంత నీరు ఇవ్వాలని కర్ణాటక చేసిన వినతిపై ఆంధ్రప్రదేశ్ తన నిస్సహాయతను తెలియజేస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న సాగునీటి, తాగునీటి అవసరాల దృష్ట్యా అందుబాటులో ఉన్న నీరే చాలని పరిస్థితుల్లో కర్ణాటక వినతిని గౌరవించలేమని జలవనరులశాఖ అధికారులు తేల్చారు. ఇదే విషయం ఆ రాష్ట్ర అధికారులకు తెలియజేశారు.

సుంకేశుల బ్యారేజీకి నీరు విడుదల చేయండి...

కేసీ కాలువ కింద ఉన్న నీటి అవసరాల కోసం తక్షణమే 3 టీఎంసీల జలాల్ని తుంగభద్ర నుంచి సుంకేశుల బ్యారేజీకి విడుదల చేయాలని తుంగభద్ర బోర్డుకు విన్నవిస్తూ ఏపీ లేఖ రాయనుంది. కేసీ కాలువ పరిధిలో తొలుత వర్షాలు సరిగా లేకపోవడం, ఆ తర్వాత కర్నూలు జిల్లాలో వరుసగా వర్షాలు పడటంతో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటను రైతులు నష్టపోయారని, తిరిగి మళ్లీ ఆలస్యంగా సాగు చేశారని జలవనరులశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే కేసీ కాలువ కింద 1,70,554 ఎకరాల పంట వివిధ దశల్లో ఉందని, ఇందులో 90వేల ఎకరాలకు పైగా ఆయకట్టుకు సుంకేశుల బ్యారేజి నుంచి నీరు అందించాల్సి ఉందని వారు తెలియజేస్తున్నారు. కర్నూలు జిల్లాకు తాగునీటికి 2 టీఎంసీల నీటి అవసరాలు ఉన్నాయని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో తమకు 3 టీఎంసీలు తక్షణం విడుదల చేయాలని కోరుతున్నారు.

మంత్రి ఉమాకు తెలంగాణ జలవనరుల మంత్రి హరీశ్ ఫోన్: తుంగభద్ర ఉమ్మడి వాటాపై ఏపీ జలవనరుల మంత్రి ఉమాతో తెలంగాణ జలవనరుల మంత్రి హరీశ్‌రావు బుధవారం ఫోన్‌లో చర్చించారు. కర్ణాటక నుంచి నీటి విడుదలపై తెలుగు రాష్ట్రాలు ఉమ్మడిగా వాటా కోరే విషయంపై మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం తుంగభద్ర బోర్డుకు లేఖ రాసిందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా లేఖ రాస్తే ఒకేసారి నీటివిడుదల సాధ్యమవుతుందని వివరించారు. తద్వారా ఇటు తెలంగాణలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆర్డీఎస్ కింద ఉన్న ఆయకట్టుకు అటు కేసీ కెనాల్ ఆయకట్టుకు తుంగభద్ర నుంచి ఒకేసారి నీళ్లు విడుదలవుతాయన్నారు.

గుండె ‘చిప్’

హృద్రోగాలపై అవగాహన కల్పించేందుకే

సింగపూర్: హృద్రోగాలపై మెరుగైన అవగాహన కల్పించేందుకు తోడ్పడే “గుండె చిప్”ను శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. కొత్త ఔషధాలకు ప్రయోగ పరీక్షలు నిర్వహించేందుకూ దీన్ని ఉపయోగించే వీలుంది. రక్తనాళాలు కుంచించుకుపోవడం వల్లే ఎక్కువగా గుండెపోటు, పక్షవాతం లాంటి వ్యాధులు చుట్టుముడుతుంటాయి. కొవ్వు, కొలెస్ట్రాల్, ఇతర పదార్థాలు రక్తనాళాల్లోని గోడలకు అంటిపెట్టుకుపోవడమే దీనికి ప్రధాన కారణం. దీన్ని కళ్లకుకట్టినట్టు చూపించేందుకు తాజా చిప్‌ను సింగపూర్‌లోని నాన్యంగ్ సాంకేతిక వర్సిటీ నిపుణులు అభివృద్ధిచేశారు. దీనిలో రక్తనాళాల గోడలతో పాటు రక్త ప్రసరణ వ్యవస్థపైనా ప్రధానంగా దృష్టికేంద్రీకరించారు. చదరపు అంగుళం పరిమాణంలో ఉండే ఈ చిప్‌లో రెండు ప్రత్యేక గదుల్లాంటి నిర్మాణాలున్నాయి. కింద నిర్మాణంలో గాలి, పై నిర్మాణంలో రక్తంలాంటి ద్రవం ప్రవహింపజేసేలా వీటిని సిద్ధంచేశారు. కిందనుండే నిర్మాణంలో గాలి నింపినప్పుడు ఇది బుడగలా వ్యాకోచించి కండరాలు కుంచించుకుపోయే పరిస్థితులను కల్పిస్తున్నట్లు పరిశోధకులు తెలిపారు.

కాంగ్రెస్, ఆర్జేడీ నేతలకు కోర్టుధిక్కార నోటీసులు

- లాలూను దోషిగా తేల్చడంపై విమర్శల ఫలితం
- దాణా కుంభకోణంలో నేడు శిక్షల ఖరారు!

రాంచీ: దాణా కుంభకోణంలో ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్‌ను దోషిగా తేలుస్తూ ఇచ్చిన తీర్పును విమర్శించిన కాంగ్రెస్, ఆర్జేడీ నేతలకు ప్రత్యేక సీబీఐ న్యాయస్థానం బుధవారం కోర్టుధిక్కార నోటీసులు జారీచేసింది. ఈమేరకు మనీష్ తివారీ (కాంగ్రెస్), లాలూ కుమారుడు తేజస్వీ యాదవ్, రఘువంశ్‌ప్రసాద్ సింగ్, శివానంద్ తివారీ (ఆర్జేడీ)లను జనవరి 23న న్యాయస్థానం ఎదుట హాజరుకావాల్సిందిగా సీబీఐ న్యాయమూర్తి శివపాల్‌సింగ్ ఆదేశించారు. కాగా దోషులకు విధించే శిక్షలను న్యాయస్థానం గురువారం వెలువరించే అవకాశం ఉన్నట్లు సీబీఐ న్యాయవాది తెలిపారు. ఇద్దరు న్యాయవాదుల మృతికి సంతాపం తెలపడంతో ఈ కేసు బుధవారం న్యాయస్థానం ముందుకు రాలేదని వెల్లడించారు. ఈమేరకు ఉదయం న్యాయస్థానానికి తీసుకొచ్చిన లాలూ, తదితరులను తిరిగి జైలుకు తీసుకెళ్లిపోయారు. దాణా కుంభకోణంలో గత డిసెంబరు 23న లాలూ, మరో 15 మందిని న్యాయస్థానం దోషులుగా ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఐఐఎఫ్‌టీ విద్యార్థులకు రూ.95 లక్షల పైచిలుకు వార్షిక వేతన ప్యాకేజీ!!

దిల్లీ: ఇక్కడి ‘ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్’(ఐఐఎఫ్‌టీ) విద్యార్థులు నలుగురికి ఏటా రూ.95 లక్షలకు మించిన వేతన ప్యాకేజీతో ఉన్నత స్థాయి ఉద్యోగాలు లభించాయి. ఏడుగురు విద్యార్థులకు ఏడాదికి సుమారు రూ.50 లక్షల 78 వేల 4 వందల వార్షిక వేతనంతో ఉద్యోగావకాశాలు దక్కాయి. ఈ మేరకు ఐఐఎఫ్‌టీ ఒక ప్రకటన చేసింది. ఇక్కడ నిర్వహించే ఉద్యోగుల ఎంపిక ప్రక్రియలో అత్యున్నతస్థాయి సంస్థలు పాల్గొంటున్నాయి.

చట్టంలో మార్పులకు అధ్యయనం

మహిళల అక్రమ రవాణా నిరోధంపై సలహా కమిటీ

ఈనాడు అమరావతి: రాష్ట్రంలో మహిళల అక్రమ రవాణా నిరోధానికి చట్టాన్ని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. బాధితులకు తక్షణ న్యాయం జరిగేలా, వీరిని అక్రమ రవాణ చేస్తున్న దోషుల్లో చివరి వ్యక్తికి కూడా శిక్ష పడేలా చట్టంలో మార్పులు అవసరమని గుర్తించింది. దీనిపై అధ్యయనం చేసేందుకు సలహా కమిటీని నియమించింది. ఇందులో హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రతిపాదించిన న్యాయమూర్తి, నల్సార్ విశ్వ విద్యాలయం ఆచార్యుడు(ఒకరు), హోంశాఖ కార్యదర్శి ప్రతిపాదించే ఐపీఎస్ అధికారిణి ఉంటారు. వీరితోపాటు పద్మశ్రీ అవార్డు గ్రహీత సునీతా కృష్ణన్, విశ్రాంత ఐపీఎస్ అధికారి ఉమాపతి, సీనియర్ న్యాయవాది ఎం.భాస్కరలక్ష్మిలను సభ్యులుగా నియమించారు. కమిటీకి రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కమిషనర్ సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. 60రోజుల్లోగా కమిటీ తన నివేదికను స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యదర్శికి అందజేయాలి.

రైల్వే ప్రాజెక్టుల పూర్తికి

రూ.46వేల కోట్లు కావాలి

- మాచర్ల-నల్గొండ, కాకినాడ-పిఠాపురం లైన్లను పక్కన పెట్టినట్లు వెల్లడి

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణ దశలోని రైల్వే ప్రాజెక్టులు పూర్తిచేయాలంటే రూ.46,267 కోట్లు అవసరమని రైల్వేశాఖ సహాయ మంత్రి రాజన్‌గోహెన్ తెలిపారు. కొత్తలైన్లు, డబ్లింగ్ కలిపి రాష్ట్రంలో 30 ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని, మాచర్ల-నల్గొండ, కాకినాడ-పిఠాపురం లైన్లను పక్కన పెట్టామని వెల్లడించారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నట్లు తెలిపారు. బుధవారం లోక్‌సభలో నెల్లూరు ఎంపీ మేకపాటి రాజామోహన్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానమిచ్చారు. ఈ మొత్తం ప్రాజెక్టులపై రైల్వేశాఖ ఇప్పటివరకూ రూ.4,018 కోట్లు ఖర్చుచేసింది. 2017-18లో రూ.2,810 కోట్లు వెచ్చించింది. చాలా ప్రాజెక్టులకు రైల్వేశాఖ అత్తెసరు నిధులు కేటాయించింది. అట్టిపట్టు-పుత్తూరు లైన్‌కు రూ.5లక్షలు, గూడూరు-దుగరాజపట్నం లైన్‌కు రూ.10లక్షలు, కొండపల్లి-కొత్తగూడెం, చిక్కబళ్లాపురం-పుట్టపర్తి, శ్రీనివాసపురం-మదనపల్లి లైన్‌లకు రూ.లక్ష చొప్పున కేటాయించడం ఇందుకు నిదర్శనం. రూ.వందల కోట్ల ఖర్చయ్యే ప్రాజెక్టులకూ లక్షల్లో నిధులు విదిల్చారు. భద్రక్-విజయనగరం మధ్య మూడోలైన్ నిర్మాణ పనులను వాయిదావేశారు. చాలా ప్రాజెక్టులు భూసేకరణ దశలోనే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి ఎలా ఉందో చూద్దాం.

ప్రాజెక్టు	కి.మీ	ప్రస్తుత వ్యయం రూ.కోట్లలో	ఖర్చు చేసింది రూ.కోట్లలో	బడ్జెట్‌లో కేటాయించింది రూ.కోట్లలో
మాచర్ల-నల్గొండ	92	815	3.5	0.5
కాకినాడ-పిఠాపురం	22	220	25.01	100.50
కోటిపల్లి-నర్సాపురం	57	2,125	238	430
ఓబులవారిపల్లి-కృష్ణపట్నం	113	839	645	100.1
దిండివనం-నగరి	179	1,080	196	47
రాయదుర్గం-తుమకూరు	213	2,000	465	182
కడప-బంగారు పేట	255	2,050	340	240
అట్టిపట్టు-పుత్తూరు	88	528	3.42	0.05
నడికుడి-శ్రీకాళహస్తి	309	2,299	198	340
గూడూరు-దుగరాజపట్నం	42	500	0.51	0.10
భద్రాచలం-కొవ్వూరు	151	923	7	7
కంభం-పొద్దుటూరు	142	830	0.5	1.00
కొండపల్లి-కొత్తగూడెం	125	723	0	0.010
చిక్కబళ్లాపురం-పుట్టపర్తి	103	692	0	0.1
శ్రీనివాసపురం-మదనపల్లి	75	296	0	0.1
విజయవాడ-అమరావతి డబ్లింగ్	106	2,679.6	0	1
విజయవాడ, గుడివాడ, భీమవరం నర్సాపూర్, గుడివాడ, మచిలీపట్నం భీమవరం, నిడదవోలు విద్యుదీకరణ	221	1,503	304.18	121.87
గుంటూరు-తెనాలి	24	168	140.76	36
కాజీపేట-విజయవాడ3వలైన్	220	2,200	142.34	100
దువ్వాడ-విజయవాడ 3వలైన్	332	3,873.1	0.04	7.5
గుత్తి-ధర్మవరం	90	636.38	130.6	75
కల్లూరు-గుంతకల్లు	41	323	32.68	52
రేణిగుంటబైపాస్-ధర్మవారం, వాడి	21	273.05	5	10
విజయవాడబైపాస్-కాజీపేట	30	499.29	79.97	125
విజయవాడ-గూడూరు 3వలైన్	288	3,246	51.5	100
యలహంక-పెనుకొండ	121	860.43	205.92	120
విజయనగరం-సంబల్‌పూర్ 3వలైన్	255	2,336	250	90
భద్రక్-విజయనగరం 3వలైన్	525	5,250	313.57	150
గుంటూరు-గుంతకల్లు	443	4,000	0.01	124
కొత్తవలస-జగదల్‌పూర్	189	2,500	240	250
మొత్తం		46,267.85	4,018.51	2,810.74

దుర్గగుడిలో అర్ధరాత్రి పూజలు జరిగాయి

- ఈవో సూర్యకుమారే చేయించారు
- పాలకమండలి ఆరోపణలు
- శుద్ధి, అలంకరణ మాత్రమే జరిగింది
- నాపై కక్షతోనే ఇదంతా: ఈవో
- సీఎం వద్దకు చేరిన వ్యవహారం

ఈనాడు, అమరావతి: విజయవాడ కనకదుర్గమ్మ గుడిలో గత నెల 26న(మంగళవారం) అర్ధరాత్రి జరిగిన పూజల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. ఆలయంలో అర్ధరాత్రి పూజలు జరిగిన మాట ముమ్మాటికీ నిజమని తాజాగా ఆలయ పాలకమండలి స్పష్టం చేసింది. పూజలు చేసినట్టు పోలీసుల విచారణలో నిర్ధరణ అయినా.. శుద్ధి, అలంకరణ మాత్రమే చేశామని ఆలయ యంత్రాంగం. వివరణ ఇస్తోంది. దుర్గగుడిలో జరిగిన మొత్తం వ్యవహారానికి తనదే నైతిక బాధ్యత అని ఈవో సూర్యకుమారి బుధవారం స్పష్టం చేశారు. ఎలాంటి పూజలు మాత్రం జరగలేదని ఆమె వెల్లడించారు. ఈ మొత్తం వ్యవహారం ముఖ్యమంత్రి వద్దకు చేరింది.

దుర్గగుడిలో సాధారణంగా ప్రతిరోజూ రాత్రి 10గంటలకు దర్శనం ఆపేసి గుడి తలుపులు మూసేస్తారు. తర్వాత అమ్మవారికి వస్త్రాలంకరణ చేస్తారు. రాత్రి 10.30లోపు ఈ కార్యక్రమం పూర్తిచేస్తారు. ఒక్క గురువారం మాత్రమే అమ్మవారికి ముఖాలంకరణ, వస్త్రాలంకరణ చేస్తారు. ఆ ఒక్కరోజు మాత్రమే రాత్రి 2గంటలు దాటుతుంది. కానీ.. పూజలు జరిగాయని భావిస్తున్న రోజు రాత్రి 11.30కు తలుపులు మూసినట్టు ఎస్పీఎఫ్ సిబ్బంది పుస్తకంలో నమోదు చేశారు. గంట సమయం అదనంగా ఎందుకయ్యిందనే దానికి సమాధానం లేదు. పైగా.. రోజూ ఒక అర్చకుడు, ఇద్దరు పరిచారకులు ఈ కార్యక్రమం ముగిస్తారు. అలాంటిది ఆరోజు ముగ్గురు పరిచారకులు, ఇద్దరు దుర్గగుడి అర్చకులు, అలంకరణ కోసం ఒక వ్యక్తి, మరో అజ్ఞాత వ్యక్తి(పార్థసారథి)ని తీసుకొచ్చారు. ఎప్పుడూ శుద్ధి చేయడానికి అనుమతి అనేది తీసుకోరు. కానీ.. 26న శుద్ధి కోసం 23వ తేదీనే అనుమతి పత్రం పెట్టారు. ఇదికూడా అనుమానాలకు తావిస్తోంది. ఈ మొత్తం వ్యవహారాన్ని పోలీసులు సుమోటోగా స్వీకరించి దర్యాప్తును ముమ్మరం చేశారు. ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి అందజేశారు.

సూర్యకుమారిని జైలుకు పంపాలి

దుర్గగుడికి ఎప్పటికీ తానే ఈవోగా కొనసాగాలనే కుతంత్రంతోనే సూర్యకుమారి అర్ధరాత్రి పూజలు చేయించారు. ఆలయ ప్రతిష్ఠను దిగజార్చిన సూర్యకుమారిని తొలగించడమే కాదు జైలుకు కూడా పంపాలి. పాలకమండలి తరఫున ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేశాం. ఆరోజు రాత్రి గుడిలో జరుగుతున్న వ్యవహారాన్నంతా ఈవోకు ఎప్పటికప్పుడు తెలియజేశారు.

– గౌరంగబాబు, పాలకమండలి ఛైర్మన్, పాలకమండలి సభ్యులు

కక్షతోనే వివాదం రేపారు

ఆలయంలో 26న అర్ధరాత్రి శుద్ధి, అమ్మవారి మరుసటి రోజు అలంకరణ తప్ప ఎలాంటి పూజలు జరగలేదు. నాపై కక్షతోనే కొందరు ఈ వివాదాన్ని లేపారనే అనుమానం ఉంది. వ్యక్తిగత ప్రయోజనాల కోసం అమ్మవారి ఆలయ ప్రతిష్ఠను ఇలా దిగజార్చొద్దని విజ్ఞప్తి చేస్తున్నాను. జరిగిన సంఘటనపై విచారణ జరిపించి నివేదికను ప్రభుత్వానికి అందజేశాను. ఆధారాలు లేకుండా పాలకమండలి నాపై ఎలా ఆరోపణలు చేస్తోందో అర్థం కావడం లేదు. శాఖాపరమైన విచారణ సైతం ప్రస్తుతం ఈఈ ఆధ్వర్యంలో జరుగుతోంది. భైరవీ పూజ అంటే ఏంటో కూడా నాకు తెలియదు.

– సూర్యకుమారి, ఆలయ కార్యనిర్వహణాధికారి

ఈవో బదిలీకి రంగం సిద్ధం?

వివాదానికి కారకురాలిగా భావించి ఈవో సూర్యకుమారిని బదిలీ చేస్తున్నారనే వార్తలు బుధవారం జోరుగా ప్రచారం జరిగాయి. సింహాచలం ఆలయ ఈవో రామచంద్రమోహన్‌ను దుర్గగుడికి ఇన్‌ఛార్జి ఈవోగా నియమిస్తున్నట్టు సమాచారం. అయితే.. దీనిపై తమకు ఎలాంటి సమాచారం లేదంటూ ఈవో సూర్యకుమారి, రామచంద్రమోహన్ వెల్లడించారు. ఐఆర్ఎస్ అధికారి కోటేశ్వరమ్మను దుర్గగుడికి ఈవోగా నియమించనున్నారనే వార్తలు సైతం వస్తున్నాయి.

ఏడుగురిపై పోలీసులకు ఫిర్యాదు..

అర్ధరాత్రి పూజల విషయంలో ఈవో సహా బాధ్యులైన ఏడుగురిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలంటూ విజయవాడకు చెందిన న్యాయవాది కె.వెంకటేష్, అన్నవరపు వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నరసరావుపేటలో కిడ్నీల రాకెట్

- నకిలీ ఆధారాలతో మార్పిడులు
- పేటలో ధ్రువపత్రాలు... గుంటూరులో ఆపరేషన్లు
- పరారీలో సూత్రధారి

నరసరావుపేట పట్టణం, నరసరావుపేట లీగల్, న్యూస్‌టుడే: కిడ్నీల మార్పిడికి నరసరావుపేట కేంద్రంగా మారింది. ఇక్కడి తహసీల్దార్ కార్యాలయంలో బేరసారాలు బెడిసికొట్టి బయటకొచ్చినట్టు తెలుస్తోంది. మామూలుగా కొన్ని అనుమతులు తీసుకొని రోగి బంధువు తన కిడ్నీ దానం చేయవచ్చు. బయట వ్యక్తి ఇవ్వాలంటే జిల్లా స్థాయిలో ఉన్న కమిటీ ఆమోదం తప్పనిసరి. అందుకే రోగి బంధువులే కిడ్నీలు దానం చేస్తున్నట్టు నరసరావుపేటలో తప్పుడు పత్రాలు సృష్టించి గుట్టు చప్పుడు కాకుండా ఇప్పటిదాకా పని చక్కబెట్టారు. ఇలా ముగ్గురికి గుంటూరులో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు జరిగాయి. తాజాగా గుంటూరు చంద్రమౌళినగర్‌కు చెందిన ఓ వ్యక్తికి రెండు కిడ్నీలు చెడిపోవడంతో అదే ప్రైవేటు వైద్యశాలలో చేరాడు. కిడ్నీ ఏర్పాటు చేయిస్తానని ఆ వైద్యుడు హామీ ఇచ్చి ఎప్పటి మాదిరే నరసరావుపేటలో ఉన్న తన బంధువుకి పురమాయించారు. ఆయన ఈ పనిలో ఆరితేరిన తన డ్రైవర్‌కి ఆ మేరకు ఏర్పాటు చేయమని చెప్పాడు. అతడు దుర్గి మండలం ముటుకూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని గుర్తించాడు. ఆ వ్యక్తి రోగి బంధువు కాకపోవడంతో నిబంధనల ప్రకారం కిడ్నీ ఇవ్వడానికి వీలులేదు. దీంతో నరసరావుపేట పట్టణం ప్రకాష్‌నగర్‌కు చెందిన రవి పేరుతో ఉన్న ఆధార్‌కార్డు సంపాదించి అందులోని ఫొటోను మార్చారు. రవి స్థానంలో కిడ్నీ దాత ఫొటో ఉంచారు. ఆ నకిలీ కార్డుతో అనుమతుల కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేశారు. గతంలో ఇలాగే మూడు దరఖాస్తులను ఆమోదించిన అధికారులు ఇది కూడా ఆమోదించేందుకు సిద్ధమయ్యారని తెలిసింది. బేరసారాలు కుదరకపోవడంతో ఈ విషయం బయటకు పొక్కినట్టు తెలుస్తోంది. కార్యాలయంలోని కింది స్థాయి నుంచి అధికారి వరకు అందరి ప్రమేయంతోనే ఆధార్‌కార్డులో ఫొటో మార్పిడి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి.


నరసరావుపేట తహశీల్దార్ కార్యాలయం

విచారణ జరుపుతున్నాం: కిడ్నీ మార్పిడికి సంబంధించి తప్పుడు ఆధార్‌కార్డులు సృష్టించారని, వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ విజయజ్యోతికుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నామని ఒకటో పట్టణ సీఐ శివప్రసాద్ చెప్పారు. కిడ్నీ రాకెట్‌కు సంబంధించి ప్రముఖ సూత్రధారి పరారీలో ఉన్నట్లు చెప్పారు. తహసీల్దార్ కార్యాలయంలో పలువురిని దీనిపై ఇప్పటికే విచారించామని చెప్పారు.

తాంత్రికపూజలపై నిజనిర్ధారణ కమిటీ

- 48 గంటల్లో నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశించారు
- సీఎంతో భేటీ అనంతరం మంత్రి మాణిక్యాలరావు వెల్లడి

ఈనాడు, అమరావతి: విజయవాడ కనకదుర్గ ఆలయంలో తాంత్రిక పూజలు జరిగినట్టుగా వస్తున్న ఆరోపణలపై దేవాదాయశాఖ ఉన్నతాధికారులు, పోలీసులు వేర్వేరుగా విచారణ జరపనున్నారని ఆంధ్రప్రదేశ్ దేవాదాయశాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు వెల్లడించారు. ఈ వ్యవహారంపై దేవాదాయశాఖ తరఫున నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. దేవాదాయశాఖకు చెందిన ఒక అసిస్టెంటు కమిషనర్, ధార్మిక వ్యవహారాలపై అవగాహన ఉన్న ఒక నిపుణుడిని కమిటీలో నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారని చెప్పారు. 48 గంటల్లో నివేదిక వచ్చేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారని మంత్రి చెప్పారు. విజయవాడలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో బుధవారం రాత్రి సీఎంను కలిసిన అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. ఆగమశాస్త్ర విరుద్ధంగా ఏం జరిగినా క్షమించేది లేదని సీఎం గట్టిగా చెప్పారన్నారు. దుర్గగుడిలో ఎలాంటి తాంత్రిక పూజలు జరగలేదని మంత్రి చెప్పారు. బయటి వ్యక్తులు అంతరాలయంలోకి ప్రవేశించిన మాట వాస్తవమేనని మంత్రి అంగీకరించారు. రాష్ట్రపతి సతీమణి దుర్గగుడిని సందర్శిస్తున్న నేపథ్యంలో అలంకరణ కోసమే ఆలయ ప్రధాన పూజారి బద్రీనాథ్ ఆ వ్యక్తిని లోపలికి తీసుకొచ్చారని వివరించారు.

రెండు కొరియాల మధ్య మళ్లీ హాట్‌లైన్

సియోల్: ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య హాట్‌లైన్ సేవలు పునఃప్రారంభం కానున్నాయి. రెండు దేశాల మధ్య సంబంధాలను మెరుగుపరచుకునేందుకు ఉన్నతస్థాయి చర్చలు జరపాలనీ, వచ్చే నెలలో జరిగే శీతాకాల ఒలింపిక్స్‌లోనూ పాల్గొనాలనీ నిర్ణయించిన మీదట ఉత్తర కొరియా ఈ దిశగా స్పందించింది. అణుబాంబు మీట తన బల్లపైనే ఉంటుందంటూ నూతన సంవత్సర సందేశంలో అమెరికాను హెచ్చరించిన ఉ.కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ యున్... అదే సమయంలో ద.కొరియాకు మాత్రం స్నేహహస్తం చాచారు. దీనిని ద.కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్ స్వాగతించారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00